సోమవారం
24•6•2019
కరీంనగర్
• వెల. రూ.6.50
• సంపుటి 8 • సంచిక 360
• పేజీలు: 16 + 16

# నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక
WWW. NTNEWS.COM
/NTDAILYONLINE




PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD





అడ్వకేట్ తన్నీరు శ్రీరంగారావు కుమార్తె యశస్విని వివాహ వేడుకకు హాజరై వధూవరులకు శుభాకాంక్షలు తెలుపుతున్న సీఎం కేసీఆర్. చిత్రంలో మంత్రి శ్రీనివాస్‌యాదవ్, ఎమ్మెల్సీలు శేరి సుభాష్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి కూడా ఉన్నారు.



నాంపల్లిలో జరిగిన బోధన్ ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ అమీర్ కుమార్తె వివాహానికి హాజరై శుభాకాంక్షలు తెలుపుతున్న సీఎం కేసీఆర్. చిత్రంలో స్పీకర్ పోచారం, మంత్రులు మహమూద్ అలీ, ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ సుభాష్‌రెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు కూడా ఉన్నారు.





శ్రీహిత తండ్రిని ఫోన్లో కేటీఆర్‌తో మాట్లాడిస్తున్న ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్. చిత్రంలో కుడా చైర్మన్ మర్రి యాదవరెడ్డి కూడా ఉన్నారు.

## శ్రీహిత కుటుంబానికి కేటీఆర్ అండ

ఫోన్‌చేసి ధైర్యం చెప్పిన టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్

నిందితుడిపై కఠిన చర్యలు తప్పవు: హోంమంత్రి మహమూద్‌అలీ హామీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ / రెడ్డికాలనీ (వరంగల్):** హన్మకొండలో కామాంధుడి చేతిలో బలైన తొమ్మిది నెలల చిన్నారి శ్రీహిత కుటుంబానికి టీఆర్‌ఎస్ తరుపున అండగా ఉంటామని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు భరోసా ఇచ్చారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. హన్మకొండలోని శ్రీహిత తల్లిదండ్రులు జగన్, రచనతో కేటీఆర్ ఆదివారం ఫోన్లో మాట్లాడారు. ఘటనకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకుని వారిని ఓదార్చారు. శ్రీహిత కుటుంబాన్ని ఎంపీ పసునూరి దయాకర్, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ పరామర్శించారు. ఈ సందర్భంగా హోం మంత్రి మహమూద్‌అలీ.. ఫోన్‌లో శ్రీహిత తల్లిదండ్రులకు ధైర్యం చెప్పారు. నిందితుడిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మరోవైపు, చిన్నారి తల్లిదండ్రులను పరామర్శించిన జాతీయ బీసీ కమిషన్ సభ్యుడు తల్లోజు ఆచారి.. నిందితుడిని ఉరితీయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరినట్టు చెప్పారు. శ్రీహిత కుటుంబానికి న్యాయం జరిగేవరకు పోరాడుతానని, అధైర్యపడొద్దని బిగ్‌బాస్-2 విన్నర్ కౌశల్ అన్నారు. శ్రీహిత కుటుంబసభ్యులను ఆయన పరామర్శించి ఓదార్చారు.

# సత్వరమే మొక్కలు నాటాలి

హరితహారం ప్రారంభమయ్యేవరకు ఆగొద్దు ■ అధికారులకు సీఎంవో ఆదేశాలు

హరితహారంపై 26న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి సమీక్ష ■ ఈ ఏడాది 86 కోట్ల మొక్కలు నాటాలని లక్ష్యం

**ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ**

రాష్ట్రంలో మూడు రోజులుగా విస్తారంగా వానలు కురుస్తుండటంతో 'హరితహారం' కార్యక్రమానికి అధికారులు యుద్ధప్రాతిపదికన ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ కార్యక్రమం లాంఛనంగా ప్రారంభమయ్యే వరకు ఆగకుండా ఎక్కడ వీలైతే అక్కడ వెంటనే మొక్కలు నాటడం ప్రారంభించాలని ముఖ్యమంత్రి కార్యాలయ (సీఎంవో) ఓఎస్డీ ప్రియాంక వర్గీస్.. అధికారులకు సూచించారు. అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయికి వెళ్లి భారీగా మొక్కలు నాటాలని అటవీశాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ప్రశాంత్‌కుమార్‌ఝా ఆదేశాలు జారీ చేశారు. హరితహారం అమలుపై ఈ నెల 26న అటవీ, దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించనున్నారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి కూడా రెండ్రోజుల్లో మరోసారి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనున్నట్టు అధికారులు తెలిపారు. ఈ ఏడాది ఐదో విడుత హరితహారంలో రాష్ట్రవ్యాప్తంగా 86 కోట్ల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్ణయించడంతో అన్ని నర్సరీలు మొక్కలతో కళకళలాడుతున్నాయి. వాస్తవానికి నర్సరీల్లో దాదాపు వందకోట్ల మొక్కలు సిద్ధంగా ఉన్నప్పటికీ 86 కోట్ల మొక్కలను నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ లక్ష్యాన్ని అధిగమించేందుకు వివిధ శాఖలు సమన్వయంతో కృషిచేయనున్నాయి. పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ 53 కోట్ల మొక్కలను సిద్ధం చేయగా.. అటవీశాఖ 22 కోట్లు, పురపాలకశాఖ 15 కోట్లు, హెచ్‌ఎండిఏ 7 కోట్లు, జీహెచ్‌ఎంసీ 3 కోట్ల మొక్కలను సిద్ధం చేశాయి. ఈసారి చందనం, టేకు, వెదురు, చింత మొక్కలతోపాటు పూలు, పండ్ల మొక్కలకు ఎక్కువ ప్రాధాన్యమివ్వాలని నిర్ణయించారు. నీడను, ఫలాలనిచ్చే మొక్కలనే కాకుండా భవిష్యత్తులో రైతులకు ఆదాయాన్ని సమకూర్చేలా 12 కోట్ల వెదురు, టేకు మొక్కలను, 11 లక్షల చందనం మొక్కలను, 4 లక్షల సర్వి మొక్కలను పంపిణీ చేయనున్నారు. 'వానలు వాపసు రావాలి.. కోతులు వాపసు పోవాలి' అనే నినాదంతో ముఖ్యమంత్రి కేసీఆర్ 2015లో హరితహారం కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. హరితహారం ద్వారా గత నాలుగేండ్లలో అద్భుత ఫలితాలు వచ్చాయి. 2015-16 వానాకాలం నుంచి ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 113.41 కోట్ల మొక్కలను నాటి సరికొత్త రికార్డు సృష్టించడంతో తెలంగాణ హరితవనంగా మారడంతోపాటు విధ్వంసమైన అడవులకు మళ్లీ జీవం వచ్చింది. ఇంత తక్కువ సమయంలో 100 కోట్లకుపైగా మొక్కలను నాటిన రాష్ట్రం దేశంలో ఎక్కడా లేదు. ఇదే ఉత్సాహంతో మున్ముందు కూడా భారీ సంఖ్యలో మొక్కలు నాటాలని సీఎం కేసీఆర్ ఆదేశించారు. ఈ ఆదేశాల మేరకు వివిధ శాఖల అధికారులు విస్తృతమైన ఏర్పాట్లు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 10 వేల నర్సరీల్లో 100 కోట్ల మొక్కలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని 'హరితహారం' సమన్వయకర్త, అటవీశాఖ అడిషనల్ పీసీసీఎఫ్ రాకేశ్ మోహన్ డోబ్రియాల్ వెల్లడించారు.






భిక్కనూరు గురుకుల పాఠశాల ఆవరణలో మొక్క నాటి నీళ్లు పోస్తున్న ఆండ్రూ ఫ్లెమింగ్ సన్

## హరితహారం బాగుంది

బ్రిటిష్ డిప్యూటీ హైకమిషనర్ ఆండ్రూ ఫ్లెమింగ్‌సన్ ప్రశంస

**భిక్కనూరు:** తెలంగాణలో హరితహారం కార్యక్రమం బాగుందని బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ ఆండ్రూ ఫ్లెమింగ్‌సన్ అన్నారు. ఆదివారం కామారెడ్డి జిల్లా భిక్కనూరు గురుకుల పాఠశాలలో 'వాయిస్ ఫర్ బాయిస్' శిబిరాన్ని సందర్శించారు. ముందుగా కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ఆయనతో పాఠశాల ఆవరణలో రెండు మొక్కలు నాటించారు. అనంతరం హరితహారం గురించి ప్రిన్సిపాల్ వివరించడంతో బాగుందని ప్రశంసించారు.

# సాగుకు రైతుల సమాయత్తం

తొలకరి పలుకరించడంతో వ్యవసాయ పనులు ప్రారంభం

ప్రధాన పంటల సాగుకు మరోవారం వేచిచూడాలంటున్న అధికారులు

మధ్యతరహా విత్తనాలు మేలని వ్యవసాయ వర్సిటీ శాస్త్రవేత్తల సలహా

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తొలకరి పలుకరించడంతో రైతన్నలు సాగుకు సమాయత్తమయ్యారు. నైరుతి రుతుపవనాలు రాష్ట్రమంతటా విస్తరించడంతో రెండురోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. 20 రోజులు ఆలస్యంగా వానలు కురియడంతో.. ఏ మాత్రం ఆలస్యం చేయకుండా భూమిని చదునుచేసి విత్తనాలు విత్తడానికి రైతులు ఏర్పాట్లు చేసుకొంటున్నారు. వ్యవసాయశాఖ వానకాలం ప్రణాళికను ప్రకటించి ముందస్తుగా సుమారు 7.45 లక్షల టన్నుల సబ్సిడీ విత్తనాలు, ఎరువులను సిద్ధంగా ఉంచింది. ప్రభుత్వం రైతుబంధు పథకం కింద పెట్టుబడి సాయంగా ఎకరాకు రూ.5 వేల చొప్పున అందజేసింది. దీంతో రైతులు అవసరమైన ఎరువులు, విత్తనాలను కొనుగోలు చేసి సిద్ధంగా పెట్టుకున్నారు. అయితే ప్రస్తుతం కురుస్తున్న చిన్న వర్షాలతోనే ప్రధానపంటలు సాగుచేయవద్దని, మరో రెండు,మూడు పెద్దవానలు పడేవరకు వేచిచూసి.. తర్వాతే విత్తుకోవాలని వ్యవసాయశాఖ, వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు గ్రామాల్లో ప్రచారం చేపడుతున్నారు. సీజన్ ప్రారంభం 20 రోజులు ఆలస్యం కావడంతో మధ్యతరహా విత్తనాలు విత్తుకొంటే మంచిదని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. కొన్నిచోట్ల తొలకరి చినుకులకే విత్తనాలు వేయగా.. సకాలంలో వర్షాలు కురియక విత్తనం మొలకెత్తలేదు.

### జూలైలో అధిక వర్షాలు

రాష్ట్రవ్యాప్తంగా జూన్ నెలతో పోలిస్తే జూలైలో వర్షాలు అధికంగా కురిసే అవకాశాలున్నట్టు వ్యవసాయశాఖ, వ్యవసాయ శాస్త్రవేత్తలు అంచనా వేశారు. జూన్‌లో సాధారణం కంటే 60 నుంచి 70 శాతం తక్కువగా నమోదవుతుండగా.. జూలైలో మాత్రం సాధారణం కంటే 60 నుంచి 70 శాతం ఎక్కువగా నమోదయ్యే అవకాశాలున్నాయి. ఉత్తర తెలంగాణలో ఆగస్టు నెలలో సాధారణం కంటే 50- 60 శాతం తక్కువగా, దక్షిణ తెలంగాణలో సాధారణం కంటే 40- 50 శాతం తక్కువగా.. అలాగే రాష్ట్రవ్యాప్తంగా సెప్టెంబర్‌లో సాధారణం కంటే 60- 70 శాతం ఎక్కువగాను, దక్షిణ తెలంగాణలో తక్కువగాను వానలు కురిసే అవకాశం ఉన్నది. ఇప్పుడు కురుస్తున్న వానలకు వర్షాధార పంటలు విత్తుకోకూడదని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. నేల 10 నుంచి 20 సెం.మీ తడిసిన తర్వాత సోయా, మక్క, జొన్న, కంది, పెసర, పత్తి వంటి పంటలు విత్తుకోవాలని గ్రామాల్లో ప్రచారం చేస్తున్నారు. వరి సాగుచేసే పొలాల్లో తొలకరి వానలకు జనుము, జీలుగను పచ్చిరొట్ట పైరుగా, ఆలస్యంగా నీరు విడుదలయ్యే ప్రాంతాల్లో పెసరను పైరుగా లేదా పచ్చిరొట్టగా విత్తుకోవాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెప్తున్నారు.



**ఏ పంట ఏ నెలలో విత్తాలి**

| విత్తాల్సిన నెల | పంట |
|---|---|
| జూన్ 30 వరకు | పెసర, జొన్న |
| జూలై 15 వరకు | మక్కజొన్న, పత్తి, సోయా |
| జూలై 31 వరకు | కంది |
| ఆగస్టు 15 వరకు | ఆముదం |
| జూలై 10 వరకు | వరి మధ్యకాలిక రకాలు |
| జూలై 20 వరకు | వరి దీర్ఘకాలిక రకాలు |
| జూలై 31 వరకు | వరి స్వల్పకాలిక రకాలు |

### హరితహారంలో పది లక్షల మందికి ఉపాధి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రం మొత్తం ఆకుపచ్చగా మార్చాలనే సీఎం కేసీఆర్ నిర్ణయంతో.. ఉపాధి హామీలో కూలీలకు వందరోజుల పనిదినాలు కల్పిస్తూ మొక్కల పెంపకాన్ని భారీగా చేపట్టనున్నారు. కూలీలు, గ్రామస్థులు, ప్రజాప్రతినిధులతో చర్చించి మొక్కలు నాటాల్సిన ప్రాంతాలను గ్రామీణాభివృద్ధిశాఖ గుర్తించింది. వర్షాలు కురియడం మొదలవగానే మొక్కలు నాటడాన్ని ప్రారంభించనున్నారు. ఈసారి దాదాపు 10 లక్షల మంది ఉపాధి కూలీలకు హరితహారంలో వందరోజుల పని దినాలు కల్పించనున్నారు. వ్యవసాయ భూముల్లో నాటే ఒక్కో మొక్కకు నెలకు రూ.ఐదు చొప్పున రక్షణకు ఇవ్వనున్నారు. రహదారి వెంట నాటిన మొక్కలను సంరక్షించేందుకు ఒక్కో ఉపాధి కూలీకి కిలోమీటరు బాధ్యత అప్పగించి, రోజుకు రూ.211 సగటు వేతనం చెల్లించనున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు 19.4 లక్షల కుటుంబాలకు చెందిన 31.2 లక్షల మందికి పని కల్పించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 12 కోట్ల పనిదినాలకు కేంద్రం ఆమోదించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఈ నెల 4వ తేదీ వరకు 5.7 కోట్ల పనిదినాలు రూ.147 సగటు వేతనంతో పని కల్పించి మొత్తం రూ.947.2 కోట్లు వెచ్చించారు.

**ముహూర్తం**

సూర్యోదయం: 5.48 గంటలకు

సూర్యాస్తమయం: 6.50 గంటలకు

వికారినామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, కృష్ణపక్షం, సప్తమి, నక్షత్రం: పూర్వాభాద్ర, అమృతఘడియలు: సాయంత్రం 6.05 నుంచి 7.41 వరకు, రాహుకాలం: ఉదయం 7.25 నుంచి 9.03 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 11.53 నుంచి మధ్యాహ్నం 12.45 వరకు, తిరిగి మధ్యాహ్నం 3.21 నుంచి సాయంత్రం 4.13 వరకు, వర్జ్యం: ఉదయం 7.19 నుంచి 8.55 వరకు.

# పసిమొగ్గలపై పైశాచికం

- వికృత చేష్టలతో రెచ్చిపోతున్న సైకోలు
- పన్నెండేండ్లలోపు చిన్నారులే టార్గెట్
- పొత్తిళ్లలో పాపపై అఘాయిత్యం మరువకముందే హైదరాబాద్‌లో మరో ఘటన
- తస్మాత్ జాగ్రత్త అంటున్న మానసిక వైద్య నిపుణులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కామాంధుల కర్కశత్వానికి పసిమొగ్గలు బలవుతున్నాయి. అమ్మ పొత్తిళ్లలో హాయిగా నిదురించే నెలల పాపాయి నుంచి..లోకం పోకడ తెలియని పసి మనసుల వరకు అంతా ఈ దుర్మార్గులబారిన పడుతున్న ఘటనలు కలిచివేస్తున్నాయి. కొందరు లింగభేదాన్ని మరిచి చిన్నారుల జీవితాల్లో చితిమంటలు రగిలిస్తున్నారు. హన్మకొండలో తొమ్మిది నెలల చిన్నారిపై అఘాయిత్యం ఘటన మరువకముందే ఆదివారం మరో రెండు ఘటనలు వెలుగుచూశాయి. మేడ్చల్ జిల్లా జవహర్‌నగర్ పీఎస్ పరిధిలో 60 ఏండ్ల వృద్ధుడు ఏడేండ్ల చిన్నారిపై అత్యాచారానికి యత్నించి పట్టుబడ్డాడు. ఏపీలో 16 ఏండ్ల బాలికకు మాయ మాటలు చెప్పి తీసుకెళ్లి ఆరు రోజులుగా ఆరుగురు ఉన్మాదుల అఘాయిత్యానికి ఒడిగట్టారు. నిత్యం ఏదో ఒకచోట ఇలాంటి ఘటనలు వెలుగుచూడటం ఆందోళనకు గురిచేస్తున్నది.



### పశువుల కంటే హీనంగా..

పశువులకు కూడా ఆడ, మగ అన్నతేడా ఉంటుంది. కానీ కామంతో కండ్లుమూసుకుపోయిన మానవ మృగాలకు మాత్రం లింగభేదం లేకుండాపోతున్నది. హైదరాబాద్‌లో గతేడాది చిన్నారులపై 1,093 అత్యాచారం కేసులు నమోదైతే వాటిలో 30 మందికిపైగా బాధితులు బాలురు ఉండటం కలవరపాటుకు గురిచేస్తున్నది. చిన్నారులపై లైంగికదాడులకు పాల్పడుతున్నవారిలో ఎక్కువగా 13 నుంచి 20 ఏండ్ల మధ్య యువకులు, లేదా 55 ఏండ్లు పైబడిన వృద్ధులు ఉంటున్నారు. యుక్తవయస్సుల్లో ఉన్న యువకులు ఇంటర్నెట్‌లో పోర్న్‌వీడియోలతో పెడదోవ పడుతున్నారు. వృద్ధులు సైతం లైంగిక దాడుల ఘటనలకు పాల్పడుతున్నారు. కొందరు మద్యానికి, మత్తుపదార్థాలకు బానిసలుగా మారి, ఆ నిషాలో కనీస విచక్షణ కోల్పోతున్నారు.

### తల్లిదండ్రులు తస్మాత్ జాగ్రత్త

పిల్లలను కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులదే. వారికి ముందుగానే పరిసరాలపై పూర్తి అవగాహన కల్పించాలి.

☛ పాఠశాలలకు వెళ్లే చిన్నారులకు చాక్లెట్లు, ఐస్‌క్రీంలు కొనిస్తామంటూ, మీ పేరెంట్స్ పిలుస్తున్నారంటూ ఎవరైనా కొత్తవాళ్లు చెప్తే అసలు నమ్మవద్దని చెప్పాలి.

☛ తల్లిదండ్రుల ఫోన్‌నంబర్లు, పేర్లు, ఇంటి చిరునామా తప్పక నేర్పించాలి. వీలైనంతవరకు పాఠశాలలో స్వయంగా దింపడం, మళ్లీ తీసుకురావడం చేయాలి. ఆటోలు, బస్సుల్లో వెళ్లే పిల్లల తల్లిదండ్రులు ఆయా డ్రైవర్ల ప్రవర్తనపైనా కన్నేసి ఉంచాలి.

☛ ఎవరైనా తమ ఒంటిపై చేతులువేసి తాకడానికి ప్రయత్నిస్తే అది ఎక్కడ వేస్తున్నారన్న దాన్నిబట్టి ఎదుటివాళ్లు మంచివాళ్లా.. చెడ్డవాళ్లా పసిగట్టేలా పిల్లలకు నేర్పించాలి.

☛ దూరపు బంధువులు, స్నేహితులు, తెలిసినవాళ్లు పిల్లలతో మరీ చనువుగా ఉండేందుకు ప్రయత్నిస్తే ముఖ్యంగా టీనేజ్ అమ్మాయిల విషయంలో అనవసర వరసలు కలిపేందుకు ప్రయత్నిస్తే కఠినంగా వ్యవహరించాలి.

### పన్నెండేండ్లలోపు చిన్నారులే టార్గెట్

లైంగికదాడుల ఘటనల్లో బాధితులు పన్నెండేండ్లలోపువారే ఉంటున్నారు. ఈ వయస్సుల వారిని ట్రాప్ చేయడం, ఎత్తుకెళ్లడం సులువు కాబట్టే వారిని టార్గెట్ చేస్తున్నారు. వారిని అంతమొందించడం కూడా సులువు కావడం వల్లనే చిన్నారులే ఎక్కువగా బాధితులు ఉన్నారని పోలీసులు చెప్తున్నారు. ఇటీవల నిర్వహించిన ఒక సర్వే ప్రకారం.. 4 నుంచి 15 ఏండ్ల పిల్లలు పాఠశాలల్లో 16 శాతం, ఇంటికివచ్చి ట్యూషన్లు చెప్పేవారితో 29శాతం, దూరపు బంధువులు, పరిచయస్థులతో 37శాతం, క్రీడల్లో కోచ్‌లు, ఉపాధ్యాయులతో 11శాతం, స్నేహితుల అన్నలు, బంధువులతో 7శాతం లైంగిక వేధింపులకు గురవుతున్నట్టు వెల్లడైంది.

### కఠిన శిక్షలతోనే మార్పు



దీనిని యాంటీసోషల్ పర్సనాలిటీ డిజార్డర్ అంటారు. విచ్చలవిడితనం పెరగడం, తప్పుచేస్తే కఠినశిక్షలు ఏమీ ఉండవు, సులభంగానే తప్పించుకోవచ్చన్న ఒకరకమైన ధోరణి ఇలాంటి నేరాలను మరింత ప్రేరేపిస్తుంది. ఇలాంటి ఘటనలకు బలికాకుండా ఉండాలంటే పిల్లల పట్ల తల్లిదండ్రుల బాధ్యత మరింత పెరుగాలి.

– డాక్టర్ మొత్కూరి రామచందర్, కౌన్సెలింగ్ సైకాలజిస్ట్

## ఒంగోలులో బాలికపై గ్యాంగ్‌రేప్

గదిలో బంధించి ఆరురోజులు అఘాయిత్యం

ఆరుగురి అరెస్టు.. నిందితుల్లో ముగ్గురు మైనర్లు

స్నేహితుడి కోసం బస్టాండ్‌కు వచ్చిన బాలికను ట్రాప్‌చేసిన దివ్యాంగుడు

కేసు వివరాలు మీడియాకు వెల్లడించిన ప్రకాశం జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఏపీలోని ప్రకాశం జిల్లా ఒంగోలులో ఇల్లొదిలి వచ్చిన ఓ బాలికను ట్రాప్‌చేశాడో యువకుడు. మాయమాటలు చెప్పి ఓ గదిలో నిర్బంధించాడు. అతడితోపాటు మరో ఐదుగురు యువకులు ఆరురోజులపాటు లైంగికదాడికి పాల్పడ్డారు. వారి చెర నుంచి బయటపడిన బాలిక బస్టాండ్‌లో ఏడుస్తూ కనిపించడంతో పోలీసులు విచారించగా దారుణ ఘటన వెలుగులోకి వచ్చింది. ఘటనలో ఆరుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. వీరిలో ముగ్గురు మైనర్లు ఉన్నారు. కేసు వివరాలను ప్రకాశం జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ ఆదివారం మధ్యాహ్నం మీడియాకు వెల్లడించారు. గుంటూరుకు చెందిన ఓ బాలిక దవాఖానలో చికిత్స పొందుతున్న తన తాతకు సహాయంగా ఉన్నది. ఒంగోలుకు చెందిన రాము అనే ట్యాక్సీ డ్రైవర్ అనారోగ్యంతో ఉన్న ఓ వ్యక్తిని అదే దవాఖానకు తీసుకెళ్లాడు. ఈ క్రమంలో అతడు బాలికలో మాటలు కలిపాడు. ఆ పరిచయంతో ఇద్దరూ ఫోన్‌లో మాట్లాడుకోవడం ప్రారంభించారు. విషయం తల్లికి తెలియడంతో కూతుర్ని మందలించింది. దీంతో ఆగ్రహించిన బాలిక 17న ఇల్లు వదిలిపెట్టి ఒంగోలులో తన స్నేహితుడిని కలిసేందుకు బస్టాండ్‌కు చేరుకొంది. ట్యాక్సీ డ్రైవర్ రాము కోసం వాకబు చేసింది. బస్టాండ్‌లోని ఓ దుకాణంలో పనిచేసే షేక్ బాజీ అనే దివ్యాంగ యువకుడు ఇదంతా గమనించాడు. ఆ బాలికతో మాటలు కలిపాడు. ఆమె సెల్‌ఫోన్ చార్జింగ్ అయిపోవడంతో తన షాపులోనే చార్జింగ్ పెట్టించాడు. రాము అచూకీ లభించేంతవరకు తాను ఆశ్రయం కల్పిస్తానని నమ్మించడంతో బాలిక అతడి వెంట నడిచింది. ఒంగోలులోని రద్దీప్రాంతంలో ఉన్న ఒక గదికి తీసుకెళ్లిన ఆ యువకుడు లైంగికదాడికి పాల్పడ్డాడు. మరో ఐదుగురిని ఆమెపై లైంగికదాడికి ఉసిగొల్పాడు. గదిలో బంధించి ఆరురోజులు బాలికపై ఆరుగురు యువకులు లైంగకదాడి చేశారు. వారి బారి నుంచి తప్పించుకున్న బాలిక శనివారం సాయంత్రం ఒంగోలు బస్టాండ్‌లో రోదిస్తూ కూర్చుంది. బాలికను గమనించిన హోంగార్డు వెంకటేశ్వర్లు, ఔట్‌పోస్టు ఏఎస్సై బాబురావు ఆమెతో మాట్లాడి జరిగిన విషయాన్ని తెలుసుకున్నారు. బాలికను పీఎస్‌కు తీసుకొచ్చారు. పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి నిందితుల కోసం గాలింపు చేపట్టారు. శనివారం నలుగురు, ఆదివారం మరో ఇద్దరు నిందితులను అరెస్టుచేశారు. ప్రధాన నిందితుడిని షేక్ భాజీగా గుర్తించారు. బాలిక ఫిర్యాదు మేరకు ఏ1 షేక్ బాజీ, ఏ2 శ్రీనివాస్, ఏ 6 మహేశ్, మరో ముగ్గురు మైనర్లపై కేసులు నమోదుచేశారు. బాధిత బాలికను దవాఖానకు తరలించి వైద్య పరీక్షలు చేయించామని, బాలిక ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని ఎస్పీ తెలిపారు. ఈ ఘటనను ఏపీ హోం మంత్రి సుచరిత తీవ్రంగా ఖండించారు. నిందితులకు చట్టప్రకారం శిక్షపడేలా చేస్తామని, మరోమారు ఘటనలకు తావులేకుండా చూస్తామని తెలిపారు.

### లోకం పోకడ




మనీ ప్లాంట్లు పెంచితే ఆదాయం రాదంటే వినవేంది?!

## చిన్నారిని చిదిమేసిన టిప్పర్

అల్వాల్‌లోని అంజయ్యనగర్‌లో విషాదం

**అల్వాల్:** చిన్నారిని టిప్పర్ వాహనం చిదిమేసిన ఘటన మేడ్చల్ జిల్లా అల్వాల్ పీఎస్ పరిధిలోని హస్మత్‌పేట్ అంజయ్యనగర్‌లో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. అంజయ్యనగర్‌కు చెందిన మహ్మద్ బాబు, సాజాన బేగం దంపతుల కూతురు ముస్కానాబేగం (7) స్థానిక స్కూల్‌లో రెండో తరగతి చదువుతున్నది. ఆదివారం ఇంటి ముందు స్నేహితురాలితో ఆడుకుంటున్నది. అదే సమయంలో అక్కడికి కంకరలోడుతో టిప్పర్ వాహనం వచ్చింది. వాహన్నాన్ని గడ్డప్రాంతాన్ని ఎక్కిస్తున్న సమయంలో బ్రేకులు ఫెయిల్ కావడంతో అదుపుతప్పిన టిప్పర్ వెనుకకు (రివర్స్‌లో) ముస్కానాబేగం మీదుగా వెళ్లడంతో బాలిక అక్కడికక్కడే ప్రాణాలు వదిలింది. డ్రైవర్ ఘటన స్థలం నుంచి పరారయ్యాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ముస్కానా బేగం

## మాజీ ఖైదీలకు ఉద్యోగం

జాబ్‌మేళా ద్వారా 81మంది ఎంపిక.. భరోసా కల్పిస్తున్న జైళ్లశాఖ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఖైదీల్లో మార్పు తీసుకొచ్చేందుకు జైళ్లశాఖ అనేక పథకాలను అమలుచేస్తున్నది. జైలు నుంచి విడుదలైన అనంతరం కుటుంబంతో గౌరవప్రదమైన జీవితాన్ని గడిపేందుకు మహాపరివర్తన, ఉన్నతి, విద్యాదానం, స్కిల్ డెవలప్‌మెంట్, రుణాలివ్వడం వంటి అనేక కార్యక్రమాల ద్వారా మాజీ ఖైదీలకు భరోసా కల్పిస్తున్నది. జైలుశిక్ష అనుభవించి విడుదలైన మాజీ ఖైదీల కోసం శనివారం హైదరాబాద్‌లో వివిధ కంపెనీలతో జాబ్‌మేళా-2019 నిర్వహించింది. జాబ్‌మేళాకు 129 మంది మాజీ ఖైదీలు హాజరుకాగా, వీరిలో 81 మంది వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు సాధించారు. వీరు నెలకు రూ.10 వేల నుంచి రూ.30 వేల వరకు వేతనాలు పొందనున్నారు. 2017 నవంబర్ నుంచి జాబ్‌మేళాల ద్వారా దాదాపు 650 మంది మాజీ ఖైదీలు వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు పొందినట్టు జైళ్లశాఖ అధికారులు తెలిపారు.

## లైంగికదాడికి యత్నించిన వృద్ధుడికి బడితపూజ

**జవహర్‌నగర్:** ఏడేండ్ల బాలికపై వృద్ధుడు లైంగికదాడికి యత్నించిన ఘటన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జవహర్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని ఓ కాలనీలో నివాసముండే వృద్ధుడు వెంకటయ్య.. ఇంటి పక్కనే ఆడుకుంటున్న చిన్నారిని భవనంపైకి తీసుకెళ్లి లైంగికదాడి చేయబోయాడు. పక్క భవనంలో నివాసం ఉండే వ్యక్తి గమనించి అరవడంతో కామాంధుడు పరారయ్యాడు. స్థానికులు వెంబడించి వృద్ధుడిని పట్టుకొని విద్యుత్ స్తంభానికి కట్టేసి కొట్టి పోలీసులకు అప్పగించారు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసిన పోలీసులు.. నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.



వెంకటయ్య

సోమవారం
24•6•2019
కరీంనగర్

# నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE






## తృణమూల్‌కు కమీషన్ల చిక్కులు

- ప్రభుత్వ పథకాల సొమ్ముకు చేయిచాస్తున్న ప్రజాప్రతినిధులు
- లంచం సొమ్మును తిరిగిచ్చేయాలని సీఎం మమత ఆదేశం
- పార్టీ నేతలపై రాష్ట్రవ్యాప్తంగా వెల్లువెత్తుతున్న ఫిర్యాదులు

9



## భారత్ అజేయభేరీ

- ఓటమి ఎరుగని మహిళా హాకీ జట్టు
- ఎఫ్ఐహెచ్ సిరీస్ సొంతం
- తుదిపోరులో 3-1తో జపాన్‌పై ఘనవిజయం
- కెప్టెన్ రాణి రాంపాల్ మెరుపు గోల్

ఆటలో



ఇథియోపియా ఆర్మీ చీఫ్ సియారె మెకొన్నెన్ దారుణ హత్య

## కాల్చి చంపిన బాడీగార్డు

- ప్రాంతీయ అధ్యక్షుడినీ హత్య చేసిన దుండగులు
- ప్రాంతీయ ప్రభుత్వాన్ని కూల్చే కుట్ర!

9

PUBLISHED FROM HYDERABAD I KARIMNAGAR I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD

# జోరువానలు

## రాష్ట్రమంతటా విస్తరించిన రుతుపవనాలు

- నాగర్‌కర్నూల్, జనగామ, గ్రేటర్ హైదరాబాద్‌లో భారీవర్షం
- వికారాబాద్ జిల్లాలో పొంగిపొర్లుతున్న వాగులు
- రంగారెడ్డి జిల్లాలోని ఈసీ వాగులో ఉధృత ప్రవాహం
- రానున్న మూడు రోజుల్లో రాష్ట్రంలో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వానలు

**రాష్ట్రాన్ని** ఆలస్యంగా పలుకరించినప్పటికీ తొలకరి రైతన్నల్లో భరోసా నింపింది. రెండు రోజుల క్రితం రాష్ట్రంలో ప్రవేశించిన రుతుపవనాలు చురుకుగా కదులుతున్నాయి. ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా విస్తరించాయి. దీంతో పది జిల్లాల్లో వర్షం పడింది. వికారాబాద్, నాగర్‌కర్నూల్, జనగామ, గ్రేటర్ హైదరాబాద్‌లో భారీవర్షం కురవగా మిగతా జిల్లాల్లో ఓ మోస్తరు నుంచి జల్లులు కురిశాయి. పలు చోట్ల వాగులు పొంగాయి. రంగారెడ్డి జిల్లాలో ఈసీ వాగులోకి వరద చేరింది. నాగర్‌కర్నూల్ జిల్లాలో దుందుభి వాగు పరవళ్లు తొక్కింది. సంగారెడ్డి జిల్లాలో ఆదివారం మధ్యాహ్నం ఉరుములు మెరుపులతో గాలివాన బీభత్సం సృష్టించింది. వరంగల్ అర్బన్‌లో జల్లులు కురిశాయి. రూరల్ జిల్లాలోని మూడు మండలాల్లో తేలికపాటి వర్షం కురిసింది. జనగామ జిల్లాలోని పలు చెరువులు, కుంటల్లోకి నీరు చేరింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలంలో భారీవర్షం కురిసింది. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలంలో ఓ మోస్తరు వాన పడింది. నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలం ఎడంపల్లిలో అత్యధికంగా 92.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. గ్రేటర్ హైదరాబాద్‌లో వర్షానికి పలుచోట్ల రోడ్లు జలమయమయ్యాయి. కొద్దిసేపు ట్రాఫిక్ స్తంభించింది.

వివరాలు 7వ పేజీలో



ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లాలో కురిసిన భారీ వర్షానికి కల్వకుర్తి మండలం రఘుపతిపేట వద్ద పొంగిన దుందుభి వాగు

అపరిష్కృత సమస్యలపై

# కేసీఆర్, జగన్ భేటీ

## ఈ నెల 28, 29 తేదీల్లో సమావేశం



- జలవనరుల అంశాలపై ప్రధానంగా చర్చ
- విభజన అంశాలపైనా చర్చించే అవకాశం
- ముందస్తుగా ఇరిగేషన్ అధికారులతో సమావేశమైన సీఎం కేసీఆర్
- రెండు రాష్ట్రాల సస్యశ్యామలానికి చేపట్టాల్సిన చర్యలపై నివేదికకు ఆదేశం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మధ్య సుహృద్భావ వాతావరణం నెలకొన్న నేపథ్యంలో కీలకమైన జలవనరుల అంశాలను పరిష్కరించడానికి ఇద్దరు ముఖ్యమంత్రులు భేటీ కావాలని నిర్ణయించారు. జూన్ 28, 29 తేదీల్లో ముఖ్యమంత్రి కేసీఆర్, ఏపీ సీఎం జగన్మోహన్‌రెడ్డి సమావేశమయ్యే అవకాశాలున్నాయి. ఏపీ సీఎం జగన్మోహన్‌రెడ్డి పలు కార్యక్రమాల దృష్ట్యా ఈ నెల 26 నుంచి 29 వరకు హైదరాబాద్‌లోనే ఉంటున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే ఈ ఇద్దరు నేతలు సమావేశమై పలు అంశాలపై కీలక నిర్ణయాలు తీసుకొనే అవకాశమున్నట్లు తెలుస్తున్నది. ముఖ్యంగా ఐదేండ్లుగా అపరిష్కృతంగా ఉన్న విభజన అంశాలపై నిర్ణయాలు తీసుకోవచ్చని అధికార వర్గాలు చెప్తున్నాయి. ఈ క్రమంలో ఆదివారం సీఎం కేసీఆర్ ప్రగతిభవన్‌లో నీటిపారుదలశాఖ ఉన్నతాధికారులతో భేటీ కావడం ప్రాధాన్యాన్ని సంతరించుకొన్నది.

**స్నేహ సంబంధాలతోనే సమస్యల పరిష్కారం**

పొరుగు రాష్ట్రాలతో స్నేహపూర్వక వాతావరణాన్ని కొనసాగిస్తున్న తెలంగాణ ప్రభుత్వం.. ముందునుంచీ ఆంధ్రప్రదేశ్‌తో సత్సంబంధాలనే కోరుకొన్నది. కానీ.. మొన్నటివరకు ఉన్న ప్రభుత్వం తెలంగాణ స్నేహహస్తాన్ని అందుకోకపోగా.. కయ్యాలమారిగా మారింది. తాజాగా ఆ రాష్ట్రంలో ప్రభుత్వం మారడం.. ఏపీ సీఎం జగన్మోహన్‌రెడ్డి తెలంగాణతో సఖ్యంగా వ్యవహరించడం వల్ల రెండు రాష్ట్రాల మధ్య సానుకూల వాతావరణం నెలకొన్నది. హైదరాబాద్‌లో ఏపీకి కేటాయించిన భవనాలను తెలంగాణకు అప్పగించడంతోపాటు, కాళేశ్వరం ఎత్తిపోతల పథకం ప్రారంభోత్సవానికి జగన్ హాజరుకావడం శుభ సంకేతాలనిచ్చాయి. చర్చలు, సంప్రదింపులతో అన్ని అపరిష్కృత అంశాలను పరిష్కరించుకోవాలని రెండు రాష్ట్రాల సీఎంలు కోరుకుంటున్నారు. ఈ నేపథ్యంలోనే 28, 29 తేదీల్లో ఇద్దరు నేతల భేటీలో ప్రధానంగా

మిగతా 4వ పేజీలో

ఒకే భూమి..

# రెండు సర్వేనంబర్లు!

- రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యంతో అక్రమార్కుల పాగా
- అసైన్డ్‌భూమి లబ్ధిదారులకు కొత్త చిక్కులు
- తప్పను గుర్తించినా.. సరిదిద్దని రెవెన్యూ అధికారులు
- రాజన్న సిరిసిల్ల జిల్లాలో వెలుగుచూసిన బాగోతం




బాధిత రైతు కాంబోజి బుచ్చయ్య

రెవెన్యూ అధికారుల తప్పిదం ఇద్దరు అన్నదమ్ములకు శాపంగా మారింది. రెండు గ్రామాల సరిహద్దుల్లో ఉన్న అసైన్డ్‌భూమికి రెండు గ్రామాల్లోనూ సర్వే నంబర్లు కేటాయించారు. ప్రభుత్వం సదరు భూమిని 1996లో రాజన్న సిరిసిల్ల జిల్లా పెద్దబోనాల గ్రామానికి చెందిన కాంబోజి బుచ్చయ్య సోదరులకు కేటాయించి, పాస్‌పుస్తకాలు కూడా మంజూరుచేసింది. అప్పటినుంచి వారే దానిని సాగుచేసుకొంటున్నారు. కాగా భూ రికార్డుల ప్రక్షాళన సమయంలో రెండు సర్వే నంబర్ల కారణంగా వారికి కొత్త పాస్‌పుస్తకాలు ఇవ్వలేదు. ఒకే భూమికి రెండు సర్వే నంబర్లు ఇవ్వడం తప్పేనని ఒప్పుకొంటున్న రెవెన్యూ అధికారులు.. సమస్య పరిష్కారంలో మాత్రం కాలయాపన చేస్తున్నారు.

వివరాలు 8వ పేజీలో

అసెంబ్లీ, సచివాలయ నిర్మాణాలకు

# గ్లోబల్ టెండర్లు!

- జాతీయ, అంతర్జాతీయ నిర్మాణ సంస్థలకు భాగస్వామ్యం
- వేగంగా నిర్మాణాలను పూర్తిచేసేందుకు కసరత్తు
- సచివాలయంకోసం సీఎం పరిశీలనలో రెండు నమూనాలు
- కొత్త అసెంబ్లీకి పాత అసెంబ్లీ ఎలివేషన్ ఖరారు
- బీఆర్కే భవన్‌లోకి సీఎంవో, జీఏడీ
- నిర్మాణాలపై సిఫారసులు చేయనున్న సబ్ కమిటీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

నూతన శాసనసభ, సచివాలయ భవనాల నిర్మాణాలకు గ్లోబల్ టెండర్ల ద్వారా నిర్మాణ సంస్థను ఎంపిక చేయాలని ప్రభుత్వం భావిస్తున్నది. జాతీయ, అంతర్జాతీయంగా ప్రసిద్ధి చెందిన సంస్థలకు ప్రతిష్ఠాత్మకమైన ఈ రెండు భవనాల నిర్మాణ బాధ్యతలను అప్పగించాలని సీఎం కేసీఆర్ ఆలోచిస్తున్నారు. రెండు భవనాలకు ఈ నెల 27 న శంకుస్థాపన చేయాలని సీఎం నిర్ణయించిన సంగతి తెలిసిందే. లేక్ వ్యూ, పచ్చికబయళ్లు, ఫౌంటెయిన్లతో కొత్త భవన సముదాయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడమే కాకుండా పర్యావరణహిత వాతావరణాన్ని నెలకొల్పేవిధంగా నిర్మించాలని సీఎం అభిప్రాయపడుతున్నారు. గురువారం (జూన్ 27) ఉదయం సచివాలయ ప్రాంగణంలోని ఈశాన్యం మూలలో, ఎర్రమంజిల్‌లోని పాత భవనం స్థానంలో ముఖ్యమంత్రి కేసీఆర్ శంకుస్థాపనలు

మిగతా 4వ పేజీలో

# నేడు గులాబీ పండుగ

- టీఆర్ఎస్ జిల్లా పార్టీ కార్యాలయాలకు నేడే భూమిపూజ
- 29 జిల్లాల్లో ఒకేసారి శంకుస్థాపన
- దసరానాటికి పూర్తిచేయాలని కేసీఆర్ ఆదేశం
- సంస్థాగతంగా మరింత బలోపేతం దిశగా మరో అడుగు



4






# విడాకులు కోరిన భర్తతోనే రెండో బిడ్డను కంటా!

- కోర్టుకు భార్య వినతి
- సమ్మతించిన న్యాయస్థానం

**ముంబై:** విడాకుల కేసు విచారణలో ఉండగా.. భర్తతో తాను రెండో బిడ్డను కనేందుకు అనుమతి ఇవ్వాలని ఓ మహిళ న్యాయస్థానానికి అర్జీ పెట్టుకున్న అరుదైన ఘటన మహారాష్ట్రలో చోటుచేసుకున్నది. బిడ్డను కనడానికి తమ దాంపత్య హక్కులను పునరుద్ధరించడం లేదా కృత్రిమ పద్ధతి ద్వారాగానీ బిడ్డను కనేందుకు అనుమతి ఇవ్వాలని నాందేడ్ కుటుంబ న్యాయస్థానాన్ని ఆమె కోరారు. సదరు మహిళ అభ్యర్థనను పరిశీలించిన న్యాయస్థానం.. సంతానోత్పత్తి హక్కులు భావోద్వేగపరంగా చర్చించదగినవని, స్త్రీ, పురుష సంక్లిష్టతతో కూడినవని, న్యాయపరమైన, సాంఘికపరమైన చిక్కులను, పర్యవసానాలను సృష్టించగలవని అభిప్రాయపడింది. సంతానోత్పత్తి హక్కు మహిళకు ఉందని, ప్రస్తుత కేసులో కృత్రిమ గర్భాదానం కోసం తన భర్త వీర్యాన్ని దానం చేయాలని చేసిన ఆమె అభ్యర్థన న్యాయమైన విధానమని, దీనికోసం భర్త సమ్మతి చాలా ముఖ్యమని పేర్కొంది. ఈ నెల 24న మ్యారేజ్ కౌన్సిలర్‌తో సమావేశమవాలని, ఓ నెలలోగా ఐవీఎఫ్ ఎక్స్‌పర్ట్‌ను సలహా అడగాలని కోర్టు తెలిపింది. ఉద్యోగస్థులైన ఈ దంపతులకు ఇప్పటికే ఒక బిడ్డ ఉన్నది. తనను ఆమె క్రూరంగా హింసిస్తున్నదని, తనకు విడాకులు మంజూరు చేయాలని భర్త ముంబయి కోర్టును 2017లో ఆశ్రయించాడు. ఆయనతోనే తనకు రెండో బిడ్డను కనేందుకు అనుమతి ఇవ్వాలని నాందేడ్ కుటుంబ న్యాయస్థానాన్ని భార్య 2018లో ఆశ్రయించారు.

# దారితప్పి గుడిలోకి ప్రవేశించిన మొసలి

పూజలుచేసి హారతులిచ్చిన గ్రామస్థులు ■ రక్షించిన అధికారులు.. గుజరాత్‌లో ఘటన



**అహ్మదాబాద్/వడోదర:** దారితప్పి గుడిలోకి ప్రవేశించిన ఓ మొసలికి గ్రామస్థులు పూజలు చేసిన ఘటన గుజరాత్‌లోని మహిసాగర్ జిల్లాలో ఆదివారం జరిగింది. చివరకు అటవీశాఖ అధికారుల చొరవతో ఆ మొసలి దగ్గర్లోని నీటికుంటలోకి చేరింది. మహిసాగర్ జిల్లాలోని ఖోదియార్ ఆలయంలోకి ఆదివారం ఓ మొసలి ప్రవేశించింది. గుళ్లోకి మొసలి ప్రవేశించడం శుభసూచకమని భావించి ప్రజలు పూజలు చేసి హారతులు ఇచ్చారు. సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు అక్కడికి చేరుకొని మొసలిని తరలించే ప్రయత్నం చేశారు. గ్రామస్థులు వారించడంతో రెండు గంటలపాటు వేచి చూశారు. అనంతరం ఆ మొసలిని దగ్గర్లోని నీటి మడుగుకి తరలించినట్టుఅని అటవీశాఖ అధికారి పార్మర్ తెలిపారు.

# ఇండోర్‌లో హత్య!

- వేరే కులస్థుడిని పెండ్లి చేసుకుందని అక్కను చంపిన తమ్ముడు

**ఇండోర్:** కుటుంబసభ్యుల అభిమతానికి విరుద్ధంగా వేరే కులానికి చెందిన వ్యక్తిని పెండ్లి చేసుకుందన్న కోపంతో సొంత అక్కనే కాల్చి చంపాడు తమ్ముడు. ఈ ఘటన ఇండోర్‌లోని ఓ గ్రామంలో శనివారం చోటుచేసుకున్నది. 'రావాద్ గ్రామంలోని ఇతర కులస్థుడైన వ్యక్తితో బాధితురాలికి ఆరు నెలల క్రితం పెండ్లయింది. దానికి యువతి కుటుంబసభ్యులు ఒప్పుకోలేదు. దీంతో దంపతులు గ్రామాన్ని విడిచివెళ్లారు. శనివారం గ్రామానికి వచ్చిన బాధితురాలిని ఆమె పదిహేడేండ్ల వయసున్న తమ్ముడు తుపాకీతో కాల్చాడు' అని పోలీస్ సబ్ డివిజనల్ ఆఫీసర్ రామ్‌కుమార్ రాయ్ తెలిపారు. బాధితురాల్ని హుటాహుటిన దవాఖానకు తరలించినా అప్పటికే యువతి చనిపోయినట్టు వైద్యులు నిర్ధారించారు. ఘటన అనంతరం నిందితుడు బెట్మా పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయాడు.



## టీఆర్ఎస్ జిల్లా పార్టీ కార్యాలయాలకు
# నేడే భూమిపూజ

- 29 జిల్లాల్లో ఒకేసారి శంకుస్థాపన
- దసరానాటికి పూర్తిచేయాలని కేసీఆర్ ఆదేశం
- సంస్థాగతంగా మరింత బలోపేతం దిశగా మరో అడుగు




**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ రాష్ట్రంలో మరింత బలపడటానికి మరో అడుగు ముందుకు వేస్తున్నది. గ్రామ స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు అత్యధికంగా ప్రజాప్రతినిధులను కలిగిన ఉన్న పార్టీగా గుర్తింపు పొందిన టీఆర్ఎస్ సంస్థాగతంగా పటిష్ఠం కావడానికి ప్రతి జిల్లాలో శాశ్వత కార్యాలయాల నిర్మాణం చేపడుతున్నది. ఈ మేరకు సోమవారం 29 జిల్లాల్లో ఒకేసారి పార్టీ కార్యాలయ నిర్మాణాలకు శంకుస్థాపన జరుగనున్నది. ఇందుకోసం అన్ని జిల్లాల్లో ప్రభుత్వం నుంచి ఎకరం చొప్పున స్థలాన్ని టీఆర్ఎస్ కొనుగోలుచేసింది. పార్టీ కార్యాలయాల నిర్మాణానికి రాష్ట్ర పార్టీ నుంచి ఒక్కో జిల్లాకు రూ.60 లక్షలు కేటాయించారు. వచ్చే దసరా నాటికి కార్యాలయాలను ప్రారంభించుకోవాలని పార్టీ అధ్యక్షుడు, సీఎం కేసీఆర్ లక్ష్యంగా నిర్దేశించారు. పార్టీ కార్యాలయాల శంకుస్థాపనకు పార్టీ నాయకులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. శంకుస్థాపన ఏర్పాట్లపై నాయకులతో వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు ఎప్పటికప్పుడు సమీక్షించారు. భూమిపూజను సోమవారం ఉదయం 10 గంటల నుంచి 11 గంటల మధ్యలో పూర్తిచేయనున్నారు. పార్టీకి చెందిన ఎంపీటీసీ సభ్యులు, జెడ్పీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, పార్టీ సీనియర్ నాయకులను ఈ కార్యక్రమానికి ఆహ్వానించారు. పార్టీ కార్యాలయాల నమూనాను సీఎం త్వరలో ఎంపిక చేస్తారు. మంత్రులు తాము ప్రాతినిధ్యం వహిస్తున్న చోట్ల శంకుస్థాపన చేస్తారు. మిగతా ప్రాంతాల్లో కొత్తగా ఎన్నికైన జిల్లా పరిషత్ చైర్మన్లు, శాసనసభ్యులు, పార్లమెంట్ సభ్యులు, శాసనమండలి సభ్యులు కలిసి భూమిపూజ నిర్వహిస్తారు. ఖమ్మం జిల్లాలో ఇప్పటికే కార్యాలయం నిర్మాణమైంది. హైదరాబాద్, వరంగల్ రూరల్ జిల్లా పార్టీ కార్యాలయాలకు స్థలాలను అన్వేషిస్తున్నారు. వనపర్తి జిల్లా కార్యాలయానికి ఇప్పటికే శంకుస్థాపన పూర్తిచేశారు.

## అపరిష్కృత సమస్యలపై
# కేసీఆర్, జగన్ భేటీ

మూడోపేజీ తరువాయి...

జలవనరుల అంశాలు, విభజన అంశాలపై చర్చలు జరుగనున్నాయి. అంతేకాకుండా రెండు రాష్ట్రాల నీటిపారుదలశాఖ ఉన్నతాధికారులతోకూడా ఇద్దరు సీఎంల భేటీ ఉంటుందని తెలంగాణ సీఎం కేసీఆర్ ఇప్పటికే ప్రకటించారు. చాలాకాలంగా రెండు రాష్ట్రాల మధ్య పలువిభజన అంశాలు కొలిక్కి రాకుండా పెండింగులో ఉన్నాయి. వాటిపై చర్చించి త్వరితగతిన పరిష్కరించేందుకు ఇద్దరు సీఎంలు కీలక నిర్ణయాలు తీసుకొనే అవకాశాలు కనిపిస్తున్నాయి.

### రెండు రాష్ట్రాల సస్యశ్యామలానికి ఏం చేద్దాం?

రెండు తెలుగు రాష్ట్రాల్లో సాగుకు అనువైన ప్రతి ఎకరాకు నీరందించి సస్యశ్యామలం చేయడానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలన్న దానిపై లోతుగా పరిశీలన చేయాలని సీఎం కేసీఆర్.. నీటిపారుదలశాఖ ఇంజినీర్లకు సూచించారు. కృష్ణా, గోదావరి బేసిన్‌కు సంబంధించి తెలంగాణ, ఏపీ మధ్య ఉన్న జలసంబంధ అంశాలను పరిష్కరించుకొనే దిశలో ఇద్దరు సీఎంల మధ్య భేటీ జరుగనున్న నేపథ్యంలో ఆదివారం నీటిపారుదలశాఖ ఉన్నతాధికారులతో సీఎం కేసీఆర్ ప్రగతిభవన్‌లో రెండుగంటలపాటు సమావేశమయ్యారు. ప్రధానంగా కృష్ణా, గోదావరి జలాల్ని సంపూర్ణంగా వినియోగించుకొని.. రెండు రాష్ట్రాలను సస్యశ్యామలం చేసేందుకుగాను పరిశీలనచేసి, నివేదిక రూపొందించాలని సీఎం సూచించినట్టు తెలిసింది. ప్రతి ఏటా గోదావరిలో సరాసరిన మూడువేల టీఎంసీల నీళ్లు సముద్రంలోకి పోతున్నాయని, అదేవిధంగా కృష్ణలో నీటి లభ్యత గణనీయంగా తగ్గుతున్నదని సీఎం అన్నట్టు సమాచారం. ఈ క్రమంలో శ్రీశైలం వరకు వచ్చే ఇన్‌ఫ్లోలను రెండు రాష్ట్రాలు వినియోగించుకొని.. దిగువన కృష్ణా బేసిన్‌లో గోదావరి జలాలను సద్వినియోగం చేసుకొనే అంశాలపై చర్చ జరిగినట్లు తెలిసింది. రెండు రాష్ట్రాల మధ్య అపరిష్కృతంగా ఉన్న అంశాలపై ప్రత్యేకంగా చర్చించనప్పటికీ.. ప్రధానంగా గోదావరిలో సమృద్ధిగా నీటి లభ్యత ఉన్నందున రెండు రాష్ట్రాల్లోని బీడు భూములకు తరలించడంపై సీఎం కేసీఆర్ చాలాసేపు మాట్లాడినట్లు తెలిసింది. ఏయే అంశాలపై ఎలా ముందుకు పోవాలనే దానిపై నివేదిక రూపొందించాలని కూడా సీఎం అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ప్రస్తుతం ఉన్న పరిస్థితులు, ట్రిబ్యునల్ విచారణ.. తదితర అంశాలను అధికారులు సీఎం కేసీఆర్‌కు వివరించారు.



ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావుకు తాను రాసిన ఇంటర్‌స్టేట్ రివర్ వాటర్ డిస్ప్యూట్స్ పుస్తకాన్ని అందజేస్తున్న నీటిపారుదలశాఖ ఇంటర్ స్టేట్ చీఫ్ ఇంజినీర్ ఎస్ నర్సింహారావు

### పుస్తకాన్ని అందించిన చీఫ్ ఇంజినీర్..

జాతీయంగా, అంతర్జాతీయంగా నదీజలాల పంపిణీపై నెలకొన్న వివాదాలు.. వాటిని పరిష్కరించుకున్నతీరుపై సమగ్రంగా అధ్యయనం చేసిన నీటిపారుదలశాఖ ఇంటర్ స్టేట్ చీఫ్ ఇంజినీర్ ఎస్ నర్సింహారావు వాటిని ఇటీవల పుస్తకరూపంలోకి తీసుకువచ్చారు. ఆదివారం ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌తో సమావేశమైన అనంతరం నర్సింహారావు ఆ పుస్తకాన్ని సీఎం కేసీఆర్‌కు అందించారు.

# చేప పిల్లల పంపిణీకి కసరత్తు

- జూలై ఆఖరులో 80.64 కోట్ల చేపపిల్లల పంపిణీకి చర్యలు
- చేపపిల్లల సేకరణకు కొనసాగుతున్న టెండర్ల ప్రక్రియ
- మంచి సైజు, నాణ్యతకు ప్రాధాన్యమిస్తున్న మత్స్యశాఖ



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని జలవనరుల్లో వందశాతం రాయితీపై చేపపిల్లల పంపిణీకి మత్స్యశాఖ కసరత్తు చేస్తున్నది. 2019-20 సంవత్సరానికి జూలై చివరివారంలో పంపిణీచేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్రంలోని సుమారు 23 వేల నీటివనరుల్లో 80.64 కోట్ల చేపపిల్లలను పంపిణీచేయాలని మత్స్యశాఖ అధికారులు ప్రణాళికలను రూపొందించారు. ఇందుకు అవసరమైన చేపపిల్లల సేకరణకు టెండర్ల ప్రక్రియ కొనసాగుతున్నది. 2016-17లో 3,939 చెరువుల్లో 27.85 కోట్లు, 2017-18లో 11,067 నీటివనరుల్లో 51.68 కోట్లు, 2018-19లో 49.15 కోట్ల చేపపిల్లలను సుమారు 21 వేలచెరువుల్లో వదిలారు. చేపల దిగుబడి పెరుగుతుండటం, వివిధ రాష్ట్రాల్లో మన రాష్ట్ర చేపలకు డిమాండ్ పెరగడంతో మత్స్యకారులను ప్రోత్సహించాలని మత్స్యశాఖ భావిస్తున్నది. మంచి సైజు, నాణ్యమైన చేపపిల్లల కొనుగోలుకు ప్రాధాన్యమిస్తున్నట్టు మత్స్యశాఖ కమిషనర్ సువర్ణ తెలిపారు. వర్షాలు కురుస్తున్నందున చెరువుల్లో నీరుచేరిన వెంటనే చేపపిల్లలను వదిలేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. చేపపిల్లలను సరఫరా చేసేందుకు మత్స్యశాఖ ఇప్పటికే టెండర్ ప్రకటనను జారీచేసింది. వచ్చే నెల 5న ఈ టెండర్లు ఖరారు కానున్నాయి. టెండర్ల గడువు ముగిసిన 10 రోజుల్లో ఏ జిల్లాకు ఏ ఏజెన్సీ చేపపిల్లలను సరఫరా చేయాలనేది నిర్ణయిస్తామని మత్స్యశాఖ అధికారులు తెలిపారు. ఇప్పటికే ఈ చేపపిల్లల సరఫరాకు సంబంధించి ఒకసారి టెండర్లు నిర్వహించినప్పటికీ, రాష్ట్రవ్యాప్తంగా ఎక్కువ జిల్లాల్లో సగటు మార్కెట్ ధర కన్నా తక్కువ మొత్తంతో బిడ్లు దాఖలుకావడం, జిల్లా జిల్లాకు ప్రతిపాదించిన ధరలో వ్యత్యాసం ఎక్కువగా ఉండటంతో వాటిని రద్దుచేశారు. మార్కెట్ ధర లభించడంలేదనే కారణంతో సరఫరా ప్రక్రియ నుంచి మధ్యలోనే తప్పుకొనే అవకాశం ఉందని టెండర్లను రద్దుచేసినట్లు మత్స్యశాఖ కమిషనర్ సువర్ణ తెలిపారు. నాణ్యతకు ప్రాధాన్యమిస్తూ ప్రస్తుత టెండర్ల ప్రక్రియ పూర్తి చేసేందుకు మత్స్యశాఖ జాగ్రత్తలు తీసుకుంటున్నది.

## ఢిల్లీలో మహిళా జర్నలిస్టుపై కాల్పులు



మితాలి చందోలా

**న్యూఢిల్లీ:** ఢిల్లీలో ఓ మహిళా పాత్రికేయురాలిపై ఇద్దరు దుండగులు తుపాకీతో కాల్పులు జరిపారు. ఆమె చేతికి గాయం కావడంతో ప్రాణాపాయం తప్పింది. ఓటీవీ చానల్‌లో పనిచేస్తున్న మితాలి చందోలా శనివారం అర్ధరాత్రి కారులో ఒంటరిగా డ్రైవ్‌చేస్తూ వెళ్తుండగా వెంబడించిన అగంతకులు న్యూ అశోక్‌నగర్ ప్రాంతంలో తొలుత ఆమె కారుపైకి గుడ్లు విసిరారు. ఆమె కారును ఆపకపోవడంతో తుపాకులతో కాల్పులు జరిపారు. రెండు బుల్లెట్లు కారులోకి దూసుకెళ్లగా, ఒకటి ఆమె చేతికి తగలడంతో గాయమైంది. మితాలి తన భర్త నుంచి విడిగా నివసిస్తుండటంతో ఆమెపై కాల్పులకు కుటుంబ వివాదాలు కారణమని తెలుస్తున్నది.

# ముస్లిం యువకుడిపై మూక దాడి!

- దొంగతనం చేశాడని 18 గంటలపాటు చిత్రవధ
- దెబ్బలు తాళలేక మృతి, జార్ఖండ్‌లో ఘటన



తబ్రేజ్ అన్సారీ (ఫైల్)

**జార్ఖండ్:** దొంగతనం చేశాడన్న అనుమానంతో 18 గంటలపాటు కొట్టడంతో యువకుడు చనిపోయిన విషాద ఘటన జార్ఖండ్‌లోని ఖర్సవాన్ జిల్లాలో జరిగింది. మహారాష్ట్రలోని పుణెలో వెల్డర్‌గా పనిచేస్తున్న తబ్రేజ్ అన్సారీ (24) ఈద్‌కు ఖర్సవాన్ జిల్లాలోని తన స్వగ్రామానికి వచ్చాడు. ఇటీవల పెండ్లి చేసుకున్న అతడు కుటుంబ సభ్యులతో పండుగను జరుపుకొని, ఈ నెల 18న జంషెడ్‌పూర్‌కి మరో ఇద్దరితో తిరుగు ప్రయాణమయ్యాడు. దత్‌కిది గ్రామానికి చేరుకున్న వీరిని అనుమానాస్పద వ్యక్తులుగా భావిస్తూ గ్రామస్థులు ప్రశ్నించారు. ముగ్గురిలో ఇద్దరు పారిపోగా.. తబ్రేజ్ చిక్కాడు. దొంగతనం చేశాడన్న అనుమానంతో కొందరు తబ్రేజ్‌ను 18 గంటల పాటు కర్రలతో కొడుతూ హింసించారు. తబ్రేజ్ ముస్లిం అని తెలియడంతో దుండగుల్లో కొందరు 'జై శ్రీరామ్', 'జై హనుమాన్' నినాదాలు చేయాలని ఒత్తిడి చేసినట్టు కొన్ని వీడియోల ద్వారా తెలుస్తున్నది. తీవ్ర గాయాలపాలైన తబ్రేజ్‌ను పోలీసులు సమీప దవాఖానలో చేర్పించి చికిత్సను అందించారు. జూన్ 22న చికిత్స పొందుతూ తబ్రేజ్ మృతిచెందాడు.

## ప్లాస్టిక్ వ్యర్థాల దిగుమతి నిషేధాన్ని
# పక్కాగా అమలుచేయండి

- కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డుకు జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశం



**న్యూఢిల్లీ:** పర్యావరణానికి ప్రమాదకరమైన ప్లాస్టిక్ వ్యర్థాల దిగుమతిపై ఉన్న నిషేధాన్ని పక్కాగా అమలుచేయాలని కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డు (సీపీసీబీ)ను జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్(ఎన్జీటీ) ఆదేశించింది. అమెరికా, ఐరోపా నుంచి సుమారు తొమ్మిది వేల టన్నుల ప్లాస్టిక్ వ్యర్థ కాగితం, రోడ్లు తుడిచే వ్యర్థాలు భారత్‌కు దిగుమతి కావడంపై అమిత్ జైన్ అనే ఓ వ్యక్తి ఆందోళన వ్యక్తంచేశారు. ఇటుకల బట్టీల్లో వీటిని వినియోగిస్తుండటంతో గాలి, నీరు కలుషితమవుతున్నాయని తద్వారా పర్యావరణానికి నష్టం జరుగుతున్నదని ఎన్జీటీలో టిషన్ వేశారు. చైర్‌పర్సన్ జస్టిస్ ఆదర్శ్ కుమార్ గోయెల్ నేతృత్వంలోని ధర్మాసనం దీనిపై విచారణ చేపట్టింది. ప్లాస్టిక్ వ్యర్థ నిర్వహణ నియమాలను కచ్చితంగా అమలుచేయాలని సీపీసీబీని ఆదేశించింది. ప్రతి ప్లాస్టిక్ ఉత్పత్తిదారుడు లేదా బ్రాండ్ యజమాని తప్పకుండా కొత్తగా లేదా తిరిగి నమోదు చేసుకోవాలని, సీపీసీబీ చెక్‌లిస్ట్ ప్రకారమే రిజిస్ట్రేషన్ జరుగాలని ఎన్జీటీ స్పష్టం చేసింది. అలాగే రోడ్డు నిర్మాణం, విద్యుత్ ఉత్పత్తి, ఆయిల్ తయారీలో ప్లాస్టిక్ వ్యర్థాల వినియోగాన్ని పెంచేలా మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలను ప్రోత్సహించాలని సూచించింది. తమ ఆదేశాలపై చర్య నివేదికను రెండు నెలల్లోగా ఈ మెయిల్ ద్వారా పంపాలని కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డును ఆదేశించింది. తదుపరి విచారణను సెప్టెంబర్ 6కు వాయిదా వేసింది.

# పందిరి కూలి 14 మంది దుర్మరణం

- 50 మందికిపైగా గాయాలు
- ఆధ్యాత్మిక కార్యక్రమంపై పంజా విసిరిన పెనుగాలులు
- రాజస్థాన్‌లో విషాదం



ఆదివారం రాజస్థాన్‌లోని బాడ్‌మెర్ జిల్లాలో పెనుగాలులకు కూలిన ఇనుప పందిరి

**బాడ్‌మెర్:** రాజస్థాన్‌లోని బాడ్‌మెర్ జిల్లాలో ఘోర విషాదం చోటుచేసుకుంది. పెనుగాలులు, భారీ వర్షం ధాటికి పందిరి కూలి మీద పడడంతో 14 మంది ప్రాణాలు కోల్పోయారు. 50 మందికిపైగా గాయపడ్డారు. జసోల్ ప్రాంతంలోని రాణి భాటియాణి ఆలయం సమీపంలో ఉన్న ఓ పాఠశాలలో ఆదివారం 'రామకథ' కార్యక్రమం కోసం ఈ పందిరిని ఏర్పాటు చేశారు. వందలాది మంది భక్తులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. అయితే భారీ వర్షం, పెనుగాలులు వీచడంతో పందిరి కూలి భక్తులపై పడింది. ఈ ప్రమాదంలో 14 మంది మరణించారని, 50 మందికిపైగా గాయపడ్డారని బాలోతరా అదనపు ఎస్పీ రతన్‌లాల్ భార్గవ వెల్లడించారు. గాయపడినవారిని జిల్లాలోని వివిధ దవాఖానలకు తరలించామని చెప్పారు. పోస్ట్‌మార్టం అనంతరం మరణాలకు గల కారణాలు తెలుస్తాయని పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున, గాయపడ్డవారికి రూ.2 లక్షల చొప్పున రాష్ట్ర ప్రభుత్వం పరిహారం ప్రకటించింది. పందిరి కూలే అవకాశం ఉండడంతో కథను మధ్యలోనే ఆపేసిన మురళీధర్ మహారాజ్.. ప్రజలందరూ పందిరి నుంచి బయటకు వెళ్లాలని కోరారు. వేదిక నుంచి ఆయన దిగిన కొద్ది క్షణాలకే పందిరి కూలి భక్తులపై పడిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఘటనా స్థలంలో తొక్కిసలాట జరిగినట్లుగా పరిస్థితి ఉందని చెప్పారు. మహారాజ్ పరిస్థితిపై ఎలాంటి సమాచారం తెలియరాలేదు. బాధితులను రక్షించేందుకు వెళ్లిన స్థానికులకు కరెంట్ షాక్ కొట్టినట్లు ఓ స్థానికుడు తెలిపారు. ఎలాగోలా బాధితులను రక్షించి, ప్రైవేట్ వాహనాలు, మినీ వ్యాన్లలో వివిధ దవాఖానలకు తరలించినట్టు చెప్పారు. రామకథ కార్యక్రమాన్ని రాణి భాటియాణి మందిర్ సంస్థానం నిర్వహిస్తున్నది. శనివారం ప్రారంభమైన ఈ కార్యక్రమం ఈ నెల 30 వరకు జరుగాల్సి ఉన్నది. ప్రమాద ఘటనపై ప్రధాని నరేంద్రమోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పందిరి కూలిపోవడం దురదృష్టకరమన్నారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. గాయపడ్డవారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ ప్రమాద ఘటనపై విచారం వ్యక్తంచేశారు. బాధిత కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలియజేశారు. ఘటనపై విచారణకు ఆదేశించారు. సహాయక చర్యలు చేపట్టాలని జిల్లా యంత్రాంగానికి సూచించారు. కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ, పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ కూడా ఈ ఘటనపై విచారం వ్యక్తం చేశారు.

## అలహాబాద్ హైకోర్టు జడ్జిని తొలగించండి

- ప్రధాని మోదీకి సీజేఐ గొగోయ్ లేఖ

**న్యూఢిల్లీ:** దుర్వర్తనకు పాల్పడిన అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్ఎన్ శుక్లాను తొలగించాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీకి సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ (సీజేఐ) రంజన్ గొగోయ్ లేఖ రాశారు. జస్టిస్ ఎస్ఎన్ శుక్లా దుర్వర్తనకు పాల్పడినట్లు మద్రాస్ హైకోర్టు చీఫ్ జస్టిస్ ఇందిరా బెనర్జీ, సిక్కిం హైకోర్టు చీఫ్ జస్టిస్ ఎస్కే అగ్నిహోత్రి, మధ్యప్రదేశ్ హైకోర్టు జస్టిస్ పీకే జైస్వాల్‌లతో కూడిన అంతర్గత కమిటీ నిర్వహించిన దర్యాప్తులో తేలింది. గతేడాది జనవరిలో కమిటీ తన నివేదికను సుప్రీంకోర్టుకు సమర్పించింది. ఇప్పటివరకు అమలులో ఉన్న ప్రక్రియ ప్రకారం ఆరోపణలు వచ్చిన జడ్జి రాజీనామా లేదా, స్వచ్ఛంద పదవీ విరమణ చేయాల్సి ఉంటుంది. అందుకు జస్టిస్ శుక్లా నిరాకరించారు. దీంతో జస్టిస్ శుక్లాను జ్యుడీషియల్ విధుల నుంచి తొలగించాలని అలహాబాద్ హైకోర్టు సీజేను సీజేఐ ఆదేశించారు. ఆ వెంటనే జస్టిస్ శుక్లా సుదీర్ఘ సెలవుపై వెళ్లారు.

# అసెంబ్లీ, సచివాలయ నిర్మాణాలకు గ్లోబల్ టెండర్లు!

మూడోపేజీ తరువాయి...

చేయనున్నట్లు సమాచారం. శంకుస్థాపన చేసిన తర్వాత ఎలాంటి ఆలస్యం చేయకుండా వీలైనంత వేగంగా ఈ రెండు భవనాల నిర్మాణాలను పూర్తిచేయాలని ప్రభుత్వం భావిస్తున్నది. ఇందులో భాగంగానే పాత సచివాలయంలోని సీఎంవో, జీఏడీతో సహా పలు ప్రభుత్వ శాఖలను పక్కనే ఉన్న బీఆర్కే భవనంలోకి తరలించడానికి సాధారణ పరిపాలన శాఖ కసరత్తు చేస్తున్నది. ఇది పూర్తయితే నూతన భవనాల నిర్మాణం పనులు వేగం పుంజుకుంటాయి.



ఎర్రమంజిల్‌లో ఆర్‌అండ్‌బీ కార్యాలయం నిర్వహిస్తున్న జంట భవనాలు

### సచివాలయంకోసం రెండు నమూనాలు

కొత్త సచివాలయ భవనం కోసం సీఎం కేసీఆర్ రెండు నమూనాలను పరిశీలిస్తున్నారు. ముంబైకి చెందిన ఆర్కిటెక్ట్ హఫీజ్ కాంట్రాక్టర్ గతంలో ఇచ్చిన ఓ నమూనాతోపాటు ఈ మధ్యనే చెన్నైకి చెందిన ఆస్కార్ అండ్ పొన్ని ఆర్కిటెక్ట్ సంస్థ ఇచ్చిన మోడల్ కూడా సీఎం దృష్టిలో ఉన్నది. దీర్ఘ చతురస్రాకారంలో ఒకే బ్లాక్‌గా, పొడవుగా కనిపించేలా చెన్నై కంపెనీ ఇచ్చిన నమూనాతోపాటు భవనం ఎలివేషన్ కూడా సీఎంను బాగా ఆకట్టుకున్నదని అధికారులు చెప్తున్నారు. ఇండో- అరబిక్ ఆర్కిటెక్చర్‌తో హఫీజ్ కాంట్రాక్టర్ ఇచ్చిన నమూనాను కూడా సీఎం పరిశీలిస్తున్నారు. ఈ రెండింటిలో ఒకదాన్ని ఆయన ఖరారు చేస్తారు. గతవారం జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం కూడా నూతన అసెంబ్లీ, సచివాలయ నిర్మాణాలకు ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే.

### నిర్మాణాలకు రూ.500 కోట్ల అంచనా..

కొత్త అసెంబ్లీ, సచివాలయం భవనాల నిర్మాణానికి సంబంధించిన క్యాబినెట్ తీర్మానం ప్రతి ఇప్పటికే రోడ్లు భవనాలశాఖకు చేరింది. ఈ రెండింటి నిర్మాణాలపై ఆర్‌అండ్ బీ శాఖ నుంచి ఖర్చుల ప్రతిపాదనలు పంపించాలని ఇంజినీర్ ఇన్ చీఫ్ కార్యాలయానికి సర్క్యులర్ జారీఅయింది. ప్రతిపాదనలు వచ్చిన తర్వాత పాలనాపరమైన అనుమతులు, బడ్జెట్ విడుదల ఉత్తర్వులు జారీఅవుతాయి. కొత్త సచివాలయం నిర్మాణానికి రూ.400 కోట్లు, అసెంబ్లీ భవన నిర్మాణానికి రూ.100 కోట్ల మేర ఖర్చు అయ్యే అవకాశాలున్నాయని ప్రభుత్వం అంచనా వేస్తున్నది. ఈ ప్రక్రియ పూర్తయితే ఆన్‌లైన్ గ్లోబల్ టెండర్ల ద్వారా నిర్మాణ సంస్థను ఎంపికచేసే అవకాశాలున్నాయి. గతంలో అత్యంత వేగంగా రికార్డు సమయంలో ప్రగతిభవన్ నిర్మాణపనులను పూర్తిచేసిన షాపూర్జీ-పల్లోంజీ సంస్థ.. అసెంబ్లీ, సచివాలయ భవనాల నిర్మాణంపై ఆసక్తి చూపుతున్నట్లు తెలిసింది.

### పాత సచివాలయంలో సౌకర్యాల లేమి

ప్రస్తుత సచివాలయం మొత్తం 25.5 ఎకరాల్లో 10 బ్లాకులుగా విస్తరించి ఉన్నది. దీంట్లో హెరిటేజ్ భవనమైన సర్వహిత బ్లాక్ ఇప్పటికే శిథిలావస్థకు చేరి నిరుపయోగంగా మారింది. కొత్త సచివాలయం నిర్మాణానికి ఈ భవనం అడ్డు రాకూడదని ఈ మధ్యనే దానికున్న వారసత్వ సంపద హోదాను రద్దుచేస్తూ ప్రభుత్వం చట్టంచేసింది. మిగిలినవాటిలో ఏ, బీ, సీ, డీ లు కలిపి 35,818 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఉండగా.. జే, కే, ఎల్, హెచ్ నార్త్, సౌత్ కలిపి 49,342 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఉన్నాయి. ఈ భవనాల్లో కూడా వీవీఐపీ రక్షణ, ఇతర భద్రతా ప్రమాణాలు, సౌకర్యాల లేమి కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. వీటిలో ప్రమాణాలపై పోలీసు, అగ్నిమాపక శాఖలు ఇప్పటికే నివేదికలిచ్చాయి.

### సబ్‌కమిటీ సిఫారసులకు ప్రాధాన్యం

కొత్త నిర్మాణాలపై ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి ప్రశాంత్‌రెడ్డి నేతృత్వంలో ఏర్పాటైన సబ్ కమిటీ సిఫారసులను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోనున్నది. అటు ఎర్రమంజిల్‌లో కొత్త అసెంబ్లీ నిర్మాణం కోసం, ఇటు హుస్సేన్‌సాగర్ ఒడ్డున కొత్త సచివాలయం నిర్మాణం కోసం కమిటీ కార్యాచరణను రూపొందిస్తున్నది. అక్కడా, ఇక్కడా ఏయే భవనాలను స్వాధీనం చేసుకోవాలి, వేటిని కూల్చేయాలి, వేటిని మనుగడలో ఉంచాలనే అంశాలపై సబ్‌కమిటీ అధ్యయనంచేసి ముఖ్యమంత్రికి నివేదిక ఇస్తుంది. కొన్నేండ్ల క్రితం రోడ్లు, భవనాలశాఖ ఎర్రమంజిల్‌లో నిర్మించిన జంట భవనాలను అసెంబ్లీకి అనెక్స్ కాంప్లెక్స్‌గా వాడుకొని శాసనసభ సచివాలయం ఏర్పాటు చేయాలనేది ప్రభుత్వ ఆలోచన. కొత్త అసెంబ్లీ నిర్మించాక అక్కడే ఉన్న జలసౌధను ఉంచాలా, తొలగించాలా అన్న విషయాన్ని కూడా సబ్ కమిటీ తేల్చనున్నది. సబ్ కమిటీ నివేదిక ఆధారంగా తదుపరి కార్యాచరణ ఉంటుందని సీఎం కేసీఆర్ ఇప్పటికే ప్రకటించారు.



ప్రస్తుత సచివాలయంలో హెలిప్యాడ్ ఉన్న ప్రాంతం

### 4 లక్షల చదరపు అడుగుల్లో కొత్త సచివాలయం

ప్రతిపాదిత కొత్త సచివాలయాన్ని సుమారు నాలుగు లక్షల చదరపు అడుగులలో నిర్మించాలని ప్రభుత్వం భావిస్తున్నది. ఇందుకోసం ప్రస్తుత స్థలం చుట్టూ ఉన్న మరికొన్ని భవనాలను కూడా ప్రభుత్వం స్వాధీనం చేసుకోనున్నది. కొత్త సచివాలయం నలువైపులా రోడ్డు ఉండేలా ప్రణాళిక రూపొందిస్తున్నారు. సీ బ్లాక్ వెనుక భాగంలోని కేంద్ర ప్రభుత్వ రంగసంస్థ మింట్ కాంపౌండ్‌లో.. గవర్నమెంట్ ప్రింటింగ్‌ప్రెస్ మినహా, మిగిలిన భాగంలోని భవనాలన్నీ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఉన్నాయి. అటు ఎన్టీఆర్ గార్డెన్‌ను ఆనుకొని ఉన్న దారిలోని తెలంగాణ గేట్ పక్కనున్న విద్యుత్ బిల్డింగులు, ఎంప్లాయీస్ యూనియన్ కార్యాలయాలు, ఇతర భవనాలను సైతం కొత్త సచివాలయం ప్రాంగణంలో కలుపనున్నారు. తద్వారా స్థలం మొత్తాన్ని చతురస్రాకారంలోకి మార్చి వాస్తుదోషాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలనేది ప్రభుత్వం భావన.



## • మా మంచి మల్లన్న

మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి మరో సారి మానవత్వం చాటుకొన్నారు. ఇటీవల బాలానగర్ చౌరస్తాలో ఓ వ్యక్తి రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడటంతో కాన్వాయి వాహనంలో తీసుకెళ్లి దగ్గరుండి వైద్యం చేయించారు. తాజాగా ఓ అనాథ యువతికి సొంత ఖర్చుతో వివాహం జరిపించి కన్యాదానం చేశారు. దుండిగల్ బహదూర్‌పల్లిలోని గౌరీ ఆశ్రమంలో పెరిగిన అనాథ యువతి పుష్ప వివాహం విజయవాడకు చెందిన కిశోర్‌తో ఆదివారం జరిపించి.. పెండ్లి ఖర్చుల కింద రూ.25 వేలు చెల్లించారు. వధువు పేరిట రూ.2.35 లక్షలు ఫిక్సడ్ డిపాజిట్ చేసి ఆశీర్వదించారు. వధూవరులకు సూరారంలోని తన దవాఖానలో ఉద్యోగావకాశం కల్పిస్తున్నట్టు ప్రకటించి పెద్ద మనసు చాటారు.

**- దుండిగల్ (నమస్తేతెలంగాణ)/మేడ్చల్ రూరల్**



ఆదివారం రామప్ప ఆలయ ప్రాంగణంలో తైవాన్ దేశానికి చెందిన ప్రొఫెసర్లు

## రామప్ప కళాఖండాలు అద్భుతం

తైవాన్ దేశ ప్రొఫెసర్ల ప్రశంస

**వెంకటాపూర్:** ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన రామప్ప దేవాలయాన్ని ఆదివారం తైవాన్ దేశస్థులు సందర్శించారు. హన్మకొండ నిట్ కళాశాల సందర్శనలో భాగంగా నిట్ డీన్ ప్రొఫెసర్ జయకుమార్ ఆధ్వర్యంలో రామప్పను సందర్శించి పూజలు చేశారు. కాకతీయ శిల్ప సౌందర్యం అద్భుతమని కొనియాడారు. ఆలయ ప్రాంగణంలో కాకతీయ శిల్పాలను కెమెరాల్లో బంధించారు. ఆలయ విశిష్టతను గైడ్ గోరంట్ల విజయ్‌కుమార్ వారికి వివరించారు.



# ఫుడ్ ప్రాసెసింగ్‌లో తొలి విజయం





మామిడి పండ్లను ప్యాకింగ్ చేసేందుకు సిద్ధంచేసిన బాక్సులు

### మన మహిళల మరో ఘనత

**నాలుగు జిల్లాల్లో 92 మెట్రిక్ టన్నుల మామిడి సేకరణ**

**రైతులకు రూ.40 లక్షల చెల్లింపుతో రెట్టింపునకు మించి లాభం**

**ఉత్పత్తి సంఘాలతో మహిళలకు ఆదాయం**

హాట్‌కేకుల్లా అమ్ముడైన ప్రాసెసింగ్ మామిడి పండ్లు ● తర్వాతి లక్ష్యం పసుపు ప్రాసెసింగ్!

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఆహార విప్లవంలో తొలిఅడుగు విజయవంతమైంది. అనుకున్న లక్ష్యం నెరవేరింది. మహిళాసంఘాలు మరోసారి తమకు ఎదురులేదని నిరూపించుకున్నాయి. నాలుగు జిల్లాల్లో మామిడి సేకరణ, కొనుగోళ్లు విజయాన్ని తెచ్చిపెట్టాయి. మంచి ప్రదేశంలో ప్రాసెసింగ్ చేసి.. సహజ సిద్ధంగా మాగబెట్టిన మామిడి పండ్లు అత్యధిక ధర పలికాయి. రత్నదీప్ మార్కెట్‌లో మహిళా సంఘాల మామిడి పండ్లు కిలోకు దాదాపు రూ. 60కిపైగా ధర దక్కించుకున్నాయి. రైతులు పండించిన పంటలు ఆన్‌డిమాండ్ అమ్ముడయ్యేలా చేయడంతోపాటు గ్రామాల్లో ఆర్థికాభివృద్ధికి బాటలువేసేందుకు.. వినియోగదారులకు కల్తీలేని, నాణ్యమైన ఉత్పత్తులు అందించేందుకు ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధంచేసిన విషయం తెలిసిందే. ఈ ప్రణాళికలో భాగంగా తొలి ప్రయోగంగా రాష్ట్రంలోని నాలుగుజిల్లాల్లో మామిడి సేకరణ మొదలుపెట్టారు. తొలిసారిగా మహిళా రైతులతో కొనుగోళ్లు చేయించి... వాటిని సహజసిద్ధంగా మాగపెట్టి, వినియోగదారులకు అందించారు.

**నాలుగు జిల్లాలో 92,000 కిలోలు సేకరణ**

గతంలో మామిడి రైతులు సరైన గిట్టుబాటు ధరలేక నష్టాలు ఎదుర్కొన్నారు. మామిడిలో రారాజు అయిన బంగినపల్లి మామిడికి దేశంలోనే మంచి డిమాండ్ ఉంటుంది. ఈ రకం మామిడికి మన రాష్ట్రమే ఫేమస్. ఇక్కడి నుంచి ఢిల్లీ, గుజరాత్, రాజస్థాన్ వంటి రాష్ట్రాలకు ఎగుమతులు చేస్తుంటారు. రైతులు అక్కడకు వెళ్లి అమ్ముకునే పరిస్థితులు లేకపోవడంతో.. దళారులే దిక్కయ్యేవారు. వారు రైతుల నుంచి అగ్గువకు కొనుగోలు చేసి.. డిమాండ్ ఉన్న ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటారు. గతంలో రైతులను పలువురు వ్యాపారులు మోసంచేసిన ఘటనలూ ఉన్నాయి. అయితే కొంతమంది రైతులు తమ ఖర్చులతోనే నాగపూర్, మహారాష్ట్రకు వెళ్లి అమ్ముకున్నా.. ఆశించిన లాభాలు రాలేదు. ఈ నేపథ్యంలోనే రాష్ట్రప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుని ఈ సీజన్‌లోనే ఐకేపీ ద్వారా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను నెలకొల్పే ప్రణాళికల్లో భాగంగా మామిడి సేకరణ మొదలుపెట్టింది. జగిత్యాల, మంచిర్యాల, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో 100 మెట్రిక్ టన్నుల మామిడి సేకరణను మహిళా సంఘాలకు లక్ష్యంగా నిర్దేశించింది. ఈనెల 15 వరకు మహిళా సంఘాల సభ్యులు 92 మెట్రిక్ టన్నులు సేకరించారు. జగిత్యాల జిల్లాలో 40, నాగర్‌కర్నూల్‌లో 38, మంచిర్యాలలో 12, మహబూబ్‌నగర్‌లో 2 మెట్రిక్ టన్నుల చొప్పున సేకరించారు.

> జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం ఆరెపేట గ్రామానికి చెందిన రైతు అంజయ్య గతేడాది 3 ఎకరాల్లో పండించిన మామిడి అమ్మితే కూలీలు, రవాణా, కడ్తా, వేస్టేజీ, క్యాష్ కటింగ్, దళారీ కమీషన్.. ఇలా అన్నీపోనూ చేతి కొచ్చిన సొమ్మురూ.60 వేలు. ఈసారి సెర్ప్ ద్వారా మహిళా ఉత్పత్తిదారుల సంఘం నుంచి అమ్మితే వచ్చిన ఆదాయం రూ.1.25 లక్షలు. అంటే రెట్టింపు సొమ్ము చేతికి వచ్చింది.

**రూ.40 లక్షల ఆదాయం**

నాలుగు జిల్లాల్లో సేకరించిన 92 మెట్రిక్ టన్నులకుగాను రైతులకు రూ.40 లక్షలు చెల్లించారు. తెంపిన మామిడిని ఒక పద్ధతి ప్రకారం తుడిచి, ప్యాకింగ్‌చేసి, సహజసిద్ధంగా మాగబెట్టే వరకు తీసుకెళ్లే బాధ్యతను మొత్తం మహిళా ఉత్పత్తిదారుల సంఘాలే తీసుకున్నాయి. దీంతో రైతులకు ఖర్చుల భారం తగ్గిపోయింది. రవాణాఖర్చులు, రెండు, మూడ్రోజుల నిరీక్షణ తప్పింది. మామిడి తెంపేందుకు కూలీలకు ఇచ్చే ఖర్చును మాత్రమే రైతులు భరించారు.

**మహిళా ఉత్పత్తిదారుల సంఘాలకు రూ.4.09 లక్షల కమీషన్**

అహార శుద్ధికేంద్రాల్లో భాగంగా చేసిన కొత్త ప్రయోగం మరో విజయాన్ని తెచ్చింది. కమీషన్ కూడా రైతులకే చెందేవిధంగా రైతుల కుటుంబాల్లోని మహిళలను సభ్యులుగా చేస్తూ రైతు ఉత్పత్తిదారుల సంఘాలను ఏర్పాటుచేశారు. ఆ సంఘాలతోనే మామిడి కొనుగోళ్లు మొదలుపెట్టారు. దీంతో వారికి ఈ సీజన్‌లో రూ.4.09 లక్షల కమీషన్ వచ్చింది. రైతులకు గిట్టుబాటు ధర కల్పించడం, స్థానికంగా కొనుగోళ్లను మహిళా సంఘాలతో చేయించడం, ఆహార శుద్ధికేంద్రాల్లో వాటిని ప్రాసెసింగ్ చేయించే బాధ్యత ఐకేపీ ఉద్యోగులకు అప్పగించడం, ఆ తర్వాత నాణ్యమైన ఉత్పత్తులను అందించి, వాటిని డీలర్లు, ఇతర సంస్థల ద్వారా విక్రయించడంలో ప్రధాన ఉద్దేశం నెరవేరింది.

**మద్దతు ధర మించింది**

రైతులకు గిట్టుబాటు ధర తొలి ప్రాధాన్యంగా తీసుకున్న ప్రభుత్వం.. సరైన న్యాయం చేసింది. ఇప్పటివరకు ఏగ్రేడ్ మామిడి పండ్లకు వ్యాపారులు పెట్టిన ధర కిలోకు రూ.20 నుంచి రూ.25లోపే. ఇదే ఇప్పటివరకు అత్యధిక ధర. కానీ.. ఈ సీజన్‌లో రైతు ఉత్పత్తిదారులు సేకరించిన ధర కిలోకు రూ.35 నుంచి రూ.44 వరకు చెల్లించారు. అంటే ఒక్కో టన్నుకు రూ.15 వేలు పైబడి గిట్టుబాటు ధర రైతులకు దక్కింది. సేకరించిన మామిడిపై రైతు ఉత్పత్తిదారుల సంఘాలు 4 శాతం వరకు కమీషన్ తీసుకున్నాయి. ఈ కమీషన్ నుంచే రైతు వద్ద సేకరించిన పండ్లను రవాణా చేయడం, కిరాయి చెల్లించడం, రిఫైనింగ్‌చాంబర్ కిరాయితోపాటు ఇతరత్రా ఖర్చులకు వినియోగించారు.సెర్ప్ ద్వారా సేకరించిన మామిడికి రైతుల ఖాతా నుంచే చెల్లింపులు జరిపారు. మామిడిని తెంపిన నాలుగైదు రోజుల్లోనే రైతుల చేతులకు డబ్బులందాయి.

**ఇక పసుపుపై గురి**

మహిళా సంఘాలు మామిడి కొనుగోళ్లు సక్సెస్ చేయడంతో.. పసుపు సేకరణపై దృష్టి పెట్టారు. ప్రస్తుతం పసుపు రైతులు కొంత ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనే నేపథ్యంలో పసుపు కొనేందుకు ప్రణాళిక చేస్తున్నారు.

**దళారుల దోపిడీ తగ్గింది**



ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటులో భాగంగా మామిడి సేకరణతో దళారుల దోపిడీ తగ్గిపోయింది. రైతులకు మంచి ధరతోపాటు మాకే కమీషన్ కూడా వచ్చింది. రవాణా భారం, కడ్తా పేరుతో దోచుకునే దళారుల దోపిడీ లేకుండాపోయింది. **గంగలక్ష్మి, రైతు ఉత్పత్తిదారుల సంఘం సభ్యురాలు**

**మూడింతల ఆదాయం వచ్చింది**



గతంలో మామిడి పంటను అమ్ముకునేందుకు చాలా ఇబ్బందులు పడేవాళ్లం. నాగ్‌పూర్, మహారాష్ట్రకు తీసుకెళ్లేవాళ్లం. లేకుంటే ఇక్కడకు వచ్చే అక్కడి వ్యాపారులకు ఎంతో కొంతకు అమ్ముకునేవాళ్లం. అప్పుడు కిలోకు రూ.20 వచ్చినయంటే పెద్ద పండుగ. కానీ ఇప్పుడు రైతు కుటుంబాల్లోని మహిళలతో రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ఏర్పాటు చేసి, మామిడిపండ్లకు మంచి ధర చెల్లిస్తున్నారు. అటు మంచి ధర, ఇటు కమీషన్.. రెండూమాకే వచ్చాయి. ఈసారి మాకు మూడింతల ఆదాయం వచ్చినట్లైంది.

**లత, మామిడి రైతు, ఉత్పత్తిదారుల సంఘ సభ్యురాలు, రాయికల్**

### ఇదీ ఆరంభం..

- ఈ సీజన్‌లో తొలిదశలో సేకరించాల్సిన మామిడి లక్ష్యం : 100 మెట్రిక్ టన్నులు
- ఈ నెల 15 వరకు సేకరించినది: 92 మెట్రిక్ టన్నులు (92,000 కేజీలు)
- సేకరించిన మామిడికి చెల్లించిన సొమ్ము : రూ.40 లక్షలు
- ఒక్కోమెట్రిక్ టన్నుకు రైతుకు వచ్చిన ధర : రూ.43,478. (కిలోకు రూ. 43.47.)
- మామిడిని తెంపేందుకు రైతుకు అయిన ఖర్చు (కూలీలకు): రూ.5వేల నుంచి రూ.8వేలు
- ఈ సీజన్‌లో మహిళలకు వచ్చిన కమిషన్: రూ.4.09 లక్షలు (4శాతం)

**గతంలో..**

- ఒక మెట్రిక్ టన్ను మామిడి అమ్మితే రైతుకు వచ్చిన సొమ్ము : రూ.25 వేలు
- దళారీ దందా, క్యాష్ కటింగ్, సంచులు, వేస్టేజీ కింద కటింగ్: రూ.3 వేల నుంచి రూ.4 వేలు
- రైతుకు చేతికి వచ్చిన సొమ్ము : రూ.21 నుంచి రూ.22 వేలు

**వడ్డీ భారం తగ్గింది**



మామిడికాయలు అమ్మిన వెంటనే మూడు రోజుల్లో ఖాతాల్లో పైసలు జమచేశారు. దీంతో పెట్టుబడి కోసం తెచ్చిన అప్పు వెంటనే తీర్చాం. మాకు వడ్డీభారం తగ్గింది. వినియోగదారులకు కూడా నాణ్యమైన మామిడి పండ్లు అందించామనే తృప్తి ఉంది.

**అంజయ్య, మామిడి రైతు, జగిత్యాల**

**ఏదైనా విజయవంతం చేస్తాం**



మహిళా సంఘాలకు ఏ పని అప్పజెప్పినా విజయవంతం చేస్తామని ఇప్పుడు మరోసారి తేలిపోయింది. మామిడిపండ్ల వ్యాపారం ఇచ్చిన ధైర్యంతో ఇకముందు ఫుడ్ ప్రాసెసింగ్ కింద ఏ పనైనా విజయవంతంగా చేయగలమని విశ్వాసం ఉంది.

**లత, ఎఫ్‌పీజీ అధ్యక్షురాలు**

# వైద్యశాఖ అప్రమత్తం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ముందస్తు చర్యలతో సీజనల్ వ్యాధులను అడ్డుకునేందుకు వైద్య, ఆరోగ్యశాఖ ప్రణాళికలు సిద్ధం చేసింది. వర్షాకాలం మొదలైనందున విషజ్వరాల నివారణపై దృష్టి సారించింది. దోమల నిర్మూలనకు, రక్షిత తాగునీట సరఫరా కోసం సంబంధిత శాఖల మధ్య సమన్వయాన్ని పెంపొందించేందుకు అధికారులు కృషిచేస్తున్నారు. ముఖ్యంగా గిరిజన గూడేలు, తండాల్లోని ప్రజలు వ్యాధుల బారిన పడకుండా చూసేందుకు ముందస్తు చర్యలు చేపట్టారు. ఐటీడీఏ పరిధిలోని గ్రామాల్లో వైద్య సదుపాయాలను మెరుగుపర్చడంపై దృష్టి సారించారు. ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, జయశంకర్ భూపాలపల్లి, ఖమ్మం, మహబూబాబాద్, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, నాగర్‌కర్నూల్ జిల్లాల్లోని 1,697 గ్రామాలను హైరిస్క్ (అత్యంత సమస్యాత్మక) ప్రాంతాలుగా గుర్తించి మలేరియా, డెంగ్యూ, డయేరియా, జాండీస్, టైఫాయిడ్, చికెన్‌గున్యా లాంటి వ్యాధుల నియంత్రణకు చర్యలు చేపట్టారు. వ్యాధికారకాలను నియంత్రించేందుకు జిల్లా స్థాయిలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయడంతోపాటు గిరిజన ప్రాంతాల్లోని పీహెచ్‌సీలు, పారామెడికల్ సిబ్బంది వద్ద తగినన్ని మందులు అందుబాటులో ఉంచారు. మెడికల్ ఆఫీసర్లు, పారామెడికల్ ఆఫీసర్లు, హెల్త్ అసిస్టెంట్లు, ఆశా వర్కర్లకు శిక్షణ ఇస్తున్నారు. డెంగ్యూ వ్యాధిని గుర్తించేందుకు వివిధ ప్రాంతాల్లో సంచార వైద్య సేవలు అందజేయడంతోపాటు గ్రామాల్లో మురుగునీరు నిల్వ ఉండకుండా చూసేందుకు చర్యలు ప్రారంభించారు.

NABARD
Tender for Annual Maintenance Contract for various services
NABARD, Telangana Regional Office, Hyderabad invites tender for Annual Maintenance Contract for various services. The last date for submission of the tender is 17th July 2019 by 14.00 hrs. Please visit our website www.nabard.org for more details.
Chief General Manager
NABARD, TSRO, Hyderabad

తెలంగాణ ప్రభుత్వము
నీటిపారుదల మరియు ఆయకట్టు అభివృద్ధి శాఖ
టెండర్ నోటీసు నెం. 1,2,3,4,5,6,7,8 మరియు 9/ఇ.ఇ./డివిజన్ నెం.4/కె.యస్.ఆర్.పి/2019-20, తేది: 19-06-2019.
టెండర్ డాక్యుమెంట్ ప్రారంభపు తేది: 24-06-2019 ఉదయం11.00 గంటల నుండి, టెండర్ డాక్యుమెంట్ ముగింపు తేది: 07-07-2019 సాయంత్రం 04.00 గంటల వరకు. టెండర్ బిడ్ తెరుచు తేది: 08-07-2019 ఉదయం 11.00 గంటల నుండి. మిగతా వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ https://tender.telangana.gov.in వెబ్‌సైట్ చూడగలరు.
సం/- కార్యనిర్వాహక అభియంత, డివిజన్ నెం.4, కెయస్ఆర్ ప్రాజెక్ట్, కడెం. ఫోన్: నం. 08730 252201
DIPR R.O.No. 182 PP/CL/Advt/1/2019-20 తేది: 22-06-2019

TELANGANA STATE PUBLIC SERVICE COMMISSION
Prathibha Bhavan, M.J.Road, Nampally, Hyderabad
Group-II Services
(General Recruitment)
Notification No's 17/2016 to 20/2015
RESULT NOTIFICATION FOR INTERVIEW
The Commission published the List of provisionally admitted candidates for Interview (Oral Test) to the posts under Group-II Services. The Interviews will be held in the office of TSPSC at Prathibha Bhavan, Nampally, Hyderabad from 01/07/2019 onwards.
For the List of Hall ticket numbers and Interview Schedule candidates can visit: www.tspsc.gov.in. It may be noted that interview schedule will be drawn from a jumbled list and announced phase wise. Candidates are requested to check the website for weekly interview schedule.
Hyderabad Sd/-
Dt. 21/06/2019 SECRETARY
DIPR R.O. No. 185-PP/CL/Advt/1/2019-20

శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం
అడ్మినిస్ట్రేషన్ భవన్, రాజేంద్రనగర్, హైదరాబాద్ - 500 030
Ref: Advt/001/admissions/Diploma/2019 Date: 24-06-2019
ఉద్యాన 2 సం.ల డిప్లొమా నందు ప్రవేశం కొరకు దరఖాస్తులను ఆహ్వానించడమైనది
ఉద్యాన 2 సం.ల డిప్లొమాలో ప్రవేశం కొరకు దరఖాస్తులను ఆహ్వానించడమైనది. ఆసక్తిగలవారు 2019-20 విద్యా సంవత్సరానికై ఎస్ఎస్‌సి/దానికి సమానమైన పరీక్షల యందు ఉత్తీర్ణులై ఉండాలి.
దరఖాస్తు పత్రం: బ్రోచర్ మరియు దరఖాస్తు పత్రం మా వెబ్‌సైట్ www.skltshu.ac.in నుండి డౌన్‌లోడ్ చేసుకోగలరు.
దరఖాస్తు స్వీకరించుటకు ఆఖరి తేది: సంపూర్ణంగా పూరించిన దరఖాస్తు పత్రాలు ది రిజిస్ట్రార్, SKLTSHU, రాజేంద్రనగర్, హైదరాబాద్ - 500 030 కు 25-07-2019 తేది సాయంత్రం 4.00 గంటల లోపల చేరాలి.
కె. రవీందర్ రెడ్డి
రిజిస్ట్రార్

### బాబుకు ఫిరాయింపులపై
## మాట్లాడే అర్హతలేదు!

- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** పార్టీ ఫిరాయింపులపై మాట్లాడే అర్హత టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబుకు లేదని బీజేపీ నేత, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. నలుగురు టీడీపీ ఎంపీల చేరికతోపాటు బీజేపీలో టీడీపీ రాజ్యసభాపక్షం విలీనం రాజ్యాంగబద్ధంగానే జరిగిందన్నారు. నిబంధనల ప్రకారం పార్టీ మారుతామంటే ఆపే అధికారం ఎవరికీ లేదన్నారు. ఢిల్లీలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బీజేపీలో చేరిన ఎంపీలపై కేసులులేవని, ఆర్థికపర అంశాల్లో చట్టం తన పని తాను చేసుకుపోతుందన్నారు.

# మలయాళీలకు తెలంగాణ అండ



రవీంద్రభారతిలో సత్కారాలు పొందిన సీనియర్ సిటిజన్లతో మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మాజీ మంత్రి నాయిని, కార్పొరేషన్ చైర్మన్ శివకుమార్, సాంస్కృతికశాఖ సంచాలకుడు హరికృష్ణ

- పర్యాటకశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

**రవీంద్రభారతి:** తెలంగాణ ప్రభుత్వం ఇక్కడ నివసిస్తున్న మలయాళీలకు అండగా ఉంటుందని ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతికశాఖ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ చెప్పారు. హైదరాబాద్ నగరంలో కేరళభవన్ నిర్మించేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ రూ.100 కోట్లు మంజూరు చేసినట్టు తెలిపారు. రాష్ట్ర సాంస్కృతికశాఖ, కాన్ఫెడరేషన్ ఆఫ్ తెలుగు రీజియన్ మలయాళీ అసోసియేషన్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం రవీంద్ర భారతిలో 'ప్రభాత సంధ్య' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో సేవలందించిన 100 మంది సీనియర్ సిటిజన్లను మంత్రి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి నాయిని నర్సింహారెడ్డి, బాషా, సాంస్కృతికశాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ, కాన్ఫెడరేషన్ అధ్యక్షుడు లిబ్బీ బెంజిమిన్ తదితరులు పాల్గొన్నారు.

## షూటింగ్ గేమ్స్‌తో అనర్థం

- 'కన్వర్జేషన్ విత్ సద్గురు'లో ఇషా ఫౌండర్ జగ్గీవాసుదేవ్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** చిన్నారులు ఫోన్లలో ఆడుతున్న షూటింగ్ గేమ్స్‌వల్ల అనర్థాలు ఉన్నాయని, నేరప్రవృత్తికి దారితీస్తాయని ఇషా ఫౌండర్ జగ్గీవాసుదేవ్ అన్నారు. చిన్నతనంలో అలాంటి గేమ్స్ ఆడటం వల్ల వయసు పెరిగేకొద్దీ రియాల్టీవైపు మళ్లించే అవకాశం ఉన్నదని చెప్పారు. ఆదివారం గచ్చిబౌలిలోని ఇండోర్ స్టేడియంలో జరిగిన 'ఇన్ కన్వర్జేషన్ విత్ ద మిస్టిక్ -నాని విత్ సద్గురు' కార్యక్రమంలో జగ్గీవాసుదేవ్.. సినీ నటుడు నాని అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. దేశంలో వ్యవసాయంచేసే వారిసంఖ్య క్రమంగా తగ్గుతున్నదని ఆవేదన వ్యక్తంచేశారు. సినిమాలు విలువలు పెంచేవిగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా తెలుగులోకి అనువదించిన 'ఇన్నర్ ఇంజినీరింగ్' పుస్తకాన్ని హీరో నాని ఆవిష్కరించారు.

## ఏపీలో 22 మంది ఐపీఎస్‌ల బదిలీ

- ఉత్తర్వులు జారీచేసిన ఏపీ సీఎస్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఏపీలో 22 మంది ఐపీఎస్ అధికారులకు స్థానచలనం కల్పిస్తూ ఆ రాష్ట్ర సీఎస్ ఎల్వీ సుబ్రహ్మణ్యం ఆదివారం ఉత్తర్వులు జారీచేశారు. విశాఖపట్టణం పోలీస్ కమిషనర్‌గా ఆర్కే మీనాను, వెయిటింగ్‌లో ఉన్న ఏఆర్ అనురాధను ఏపీ విపత్తుల నిర్వహణ, అగ్నిమాపకశాఖ డీజీగా నియమించారు. ఈ నెల 5న అనంతపురం పీటీసీకి బదిలీచేసిన ఘట్టమనేని శ్రీనివాస్‌ను .. మళ్లీ పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో రిపోర్ట్‌చేయాలని ఆదేశాలిచ్చారు. కోయ ప్రవీణ్, జీవీజీ అశోక్‌కుమార్, సర్వశ్రేష్ఠ త్రిపాఠి, విక్రాంత్ పాటిల్‌ను ప్రభుత్వం మళ్లీ బదిలీచేసింది.

### పోలవరం అవినీతి నుంచి
## ఎవరూ తప్పించుకోలేరు

- వైఎస్సార్సీపీ ఎంపీ విజయసాయిరెడ్డి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** పోలవరం పనుల్లో అవినీతికి పాల్పడినవారు తప్పించుకోలేరని వైఎస్సార్సీపీ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి పేర్కొన్నారు. 'పోలవరం పనుల అంచనాలను ఎలా తగ్గిస్తారో చెప్పాలని మాజీమంత్రి ఉమా అనడం, దమ్ముంటే తనను పట్టుకోమని దొంగే పోలీసులకు సవాల్ విసిరినట్టుగా ఉన్నది. అన్ని అనుమతులుండి, పనులు మొదలైన ప్రాజెక్టును ఐదేండ్లు ఏటీఎం వలే వాడుకున్నారు. మీ దోపిడీలన్నీ బయటకొస్తాయి. ఎవరూ తప్పించుకోలేరు ఉమా' అని ఆదివారం ట్వీట్ చేశారు.

## ఏ బడికి పంపినా 'అమ్మ ఒడి'

- స్పష్టంచేసిన ఏపీ సీఎం కార్యాలయం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** బడిఈడు పిల్లలను బడికి పంపే ప్రతి తల్లిదండ్రులకు అమ్మ ఒడి పథకం కింద రూ.15 వేలు అందజేస్తామని ఏపీ ప్రభుత్వం స్పష్టంచేసింది. పేద పిల్లలు చదివే ప్రభుత్వ లేదా ప్రైవేటు స్కూళ్లకు ఈ పథకం వర్తిస్తుందని ఏపీ సీఎం కార్యాలయం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది.

## నాటుబాంబు పేలి వ్యక్తి ఛిద్రం

- ఏపీలోని చిత్తూరు జిల్లా చర్లపల్లిలో విషాదం

**చిత్తూరు:** ఏపీలోని చిత్తూరు రూరల్ మండలం చర్లపల్లిలో ఓ ఇంట్లో ఆదివారం భారీ పేలుడు సంభవించింది. ఇంట్లో నాటుబాంబు తయారుచేస్తుండగా పేలడంతో సుధాకర్ అనే వ్యక్తి శరీరం తునాతునకలైంది. ప్రమాదంలో సుధాకర్ రెండు అంతస్తుల భవనం కూలిపోయింది. అతడి శరీరం సుమారు వంద అడుగుల దూరంలో పడింది. పేలుడు శబ్దానికి స్థానికులు భయంతో పరుగులు తీశారు.

# స్వచ్ఛతలో పెద్దపల్లి టాప్



స్వచ్ఛ సుందర్ సౌచాలయ్‌పై మహిళా సంఘాలకు అవగాహన కల్పిస్తున్న కలెక్టర్ శ్రీదేవసేన (ఫైల్)

- 'స్వచ్ఛ సుందర్ సౌచాలయ్'లో దేశంలోనే ప్రథమ స్థానం
- నేడు ఢిల్లీలో పురస్కార ప్రదానం

**కలెక్టరేట్:** స్వచ్ఛతలో పెద్దపల్లి జిల్లా మరోసారి తన ప్రత్యేకతను చాటుకున్నది. 2017-18 సంవత్సరానికి 'స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్'లో దేశవ్యాప్తంగా మూడో స్థానాన్ని, దక్షిణ భారత దేశంలో మొదటి స్థానాన్ని కైవసం చేసుకుని అప్పటి కేంద్రమంత్రి ఉమాభారతి చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకున్న పెద్దపల్లి జిల్లా కలెక్టర్ దేవసేన.. స్వచ్ఛతలో జిల్లాను మరింత ఉన్నతస్థానానికి తీసుకెళ్లారు. 'స్వచ్ఛ సుందర్ సౌచాలయ్' పథకంలో భాగంగా సౌచాలయాల (మరుగుదొడ్ల)ను శుభ్రంగా ఉంచుకోవడం, సుందరంగా తీర్చిదిద్దడంపై ఈ ఏడాది జనవరి 1 నుంచి 31 వరకు నెల పాటు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ పథకం కింద దేశంలోని ఉత్తమ జిల్లాలకు పురస్కారాలను ఇచ్చేందుకు కేంద్రం ఎంపిక ప్రక్రియ చేపట్టగా.. తెలంగాణ నుంచి పెద్దపల్లి జిల్లా మొదటి స్థానంలో నిలిచింది. సోమవారం ఢిల్లీలో జరిగే కార్యక్రమంలో కేంద్ర మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ చేతుల మీదుగా కలెక్టర్ దేవసేన ఈ పురస్కారాన్ని పొందనున్నారు.



ఆదివారం ఐటీసీ కాకతీయలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి ఇచ్చిన విందులో పాల్గొన్న ఇస్టా గవర్నింగ్ బాడీసభ్యులు

# ప్రపంచ విత్తన కేంద్రంగా తెలంగాణ

- వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి
- 'ఇస్టా' గవర్నింగ్‌బాడీ సభ్యులకు ప్రభుత్వ విందు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ గ్లోబల్ సీడ్ హబ్‌గా కాబోతున్నదని వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. భారత విత్తన అవసరాలను తెలంగాణ 60 శాతం వరకు తీరుస్తున్నదని, విదేశాలకు సైతం ఎగుమతి చేస్తున్నామని చెప్పారు. జూన్ 26 నుంచి జూలై 3వ తేదీ వరకు అంతర్జాతీయ విత్తన సదస్సు జరుగుతున్న నేపథ్యంలో ఇస్టా గవర్నింగ్ బాడీసభ్యులకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి విందు ఏర్పాటుచేశారు. ఐటీసీ కాకతీయలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి పార్థసారథి, కమిషనర్ అండ్ డైరెక్టర్ రాహుల్ బొజ్జా, సీడ్ కార్పొరేషన్ చైర్మన్ కేశవులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి సదస్సు నిర్వహణపై చర్చించారు. వివిధ కమిటీల బాధ్యతలను అడిగి తెలుసుకున్నారు.

ది సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్
(ప్రభుత్వ సంస్థ)
రిజిష్టరు ఆఫీసు : కొత్తగూడెం కాలరీస్ - 507101
నోటీసు
ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా, భారత ప్రభుత్వము యొక్క పర్యావరణ, అటవీ మరియు వాతావరణ మార్పు మంత్రిత్వ శాఖ వారి లేఖ. F.No.11015/212/2014-IA-II(M) తేది. 12.06.2019 లోని 4.1 (j) (i) నిబంధన ప్రకారము, సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ తెలంగాణ రాష్ట్రం, ఖమ్మం జిల్లా, సత్తుపల్లి మండలంలోని కిష్టారం మరియు జగన్నాథపురం గ్రామాలలోని కిష్టారం ఓపెన్ కాస్టు ప్రాజెక్టు నుండి సాలీనా 2.00 మి.టన్నులకు 435.68 హెక్టార్ల మైనింగ్ లీజు ప్రాంతంలో బొగ్గు ఉత్పత్తి చేయుటకు కేంద్ర పర్యావరణ, అటవీ మరియు వాతావరణ మార్పు మంత్రిత్వ శాఖ నుండి ఆమోదము లభించినదని ప్రకటించడమైనది. ఈ ఆమోద పత్రములోని నిబంధనలననుసరించి ఈ ప్రాజెక్టులో సింగరేణి కాలరీస్ లిమిటెడ్ బొగ్గు ఉత్పత్తి చేయుటకు అనుమతి లభించినది.
ఈ పర్యావరణ అనుమతి లేఖ ప్రతులు, తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి, ప్రాంతీయ కార్యాలయము, కొత్తగూడెం, మండల ఆఫీసు ప్రక్కన, 'ఏ' పవర్ హౌస్ బస్తీ, కొత్తగూడెం-507101, ఫోన్ నెం. 08744-243165 వారి కార్యాలయమునందు మరియు ఈ క్రింద పేర్కొనబడిన కార్యాలయాలలో కూడ లభించును. అంతే కాకుండ కేంద్ర పర్యావరణ, అటవీ మరియు వాతావరణ మార్పు మంత్రిత్వ శాఖ వారి http://environmentclearance.nic.in/writereaddata/Form-1A/EC/061820191212_2014_Kistaram_letter.PDF మరియు సింగరేణి కాలరీస్ వారి http://scclmines.com/env/docs/ECS/11011.pdf వెబ్‌సైట్లలో కూడా దీనిని పొందుపరచడమైనది.
ఇంకనూ, ఈ పర్యావరణ అనుమతి లేఖలోని 4.1 (j) (ii) నిబంధన ప్రకారము, ఈ పర్యావరణ అనుమతి లేఖ ప్రతులను ప్రజల పరిశీలన నిమిత్తం సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ వారు ఈ క్రింద తెలిపిన కార్యాలయాలలో అందచేయటం జరుగుతుంది.
1. జిల్లా కలెక్టర్ కార్యాలయము, ఖమ్మం.
2. జిల్లా పరిశ్రమల కేంద్రం, ఖమ్మం.
3. ముఖ్య కార్యనిర్వాహణాధికారి, జిల్లా పరిషత్ కార్యాలయం, ఖమ్మం.
4. పర్యావరణ, అటవీ మరియు వాతావరణ మార్పు మంత్రిత్వ శాఖ ప్రాంతీయ కార్యాలయము, దక్షిణ తూర్పు మండలం, 1 మరియు 2వ అంతస్తు, హెచ్.ఇ.పి.సి భవనం, సంఖ్య 34, కాథెడ్రల్ ఉద్యానవన మార్గం, నుంగంబాకం, చెన్నై-600 034.
5. తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ప్రధాన కార్యాలయము, ఎ-3, ఇండస్ట్రియల్ ఎస్టేట్, సనత్ నగర్, హైదరాబాదు.
6. తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి, జోనల్ కార్యాలయము, ఇంటి సంఖ్య: 6-3-1219, ఉమానగర్, కంట్రీక్లబ్ సమీపంలో, బేగంపేట, హైదరాబాదు-16.
7. తెలంగాణ రాష్ట్ర పర్యావరణ, అటవీశాఖ మరియు సాంకేతిక విభాగము, సచివాలయము, హైదరాబాదు.
8. తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి, ప్రాంతీయ కార్యాలయము, కొత్తగూడెం.
9. డివిజనల్ రెవెన్యూ కార్యాలయం, ఖమ్మం, ఖమ్మం జిల్లా.
10. తహసీల్దార్ వారి కార్యాలయం, సత్తుపల్లి మండలం, ఖమ్మం జిల్లా.
11. కమీషనర్, సత్తుపల్లి నగర పంచాయితీ, ఖమ్మం జిల్లా.
12. గ్రామ పంచాయితీ కార్యాలయం, కిష్టారం గ్రామం, సత్తుపల్లి మండలం, ఖమ్మం జిల్లా.
13. గ్రామ పంచాయితీ కార్యాలయం, చెరుకుపల్లి గ్రామం, సత్తుపల్లి మండలం, ఖమ్మం జిల్లా.
కొత్తగూడెం సంచాలకులు
తేది: 24.06.2019 (ప్లానింగ్ మరియు ప్రాజెక్టులు)
PR/2019-20/ENV/SLK/30

# మార్మిక బాలుని శాశ్వత విడిది

ఈ పుస్తకం చదువడం ముగించిన నాటి రాత్రి ఒక కలగన్నాను. లిప్తకాలపు స్వప్నం కాదది, సుదీర్ఘమైన నడక. ఎక్కడ చూసినా పచ్చదనం, విశాలమైన సముద్రతీరం, కొబ్బరిచెట్లు, నిర్మలమైన చెరువులు, మిరియం, ఇలాచీ ఘాటు పరిమళాలు, వంపులు తిరిగిన బాక్వాటర్స్, నవరసాలను ముఖభావాలలో పలికించే నృత్యరీతులు-వాటిని దాటుకుంటూ దప్పిక తీరని పాంధురాలి వెతుకులాట సాగుతోంది. పరశురాముడు తపస్సు చేసుకోవడానికి తగిన చోటు కోసం గాలిస్తుండగా సముద్రం ఎదురైందట. దానిమీదకి గొడ్డలి విసిరాడట, ఆ మేరకు సముద్రం వెనక్కి వెళ్ళగా ఖాళీ అయినచోట పుట్టిందే కేరళ అంటారు. ఆ పురాణగాథ, ఒక తలపుగా తాకి వెళ్ళింది.

**విశాలమయ్యీ** అయ్యీ కళ్ళచివర్లు, పిగిలిపోతాయా అన్నంతగా చూపుని లాక్కునే సౌందర్యరాశి కేరళ. మలబారు మీదుగా ఆ చూపు విస్తారంగా సాగుతూనే ఉంది. ఆకాశం నుంచి గూగుల్ మ్యాప్‌తో కిందికి చూస్తూ వస్తుంటే ప్రదేశాలు స్పష్టపడినట్లుగా కనిపించినచోట ఆగాను. ఇక కలాంతాన, 'కొచ్చి' సరస్తీరంలోని 'తేవరా' శివారు ప్రాంతంలో ఉన్న సిఐఎఫ్‌టీ క్వార్టర్స్‌లో కనిపించాడు ఆ బాలుడు, రంగురంగుల కుంచె పట్టుకుని నవ్వుతూ కళ్ళముందు నిలిచాడు. పట్టుకోబోతే 'నీకు అందుతానా?' అన్నాడు. నివ్వెరపోయి చూస్తుండగానే సప్తవర్ణాల ఇంద్రధనుస్సు అంచు పట్టుకు తిరగేసి, ఊయల ఊగుతూ ఊగుతూ దిగంతంలోకి మాయమయ్యాడు. కల చెదిరింది, ఒక్క పెట్టున దుఃఖం వచ్చింది.

'అమ్ముునాయర్' ఇంగ్లీష్‌లో 'ఎ బ్రీఫ్ అవర్ ఆఫ్ బ్యూటీ' పేరుతో రాసిన పుస్తకాన్ని 'స్వర్ణ కిలారి' 'లిప్తకాలపు స్వప్నం' పేరుతో తెలుగులోకి అనువదించారు. ఈ పుస్తకాన్ని డ్రాఫ్ట్ రూపంలో చదివినప్పుడే చాలా ఉద్వేగపడ్డాను. 'ఎడ్వర్డ్ థామ స్ క్లింట్' అనే కేరళ బాల చిత్రకారుని జీవితగాథ ఎందుకు ఇంతగా కలవరపెడుతుంది మనల్ని!! క్లింట్, నెలల వయసులోనే దొరికిన పరికరాలతో నేల మీద చిత్రమైన గీతలు గీస్తూ ఉండటం ఒక మురిపెం. ఏడాది రెండేండ్లకే స్పష్టంగా బొమ్మలు వేయడం ఒక అద్భుతం, ఏడేండ్లు నిండకుండానే, ప్రాణాంతకమైన జబ్బుతో పోరాడుతూ కూడా ఇరువై అయిదు వేల బొమ్మలు వేయడాన్ని ఏమంటారో తెలుసుకోవడానికి కాసేపు తడుముకోవాల్సి వచ్చింది. 'నీకు అందుతానా?' అంటూ పారిపోయిన ఆ బాలుడు చెప్పకుండానే చెప్పిన రహస్యం ఇదే. 'కళాకారుని తాదాత్మ్యత'.



కళారంగాల్లో మహామహులనుకున్నవారే ఒక గొప్ప సృష్టి తర్వాత మరికొన్ని పేలవ ప్రదర్శనలతో తడబడుతూ ఉంటారు కదా! అలాంటిది ఒక్కచోట కుదురుగా కాలూని నిలబడని బాల్యానికి, ఇంతటి ఏకాగ్రత, నైపుణ్యం, ఓపిక, శక్తినిచ్చినది ఏది? బొమ్మ వెయ్యాలనుకున్నపుడే వెయ్యడం, ఎంతసేపు వెయ్యాలనుకుంటే.. అది తెల్లవారుఝాము మూడయినా వెయ్యడం, వద్దనుకున్నపుడు ఎవరు చెప్పినా వెయ్యకపోవడం, తనకు నచ్చిన బొమ్మే వేసుకోవడం, తన బొమ్మకు అవార్డ్ తీసుకోవాల్సిన సభలో కూచునే బదులు ఇంటికి వెళ్లి బొమ్మలు వేసుకుంటాననడం, అన్నిటికీ మించి – తనకి రెండు చేతులతో పాటు, ఒక తొండం కూడా ఉంటే భోజనం చేసే సమయంలో కూడా బొమ్మలు వేసుకోవచ్చుననే నిఖార్సయిన కళాకారుని జీవితచరిత్ర ఈ పుస్తకం. అందుకేనేమో ఈ మార్మిక బాలునికి 'చిత్కళ' తల్లిగా మారి అక్కున చేర్చుకొని 'కుంచె విసరు'ని కొసరికొసరి రుచి చూపింది. నిజానికి ఈరోజు ఈ అక్షరాలను పైకి ఎత్తిపట్టి లోకానికి చూపుతున్న స్వర్ణకి కూడా క్లింట్ జీవితపు స్ఫూర్తి అంటుకునే ఉంది. సామాజిక మాధ్యమాలలో ఒక అల్లరి అమ్మాయిగా, సరదాగా కనిపించిన తను, ఇంత ప్రభావవంతమైన పుస్తకాన్ని అనువాదం చెయ్యడానికి సిద్ధపడటం, అందులోనూ ఇది ఆమె తొలి పుస్తకం కావడం యాదృచ్ఛికమేమీ కాదు. తన గురించి చదివిన ఎవరినీ మామూలుగా వదలడు ఈ బుడతడు. క్లింట్ బతికుంటే ఈ అనువాదకురాలికి సమ వయస్కుడు. తన కొడుకు ఏడేండ్ల వయసులో – ఏడేండ్ల క్లింట్ గురించి చదివి, చెప్పరాని మానసిక సంచలనంతో కదిలిపోయానంటారు స్వర్ణ.

ఈ పుస్తకపు అనువాదం మామూలు విషయం కాదు, క్లింట్ అసాధారణ ప్రతిభకు, హిందూ మత ఆధ్యాత్మికతకు ముడివేసే ప్రయత్నం మూల రచనలో కనిపిస్తుంది. అమ్ము నాయర్ స్వయంగా హిందూ మతావలంబి. కానీ స్వర్ణ, కులమతాల పట్లా ఆస్తికత్వం పట్లా ఆసక్తి లేని యువతి. క్లింట్‌ను ఒక మత ఆరాధకుడిగా కట్టివేసే గట్టి ప్రయత్నాన్ని, తన స్వేచ్ఛానువాదంలో కొంత సరళం చేయాలని చూశారు. ఒకట్రెండు పదాలు, వాక్యాల మార్పు ద్వారా మూలభావానికి దెబ్బతగులకుండా తర్కానికి దగ్గరగా, పుస్తకాన్ని సార్వజనీనంగా ఉంచడానికి కృషిచేశారు. క్రైస్తవ మత విశ్వాసులైన తల్లిదండ్రుల నేపథ్యాన్ని కూడా దాటుకొని క్లింట్, వందలాది హిందూ దేవుళ్ళ బొమ్మలు వేయడానికి ఆసక్తి చూపడం, ఇన్ని వేల బొమ్మల్లో ఒక్క క్రీస్తు బొమ్మ కూడా లేకపోవడం చిత్రంగా అనిపించినప్పటికీ దానివెనుక కారణాలు పుస్తకంలోనే స్పష్టంగా కనపడుతూ ఉంటాయి. క్లింట్‌కు బైబిల్ నీతి కథలు, హిందూ పురాణ కథలతో సహా చాలా కథలు చెప్పేవారు తల్లిదండ్రులు చిన్నమ్మ, జోసెఫ్. ఆయుధాలు వాడే సాటిలేని యోధులను ఎక్కువ ఇష్టపడేవాడు క్లింట్. అలాగే ఏనుగు అంటే ఉన్న ఇష్టం వల్ల వినాయకుడు ప్రీతి పాత్రమయ్యాడు. మతాలకు ఉండే రాజకీయ ముఖం ఎరుగని బాలకుని మనసుకు ఏది నచ్చితే అది కాన్వాస్ మీదకి రావాల్సిందే. ఏ ముద్రల మరకలు పడని సహజ కళారూపాలవి. క్లింట్ జీవితంలోని ప్రతిక్షణాన్నీ అద్భుతంగా రీ బిల్ చేసిన అమ్ము నాయర్ ప్రతిభను తెలుగు పాఠక సమాజానికి అంతే గొప్పగా అందించారు స్వర్ణ. పంటికింది రాళ్లుగా అనిపించే ఒకటి రెండు అంశాలను అనువాద ఔచిత్యం ద్వారా పరిహరించారు.

జననమరణాల తాత్విక ఘర్షణ చిన్న పిల్లలకు ఉంటుందా? అందులోనూ ఏడేండ్ల లోపు పిల్లవాడికి ఉంటుందా? క్లింట్‌ను చదివాక పాత అభిప్రాయాలు మార్చుకోవాల్సి వస్తుంది. క్రీస్తు పునరుత్థాన ఘట్టం క్లింట్ మనసులో ఎన్నో ఆలోచనలు రేపింది. ఒకరోజు తల్లిదండ్రులతో కలిసి చర్చికి వెళ్లి తిరిగివస్తూ, 'మనం ఎక్కడ నుంచి వస్తాం నాన్నా?' అనడిగాడు. లాజిక్ లేని సమాధానాలను క్లింట్ నమ్మడు కనుక తెలీదని చెపుతాడు జోసెఫ్. 'చనిపోయాక మనం ఎక్కడికి వెళతామని' మళ్లీ అడుగుతాడు. సమాధానం లేదు. ఆ ఘర్షణను భుజాలకెత్తుకొని తదనంతర కాలంలో ఒక బొమ్మలో దానిని వొంపుకున్నాడు క్లింట్. జనన మరణాల చిక్కు ప్రశ్నలను మోసుకొని యముడి వద్దకి ధీమాగా నడిచి వెళ్తున్న నచికేతుడి బొమ్మ అది. నచికేతుడు తిరిగివచ్చాడు. క్లింట్ తిరిగిరాలేదు. సమస్త జంతుజాలపు భావోద్వేగాలను అత్యంత నిశితంగా పట్టి – బొమ్మల్లో చూపగల క్లింట్, అందరి ఉద్వేగాలకూ అతీతంగా, ఆరేండ్ల పదకొండు నెలల వయసులోనే వచ్చిన పని అయిపోయినట్లుగా విడిది వదిలి పెట్టాడు. 'కాపురమొచ్చిన కన్ని పాపాయి ఇల్లు ఖాళీచేసి వెళ్లి పోయాడు'.

విడిది లిప్తకాలమే అయినా అక్షరం దానిని శాశ్వతం చేసింది. ఈ పుస్తకం, అనేక పాఠాల సమాహారం. తల్లిదండ్రులకీ పిల్లలకీ మధ్యనుంచే బాంధవ్యం – ఆధార, ప్రయోజన పూరిత సంబంధంగా కాకుండా ప్రేమ, స్వేచ్ఛల సహజ పునాది మీద రూపొందితే క్లింట్ లాంటి పిల్లలు వెలుగులోకి వస్తారు. చదువుకీ కళలకీ మధ్యనున్న అనవసర దూరాల్ని తగ్గిస్తారు. ఈ 'లిప్తకాలపు స్వప్నం' పిల్లలను, చదువుకునే పిల్లలను, కళల పట్ల మక్కువ ఉన్న పిల్లలను, అందరు తల్లిదండ్రులను, డాక్టర్లను, ఉపాధ్యాయులను, ఇరుగు పొరుగును, కుటుంబ స్నేహితులను, ప్రకృతి ప్రేమికులను, మరీ ముఖ్యంగా కళాసృష్టిలో పిచ్చిగా మునిగిపోయేవాళ్ళను అడ్రస్ చేస్తుంది. మనం ఎట్లా ఉంటే అద్భుతాలు పుడతాయో, ఆ అద్భుతాలు ఎంత సహజంగా మొత్తం సమాజంలో ఇమిడిపోతాయో చెప్తుంది. పిల్లలు కాదు పెద్దలు చదువాల్సిన పుస్తకం ఇది. పెద్దలే కాదు, తన ముఖాన్ని మానవీయంగా మార్చుకునేందుకుగానూ మొత్తం సమాజం చదువాల్సిన పుస్తకమిది. ఇటువంటి స్వప్నంలో నా ఉద్వేగాన్ని అక్షరరూపంలో పంచుకోమని స్వర్ణ నన్ను కోరడం, నేను రాయగలగడం, నా ఒడిలో క్లింట్‌ను కూర్చోబెట్టుకున్న అనుభూతినిచ్చింది. లిప్తకాలపు స్వప్నాన్ని అక్షర సాకారం చేసిన అనువాదకురాలికి అన్నింటా తోడుగా నిలిచిన ఆమె సహచరుడు కొణతం దిలీప్‌కు అభినందనలు.

– కె.ఎన్.మల్లీశ్వరి

**'అమ్ముునాయర్' ఇంగ్లీష్‌లో 'ఎ బ్రీఫ్ అవర్ ఆఫ్ బ్యూటీ' పేరుతో రాసిన పుస్తకాన్ని 'స్వర్ణ కిలారి' 'లిప్తకాలపు స్వప్నం' పేరుతో తెలుగులోకి అనువాదం చేశారు. 'లిప్తకాల పు స్వప్నం' పుస్తకంలోని ముందుమాట.**

(ఈ నెల 30న 'లిప్తకాలపు స్వప్నం' పుస్తకం విడుదల సందర్భంగా..)

కాకతీయ సామ్రాజ్యం 1323లో ప్రతాపరుద్రుని మరణంతో అస్తమించింది. ఆ తర్వాత మళ్లీ హిందు సామ్రాజ్య స్థాపనకు ప్రయత్నాలు జరిగాయి. ప్రతాపరుద్రుని అనంతరం ఓరుగల్లు ప్రాంతంలో చెప్పరానంత విధ్వంసం మారణహోమాలు ఢిల్లీ పాలకులు వారి సేనలు కొనసాగించాయి. ఓరుగల్లు నగరాన్ని ఆరు నెలలపాటు ధ్వంసంచేసి దేవతా మందిరాలను కూల్చి ప్రజలను మతాంతరీకరణంచేసి ఎంతో భయోత్పాతాలను సృష్టించారు. నగరం పేరే మార్చి 'సుల్తాన్‌పూర్' అని పెట్టారు. ఈ భయం వల్ల చాలామంది విద్వాంసులు, కళాకారులు, శిల్పులు, శాస్త్రవేత్తలు ఇతర ప్రాంతాలకు తరలిపోయారు. బలవంతంగా మతాన్ని మార్చుకున్నవారు తమ పూర్వ మతస్థులను పీడించసాగారు.

# కవిత్వాహంకారం లేని ఎఱ్ఱన

**ఈ** అల్లకల్లోలంలో ఓరుగల్లు సామ్రాజ్యాన్ని ముసునూరి ప్రోలయ నాయకుడు, కాపయ నాయకుడు అనే ఇద్దరు వీరులు తమ సహచర వీరుల సహాయంతో సింహాసనాన్ని ఆక్రమించి కాకతీయుల వారసత్వాన్ని కొంతకాలం వరకు నిలబెట్టారు. ఈ సందర్భంలో రాచకొండలో పద్మనాయకులు రాజ్యాన్ని నెలకొల్పారు. మరో వైపు కొండవీటిలో రెడ్డిరాజులు మరొక రాజ్యాన్ని స్థాపించారు.

ఈ రెండు రాజ్యాలలోనూ పాలకులు సంస్కృతాంధ్ర భాషల్లో విద్వాంసులు. కవి పండిత పోషకులు. రాచకొండలో విశ్వేశ్వర పండితుడు, వామన బట్టభానుడు ఉండేవారు. స్వయంగా ఈ వంశంలోని రాజు సర్వజ్ఞ సింగభూపాలుడు 'రసార్ణవ సుధాకరం' అనే అలంకార శాస్త్ర గ్రంథాన్ని రచించారు. వేదాంత దేశికుల కుమారులు కుమార వరదాచార్యులు రాచకొండకు విచ్చేసి వైష్ణవ సంప్రదాయాన్ని వ్యాప్తిలోనికి తెచ్చారు. ఈ సందర్భంలో కుళ్లత్తాళ్వార్లు రచించిన పంచస్తవి ప్రభావం తెలుగు కవుల మీద పడింది. రాజాశ్రయాన్ని తిరస్కరించాలనే భావం కూడా పర మతస్థుల ఆక్రమణల వల్ల కల్లోలితమైన తెలంగాణలో ప్రబలింది. ఏ దిక్కులేని వారికి దేవుడే దిక్కన్నట్లు ఈ ప్రాంతంలోని రాజులకు కాక ఇష్టదైవతములకే తమ గ్రంథాలను అంకితం చేయాలని నిశ్చయించుకున్నట్లు తెలియవస్తుంది. కొండవీటి రెడ్డిరాజులు కవిత్రయంలోవి ఎఱ్ఱప్రగడ, శ్రీనాథుడు మొదలైన కవులను పోషించారు. ఈ కాలంలోని కాటయ వేముడు కాళిదాసు నాటకాలకు వ్యాఖ్యానం రచించాడు.

ఓరుగల్లు నుంచి వలస వెళ్లిన సాయణ మాధవులనే సోదరులు ఢిల్లీ నుంచి మతం మార్చుకొని తిరిగి వచ్చిన హరిహర బుక్కరాయలు అనే సోదరులను హిందువులుగా మార్చి వారిచేత విజయనగర సామ్రాజ్యాన్ని నిర్మింపజేశారు. నాడు నిర్మించిన శ్రీవిద్యానగరం, శ్రీచక్రపీఠ శక్తితో నిర్మింపబడినదని చరిత్రకారులు కొందరు పేర్కొన్నారు. సాయణ మాధవులలోని సాయణుడు నేతగా, సామ్రాజ్య పోషణలో సుమారు యాభై మంది పండితులలో మాధవులు వేద భాష్యాన్ని నిర్మింపజేశాడు. ఈ భాష్యం నేటికీ అత్యంత ప్రామాణికమైనది. విద్యారణ్యులకు సహపాఠి ఐన వేదాంత దేశికులు నిస్సంగులై జీవించారు. ఆయన శతాధిక గ్రంథకర్త రామానుజుల శ్రీభాష్యం, 'శుద్ధ ప్రకాశిక' అనే గొప్ప వ్యాఖ్యానం ఆ రోజుల్లో వెలువడింది. శ్రీరంగ క్షేత్రం మీద తురుష్కులు దండయాత్ర చేసినప్పుడు ఆ గ్రంథాన్ని ఇసుకలో దాచిపెట్టి దాని మీద తాము విగతజీవులైనట్లు పడి ఉండి ఆ గ్రంథాన్ని రక్షించినట్లు ఒక గాథ.

మాధవులు విద్యారణ్యులనే ఆశ్రమ నామంతో శృంగేరి జగద్గురుపీఠాన్ని అధిష్ఠించారు. వారి 'సర్వ దర్శన సంగ్రహం' వంటి గ్రంథాలు ప్రసిద్ధమైనవి. అప్పుడే బుక్క రాయలపోషణలో నాచన సోమన అనే గొప్ప తెలుగు కవి ఉండేవారు గత శతాబ్దం తొలిదశ కాలంలో తెలుగు విమర్శకులు ఎఱ్ఱన, నాచన సోమనల మధ్య తారతమ్యాన్ని ఎక్కువ, తక్కువల గురించి చర్చించేవారు. చిన్నయసూరి, బహుజనపల్లి సీతారామచార్యులు, వీరేశలింగం ప్రభృతులు నాచనసోమన పక్షాన్ని వహించారు.

భారతక్రమంలో మధ్యముడు, కాలక్రమంలో చివరివాడు ఐన ఎఱ్ఱాప్రగడ.. నన్నయ్య రచింపగా మిగిలిపోయిన అరణ్యపర్వాన్ని ఆయన పేరుమీద పూర్తిచేశాడు. అదికాక భారతానికి కీలకపర్వమైన హరివంశాన్ని తెలుగుజేశాడు. ఉప పురాణమైన నరసింహ పురాణాన్ని శ్రీలక్ష్మి నృసింహ అవతారంగా కావ్య రూపాన్నిచ్చి నిర్మించాడు. ఈయనకు శంభుదాసుడని పేరు ప్రబంధ పరమేశ్వరుడని బిరుదు. అసంపూర్ణమైన తెలుగు భారతాన్ని పూర్తిచేసి నిబంధించటం చేత ఇతనికి ప్రబంధ పరమేశ్వరుడు అని బిరుదు వచ్చింది. ఈ మూడు గ్రంథాలే కాక రామాయణాన్ని కూడా రచించారు. ఇప్పుడు ఈ గ్రంథం లభ్యం కావటం లేదు. లాక్షణికులు తమ గ్రంథాలలో అక్కడక్కడ ఉదహరించిన పద్యాలను బట్టి ఈ గ్రంథ ఉనికి తెలియవస్తుంది. నృసింహపురాణం, హరివంశం ఈ రెండు విష్ణు అవతారాలైన విష్ణువు, నరసింహస్వామి మహిమలు వెల్లడించేవే. ఇతడు శంభుదాసుడని పేరు కలిగి ఉన్న వైష్ణవ భక్తి ప్రతిపాదికలైన గ్రంథాలను రచించి హరిహరుల మధ్య ఐక్యభావాన్ని తెలిపాడు. హరివంశములో వ్రేపల్లెలోవి పల్లీయ లక్షణాలు ప్రకృతి సహజమైన సౌందర్యము కనిపిస్తాయి. అమాయకులైన గోప, గోపికల చిత్తవృత్తులు దర్శనమిస్తాయి.

నృసింహపురాణం ఒకవిధంగా అహోబిల క్షేత్ర మహిమలు చెప్పడానికి వచ్చింది. తెలుగులో వెలువడ్డ తొలి క్షేత్ర మహత్మ్యం. నృసింహస్వామి తాను విష్ణుమయత్వాన్ని సర్వతోవ్యాపకత్వాన్ని నిరూపించేందుకు సభ స్తంభాన్నుంచి ఆవిర్భవించాడు.. ఈ స్తంభం యోగ పద్ధతిలో సుషుమ్న నాడి. స్వామి ఉపాసకులకు హృదయాకాశంలో దర్శనమిస్తాడు. ఇదే చిదాకాశం. ఆనాహత చక్రానికి అధిపతి సూర్యుడు. సూర్యాధిపత్యం కలది సింహరాశి. ఈ హృదయోపాసన ఉపనిషత్తులలో అనేక సందర్భాలలో చెప్పబడినది. కఠోపనిషత్‌లో ఈ సాధన మృత్యు విజయ కేతువుగా పెద్దలు చెప్పినారు. భగవాన్ రమణ మహర్షి సాధకులకు హృదయోపాసనయే ప్రధాన మార్గంగా, తరుణోపాయంగా సూచన చేశారు. అనేక స్థలాల్లో, క్షేత్రాల్లో సుదర్శనమూర్తి, నరసింహమూర్తి ముందు, వెనుకగా ఉంటాయి. సుదర్శన మూర్తి ఆత్మ దర్శనానికి శాస్త్రం సూచించే మార్గం. నరసింహమూర్తిలో కొన్ని శివుని లక్షణాలు కనిపిస్తాయి. జటలు మూడవ కన్ను, తెల్లని రంగు, పినాక ధనుస్సును ధరించుట ఈ అంశం. ఇది హరిహర భేదాన్ని తెలిపే అంశం. ఎఱ్ఱాప్రగడ రచనలను జాగ్రత్తగా, లోతుగా పరిశీలిస్తే ఇతను కేవలం, కవి, తాత్వికుడు మాత్రమే కాక అంతర్యాగ పరాయణుడైన యోగి వలె కానవస్తాడు. ఇతని రచనలలో ఒక సాత్వికత ఆత్మగోపన లక్షణం కానవస్తాయి. కవిత్వాహంకారం ఇతనిలో కనిపించదు. తురుష్కుల దండయాత్రలు ప్రబలంగా ఉన్న సమయంలో, మతాంతరీకరణలు జరుగుతున్న కాలంలో.. శైవ వైష్ణవ మత భేదాలు తీవ్రస్థాయిలో పొడచూపిన సందర్భంలో హరిహరనాథ తత్వాన్ని తన కావ్యాల ద్వారా ప్రబోధించిన వాడు ఎఱ్ఱా ప్రగడ. కవిత్రయ త్రిమూర్తులలో ప్రబంధ పరమేశ్వరుడు..

> ఎఱ్ఱాప్రగడ రచనలను జాగ్రత్తగా, లోతుగా పరిశీలిస్తే ఇతను కేవలం, కవి, తాత్వికుడు మాత్రమే కాక అంతర్యాగ పరాయణుడైన యోగి వలె కానవస్తాడు. ఇతని రచనలలో ఒక సాత్వికత ఆత్మగోపన లక్షణం కానవస్తాయి. కవిత్వాహంకారం ఇతనిలో కనిపించదు.

– కోవెల సుప్రసన్నాచార్య



## కాలాన్ని జయించిన కాళేశ్వరం

**తరతరాల** కన్నీళ్ళే
ఉత్తుంగ తరంగాలై ఉప్పొంగుతున్నవి
నీళ్ళున్న దగ్గరే
నాగరికతలేర్పడడం నిన్నటి మాట
మనుషుల దగ్గరికే నీళ్ళు రావడం నేటి
తెలంగాణ మాట

ఎండిన బావులు,వాగులు, కాలువలు
దొనలు, బుగ్గలు, చెలిమలు మళ్ళీ
నీళ్ళాడాలి
పరుగు పరుగున పరవళ్ళతో
సకల పంటలతో పరవశించాలి

తెలంగాణ ఎత్తున ఉన్నది ఎకసక్కాలు
నీళ్ళు దిగువకెట్ల పోతవని ధిక్కారాలు
పొద్దెక్కని అవమానాలు అణచివేతలు
బహువిధ మోసాలు...
గొంతెత్తుతే గుండెపిసికిండ్రు
వాటాలు హక్కులు చినిగిన కాగితాలు
ఎన్కౌంటర్లు కురిసినచోటే
ఎత్తిపోతలు పరుగెడ్తున్నవి

చెరువులు స్వయం పోషకాలు
చెరువులు ఆత్మగౌరవాలు
అలల నాదమై ప్రతిధ్వనించాలి
జనం పెరిగినట్లుగా జలం పెరుగాలి
జలం నిలువాలి జనం నవ్వాలి

కృష్ణా గోదావరలు
గుండె తడులు
దశబ్దాల వలస గోసలు
అర్ధరాత్రి పత్తికాయల్లా బద్దలు
కాలాన్ని గడపడం కాదు
కాలాన్ని నదిమీద నిలబెట్టిన
మహాసంకల్పం
కండ్లముందట కాళేశ్వరం జలేశ్వరం..

– వనపట్ల సుబ్బయ్య

94927 65358



## క్షేత్రజ్ఞత

**అయస్కాంత** క్షేత్రాల మధ్య
వినిమయ మోహ వికర్షణ
తపశ్శక్తి తడారిపోయి
గుక్కపట్టి ఏడుస్తున్న మనశ్శరీరాలు–

ఈ కళ్లలోంచి ఆ కళ్ల మీదికి
ధ్వంసమైన వెన్నెల వంతెన
ఈ పెదవి మీంచి ఆ పెదవిపైకి
దగ్ధమవుతున్న దరహాసం
అవతలి గుండెపై వాలబోయి
రెక్కలు తెగి కుప్పకూలిన పక్షి
కుప్పనూర్పిడిలో చేతులు సమాధై
స్పర్శ కోల్పోయిన కరచాలనం
పదకోశంలో కిక్కిరిసిన సమూహాల
నడుమ
అర్థాలు వెతుక్కుంటున్న ఆలింగనాలు!

ఏ ఇంటినీ మినహాయించలేం
వరండాల నిండా హోరెత్తే గొంతులు
డ్రాయింగ్ హాళ్లను కమ్మేసిన మేఘాలు
డైనింగ్ టేబుళ్ల చుట్టూ కోటగోడలు
వంటగదుల్ని ముంచెత్తే నదీప్రవాహాలు
ఆఖరికి
పడకగదుల్నీ ఆక్రమించిన ఆగంతక
సంకేతాలు

రక్తకణాలకు రక్షణ గోడలుండవు
యుద్ధాల వెనుక కుట్రలు అర్థం కావు
ఆయుధాలకు ఆర్తనాదాలు వినిపించవు
మానసిక మాంద్యం దెబ్బకు
దేహాల సరిహద్దులు మూతబడతాయి
మాయలఫకీర్ కోసం
గూగుల్ సెర్చ్ ఇంజిన్‌లో తల
దూర్చావో
నీ సందేహం వేయి వక్కలవుతుంది

సందేశాల్నీ వాక్ప్రవాహాల్నీ నేలమట్టం చేసి
ఓసారి నగ్నంగా ముట్టుకుని చూడు
మట్టినీ అందులోని ఇనుపరజనునీ–
+++
విజాతి ధ్రువాలు
క్షేత్ర పర్యటనకు బయల్దేరుతున్నాయి!

– ఎమ్వీ రామిరెడ్డి,

98667 77870

## కొత్త పుస్తకం

### అరణ్యపర్వం



**పార్ధి** తెగవారికి పులుల్ని చంపి వాటి చర్మాలను, గోళ్లను అమ్ముకొని బతుకటమే ఆచారం. అలాంటి తెగవారు నేడు కటిక దారిద్ర్యంలో బతుకీడుస్తున్న పార్ధీతెగ జీవన వైవిధ్యాన్ని చిత్రించిన నవల 'అరణ్యపర్వం'. నేరస్త జాతిగా ముద్రవేయబడి నిత్యం హింసాదౌర్జన్యాలకు బలవుతున్న గుంజన్‌కీ, పగతో రగిలిపోయిన పులిపిల్లకీ మధ్య జరిగిన పోరాటాన్ని చిత్రించిన నవల ఇది.

**రచన:సలీం, వెల: రూ. 120, ప్రతులకు:సలీం, ఫ్లాట్ నెం:బి2/206, లక్ష్మీనారాయణ అపార్ట్‌మెంట్స్, 3-6-164, హిమాయత్‌నగర్, హైదరాబాద్-29. సెల్: 7588630243**

### కాళోజీ రామేశ్వరరావు



**కాళోజీ** రామేశ్వరరావు ఉర్దూ, హిందీ, ఇంగ్లీషు, తెలుగు భాషలలో మంచి పండితుడు. ఉర్దూలో మంచి కవి. స్వాతంత్ర్యోద్యమ కాలంలో ఎందరో ఉద్యమకారులకు అండగా నిలిచి, స్ఫూర్తినింపిన ఉద్యమకారుడు. ప్రజా కవి కాళోజీకి అన్నగానే గాక, మంచి సాహితీవేత్తగా పేరు ప్రఖ్యాతులు గాంచినవారు. ఆయన కవితల సంకలనం ఇది.

**రచన: కాళోజీ రామేశ్వరరావు, వెల: రూ.25, ప్రతులకు:తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యాలయం, కళాభవన్, రవీంద్రభారతి, హైదరాబాద్-4**



## ఒక స్వప్నం తర్వాత

**దో**బూచులాడిన దొంగాటకు ఇక తెర పడినట్లే
ఈరోజు నా నేల మీద పారాడిన గోదారి
ఇక తెలంగాణ దారుల వెంట పచ్చని గాలై కమ్ముకుంటుంది
ఎండిన నేలను, ఎగిరే దుమ్మును
తన తడి స్పర్శతో తల్లై హత్తుకుంటుంది
పంటల మీద పక్షుల మోత
పిల్ల బాటన కైకిలి కూత
బండి గిర్రలు, నాగలి కర్రులు
ఎద్దుల గిట్టలు, పెద్దగుమ్మలు
ఇప్పుడు మళ్ళీ మొలకెత్తే పాత గుర్తులు
తెలంగాణ కొప్పులో కాళేశ్వరం
నీటికి నడక నేర్పిన మహోజ్వల ఘట్టం
ఎండిన స్తన్యం
ఎండమావులు ఇక చరిత్రే
ఇక నేల నేలంత నీటి ఊట
నేటి కొత్త నీటితో రేపటి బోనం తలంటుకుంటది
తంగేడు పూవు తనువారా ఆటాడుకుంటది
వాడ వాడంత డప్పుల దరువు
కాళ్ళ గజ్జెలకు కొత్త నెలవు
నీరు ఎత్తు నెరుగు
తెలంగాణ పంటై వెలుగు

– ఒద్దిరాజు ప్రవీణ్ కుమార్

98490 82693

## ప్రకటనలు

### సాహిత్య సంస్థలు, సాహిత్యం-సదస్సు

**తె**లంగాణ సమాజానికి ధిక్కార స్వరాన్నిచ్చి నడిపించి, ఉన్నతీకరించిన ప్రజా సాహిత్యంపై 'తెలంగాణ ఉద్యమాలు, సాహిత్య సంస్థలు, సాహిత్యం' అంశంపై ఒకరోజు సదస్సు 2019 జూన్ 30న ఉదయం 10 గంటల నుంచి హైదరాబాద్ తిలక్‌రోడ్డులోని సారస్వత పరిషత్తు హాలులో జరుగుతుంది. సదస్సులో వివిధ సెషన్లకు సభాధ్యక్షులుగా డాక్టర్ నాళేశ్వరం శంకరం, డాక్టర్ బన్న ఐలయ్య, డాక్టర్ సూర్య ధనుంజయ్ వ్యవహరిస్తారు. గౌరవ అతిథులుగా నందిని సిధారెడ్డి, కె.రామచంద్రమూర్తి, కె.శ్రీనివాస్, డాక్టర్ జె.చెన్నయ్య, డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి హాజరవుతారు. డాక్టర్ జి.బాల శ్రీనివాస మూర్తి, డాక్టర్ దేవకీదేవి, డాక్టర్ తూర్పు మల్లారెడ్డి, డాక్టర్ కాశీం వివిధ సెషన్లలో ప్రసంగిస్తారు. ఆత్మీయ అతిథులుగా.. డాక్టర్ వి.త్రివేణి, పొద్దుటూరి మాధవీలత, డాక్టర్ వాణి దేవులపల్లి, ఐనంపూడి శ్రీలక్ష్మి, నెల్లుట్ల రమాదేవి, కవిత, పోతన జ్యోతి, డాక్టర్ సి.హెచ్.సీతాలక్ష్మి, డాక్టర్ శారదా హన్మండ్లు, డాక్టర్ అడువాల సుజాత, సీహెచ్ ఉషారాణి హాజరవుతారు. కవి సమ్మేళనాలకు సభాధ్యక్షులుగా వీఆర్ విద్యార్థి, డాక్టర్ ఎస్.రఘు, దాస్యం సేనాధిపతి, వఝుల శివకుమార్, కాంచనపల్లి, కోట్ల వెంకటేశ్వర రెడ్డి, అందోజు పరమాత్మ, పొన్నాల బాలయ్య, వనపట్ల సుబ్బయ్య, తైదల అంజయ్య, సామిడి జగన్‌రెడ్డి, శ్రీరామోజు హరగోపాల్, రాపోలు సుదర్శన్ వ్యవహరిస్తారు.

– డాక్టర్ నాళేశ్వరం శంకరం, తెరసం అధ్యక్షులు,
– డాక్టర్ వి.శంకర్, తెరసం ప్రధాన కార్యదర్శి

### 'కలల గూడు' ఆవిష్కరణ సభ

**డా**క్టర్ బి. బాలకృష్ణ రచించిన కవితా సంపుటి 'కలల గూడు' ఆవిష్కరణ సభ 2019 జూన్ 25న సాయంత్రం 6 గంటలకు హైదరాబాద్, రవీంద్రభారతిలో జరుగుతుంది. ఏనుగు నరసింహారెడ్డి అధ్యక్షతన జరుగు సభలో గౌరవ అతిథులుగా నందిని సిధారెడ్డి, మామిడి హరికృష్ణ, సిద్ధార్థ, డాక్టర్ బి.చంద్రశేఖర్ హాజరవుతారు. .

– తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, పాలపిట్ట

### 'వాల్మీకి చెప్పిన రామాయణ గాథ'

**'వాల్మీకి** చెప్పిన రామాయణ గాథ' పుస్తకావిష్కరణ సభ 2019 జూన్ 24న సాయంత్రం 5.30 గంటలకు హైదరాబాద్, సుందరయ్య విజ్ఞానకేంద్రం, షోయబ్ హాల్‌లో జరుగుతుంది. భూపతి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరుగు సభలో కవి యాకూబ్, వరప్రసాద్, కోయ చంద్ర మోహన్ ప్రసంగిస్తారు. అతిథిగా ఎస్. వినయకుమార్, పుస్తకావిష్కర్తగా కె.శివారెడ్డి హాజరవుతారు. పుస్తక రచయిత కె.ఎల్.కాంతారావు, తంగిరాల చక్రవర్తి, అనంతోజు మోహన్‌కృష్ణ పాల్గొంటారు.

– తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం

### ఆవిష్కరణ సభ

**డా**క్టర్ ఎన్. గోపి రచనలు చైనా కవితలు, జీవనభాష గ్రంథాలకు స్వాతి శ్రీపాద అనువాదాలు 'China Po-ems', 'Life Speaks' పుస్తకాల ఆవిష్కరణ సభ 2019 జూన్ 25న సాయంత్రం 6 గంటలకు ఓయూ క్యాంపస్ ఎన్‌సీసీ గేట్ దగ్గర ఆంధ్ర మహిళా సభ కాలేజీ క్యాంపస్‌లో జరుగుతుంది. డాక్టర్ పత్తిపాక మోహన్ అధ్యక్షతన జరుగు సభలో గౌరవ అతిథులుగా ఉప్పలూరి ఆత్రేయశర్మ, ఆచార్య సూర్య ధనంజయ్ హాజరవుతారు.

– తమిరిశ జానకి,
మహిత సాహితి గౌరవాధ్యక్షులు
– డాక్టర్ ముక్తేవి భారతి,
మహిత సాహితి గౌరవ సలహాదారు


Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.



సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్‌లోని ఓ వెంచర్‌లో భూమి పూజ చేస్తున్న శారద పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతీస్వామి

## తెలంగాణలో వేదపాఠశాలలను పెంచాలి

- శారదపీఠానికి రెండు ఎకరాలు కేటాయింపు సంతోషకరం
- శారద పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతీస్వామి

**రామచంద్రాపురం:** తెలంగాణలో వేద పాఠశాలలను విస్తరించాల్సిన అవసరం ఉన్నదని విశాఖ శారద పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతీ స్వామి సూచించారు. ఆదివారం సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం మండలం తెల్లాపూర్ శివారులోని ఓ వెంచర్‌లో భూమి పూజ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. సీఎం కేసీఆర్ శారద పీఠానికి కోకాపేట్‌లో రెండు ఎకరాల భూమిని కేటాయించడం సంతోషకరమైన విషయమన్నారు. పీఠాలను విస్తరించాల్సిన అవసరం ఉన్నదని సూచించారు. ప్రతి ఒక్కరూ సనాతనధర్మాన్ని పాటించాలని, ఈ విషయంలో సీఎం కేసీఆర్ ప్రతి ఒక్కరికి ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో త్రిపుర కన్‌స్ట్రక్షన్ ఎండీ సుధాకర్ పసుపులేటి, సీఈవో పల్లవి కృష్ణ, రాష్ట్ర సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు సోమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### నేడు రాజన్న ఆలయంలో

## వరుణయాగం

**వేములవాడ కల్చరల్:** లోక కల్యాణార్థం వేములవాడ రాజన్న ఆలయంలో సోమవారం అప్పాల భీమాశంకర్ ఆధ్వర్యంలో వరుణయాగాన్ని నిర్వహించనున్నట్టు ఈవో దూస రాజేశ్వర్ తెలిపారు. సోమవారం అర్చకులు యాగానికి అంకురార్పణ చేస్తారని, ఉదయం 6గంటలకు స్వామివారి కల్యాణ మండపంలో పుణ్యాహవాచనంతో యాగం ప్రారంభమవుతుందని, నవగ్రహపూజ, వాస్తు పూజ, క్షేత్రపాలకపూజ, రుష్యశృంగ స్థాపన, శతానువాద పారాయణాలు నిర్వహిస్తామన్నారు.



యాదాద్రి శ్రీలక్ష్మీనారసింహుని సన్నిధి ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. స్వామివారి దర్శనానికి వచ్చిన భక్తజనులతో తిరువీధుల్లో సందడి నెలకొన్నది. అత్యంత ప్రతిష్ఠాత్మకంగా జరుపుకొనే సత్యనారాయణ స్వామి వ్రతపూజలు ఘనంగా నిర్వహించారు.
- యాదాద్రి భువనగిరి ప్రతినిధి, నమస్తే తెలంగాణ



# జోరందుకున్న వానలు



రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం నాగరగూడ వద్ద పారుతున్న ఈసీ వాగు

- రాష్ట్రవ్యాప్తంగా విస్తరించిన రుతుపవనాలు
- వికారాబాద్ జిల్లాలో పొంగిపొర్లుతున్న వాగులు
- పలుచోట్ల రాకపోకలకు అంతరాయం
- రంగారెడ్డి జిల్లాలోని ఈసీ వాగులో ఉధృత ప్రవాహం
- సంగారెడ్డి జిల్లాలో పిడుగులుపడి ఏడు పశువుల మృత్యువాత.. నలుగురికి గాయాలు
- రానున్న మూడు రోజుల్లో రాష్ట్రంలో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వానలు

**హైదరాబాద్, నమస్తేతెలంగాణ/నమస్తే తెలంగాణ నెట్‌వర్క్:** రాష్ట్రంలో నైరుతి రుతుపవనాలు చురుకుగా కదులుతున్నాయి. రుతుపవనాలకు ఉపరితల ద్రోణులు తోడుకావడంతో రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. తూర్పు, పశ్చిమ బంగాళాఖాతంలో సముద్రమట్టానికి 5.8 కిలోమీటర్ల ఎత్తువరకు వ్యాపించిన ఉపరితల ద్రోణి రాజస్థాన్‌నుంచి ఛత్తీస్‌గఢ్, ఒడిశా వరకు వ్యాపించింది. ఇంకోవైపు ఛత్తీస్‌గఢ్ పరిసర ప్రాంతాల్లో మరో ఉపరితలద్రోణి కొనసాగుతున్నది. నాలుగు కి.మీ. ఎత్తువరకు గంటకు 30నుంచి 40 కి.మీ. వేగంతో గాలులు వీస్తున్నాయి. రాను న్న మూడు రోజుల్లో రాష్ట్రంలోని చాలాచోట్ల తేలికపాటి నుంచి ఓ మోస్తరు వానలు కురిసే అవకాశమున్నది. ఆదివారం దాదాపు పదిజిల్లాల్లో వర్షం పడింది. వికారాబాద్, నాగర్‌కర్నూల్, జనగామ, గ్రేటర్ హైదరాబాద్‌లో భారీ వర్షం కురవగా మిగతా జిల్లాల్లో ఓ మోస్తరు నుంచి జల్లులు కురిశాయి. వికారాబాద్ జిల్లాలో వాగులు పొంగడంతో పలు ప్రాంతాలకు రాకపోకలు నిలిచిపోయాయి. రంగారెడ్డి జిల్లా పరిధిలోని ఈసీ వాగులోకి వరద పెరిగింది. నాగర్‌కర్నూల్ జిల్లాలో దుందుభీ వాగు పరవళ్లు తొక్కింది. సంగారెడ్డి జిల్లాల్లో పిడుగులు పడటంతో ఏడు పశువులు మృత్యువాతపడగా, నలుగురికి గాయాలయ్యాయి.

**పొంగిపొర్లుతున్న వాగులు**

వికారాబాద్ మండలం సిద్దులూర్ చెరువు, మర్పల్లి మండలం బిల్‌కల్ చెరువులు పొంగిపొర్లడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వికారాబాద్, మర్పల్లి, కొడంగల్, మోమిన్‌పేట, బొంరాస్‌పేట, పరిగి మండలాల్లో వర్షాలు బాగా కురుస్తున్నాయి.

**ఈసీ వాగులోకి వరద..**

రంగారెడ్డి జిల్లా చేవెళ్ల, ఇబ్రహీపట్నం, ఆదిబట్లలో వర్షం కురిసింది. ఎగువ ప్రాంతమైన పరిగి, వికారాబాద్‌లో కురిసిన వర్షాలకు మొయినాబాద్, షాబాద్ మండల పరిధిలోని ఈసీ వాగులోకి భారీగా వరద వచ్చి చేరింది. హిమాయత్‌సాగర్‌కు ఈసీ వాగులోకి నీరు చేరడంతో బోరుబావుల్లో నీటి మట్టం పెరిగే అవకాశం ఉన్నది.

**సంగారెడ్డి జిల్లాలో ఏడు పశువులు..**

సంగారెడ్డి జిల్లాలో పిడుగులు పడటంతో ఏడు పశువులు మృత్యువాత పడగా నలుగురికి గాయాలయ్యాయి. న్యాల్‌కల్ మండలం రేజింతల్ శివారులో పొలంలో పనులు చేస్తున్న నాగమ్మ, సుమిత్రమ్మల పక్కనే పిడుగుపడటంతో వారు తీవ్రగాయాలతో జహీరాబాద్ ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతున్నారు. న్యామతాబాద్ శివారులో పిడుగుపడటంతో రైతు సంగప్ప తీవ్రంగా గాయపడ్డాడు. పక్కనే చెట్టుకింద ఉన్న రెండు బర్లు, మూడు ఆవులు అక్కడికక్క డే మృత్యువాతపడ్డాయి. మనూరు మండలం బోరంచలో పిడుగుపాటుకు రెండు ఎడ్లు అక్కడికక్కడే మృతి చెందగా, ఓ వ్యక్తికి గాయాలయ్యాయి.

**నాగర్‌కర్నూల్‌లో భారీ వర్షం..**

నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంతోపాటు తిమ్మాజిపేట, బిజినేపల్లి, వెల్దండ కల్వకుర్తి మండలాల్లో శనివారం అర్ధరాత్రి ఓ మోస్తరు వర్షం కురిసింది. కల్వకుర్తి మండలం రఘుపతిపేట సమీపంలో దుందుభీ వాగు పరవళ్లు తొక్కింది. జోగుళాంబ గద్వాల జిల్లా అయిజలో శనివారం రాత్రి ఓ మోస్తరు వర్షం కురిసింది.

**ఉమ్మడి వరంగల్‌లో..**

వరంగల్ అర్బన్‌లో జల్లులు కురిశాయి. వరంగల్ రూరల్ జిల్లాలోని వర్ధన్నపేట, రాయపర్తి, పర్వతగిరి మండలాల్లో తేలికపాటి వర్షం కురిసింది. జనగామ జిల్లాలోని పలు మండలాల్లో ఓ మోస్తరు వర్షం కురవగా అత్యధికంగా పాలకుర్తి మండలంలో 80.2 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. దీంతో దర్దెపల్లి-గూడెల్లగూడెం రహదారిపై నుంచి వరదనీరు పారింది. చెరువులు, కుంటల్లోకి నీరు చేరగా, పొలాలు నీటితో నిండిపోయాయి. స్టేషన్‌ఘన్‌పూర్, జఫర్‌ఘడ్, జనగామ, లింగాలఘనపురం, బచ్చన్నపేట, నర్మెట, తరిగొప్పుల, దేవరుప్పుల, కొడకండ్ల మండలాల్లో జల్లులు కురిశాయి. ములుగు జిల్లాలో ఓ మోస్తరు వర్షం కురిసింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండల కేంద్రంలో లోతట్టు ప్రాంతాల్లో నీరు చేరింది. అశ్వారావుపేట, కొత్తగూడెం, పాల్వంచలో ఓ మోస్తరు వాన పడింది. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లో ఓ మోస్తరు వర్షం కురవగా లోతట్టు ప్రాంతాల్లో వరద నీరు నిలిచింది.

**నమోదైన వర్షపాతం వివరాలు ఇలా..**

రాష్ట్రంలోని పలుచోట్ల శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలం ఎడంపల్లిలో అత్యధికంగా 92.5 మి.మీ. వర్షపాతం నమోదైనట్టు తెలంగాణ స్టేట్ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ అధికారులు వెల్లడించారు. మహబూబాబాద్‌లో 67.5 మి.మీ., నాగర్‌కర్నూల్‌లో 60 మి.మీ., అదే జిల్లాలోని కుమ్మెరలో 60 మి.మీ., పెద్దముదునూరులో 50 మిల్లీమీటర్లు, కాగజ్‌నగర్‌లో 51.8 మి.మీ., రంగారెడ్డి జిల్లా ఆమనగల్, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్, జగిత్యాల కోల్వాయ్, నల్లగొండ జిల్లా తెల్దేవరపల్లిలో 30నుంచి 40 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. రాష్ట్రంలో గరిష్ఠ ఉష్ణోగ్రత 36 నుంచి 38 డిగ్రీల వరకు, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 24నుంచి 27 డిగ్రీల వరకు నమోదయ్యాయి.

## గ్రేటర్ హైదరాబాద్‌లో భారీ వర్షం

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** గ్రేటర్ హైదరాబాద్‌లో ఆదివారం కురిసిన వర్షానికి పలుచోట్ల రోడ్లన్నీ జలమయమయ్యాయి. మాదాపూర్, జూబ్లీహిల్స్, కూకట్‌పల్లి, అల్వాల్, ఖైరతాబాద్ తదితర ప్రాంతాల్లో భారీ వర్షం కురవడంతో వరద నీరు రోడ్లపై నిలిచి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. గ్రేటర్ పరిధిలోని రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం చందన్‌వల్లిలో అత్యధికంగా 7.8 సెం.మీలు, జూబ్లీహిల్స్‌లో 6.6సెం.మీ., మోండా మార్కెట్, ఖైరతాబాద్ ప్రాంతంలో 4.0 మి.మీ. వర్షపాతం నమోదైనట్టు టీఎస్‌డీపీఎస్ అధికారులు వెల్లడించారు. రాగల మూడు రోజుల వరకు గ్రేటర్ పరిధిలో విస్తారంగా వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది.

**ముంపు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి..**

గ్రేటర్ హైదరాబాద్‌లోని ముంపు ప్రాంతాల్లో వరద నీరు నిలువకుండా జీహెచ్‌ఎంసీ చర్యలకు ఉపక్రమించింది. ముంపు ప్రాంతాలకు శాశ్వతంగా మోటర్ పంపులు ఏర్పాటు చేయడమేగాకుండా సిబ్బందిని కూడా నియమించింది. డీఆర్‌ఎఫ్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్, మాన్‌సూన్ ఎమర్జెన్సీ బృందాల వంటి వివిధ శాఖలకు చెందిన 500 బృందాలు వర్షం నీటిని ఎత్తిపోసేందుకు సిద్ధమయ్యాయి. ఈ మేరకు జేఎన్‌టీయూ ప్రొఫెసర్ లక్ష్మణ్‌రావు, జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ హరిచందన, ఇతర అధికారులతో ఆదివారం జీహెచ్‌ఎంసీ కమిషనర్ దానకిశోర్ వరద నీటిపై సమీక్ష నిర్వహించారు. అనంతరం ఐటీ కారిడార్ ప్రాంతాలతోపాటు ఇతర ముంపు ప్రాంతాలను పరిశీలించారు. వరద పోకుండా అడ్డుగా ఉన్న అక్రమ కేబుళ్లను తొలిగించాలని అధికారులను ఆదేశించారు. నగరంలో గంటకు 2 సెంటీమీటర్ల వర్షపాతాన్ని తట్టుకునే డ్రైనేజీ వ్యవస్థ మాత్రమే ఉన్నదని ఆయన పేర్కొన్నారు.



మాదాపూర్‌లో దెబ్బతిన్న పుట్‌పాత్‌ను పరిశీలిస్తున్న దానకిశోర్

## పొలం పనుల్లో రైతన్న బిజీ..

వర్షాల రాకతో రైతులు పొలం పనుల్లో నిమగ్నమయ్యారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో రైతులు సాల్లు కొట్టడం, విత్తనాలు వేసే పనులు చేపడుతున్నారు. వరంగల్‌అర్బన్, రూరల్ జిల్లాల్లో ట్రాక్టర్లతో దుక్కులు చేస్తూ పత్తి విత్తనాలు వేస్తున్నారు. ఇప్పటికే కొందరు నారుమళ్లు పోసుకోగా, తాజాగా కురుస్తున్న వానలతో మిగతా రైతులు కూడా నార్లు పోసుకుంటున్నారు. ములుగు జిల్లాలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు సాగు పనులు ఊపందుకున్నాయి.



వరంగల్ అర్బన్ జిల్లా ఐనవోలులో దుక్కులు దున్నుతున్న రైతులు



జనగామ జిల్లా పాలకుర్తి మండలం దర్దెపల్లి-గూడెల్లగూడెం రహదారిపై ప్రవహిస్తున్న వరద నీరు



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కరకగూడెంలోని పొలాల్లో చేరిన వరదనీరు



గ్రేటర్ హైదరాబాద్‌లోని మాదాపూర్‌లోగల ఓ హెయిర్ సెలూన్‌లోకి వచ్చిన వర్షపు నీరు



వికారాబాద్ జిల్లా మర్పల్లి మండలంలో పారుతున్న బిల్‌కల్ వాగు



సంగారెడ్డి జిల్లా న్యామతాబాద్‌లో పిడుగుపడి మృత్యువాతపడిన ఆవులు, బర్రెలు



కామారెడ్డి జిల్లా పాత బాన్సువాడ ఎస్సీ కాలనీలో డబుల్ బెడ్ రూం ఇండ్లకు శంకుస్థాపన చేస్తున్న స్పీకర్ పోచారం

## పేదల ఆత్మగౌరవమే లక్ష్యం

- స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి

**బాన్సువాడ, నమస్తే తెలంగాణ :** పేదల ఆత్మగౌరవం కాపాడే దిశగా రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నదని శాసన సభాపతి పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆదివారం కామారెడ్డి జిల్లా పాత బాన్సువాడలోని ఎస్సీ కాలనీలో 50 డబుల్ బెడ్ రూం ఇండ్లు, డ్వాక్రా సంఘ భవనం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. సీఎం కేసీఆర్ ప్రవేశ పెడుతున్న పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు.



డబుల్ బెడ్‌రూం లబ్ధిదారులకు చీర, పసుపు, కుంకుమను అందజేస్తున్న మంత్రి కొప్పుల, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత

## ప్రతి నిరుపేదకూ డబుల్ బెడ్‌రూం ఇల్లు

సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్

**జగిత్యాల ప్రతినిధి, నమస్తే తెలంగాణ :** ప్రతి నిరుపేదకూ డబుల్ బెడ్‌రూం ఇల్లు అందజేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తున్నదని సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. జగిత్యాల అర్బన్ మండలం ధరూర్, జగిత్యాల రూరల్ మండలం నర్సింగాపూర్‌లో నూతనంగా నిర్మించిన 40 డబుల్ బెడ్ రూం ఇండ్లను జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేశ్, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌తో మంత్రి ఆదివారం ప్రారంభించారు. అనంతరం లబ్ధిదారులకు పసుపు, కుంకుమ, చీరలు అందజేసి శా లువాలతో సత్కరించారు. నిజామాబాద్ మాజీ ఎంపీ కవిత చొరవతో జగిత్యాల నియోజక వర్గానికి రాష్ట్రంలోనే అత్యధిక సంఖ్యలో డబుల్ బెడ్ రూం ఇండ్లు మంజూరయ్యాయన్నారు.

## ముగ్గురు చిన్నారులను మింగిన వాగు

- ఆట కోసం వెళ్లి నీట మునిగి మృతి
- రాత్రి 8 గంటలకు వెలుగులోకి వచ్చిన వైనం



సాయిచరణ్, శివయ్య,యుగంధర్ (ఫైల్)

**రాజోళి :** పెండ్లి ఇంట్లో భోజనం చేసి ఆడుకోవడానికి మధ్యాహ్నం బయటకు వెళ్లిన చిన్నారులు వాగులో తీసిన నీటి కుంటలో పడి మృత్యువాతపడ్డారు. ఈ విషాద ఘటన జోగుళాంబ గద్వాల జిల్లా రాజోళిలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సుజాత-కుర్వ ఎల్లప్ప కుమారుడు యుగంధర్ ( 7), సరస్వతీ-చాకలి బజారి కుమారుడు శివయ్య (7), జ్యోతి-వెంకప్ప కుమారుడు చరణ్ (9)తోపాటు మరో ఇద్దరు పిల్లలు ఆదివారం జరిగిన ఓ వివాహానికి తల్లిదండ్రులతో కలిసి వెళ్లారు. భోజనం చేసిన అనంతరం చిన్నారులంతా కలిసి సమీపంలో ఉన్న వాగు వద్దకు ఆడుకునేందుకు వెళ్లారు. ఈ క్రమంలో వాగులో రైతులు తవ్విన నీటి కుంటల్లోకి ముగ్గురు చిన్నారులు దిగగా, మరో ఇద్దరు మాత్రం పైనే ఉన్నారు. కుంటలోకి దిగిన ముగ్గురికీ ఈత రాకపోవడంతో నీటిలో మునిగిపోయారు. పైనున్న చిన్నారులు భయంతో ఇంటికి వెళ్లి తల్లిదండ్రులకు విషయం చెప్పలేదు. తమ పిల్లలు కనిపించకపోవడంతో తల్లిదండ్రులు ఊరంతా వెతికారు. రాత్రి ఏడుగంటల సమయంలో వాగు పరిసరాల్లో వెతుకుతుండగా చిన్నారుల చెప్పులు కనిపించడంతో నీటి కుంటల్లో గాలించారు. ముగ్గురి మృతదేహాలు వెలికితీశారు. చిన్నారుల మృతితో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.



నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రం శివారులో ఉన్న బాలాజీ గోదాంలో శనివారం అర్ధరాత్రి దాటాక భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. అచ్చంపేట, కల్వకుర్తి అగ్నిమాపక సిబ్బంది శ్రమించి ఆదివారం మధ్యాహ్నం వరకు మంటల్ని అదుపుచేశారు. రూ.15 కోట్ల విలువ చేసే పత్తి పూర్తిగా దగ్ధమైంది. - నాగర్‌కర్నూల్ టౌన్



కాళేశ్వరం ప్రాజెక్టు ప్రారంభాన్ని పురస్కరించుకొని టీఆర్‌ఎస్ యూఎస్‌ఏ ఎన్‌ఆర్‌ఐ ప్రతినిధులు ఎర్రబెల్లి ప్రేమ్ చందర్ రావు, కాచం జ్ఞానేశ్వర్ ఆధ్వర్యంలో మిన్నెసోటాలో కేకు కోసి సంబురాలు జరుపుకొన్నారు. - సుబేదారి(వరంగల్)

## ఒకరి కోసం ఒకరు

### పరీక్ష రాస్తూ పట్టుబడిన ఇద్దరు

**కోదాడ అర్బన్:** ఒకరికి బదులు మరొకరు పరీక్ష రాస్తూ ఇద్దరు పట్టుబడ్డారు. నాగార్జున వర్సిటీ దూరవిద్య పరీక్షల్లో భాగంగా సూర్యాపేట జిల్లా కోదాడ సాయివికాస్ డిగ్రీ కళాశాల కేంద్రంలో ఆదివారం జరిగిన పరీక్షలో ఎండీ సాల్మన్ బదులు ఏపీలోని కృష్ణా జిల్లా మక్కపేటకు చెందిన అజ్మీరా వెంకటప్పయ్య బిజినెస్ కరస్పాండెన్స్ రిపోర్ రైటింగ్ పరీక్షను రాస్తుండగా, బీఎస్సీ ఫిజిక్స్ పరీక్షను కొమరాల తిరపమ్మకు బదులు కవిత అనే యువతి రాస్తూ పట్టుబడ్డారు.



వికారాబాద్ జిల్లా పరిగిలో ఆదివారం నిర్వహించిన పుస్తకావిష్కరణలో 'తెలంగాణ పద సంకీర్తనలు' గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న సాహిత్య అకాడమీ అధ్యక్షుడు నందిని సిధారెడ్డి. చిత్రంలో ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి. పుస్తక రచయిత డాక్టర్ పీ భాస్కరయోగి తదితరులు పాల్గొన్నారు.
- పరిగి నమస్తే తెలంగాణ



సూర్యాపేట జిల్లా కేంద్రంలో టీఆర్‌ఎస్ పార్టీ జిల్లా కార్యాలయ భవన నిర్మాణ స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి జగదీశ్ రెడ్డి

## నేడు సూర్యాపేట టీఆర్‌ఎస్ కార్యాలయానికి శంకుస్థాపన

స్థలంపరిశీలించిన మంత్రి జగదీశ్‌రెడ్డి

**సూర్యాపేట టౌన్ :** అన్ని జిల్లాకేంద్రాల్లో పార్టీ కార్యాలయాలను నిర్మించే కార్యక్రమంలో భాగంగా సోమవారం సూర్యాపేట జిల్లాకేంద్రంలో మంత్రి జగదీశ్‌రెడ్డి టీఆర్‌ఎస్ కార్యాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. స్థానిక ఎస్వీ ఇంజినీరింగ్ కళాశాల సమీపంలో ప్రభుత్వం ఎకరం కేటాయించగా, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశానుసారం మంత్రి భూమిపూజ చేయనున్నారు. ఈమేరకు ఆదివారం సాయంత్రం పార్టీ నాయకులతో కలిసి స్థలాన్ని మంత్రి పరిశీలించారు.



జగిత్యాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో ఆదివారం ఒకే కాన్పులో ముగ్గురు పిల్లలు జన్మించారు. మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం చింతపెల్లికి చెందిన అక్కల శిరీష ప్రసవం కోసం జగిత్యాల దవాఖానలో చేరింది. వైద్యులు ఆదివారం ఉదయం శస్త్రచికిత్స ద్వారా ప్రసవం చేయగా, ఇద్దరు మగ, ఒక ఆడ శిశువు జన్మించారు. తల్లీపిల్లలు ఆరోగ్యంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.
-జగిత్యాల అర్బన్/దండేపల్లి

## ప్రేమజంట ఆత్మహత్య

మూడు నెలల తర్వాత వెలుగులోకి..

**కోయిలకొండ :** ఇంట్లో పెళ్లికి అంగీకరించట్లేదని ఓ ప్రేమ జంట ఆత్మహత్య చేసుకోగా.. మూడు నెలల తర్వాత విషయం వెలుగులోకి వచ్చింది. పోలీసుల వివరాల ప్రకారం మహబూబ్‌నగర్ జిల్లా కోయిలకొండ మండలం రాంపూర్ గ్రామానికి చెందిన గొల్ల రవి (20), గొల్ల రాధిక (21) మహబూబ్‌నగర్‌లోని ఓ ప్రైవేటు కళాశాలలో డిగ్రీ చదువుతున్నా రు. వీరు కొద్ది రోజులుగా ప్రేమించుకుంటుండగా, విషయం ఇంట్లో తెలిసింది. దీంతో రవిని అతని తండ్రి వెంకటయ్య మందలించాడు. దీంతో కలిసి జీవించడం కష్టమని ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. మార్చి 23న రాంపూర్ శివారులో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. అయితే పిల్లలు కనిపించట్లేదని తల్లిదండ్రులు వేర్వేరుగా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆదివారం ఉదయం అటుగా వెళ్లిన మేకల కాపరులు చెట్టుకు వేలాడుతున్న మృతదేహాలను గమనించి పోలీసులకు సమాచారమిచ్చారు. దుస్తులు, సంఘటన స్థలంలో లభించిన సూసైడ్ నోట్ ఆధారంగా రవి, రాధికలుగా గుర్తించారు.

నమస్తే తెలంగాణ

# ధర్మగంట

మీ వద్ద ఉన్న సమాచారాన్ని పంపించాల్సిన చిరునామాలు

ధర్మగంట
నమస్తే తెలంగాణ,
8-2-603/1/7,8,9
రోడ్డు నంబర్ 10, బంజారాహిల్స్,
హైదరాబాద్-500034.
పై అడ్రస్‌కు పోస్టుద్వారా పంపించండి.

Whatsapp No.
9346979997

dharmaganta@ntnews.com
అడ్రస్‌కు ఈ-మెయిల్ చేయండి.

స్థానిక నమస్తే తెలంగాణ కార్యాలయంలో వివరాలు అందించండి.

/NTDAILYONLINE






బాధితురాలికి పాస్‌పుస్తకాన్ని అందజేస్తున్న వీఆర్వో

## వృద్ధురాలికి అందిన పాస్‌పుస్తకం

- 'పాస్‌బుక్ కోసం వృద్ధురాలి తిప్పలు' కథనానికి స్పందన
- భర్త పేరిట ఉన్న భూమిని బాధితురాలి పేర మార్చి ఇచ్చిన అధికారులు

**పాల్వంచ:** ఏప్రిల్ 23న ప్రచురితమైన 'నమస్తే తెలంగాణ'లో 'పాస్‌బుక్ కోసం వృద్ధురాలి తిప్పలు' శీర్షికతో ప్రచురితమైన కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించారు. ఆదివారం వృద్ధురాలికి పట్టాదారు పాస్‌పుస్తకం అందజేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మున్సిపాలిటీ పరిధిలోని శ్రీనివాసకాలనీకి చెందిన 80 ఏండ్ల వృద్ధురాలు దేవబత్తిన కాంతమ్మ భర్త సంజీవరావు మూడేండ్ల క్రితం మృతిచెందారు. భర్త పేరిట పాల్వంచలోని సర్వే నంబర్ 293/14లో ఉన్న 5 ఎకరాల భూమిని తన పేరుపై మార్చాలని రెవెన్యూ కార్యాలయం చుట్టూ కాళ్లరిగేలా మూడేండ్లుగా ప్రదక్షిణ చేస్తున్నారు. అధికారులు పనిచేయక పోవడంతో విసిగి వేసారిన బాధితురాలు 'ధర్మగంట'ను ఆశ్రయించారు. దీనిపై కథనం ప్రచురితం కావడంతో.. తాసిల్దార్ ప్రవీణ్‌కుమార్‌శర్మ స్పందించి ఆమె పేరుపై భూమి మార్చి పాస్‌పుస్తకంలో ఎక్కించారు. పాస్‌పుస్తకాన్ని ఆదివారం వీఆర్వో రామారావు బాధితురాలికి అందజేశారు. పాస్‌బుక్ అందడంపై వృద్ధురాలు, ఆమె కుటుంబసభ్యులు 'నమస్తే తెలంగాణ'కు కృతజ్ఞతలు తెలిపారు.

# ఒకే భూమి.. రెండు సర్వే నంబర్లు!

రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యంతో అక్రమార్కుల పాగా! ■ అసైన్డ్‌భూమి లబ్ధిదారులకు కొత్త చిక్కులు
తప్పును గుర్తించినా.. సరిదిద్దని రెవెన్యూ అధికారులు ■ రాజన్న సిరిసిల్ల జిల్లాలో వెలుగుచూసిన బాగోతం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ**

ఎక్కడైనా ఒక భూమికి ఒక సర్వే నంబర్ ఉంటుంది. కానీ రెవెన్యూ అధికారులు ఒకే భూమికి రెండు సర్వే నంబర్లు కేటాయించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా సిరిసిల్ల మండలంలోని రెండు గ్రామాల సరిహద్దుల్లో ఉన్న ఒకే భూమికి ఇటు పెద్దబోనాల గ్రామంలోనూ, అటు వెంకటాపూర్ గ్రామంలోనూ వేర్వేరు సర్వే నంబర్లు కేటాయించారు. రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం వల్ల ఇప్పుడది రెండు గ్రామాల రైతుల సమస్యగా మారింది. దీనిని ఆసరాగా చేసుకున్న భూ కబ్జాదారులు దానిని కబ్జా చేసేందుకు స్కెచ్‌వేశారు. దీనికి రెవెన్యూ అధికారులు కూడా పరోక్షంగా మద్దతు ఇవ్వడంతో సమస్య జఠిలంగా మారింది. పెద్దబోనాల గ్రామానికి చెందిన బాధిత రైతు కాంబోజి బుచ్చయ్య 'ధర్మగంట'ను ఆశ్రయించడంతో విషయం వెలుగులోకి వచ్చింది.

### మా భూమిలోకి మేం అడుగుపెట్టలేకపోతున్నాం

మాది పెద్దబోనాల గ్రామం. 164 సర్వే నంబర్‌లో నాకు, మా అన్నకు చెరో మూడు ఎకరాల భూమి ఉన్నది. దీనిని 1996లో అసైన్డ్‌ల్యాండ్ కింద మాకు ప్రభుత్వం ఇచ్చింది. గతేడాది వరకు అక్కడ సాగు చేస్తూ వస్తున్నాం. ఈ భూమికి సంబంధించిన పట్టాదారు పాస్‌పుస్తకం ఉన్నది. పహాణీలోనూ మా పేరిట నమోదై ఉన్నది. అదే భూమి మీద బ్యాంకులో రుణం తీసుకొన్నాం.. చెల్లించాం. ఉపాధి హామీ పథకం కింద మా భూమిలో పనులు కూడా జరిగాయి. కానీ భూరికార్డుల ప్రక్షాళన అనంతరం మాకు కొత్త పాస్‌పుస్తకం ఇవ్వలేదు. రైతుబంధు డబ్బులు కూడా రావడంలేదు. ఇదేంటని అడిగితే వీఆర్వో, తాసిల్దార్ నిర్లక్ష్యంగా వ్యవహరించారు. వీఆర్వో వెంకటస్వామిని అడిగితే.. 'గతేడాది నుంచి మీరు పొజిషన్‌లో లేరు.. అందుకే మీకు కొత్త పాస్‌పుస్తకం ఇవ్వడంలేదు' అంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారు. తాసిల్దార్ వద్దకు పలుమార్లు వెళ్లి అడిగాను. భూమి సరిహద్దు సమస్యలో ఉన్నదని, పరిష్కారం అయ్యేందుకు సమయం పడుతుందంటున్నారు. మా భూమిపై కబ్జాదారుల కన్ను పడటంతో ఏడాదిగా అందులో అడుగుపెట్టలేకపోతున్నాం.

**- కాంబోజి బుచ్చయ్య, రైతు, పెద్దబోనాల**

### త్వరలో పరిష్కరిస్తాం



ఇది రెండు మండలాల మధ్య సమస్య. రెండు మండల్లాలో ఒకే భూమికి వేర్వేరు సర్వే నంబర్లతో పట్టాలు జారీచేశారు. ఇది తప్పిదమే. ఇదే విషయం గురించి జిల్లా సర్వే అధికారికి ఫిర్యాదుచేశాం. త్వరలో సమస్య పరిష్కరిస్తాం. పట్టాదారు పాస్‌పుస్తకం ఎవరి పేరు మీద ఉంటే భూమి వాళ్లకే చెందుతుంది. జిల్లా కలెక్టర్ కూడా ఇదే చెప్పారు.

**- అంజన్న, సిరిసిల్ల తాసిల్దార్**

# కొనేముందు పట్టాభూమి.. కొన్నాక సీలింగ్ భూమి

- మెదక్ జిల్లా చిన్నశంకరంపేట రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం
- బోరుమంటున్న రిటైర్డ్ ఉపాధ్యాయుడు
- న్యాయం చేయాలంటూ ఉన్నతాధికారులకు విజ్ఞప్తి



**చిన్నశంకరంపేట:** రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం ఓ రిటైర్డ్ ఉపాధ్యాయుడిని నిండా ముంచింది. పట్టాభూమిని కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేసుకోగా.. రెవెన్యూ అధికారులు పట్టాచేయడం లేదు. పట్టా మార్పిడికి అనుకూలంగా ఉత్తర్వులు జారీచేసిన తాసిల్దార్ ప్రస్తుతం మాట మార్చారు. కొనుగోలు చేసిన భూమి సీలింగ్ పరిధిలోనిది అంటూ పట్టా మార్పిడికి నిరాకరించారు. ఇదే భూమిని గతంలో ముగ్గురి పేరు మీద పట్టా మార్పిడి చేశారని.. కానీ ప్రస్తుతం సీలింగ్‌భూమి అంటూ తనకు అన్యాయం చేస్తున్నారని బాధితుడు వాపోతున్నారు. మెదక్ జిల్లా చిన్నశంకరంపేట శివారులోని సర్వే నంబర్ 366/ఇలో చిన్నశంకరంపేటకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు కొమ్మూరి కిషన్ తూప్రాన్‌కు చెందిన పట్లోరి వెంకటరమణ వద్ద 2 ఎకరాల 6 గుంటల భూమిని కొనుగోలు చేసి దాన్ని 2016 సెప్టెంబర్ 15న జనాభాయి ఎడ్యుకేషన్ మెమోరియల్ సొసైటీ పేరున రిజిస్టర్ చేయించుకున్నారు. ఆ భూమి పట్టామార్పిడి కోసం రెవెన్యూ అధికారులకు దరఖాస్తు చేసుకున్నారు. కిషన్ కొనుగోలు చేసిన భూమిని కాస్తుకాలంలో నమోదుచేయాలని 12.10.2018న తాసిల్దార్ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా ఇప్పుడు అధికారులు మాట మార్చారు. సీలింగ్ భూమి కాబట్టి మార్పిడిచేయడం కుదరదని తేల్చిచెప్పారు. పట్టాభూమిని కొనుగోలు చేసినా.. భూమి తనకు దక్కకుండా రెవెన్యూ అధికారులు కుట్రపన్నుతున్నారని కిషన్ ఆవేదన వ్యక్తంచేశారు.

### సీలింగ్ భూమి కాబట్టే చేయలేదు

చిన్నశంకరంపేట గ్రామశివారులోని సర్వేనంబర్ 366/ఇ లో కిషన్ కొనుగోలు చేసిన భూమి సీలింగ్ పరిధిలోకి వస్తున్నది. అందుకే పట్టా చేయలేదు. భూములను కొనుగోలు చేసేముందే ప్రభుత్వ భూమా, లేక పట్టా భూమా అని చూసుకోవాల్సిన బాధ్యత భూమి కొనేవారిపైనే ఉంటుంది.

**- రాజేశ్వర్‌రావు, తాసిల్దార్**

# ఊర్లో లేరని ఇతరులకు పట్టా

- వారసత్వ భూమిని ఒక్కరికే ధారాదత్తం చేసిన అధికారులు
- రెండేండ్లుగా తాసిల్ చుట్టూ తిరుగుతున్న అన్నదమ్ములు

**హాలియా, నమస్తే తెలంగాణ:** నల్లగొండ జిల్లా పెద్దవూర మండలం తుంగతుర్తి గ్రామానికి చెందిన చెవిటి రాములుకు అంజయ్య, (ఆంజనేయులు), వెంకయ్య, సాంబయ్య కుమారులు. రాములుకు గ్రామంలోని సర్వే నంబర్ 156/1లో 1.20 ఎకరాలు, 571/1లో 4.24 ఎకరాలు, 155/4లో 23 గుంటలు, 573/1లో 4.07ఎకరాల పట్టా భూమి ఉన్నది. 16 ఏండ్ల క్రితం రాములు చనిపోయారు. దీంతో అన్నదమ్ములు ముగ్గురు వారసత్వ భూమిని 3.17 ఎకరాల చొప్పున పంచుకున్నారు. పట్టాదారు పాస్‌పుస్తకాలు కూడా తీసుకున్నారు. అయితే అంజయ్య, వెంకయ్య బతుకుదెరువుకోసం కొన్నేండ్ల నుంచి వేరే గ్రామంలో ఉంటున్నారు. ఇదే అదునుగా భావించిన రాములు పెద్ద కొడుకు సాంబయ్య రికార్డుల ప్రక్షాళన సమయంలో రెవెన్యూ అధికారుల సాయంతో మొత్తం భూమిని తన పేరుమీదకు మార్చుకున్నారు. విషయం తెలుసుకొన్న మిగిలిన ఇద్దరు అన్నదమ్ములు తమకు వారసత్వంగా వచ్చిన భూమిని అక్రమంగా అన్నపేరిట పట్టాచేశారని, తిరిగి తమ పేరుమీదకు మార్చాలని కోరుతూ అనేకసార్లు తాసిల్దార్‌కు దరఖాస్తు చేసుకొన్నారు. వీఆర్వో, తాసిల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడంలేదు. భూమి పట్టా రాకపోవడంతో తాము రైతుబంధు సాయంపొందలేకపోతున్నామని, రైతుబీమాకు అనర్హులమయ్యామని వారు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

### భూమి లేకుండాచేశారు



నాకు మా నాన్న నుంచి వారసత్వంగా 3.17 ఎకరాల భూమి వచ్చింది. దీనికి సంబంధించిన పాత పాస్‌పుస్తకాలు నా వద్దే ఉన్నాయి. కానీ రికార్డుల ప్రక్షాళన సమయంలో రెవెన్యూ అధికారులు కాసులకు కక్కుర్తి పడి నా భూమిని మా అన్నకు పట్టాచేశారు. అలాంటి అధికారులపై చర్యలు తీసుకొని నా భూమిని నాకు ఇప్పించాలి.

**- చెవిటి వెంకయ్య**

### అధికారులపై చర్య తీసుకోవాలి



మా తండ్రి నుంచి నాకు వారసత్వంగా 3.16 ఎకరాల భూమి వచ్చింది. దానిని మా అన్నకు అక్రమంగా పట్టాచేసిన రెవెన్యూ అధికారులపై చర్య తీసుకోవాలి. కాసులకు కక్కుర్తిపడి అధికారులు ఇష్టం వచ్చినట్టు భూములను రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. గ్రామంలో లేమనే కుంటిసాకుతో నా భూమిని మా అన్నకు పట్టాచేయడం సరి కాదు. ఉన్నతాధికారులు స్పందించి నా భూమిని నాకు ఇప్పించాలి.

**- చెవిటి అంజయ్య**

# సారూ.. పాస్‌బుక్‌లో ఎక్కించండి

- 6.25 ఎకరాలకు 20 గుంటలే నమోదు
- వారసత్వ భూమి పట్టా మార్పిడికి తంటాలు

**తిరుమలగిరి, నమస్తే తెలంగాణ:** రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం ముగ్గురు రైతులకు కష్టాలు తెచ్చిపెట్టింది. 6.25 ఎకరాల భూమికి బదులుగా 20 గుంటలే ఉన్నదని కొత్త పాస్‌బుక్‌లో నమోదుకావడంతో రైతుబంధు సాయం దూరమైంది. వారసత్వంగా రావాల్సిన భూమిని పట్టామార్పిడి చేసి తమకు ఇప్పించాలని విన్నవిస్తున్నా ఎవరూ పట్టించుకోవడంలేదని బాధిత రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలం జలాల్‌పురం గ్రామానికి చెందిన పెద్దసాయిలు 1988లో సర్వే నంబర్లు 76లో 2.20 ఎకరాలు, 399లో 20 గుంటలు, 401లో 3.25 ఎకరాలు మొత్తం 6.25 ఎకరాల భూమి కొనుగోలు చేశారు. నాటినుంచి సాగు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం సాదాబైనామాలతో పట్టామార్పిడికి అవకాశం కల్పించడంతో వారసుల పేరిట మార్చేందుకు దరఖాస్తు చేసుకున్నారు. తన కుమారుడైన సోమనర్సయ్య పేరిట 3.13 ఎకరాలు, తమ్ముడి కుమారులైన ఎల్లయ్య, కృష్ణ పేరిట మిగతా 3.12 ఎకరాలు పట్టా మార్పిడిచేయాలని అర్జీ పెట్టుకున్నారు. అధికారులు పెద్దసాయిలు కుమారుడు సోమనర్సయ్య పేరున 13బీ నమూనా ధ్రువపత్రాలు అందజేశారు. అందులో సర్వే నంబర్లు 76లో 1.10 ఎకరాలు, 399లో 10 గుంటలు, 401లో 35 గుంటలు మొత్తం 2.15 ఎకరాలు మాత్రమే నమోదుచేసినట్టు పత్రాలు ఇచ్చారు. కొత్త పాస్‌పుస్తకాల్లో మాత్రం సోమనర్సయ్యకు 10 గుంటలు, చిన్నాయన కుమారులైన ఎల్లయ్య పేరిట 5 గుంటలు, కృష్ణ పేరిట 5 గుంటలే ఎక్కించారు. మిగతా భూమిని పాస్‌పుస్తకంలో ఎక్కించకుండా అధికారులు ఇబ్బందులకు గురిచేస్తున్నారు. దీంతో రైతుబంధు సాయం కూడా కోల్పోతున్నామని బాధితులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. 'ధర్మగంట'తోనైనా తమ సమస్య పరిష్కారం కావాలని వేడుకొంటున్నారు. ఈ విషయమై జలాల్‌పురం వీఆర్వో అర్వపల్లిని వివరణ కోరగా.. మిగతా భూమి కూడా పాస్ పుస్తకాల్లో నమోదుచేస్తామని, గతంలో భూమి కూడా సర్వేచేసినట్టు తెలిపారు.



పాస్‌పుస్తకాలు చూపుతున్న సోమనర్సయ్య, కృష్ణ

### నా భూమిని మా అన్నకు పట్టాచేశారు



**హాలియా, నమస్తే తెలంగాణ:** నా పేరు పొలిశెట్టి నర్సింహ. మాది నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలం జిన్నాయిచింత గ్రామం. మా నాన్న పొలిశెట్టి చినరాములు పేరుతో చేపూరు శివారు సర్వే నంబర్ 1069లో 4 ఎకరాలు, సర్వే నంబర్ 1070లో 37 గుంటలు, సర్వే నంబర్ 1073లో ఎకరం పద్నాలుగు గుంటలన్నర, సర్వే నంబర్ 1077లో 2.25 ఎకరాల భూమి మా నాన్న పేరిట ఉన్నది. 2006న మా నాన్న చనిపోయారు. మేము నలుగురం అన్నదమ్ములం. మా నాన్న పేరిట ఉన్న భూమి నలుగురు కుమారులకు సమానంగా పంచగా.. నా వాటా కింద 2.9 ఎకరాలు రావాల్సి ఉన్నది. అయితే నేను కొన్నేండ్లుగా హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేసుకుంటూ జీవిస్తున్నాను. 2012లో రెవెన్యూ అధికారులు నా వాటా భూమిని కూడా మా అన్న పొలిశెట్టి యాదగిరి పేరిట అక్రమంగా పట్టాచేశారు. వారసత్వ భూమిని నలుగురు కుమారులకు సమానంగా పట్టాచేయాల్సి ఉండగా, ఒక్కరికే ఎక్కువ భూమిని పట్టాచేయడంతో నాకు గుంట భూమి కూడా లేకుండా పోయింది. మా నాన్న నుంచి వారసత్వంగా నాకు రావాల్సిన 2.9 భూమిని నా పేరా పట్టాచేయాలని కోరుతూ రెండేండ్లుగా రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదు. ఈ విషయంపై హైదరాబాద్ పరిపాలన విభాగంలో, జిల్లా కలెక్టర్‌కు, ఆర్డీవోకు, గుర్రంపోడు తాసిల్దార్‌కు పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. చివరికి న్యాయం కోసం ధర్మగంటను ఆశ్రయించా.

## పాస్‌పుస్తకాలు ఇస్తలేరు

- నాగర్‌కర్నూల్ జిల్లా మర్రిపల్లి రైతుల ఆవేదన

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తాత, ముత్తాల నుంచి వారసత్వంగా వస్తున్న భూములకు రెవెన్యూ అధికారులు పాస్‌పుస్తకాలు ఇవ్వడం లేదని నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండలం మర్రిపల్లి గ్రామానికి చెందిన గోరటి అయ్యప్ప, నూనే ఎల్లయ్య, మారెటి మల్లయ్య ధర్మగంటను ఆశ్రయించారు. గోరటి అయ్యప్పకు సర్వే నంబర్ 717లో 3.5 ఎకరాల భూమి ఉన్నది. నూనే ఎల్లయ్యకు సర్వే నంబర్ 677/3లో, మారెటి మల్లయ్యకు సర్వే నంబర్ 657లో కొంత భూమి ఉన్నదన్నారు. ఎన్నిసార్లు రెవెన్యూ అధికారుల చుట్టూ తిరిగినా పట్టించుకోవడంలేదని బాధితులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చొరవతీసుకొని తమకు న్యాయంచేయాలని కోరుతున్నారు.

## ఏడాదిగా తిరుగుతున్న..



నా పేరు రావుల బాలమ్మ. నాకు నల్లగొండ జిల్లా హాలియా మండలం అనుములవారిగూడెంలోని సర్వే నంబర్ 337/1లో 27 గుంటలు, 337/2లో 2.27 ఎకరాలు, 338/1లో 36 గుంటలు, 338/2లో 1.27 ఎకరాలు, సర్వే నంబర్ 342/1లో 10 గుంటలు, సర్వే నంబర్ 342/2లో 10 గుంటలు.. మొత్తం 6.17 ఎకరాల భూమి ఉన్నది. నా భూమికి సంబంధించిన పాత పట్టాదారు పాస్‌పుస్తకం, టైటిల్‌డీడ్ ఉన్నాయి. ఇప్పుడు కూడా ఆన్‌లైన్‌లో భూమి నా పేరు మీదనే ఉన్నది. నాకు రైతుబంధు పథకం ద్వారా డబ్బులు కూడా ఇస్తున్నరు. కానీ కొత్త పాస్‌పుస్తకం మాత్రం ఇవ్వడంలేదు. ఏడాదిగా వీఆర్వో, తాసిల్దార్‌ను ఎన్నిసార్లు అడిగినా చూద్దాంలే, వస్తదిలే, ఇద్దాంలే.. అని సమాధానం ఇస్తున్నరు. కానీ ఇంతవరకు పాస్‌పుస్తకం అందలేదు. కార్యాలయం చుట్టూ తిరగడానికి నాకు మగదిక్కు లేరు. ఉన్నది ఇద్దరు కుమార్తెలే.. పంట పెట్టుబడికోసం బ్యాంకులో కాగితాలు పెట్టి రుణం తీసుకుందామంటే వాళ్లు కొత్త పాస్‌పుస్తకం అడుగుతున్నరు. అందుకే అధికారుల చుట్టూ తిరుగుతున్నా ముసలిదాన్ని అని కూడా కనికరం చూపుతలేరు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కొత్త పాస్‌పుస్తకం ఇవ్వాలని కోరుతున్న.

## నా భూమిని మరొకరికి పట్టాచేశారు



నా పేరు దుర్గం రమేశ్. నాకు కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా, కెరమెరి మండలం, ఇందాపూర్ గ్రామం. గ్రామంలోని సర్వే నంబర్ 45/2లో 2.19 ఎకరాల భూమి నా పేరు మీద ఉన్నది. అయినా తాసిల్దార్ ఆ భూమిని వేరే వారి పేరు మీదకు మార్చి పట్టాచేసిచ్చారు. అదేమిటని తాసిల్దార్‌ను అడిగితే నాకు వేరే భూమిని చూపుతానని మాటలు చెప్తున్నారు. న్యాయం కోసం తాసిల్ కార్యాలయం చుట్టూ తిరిగినా ఫలితం దక్కడంలేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నాకు న్యాయంచేయాలని కోరుతున్నాను.

**- దుర్గం రమేశ్, ఇందాపూర్, కెరమెరి మండలం, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా**

# అమాయకుణ్ణి ఆగం చేస్తున్నరు

- తమ్ముడి భూమిపై కన్నేసిన అన్నలు
- బతికుండగానే చనిపోయాడంటూ రికార్డుల్లో పేరు మార్పు
- కాళ్లరిగేలా తిరిగినా కనికరించని రెవెన్యూ అధికారులు
- భూమి కోసం సిరిసిల్ల జిల్లావాసి రామస్వామి నిరీక్షణ



తండ్రి నుంచి సంక్రమించిన భూమికోసం తోడపుట్టిన తమ్ముడు మరణించాడంటూ తప్పుడుపత్రాలు సృష్టించారు ఇద్దరు అన్నలు. తమ్ముడు అమాయకుడు కావడం, భూమికి కోట్లల్లో రేటు పెరగడంతో దానిపై కన్నేసిన అన్నలు కాజేయాలని చూశారు. రోజువారీ కూలిచేస్తేనే గానీ పూట గడువని తమ్ముడు తనకున్న కొద్దిపాటి భూమితో కూతురు పెండ్లి చేయాలనుకుంటే.. అన్నలిద్దరూ అతణ్ణి ముప్పతిప్పలు పెడుతున్నారు. అన్నలు ఇచ్చిన తప్పుడు పత్రాలను చూసి కనీసం విచారణచేయకుండా పహాణీలో పేరు మార్చారు రెవెన్యూ అధికారులు. నేను బతికే ఉన్నానని మొరపెట్టుకున్నా అధికారులు పట్టించుకోలేదు. చివరికి బాధితుడు ధర్మగంటను ఆశ్రయించారు.

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** 'నా పేరు మామిడి రామస్వామి. మాది సిరిసిల్ల జిల్లా, ఇల్లంతకుంట. అదే గ్రామంలో నాకు సర్వే నంబర్ 205/ఇలో 16 గుంటలు, సర్వే నంబర్ 208/ఇలో 37 గుంటలు, సర్వే నంబర్ 191లో గుంట భూమి ఉన్నది. ఈ భూమి మా తండ్రి మామిడి మల్లయ్య నుంచి నాకు వారసత్వంగా సంక్రమించింది. మా తండ్రికి ఆరుగురు సంతానం. ముగ్గురు కూతుర్లు, ముగ్గురు కొడుకులు. కుమారుల్లో నేనే చిన్నవాడిని. మా తండ్రి పేరిట పన్నెండు ఎకరాల భూమి ఉండేది. మా తండ్రి 45 ఏండ్ల క్రితమే మరణించారు. ఆయన మరణాంతరం ఆయన పేరిట ఉన్న 12 ఎకరాల భూమిలో నుంచి కొంత భూమిని మా అన్నలు నర్సయ్య, బాలమల్లు అమ్ముకొన్నారు. మిగిలిన భూమిని పంచుకోగా ఒక్కొక్కరికి 1.14 ఎకరాల చొప్పున వచ్చింది. ఆ భూమి విరాసత్ ద్వారా మా ముగ్గురు అన్నదమ్ముల పేరిట రికార్డుల్లో నమోదైంది. దీనికి సంబంధించిన పాస్‌పుస్తకాలు కూడా మంజూరయ్యాయి. మా తండ్రి మరణించే సమయానికి నా వయసు 12 ఏండ్లు. మా తండ్రి మరణించాక మా అన్నలు నన్ను ఇబ్బందులకు గురిచేయడంతో హైదరాబాద్‌లో కూలిపని చేసుకొంటున్న. దీంతో నా పేరిట వచ్చిన పాస్‌పుస్తకం కూడా మా అన్నలే తీసుకొన్నరు. కొన్నేండ్లకు తిరిగి ఇల్లంతకుంటకు వెళ్లగా మా అన్నలు ఆదరించారు. కొద్ది రోజులు వాళ్లతో ఉండి తిరిగి హైదరాబాద్‌కు వచ్చా. ఈ క్రమంలో భూమి గురించి అన్నలను అడుగగా, 'నీ భూమి ఎక్కడికీ పోదు. నీది నీకే ఉంటుంది' అని నమ్మబలికారు. నా భూమి చేసుకుంటున్నందుకు కౌలుగా కొంత డబ్బు కూడా ఇచ్చారు. ఆ తర్వాత హైదరాబాద్‌లోనే ఒక మహిళతో నాకు వివాహం జరిగింది. మాకు ఒక కూతురు జన్మించింది. కొన్నేండ్ల తర్వాత నా భార్య మరణించింది. దీంతో ఏ ఆధారం లేక అన్నల దగ్గరికి వెళ్లి నాకు రావాల్సిన భూమి గురించి అడిగా. 'నీకు భూమి ఎక్కడిది.. భూమి లేదు ఏం లేదు' అని జవాబిచ్చారు. గ్రామస్థుల సమక్షంలో పంచాయితీ పెట్టినా నా పైనే దాడికి పాల్పడ్డారు. నా భూమి గురించి రెవెన్యూ కార్యాలయంలో విచారిస్తే 2017 వరకు పహాణీల్లో నా పేరే కొనసాగింది. భూరికార్డుల ప్రక్షాళనలో నేను మరణించినట్టు రికార్డుల్లోకి ఎక్కించి, మా అన్నలు అక్రమంగా వారి పేరిట నమోదు చేయించుకున్నారు. ఇదెలా జరిగిందని తెలుసుకోగా గ్రామంలో నా పేరుతో మరో వ్యక్తి ఉన్నారు. కానీ ఆయన తండ్రి పేరు ఎల్లయ్య. మా తండ్రి పేరు మల్లయ్య. నా పేరుతో ఉన్న వ్యక్తి మరణించడంతో మా అన్నలు నేనే మరణించానని తప్పుడు పత్రాలు సృష్టించి, నా భూమిని అక్రమంగా తమ పేరిట మార్చుకున్నారు. ఈ విషయంపై మా అన్నలను ప్రశ్నించగా నాపైనే దాడిచేశారు. ఇల్లంతకుంట మండలకేంద్రం కావడంతో భూమి రేటు కోట్లకు పెరిగింది. అందుకే నా భూమిని కాజేయాలని ప్రయత్నిస్తున్నారు. అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదుచేసినా రేపు మాపంటూ తిప్పుకుంటున్నరు. కానీ పనిచేస్తలేరు. నేను పేదవాణ్ణి. కూతురు పెండ్లి చేసే ఆర్థిక స్థోమత కూడా నాకు లేదు. ఆ భూమి ఉంటేనే నా కూతురు పెండ్లి చేయగలుతాను. ఇప్పటికైనా రెవెన్యూ ఉన్నతాధికారులు విచారణచేసి నా భూమిని నాకు ఇప్పించాలి' అని బాధితుడు రామస్వామి వేడుకొన్నారు.

### ఆర్డీవోకు అప్పీల్ చేసుకోవాలి

నేను తాసిల్దార్‌గా వచ్చి కొద్దిరోజులే అవుతున్నది. 1997లోనే సాదాబైనామా ఆధారంగా రామస్వామి అన్నల పేరిట ప్రొసీడింగ్ మంజూరైనట్టు రికార్డులో ఉన్నది. దానిని 2017 ఎల్లార్‌ఈపీలో ఆ ప్రొసీడింగ్‌ను అమలుచేశారు. 2017లో ఉన్న అధికారులు ఏ విధంగా చేశారో తెలియదు. రామస్వామి తన దగ్గరున్న ఆధారాలు తీసుకొస్తే ఆర్డీవోకు అప్పీల్ చేస్తాం. రామస్వామి ఆర్డీవో దగ్గర అప్పీల్ చేస్తే, ఆర్డీవో ఆదేశిస్తే సర్వేచేసి రామస్వామికి రావాల్సిన భూమిని రికార్డులో నమోదుచేస్తాం.

**- రాజు, ఇల్లంతకుంట తాసిల్దార్**

## పర్స్ కొట్టేసిన ఎయిర్ ఇండియా రీజనల్ డైరెక్టర్


రోహిత్ బాసిన్

సస్పెండ్ చేసిన విమానయాన సంస్థ

**న్యూఢిల్లీ, జూన్ 23:** ఎయిర్‌పోర్టులోని ఓ దుకాణంలో చోరీకి పాల్పడిన ఎయిర్ ఇండియా రీజనల్ డైరెక్టర్ (తూర్పు), కెప్టెన్ రోహిత్ బాసిన్‌ను ఆ సంస్థ సస్పెండ్ చేసింది. ఈ సంస్థకు చెందిన విమానం శనివారం ఆస్ట్రేలియాలోని సిడ్నీ విమానాశ్రయం నుంచి ఢిల్లీకి ప్రయాణించాలి. అయితే ఈ విమానం బయలుదేరడానికి ముందు విమానాశ్రయంలోని ఓ దుకాణంలో బాసిన్ పర్స్(వ్యాలెట్)ను దొంగిలించాడు. ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించిన ఎయిర్ ఇండియా సంస్థ వెంటనే అతడిని విధుల నుంచి సస్పెండ్ చేసింది. ఆస్ట్రేలియాకు చెందిన రీజనల్ మేనేజర్ ఇచ్చిన సమాచారం మేరకు బాసిన్‌పై చర్యలు తీసుకున్నామని తెలిపింది. వెంటనే గుర్తింపుకార్డును సెక్యూరిటీ సిబ్బందికి అందజేయాలని, అనుమతి లేకుండా ఎయిర్ ఇండియా సంస్థ పరిసరాల్లోకి ప్రవేశించరాదని ఆదేశించింది. బాసిన్ బాధ్యతలను మరో రీజనల్ డైరెక్టర్ అయిన సంజయ్ మిశ్రాకు అప్పగించినట్లు ఎయిర్ ఇండియా పేర్కొంది.


రవీశ్ కుమార్

## అమెరికా నివేదికపై భారత్ తీవ్ర అసంతృప్తి

పౌరుల హక్కులు, మతస్వేచ్ఛపై ప్రశ్నించే అధికారం లేదని వ్యాఖ్య!

**న్యూఢిల్లీ, జూన్ 23:** దేశంలో మైనార్టీలపై దాడులు విపరీతంగా పెరిగాయని పేర్కొంటూ అమెరికాకు చెందిన ఇంటర్నేషనల్ రిలీజియస్ ఫ్రీడమ్ అనే సంస్థ విడుదల చేసిన నివేదికను భారత్ ఖండించింది. భారత రాజ్యాంగం దేశ ప్రజలకు కల్పించిన హక్కులపై, మతస్వేచ్ఛపై ప్రశ్నించే అధికారం విదేశీ సంస్థలకు, ప్రభుత్వాలకు లేదని అసంతృప్తి వ్యక్తం చేసింది. 2018లో భారతదేశంలో మైనార్టీల మత స్వేచ్ఛకు తీవ్ర భంగం ఏర్పడిందని, హిందూమత వ్యాప్తి కోసం కొన్ని సంస్థలు గోహత్య నెపంతో మైనార్టీలపై దాడులకు పాల్పడ్డాయని, ముఖ్యంగా ముస్లింలపై ఈ దాడులు అధికంగా జరిగాయని ఇంటర్నేషనల్ రిలీజియస్ ఫ్రీడమ్ నివేదిక పేర్కొంది. సదరు నివేదికపై భారత విదేశాంగ శాఖ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. 'ఇక్కడి లౌకిక విధానాలు దేశానికే గర్వకారణం. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంలో విభిన్న ప్రజలు సహనం, సౌభ్రాతృత్వంతో కలిసిమెలసి జీవిస్తున్నారు. భారత రాజ్యాంగం కల్పించిన హక్కులన్నీ అన్ని మతాల ప్రజలకు కల్పిస్తూ.. మాత స్వేచ్ఛను కాపాడుతున్నాం' అని భారత విదేశాంగశాఖ అధికార ప్రతినిధి రవీశ్ కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మైనార్టీలతో సహా దేశంలోని పౌరులందరికీ రాజ్యాంగం ప్రసాదించిన ప్రాథమిక హక్కులను తమ ప్రభుత్వం పరిరక్షిస్తుందని ఆయన వివరించారు. దేశ ప్రజలకు రాజ్యాంగం కల్పించిన హక్కులపై, మతస్వేచ్ఛపై ప్రశ్నించే అధికారం విదేశీ సంస్థలకు, ప్రభుత్వాలకు లేదని ఆయన పేర్కొన్నారు.



# ఇథియోపియా ఆర్మీచీఫ్ కాల్చివేత

కాల్చి చంపిన బాడీగార్డ్

రాష్ట్ర అధ్యక్షుడినీ హత్య చేసిన దుండగులు

అంహారా రాష్ట్ర ప్రభుత్వాన్ని కూల్చే కుట్ర!

**అడిస్ అబాబా:** ఇథియోపియాలో మళ్లీ ఘర్షణలు చెలరేగాయి. ఉత్తర ఇథియోపియాలో ఓ రాష్ట్ర ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు పన్నిన కుట్రలో భాగంగా ఇథియోపియా ఆర్మీ చీఫ్‌తో పాటు రాష్ట్ర అధ్యక్షుడిని దుండగులు కాల్చి చంపారు. ఇథియోపియాలోని తొమ్మిది స్వయం ప్రతిపత్తి రాష్ట్రాల్లో ఒకటైన అంహారాలో శనివారం మధ్యాహ్నం ఉన్నతాధికారుల సమావేశంపై దుండగులు దాడికి తెగబడడంతో తాజా ఘర్షణలు చెలరేగాయని ప్రధాని కార్యాలయం ఆదివారం వెల్లడించింది. ప్రాంతీయ సెక్యూరిటీ చీఫ్ అసామిన్యూ జిగే ఈ కుట్రకు నేతృత్వం వహించారని, దుండగుల కాల్పుల్లో రాష్ట్ర అధ్యక్షుడు అబాచ్యూ మెకొన్నెన్, ఆయన సలహాదారు ప్రాణాలు కోల్పోయారని ప్రభుత్వ అధికార ప్రతినిధి బిలెన్ సెయూమ్ తెలిపారు. రాష్ట్ర అటార్నీ జనరల్ గాయపడ్డారని చెప్పారు. కొన్ని గంటల తర్వాత దేశ సైనిక అధిపతి సియారె మెకొన్నెన్ దేశ రాజధాని అడిస్ అబాబాలోని తన నివాసంలో తన బాడీగార్డ్ చేతిలోనే హత్యకు గురయ్యారని వెల్లడించారు. అలాగే అక్కడకు వచ్చిన రిటైర్డ్ జనరల్ పైనా కాల్పులు జరుపడంతో ఆయన కూడా చనిపోయారని చెప్పారు. కాల్పులకు పాల్పడిన బాడీగార్డును అరెస్ట్ చేశారని, అయితే కుట్రకు నేతృత్వం వహించిన అసామిన్యూ ఇంకా పరారీలో ఉన్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం అంహారాలో పరిస్థితి పూర్తిగా అదుపులో ఉన్నదని ప్రధాని కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. రెండు దాడులకు గల సంబంధం, ఉద్దేశం తెలియరాలేదు.

**జాతుల మధ్య వైరాలు..**

శనివారం సాయంత్రం నుంచి దేశవ్యాప్తంగా ఇంటర్నెట్ సేవలను నిలిపివేశారు. అడిస్ అబాబాలో కాల్పులు, అంహారా ప్రాంతీయ రాజధాని బహిర్ దార్‌లో ఘర్షణల నేపథ్యంలో అమెరికా అక్కడి తమ పౌరులను హెచ్చరించింది. అంహారా ప్రాంతం.. అంహారా జాతికి కేంద్రం. తమ దేశానికి చెందిన చాలా మంది చక్రవర్తులకు, జాతీయ భాష అయిన అంహరిక్‌కు పుట్టినిల్లు. ఓరోమో జాతి ప్రజల తర్వాత అంహారా జాతి ప్రజలే దేశ జనాభాలో అత్యధికం. ఈ రెండు జాతులు చేపట్టిన ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనలతోనే మాజీ ప్రధాని డెసాల్గన్ దిగిపోవాల్సి వచ్చింది. ఒరోమో జాతికి చెందిన అబియ్ గతేడాది ఏప్రిల్‌లో ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత దేశంలో సంస్కరణలకు బాటలు పరిచారు. ఆర్థిక సంస్కరణలకు తెరతీస్తూ అసంతృప్తులను తిరిగి దేశానికి రప్పించారు. హక్కుల ఉల్లంఘనలపై ఉక్కుపాదం మోపారు. పలువురు మిలిటరీ, నిఘా అధికారులను అరెస్ట్ చేయించారు. పొరుగునున్న ఎరిత్రియాతో శాంతి ఒప్పందం కుదుర్చుకున్నారు. అయితే పగ్గాలు వదులు చేయడంతో దేశంలో అశాంతికి కూడా దారితీసింది. 1991లో మిలిటరీ ప్రభుత్వాన్ని గద్దెదించిన తర్వాత ఇథియోపియన్ పీపుల్స్ రెవెల్యూషనరీ డెమొక్రటిక్ ఫ్రంట్ (ఈపీఆర్‌డీఎఫ్) 1995లో రాజ్యాంగాన్ని రూపొందించింది. దీని ప్రకారం దేశాన్ని ఎనిమిది స్వయం ప్రతిపత్తి ప్రాంతాలుగా విభజించారు. ఈపీఆర్‌డీఎఫ్ కూడా నాలుగు పార్టీల కూటమి. 2020లో ఎన్నికలు నిర్వహించేందుకు అబియ్ ప్రణాళికలు రచిస్తుండడంపై ప్రాంతీయ రాజకీయ పార్టీల్లో ఆగ్రహం వ్యక్తమవుతున్నది. 'జాతి'యవాదం తెరపైకి వస్తున్నది. అదే సమయంలో భూమి, వనరులపై దీర్ఘకాలికంగా ఉన్న ఆందోళనలు ఊపందుకున్నాయి. జాతుల మధ్య ఘర్షణలతో సుమారు 10 లక్షల మంది వలస వెళ్లినట్లు అంచనా. ఈపీఆర్‌డీఎఫ్ బలహీనపడుతుండడం, వివిధ వర్గాలు దీన్ని తమకు అనుకూలంగా మలుచుకునేందుకు ప్రయత్నిస్తుండడమే ప్రస్తుత పరిస్థితికి కారణమని విశ్లేషకులు చెబుతున్నారు. 2009లో సాయుధ ప్రతిపక్ష గ్రూప్ 'గిన్‌బాట్ 7' కుట్రకు పాల్పడిన సమయంలో అరెస్టయిన సెక్యూరిటీ చీఫ్ అసామిన్యూ 2018లో విడుదలయ్యారు.


ఇథియోపియా రాజధాని అడిస్ అబాబాలోని మెస్కల్ స్క్వేర్ వద్ద భద్రతా బలగాల పహారా


ఇథియోపియా ఆర్మీ చీఫ్ మెకొన్నెన్

# దీదీకి 'కమీషన్ల' చిక్కులు!

టీఎంసీ నేతలు లంచం సొమ్మును ప్రజలకు తిరిగిచ్చేయాలన్న మమత

నేతలపై రాష్ట్రవ్యాప్తంగా వెల్లువెత్తుతున్న ఫిర్యాదులు

దోపిడీ నిజమేనని రుజువైందంటున్న ప్రతిపక్షాలు

అసెంబ్లీ ఎన్నికల్లో తృణమూల్‌కు కష్టాలు తప్పవంటున్న విశ్లేషకులు



**కోల్‌కతా, జూన్ 23:** తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ చిక్కులను కొని తెచ్చుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారుల నుంచి వసూలు చేసిన డబ్బును తిరిగి ఇచ్చేయాలని సొంతపార్టీ నేతలకు ఆమె ఆదేశాలివ్వడం అధికార పార్టీని ఇబ్బందుల్లోకి నెట్టింది. సీఎం ఆదేశాల తర్వాత.. భూమి లేని రైతుల నుంచి వ్యాపారవేత్తల వరకు వందలాది మంది ప్రజలు తమ వద్ద నుంచి డబ్బు తీసుకున్న అధికార పార్టీ నేతల పేర్లను బహిరంగంగానే చెబుతున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో 2020లో జరిగే పురపాలక ఎన్నికలు, 2021లో రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో తృణమూల్ పార్టీకి కష్టాలు తప్పవని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ నెల 18న కోల్‌కతా పురపాలక సంస్థ నేతలతో సమావేశమైన దీదీ.. సామాన్య ప్రజల నుంచి వసూలు చేసిన డబ్బును తిరిగి ఇచ్చేయాలని పార్టీ నేతలను ఆదేశించారు. కొంతమంది టీఎంసీ నేతలు చనిపోయిన వారిని కూడా వదలడం లేదని, అంత్యక్రియల నిమిత్తం బాధిత కుటుంబ సభ్యులకు ప్రభుత్వం అందించే రూ.2000 విడుదల చేసేందుకు రూ.200 కమీషన్‌గా తీసుకుంటున్నారని ఆరోపించారు. నిర్మల్ బంగ్లా ప్రాజెక్ట్‌లో మాజీ గ్రామ పంచాయతీ ప్రధాన్ సుకేశ్ ప్రధాన్ రూ.కోటి నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారని ఆరోపిస్తూ ప్రజలు ఆందోళనకు దిగడంతో పోలీసులు అతడిని అరెస్ట్ చేయాల్సి వచ్చింది.

**వెల్లువెత్తుతున్న ఆరోపణలు**

అధికార పార్టీ నేతలపై అవినీతి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అన్ని జిల్లాల్లోనూ ప్రతి రోజు ఆందోళన కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిలో పంచాయతీ సభ్యుల నుంచి, రాజ్యసభ ఎంపీ వరకు ఉన్నారు. అవినీతి ఆరోపణల నేపథ్యంలో రాజ్‌పూర్-సోనార్‌పూర్ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ శాంత సర్కార్‌ను టీఎంసీ శనివారం తొలిగించింది. ప్రధానమంత్రి ఆవాస్ యోజన, నిర్మల్ బంగ్లా ప్రాజెక్ట్ నిధులను దుర్వినియోగం చేశారని ఆరోపిస్తూ బీర్భమ్ జిల్లా సైంతియా గ్రామ పంచాయతీ సభ్యుడి నివాసం ఎదుట గ్రామస్తులు ఆందోళనకు దిగారు. ఉపాధి కూలీ సొమ్మును నొక్కేసిన పౌరీ గ్రామ పంచాయితీ ప్రధాన్‌ని అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ ఆ గ్రామ ప్రజలు నిరసన చేపట్టారు. అయితే ఈ ఆందోళనల వెనుక బీజేపీ హస్తముందని టీఎంసీ నేతలు ఆరోపిస్తున్నారు. 2012-18 మధ్య.. నాటి టీఎంసీ కౌన్సిలర్, ప్రస్తుత రాజ్యసభ ఎంపీ, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ శంతను సేన్‌కు తాను రూ.40 లక్షలు ముట్టజెప్పినట్లు కోల్‌కతాకు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి సుమంత చౌధరి శుక్రవారం ఆరోపించారు. అయితే ఈ ఆరోపణలను శంతను సేన్ ఖండించారు. వ్యాపారిపై పరువునష్టం దావా వేస్తానని హెచ్చరించారు.

### ప్రతిపక్షాల పని సులువు చేశారు..

'టీఎంసీ నేతలు దోపిడీ చేస్తున్నారని ప్రధాని మోదీ చేసిన ఆరోపణలు నిజమేనని తాజా ఘటనలు రుజువు చేస్తున్నాయి. ప్రతిపక్షాల పనిని ముఖ్యమంత్రి మరింత సులువు చేశారు' అని రాజకీయ విశ్లేషకులు సువశిస్ మైత్ర అభిప్రాయపడ్డారు. 'అవినీతిని వ్యవస్థీకృతం చేసి, ఇప్పుడేమో తానొక్కదాన్నే నిజాయితీగల నాయకురాలిగా తనకుతానుగా చిత్రీకరించుకునేందుకు మమత యత్నిస్తున్నారు. దోపిడీకి వ్యతిరేకంగా సొంత పార్టీ ఎంపీ కబీర్ సుమన్ మాట్లాడినప్పుడు ఆమె ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దోపిడీలో టీఎంసీలోని ప్రతి ఒక్కరికీ భాగముందని అందరికీ తెలుసు' అని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు ఎండీ సలీం విమర్శించారు. 'కాలేజీ అడ్మిషన్ దగ్గర నుంచి మరుగుదొడ్డి నిర్మాణం వరకు ప్రతిదానికీ ప్రజలు టీఎంసీ నేతలకు కమీషన్లు ఇవ్వాల్సి వస్తున్నది' అని బెంగాల్ బీజేపీ అధ్యక్షుడు దిలీప్ ఘోష్ ఆరోపించారు. కాగా, దీదీ అనుచరుడైన ప్రముఖ బెంగాలీ గాయకుడు నచికేత చక్రవర్తి.. కమీషన్లపై తాను రూపొందించిన కొత్త పాటను యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేశారు. అయితే ఇందులో 'దీదీ' అని ఉండడం గమనార్హం. అయితే దేశవ్యాప్తంగా ఉన్న అవినీతికి సంబంధించినది ఈ పాట అని, తానెప్పటికీ దీదీ అనుచరుడినేని చక్రవర్తి పేర్కొన్నాడు.

## బంధువులకు అందలం

మాయావతి తమ్ముడు ఆనంద్, అల్లుడు ఆకాశ్‌కు పార్టీలో కీలక పదవులు

లోక్‌సభలో బీఎస్పీ నేతగా దానిశ్ అలీ నియామకం

**లక్నో:** వారసత్వ రాజకీయాలను వ్యతిరేకించే అధినేత్రి మాయావతి.. రూట్ మార్చారు. తన బంధువులకు పార్టీలో కీలక పదవులను కట్టబెట్టారు. తమ్ముడు ఆనంద్‌కుమార్‌ను పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడిగా, అల్లుడు ఆకాశ్ ఆనంద్ (24)ను జాతీయ సమన్వయకర్తగా నియమిస్తూ ఆదివారం జరిగిన పార్టీ కార్యవర్గ భేటీలో నిర్ణయించారు. లోక్‌సభలో బీఎస్పీ నేతగా దానిశ్ అలీని, నగీనా ఎంపీ గిరీశ్ చంద్రను లోక్‌సభలో పార్టీ చీఫ్ విప్‌గా నియమించారు. రెండేండ్ల క్రితం చెప్పినట్లే ఆకాశ్‌ను పార్టీ జాతీయ సమన్వయకర్తగా నియమించిన మాయావతి.. త్వరలో జరిగే 12 అసెంబ్లీ స్థానాల ఉప ఎన్నికలపై దృష్టి సారించారు. ఈ సమావేశంలో మాయావతి మాట్లాడుతూ బీజేపీ ప్రతిపాదిత 'ఒకే దేశం, ఒకే ఎన్నిక' ఆలోచన వెనుక ఒకేసారి ఈవీఎంలను తారుమారు చేసి అన్ని ఎన్నికల్లో గెలుపొందాలన్న ఆలోచన దాగి ఉన్నదని ఆరోపించారు. ఈవీఎంల ద్వారా ప్రజాస్వామ్యం హైజాకింగ్‌కు బీజేపీ ప్రయత్నిస్తున్నదన్నారు. కాగా, మాయావతి తన బంధువులకు పార్టీలో కీలక పదవులు కట్టబెట్టడాన్ని బీజేపీ ఆక్షేపించింది. కాంగ్రెస్, ఎస్పీ, బీఎస్పీ.. కుటుంబపార్టీలేనని అవి దేశానికి, ప్రజలకు గానీ ప్రాతినిధ్యం వహించడంలేదని ఉత్తర్‌ప్రదేశ్ డిప్యూటీ సీఎం కేపీ మౌర్య విమర్శించారు.


ఆనంద్‌కుమార్... ఆకాశ్ ఆనంద్

## బీఎస్పీ ఎంపీ అతుల్‌రాయ్‌పై కేసు

తప్పుడు అఫిడవిట్ సమర్పించినందుకే..

**మావ్ (యూపీ), జూన్ 23:** ఎన్నికల సందర్భంగా తప్పుడు అఫిడవిట్ సమర్పించినందుకు బీఎస్పీ ఎంపీ అతుల్‌రాయ్‌పై జిల్లా సహాయ ఎన్నికల అధికారి షబ్బీర్ అహ్మద్ కేసు నమోదు చేశారు. అతనిపై మొత్తం 24 కేసులుండగా.. అఫిడవిట్‌లో మాత్రం 13 కేసులున్నాయన్నారు. దీనిపై అతడి మీద పోటీ చేసిన బీజేపీ అభ్యర్థి హరినారాయణ్ రాజ్‌భర్ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. అధికారులు మాట్లాడుతూ తప్పుడు అఫిడవిట్‌కు సంబంధించి పోలీసులు, ఎన్నికల విభాగం నుంచి నివేదిక అందిన అనంతరం అతుల్‌రాయ్‌పై చర్యలు తీసుకుంటామని చెప్పారు. మరోవైపు ఓ కాలేజీ విద్యార్థినిపై లైంగికదాడికి పాల్పడిన కేసులో అతుల్‌రాయ్ శనివారం కోర్టుముందు లొంగిపోయారు. దీంతో న్యాయస్థానం అతడికి 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించింది.

## కాంగ్రెస్ అధ్యక్ష రేస్‌లో గెహ్లాట్ !

రాజీనామాపై వెనక్కితగ్గని రాహుల్



**న్యూఢిల్లీ, జూన్ 23:** కాంగ్రెస్ జాతీయ అధ్యక్ష పదవి రేసులో ఆ పార్టీ సీనియర్ నేత, రాజస్థాన్ సీఎం అశోక్ గెహ్లాట్ పేరు ప్రముఖంగా వినిపిస్తున్నది. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ ఓటమికి నైతిక బాధ్యత వహిస్తూ అధ్యక్ష పదవికి రాహుల్ గాంధీ రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. పార్టీ సీనియర్ నేతలు ఎంత నచ్చజెప్పినా ఆయన వెనక్కి తగ్గలేదు. దీంతో పార్టీ పగ్గాలు ఎవరికి అప్పగించాలన్న విషయమై కాంగ్రెస్ అధి నాయకత్వం మల్లగుల్లాలు పడుతున్నది. మరోవైపు కాంగ్రెస్ జాతీయ అధ్యక్ష పదవి కోసం ఆ పార్టీ సీనియర్లు పోటీ పడుతున్నారు. అధ్యక్ష బాధ్యతలు రెండేండ్లు తనకు అప్పగించాలని పార్టీ సీనియర్ నేత అస్లాం షేర్ ఖాన్ ఇటీవల కాంగ్రెస్ అధిష్ఠానాన్ని బహిరంగంగా కోరిన సంగతి తెలిసిందే. తనకూ పార్టీ అధ్యక్ష బాధ్యతలు కావాలని కర్ణాటక కాంగ్రెస్ సీనియర్ నేత వీరప్ప మొయిలీ ఇటీవల తన మనసులోని మాటను బయటపెట్టారు. అయితే కాంగ్రెస్ సీనియర్ నేత, నమ్మకస్తుడైన అశోక్ గెహ్లాట్ వైపే సోనియా గాంధీ కుటుంబం మొగ్గుచూపుతున్నట్లు తెలుస్తున్నది. పార్టీలోని పలువురు ప్రముఖులు కూడా అశోక్ గెహ్లాట్‌కే మద్దతు తెలుపుతున్నారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ అధ్యక్ష బాధ్యతలను అశోక్ గెహ్లాట్‌కు అప్పగించే అవకాశముందని తెలుస్తున్నది.

## గాంధీయేతరులు అధ్యక్షులుగా ఉండొచ్చు

కాంగ్రెస్ పార్టీకి ఆ చరిత్ర ఉంది: మణిశంకర్ అయ్యర్



**న్యూఢిల్లీ:** కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా గాంధీయేతరుడిని నియమించినా, గాంధీ కుటుంబం పార్టీ రాజకీయాల్లో క్రియాశీలంగా వ్యవహరించాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత మణిశంకర్ అయ్యర్ సూచించారు. గాంధీ లేని కాంగ్రెస్, కాంగ్రెస్ లేని భారత్‌ను బీజేపీ కోరుకుంటున్నదన్నారు. ఈ తరుణంలో పార్టీ అధ్యక్షుడిగా రాహుల్ గాంధీ కొనసాగడమే ఉత్తమమైనా ఆయన సొంత ఆకాంక్షలనూ తప్పనిసరిగా గౌరవించాలని పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో అయ్యర్ అన్నారు. యూఎన్ ధేబర్ నుంచి బ్రహ్మానందరెడ్డి వరకు పలుసార్లు నెహ్రూ-గాంధీయేతరులు పార్టీ అధ్యక్షులుగా పని చేసిన చరిత్ర కాంగ్రెస్‌కు ఉన్నదని అయ్యర్ గుర్తు చేశారు. అదే విధానం ఇప్పుడు పాటించాల్సి ఉన్నదన్నా రు. 'నెహ్రూ-గాంధీ'యేతరుడు తాత్కాలికంగా పార్టీ అధ్యక్షుడిగా ఉన్నా.. కాంగ్రెస్ పార్టీ మనుగడ సాధించగలదు. నెహ్రూ-గాంధీ కుటుంబ సభ్యులు పార్టీలో చురుగ్గా ఉంటే తీవ్రమైన సంక్షోభం తలెత్తినప్పుడు వాటి పరిష్కారానికి సహకరిస్తారు' అని చెప్పారు. 'కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేతగా సోనియాగాంధీ ఉన్నారు. అందులో రాహుల్ భాగమే. పార్టీ అధినేతగా ఎవరున్నా, మేమంతా కలిసే పోరాడుతాం. పార్టీకి తిరిగి పూర్వవైభవాన్ని తీసుకొస్తాం' అని విశ్వాసం వ్యక్తం చేశారు.పార్టీలో సంస్థాగతంగా ప్రక్షాళన తప్పకపోవచ్చునని చెప్పారు.


ఓటు వేస్తున్న టర్కీ అధ్యక్షుడు ఎర్డోగాన్

## ప్రశాంతంగా ఇస్తాంబుల్ మేయర్ ఎన్నికలు

దేశాధ్యక్షుడికి ఎదురుదెబ్బ తప్పదా?

**ఇస్లాంబుల్, జూన్ 23:** టర్కీ అధ్యక్షుడు తయ్యిప్ ఎర్డోగాన్ పాలనకు రెఫరెండంగా భావిస్తున్న ఇస్తాంబుల్ మేయర్ ఎన్నికలు ఆదివారం ప్రశాంతంగా ముగిశాయి. వాస్తవానికి ఈ ఎన్నికలను మార్చి నెలలోనే నిర్వహించగా ప్రతిపక్ష రిపబ్లికన్ పీపుల్స్ పార్టీ అభ్యర్థి గెలిచారు. అయితే ఈ ఎన్నికల్లో అక్రమాలు జరిగాయని, వీటిని రద్దు చేసి మళ్లీ ఎన్నికలు నిర్వహించాలని ఎర్డోగాన్ నేతృత్వంలోని ఏకే పార్టీ డిమాండ్ చేసింది. దీంతో ఎన్నికలను ఆ దేశ ఎన్నికల సంఘం రద్దు చేసింది. ఈ ఎన్నికలను ఆదివారం తిరిగి చేపట్టగా భారీగా ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 5 గంటలకు ముగిసింది. ఎన్నికల్లో అధికార పక్షానికి ఎదురు దెబ్బ తప్పదని భావిస్తున్నారు.

# సహనాన్ని పరీక్షించొద్దు

ఇరాన్‌కు అమెరికా హెచ్చరిక

మాతో పెట్టుకుంటే ఊహించని పరిణామాలు తప్పవు: ఇరాన్


అమెరికా జాతీయ భద్రత సలహాదారు బోల్టన్‌తో ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ కరచాలనం

**జెరూసలేం:** అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తపరిస్థితులు తీవ్రమవుతున్నాయి. గురువారం అమెరికా డ్రోన్‌ను ఇరాన్ కూల్చివేసినప్పటి నుంచి ఇరు దేశాల మధ్య మాటల యుద్ధం మరింత పెరుగుతున్నది. తాజాగా అమెరికా జాతీయ భద్రతా సలహాదారు జాన్ బోల్టన్ ఇరాన్‌పై విరుచుకుపడ్డారు. తమ సహనాన్ని బలహీనతగా భావించొద్దంటూ హెచ్చరించారు. ఏ క్షణాన్నైనా ఇరాన్‌పై దాడి చేసేందుకు అమెరికా సైన్యం సిద్ధంగా ఉన్నదని చెప్పారు. బొల్టన్ మూడురోజుల పర్యటన నిమిత్తం ఇజ్రాయెల్‌కు వెళ్లారు. ఇరాన్-అమెరికా మధ్య ఉద్రిక్తతలు, సిరియాతోసహ తూర్పు మధ్య ప్రాచ్యంలో చెలరేగుతున్న హింసలో ఇరాన్ పాత్రపై ఇజ్రాయెల్, రష్యా ప్రతినిధులతో చర్చించనున్నారు. ఇందులో భాగంగా ఆదివారం జెరూసలేంలో ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమన్ నెతన్యాహూతో కలిసి మీడియాతో మాట్లాడారు. ఇరాన్‌పై మరిన్ని ఆంక్షలు విధిస్తామని, వాటిని సోమవారం వెల్లడిస్తామని బొల్టన్ చెప్పారు. 'తూర్పు మధ్య ప్రాచ్యంలో మానవ సంహారం చేయడానికి వారికి (ఇరాన్‌కు) ఎవరూ లైసెన్స్ ఇవ్వలేదు. వారు రెచ్చిపోతుంటే చేతులు ముడుచుకొని కూర్చోలేం' అని పేర్కొన్నారు. తమ వైపు ఒక్క బుల్లెట్ దూసుకొచ్చినా తూర్పు మధ్య ప్రాచ్యంలో అమెరికాతోపాటు దాని మిత్రదేశాల ప్రయోజనాలన్నింటినీ దెబ్బతీస్తామని ఇరాన్ శనివారం హెచ్చరించిన నేపథ్యంలోనే బొల్టన్ ఈ వ్యాఖ్యలు చేసినట్టు భావిస్తున్నారు.

**సైబర్ వార్ మొదలైంది**

ఇరాన్‌పై అమెరికా సైబర్‌వార్ మొదలుపెట్టింది. తమ సైన్యంలోని సైబర్ విభాగం గురువారం ఇరాన్ సైన్యం కంప్యూటర్ వ్యవస్థపై దాడి చేసిందని అమెరికా ధ్రువీకరించింది. ఇరాన్ దగ్గర ఉన్న రాకెట్లు, మిస్సైల్ లాంచర్లను నియంత్రించే వ్యవస్థను నిర్వీర్యం చేసిందని చెప్పారు. ట్రంప్ అనుమతితోనే ఈ దాడులు చేసినట్టు అధికారులు తెలిపారు. మరోవైపు ఇరాన్ హ్యాకర్ల బృందం ప్రతి దాడులకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి.

### అదుపు చేయలేని యుద్ధాన్ని చూస్తారు: ఇరాన్

ఇరాన్‌తో పెట్టుకుంటే ఇస్లామిక్ రీజియన్‌లో ఎవరూ అదుపుచేయలేని పరిణామాలను చూస్తారని, ఇక్కడ అడుగుపెట్టే అమెరికా బలగాల ప్రాణాలకు ముప్పు తప్పదని ఇరాన్ మేజర్ జనరల్ రషీద్ హెచ్చరించారు. ఆదివారం టెహ్రాన్‌లో మిలిటరీ హెడ్‌క్వార్టర్స్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా సైనికాధికారులతో మాట్లాడారు. ఒక వేళ యుద్ధం మొదలైతే ఎవరూ ఊహించని, అదుపు చేయలేని స్థితికి చేరుతుందని స్పష్టం చేశారు. మరోవైపు ఆదివారం జరిగిన ఇరాన్ పార్లమెంట్ సమావేశంలో పలువురు సభ్యులు 'అమెరికాను అంతం చేయాలి' అంటూ నినాదాలు చేశారు. ఇరాన్ గగనతలంలోకి గురువారం అమెరికా డ్రోన్ అక్రమంగా చొచ్చుకొని రావడాన్ని పార్లమెంట్ తీవ్రంగా ఖండించింది.

## ఇందిరాగాంధీని అరెస్టు చేసిన లక్ష్మీనారాయణన్ మృతి


లక్ష్మీనారాయణన్

**న్యూఢిల్లీ:** మాజీ ప్రధాని ఇందిరాగాంధీని అరెస్ట్ చేసి సంచలనం సృష్టించిన రిటైర్డ్ ఐపీఎస్ అధికారి వీఆర్ లక్ష్మీనారాయణన్ (91) కన్నుమూశారు. ఆయన కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. ఆదివారం చెన్నైలోని తన నివాసంలో తుదిశ్వాస విడిచారు. దేశంలో ఎమర్జెన్సీ ముగిశాక జరిగిన ఎన్నికల్లో ఇందిర అధికారం కోల్పోయిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత ఏర్పడిన మొరార్జీదేశాయ్ ప్రభుత్వం ఆమెపై వచ్చిన అవినీతి ఆరోపణలపై సీబీఐ దర్యాప్తునకు ఆదేశించింది. ఈ మేరకు 1977లో సీబీఐ జేడీగా పనిచేస్తున్న లక్ష్మీనారాయణన్.. ఆమెను అరెస్ట్ చేయడం అప్పట్లో దేశవ్యాప్తంగా సంచలనమైంది. లక్ష్మీనారాయణన్ 1951వ బ్యాచ్ ఐపీఎస్ అధికారి. ఏసీపీగా కెరీర్ మొదలుపెట్టి తమిళనాడు డీజీపీగా రిటైరయ్యారు. చెన్నైలో తన కుమారుడు సురేశ్ లక్ష్మీనారాయణ, ఇద్దరు కూతుళ్లు ఉషా రవి, రమా లక్ష్మీనారాయణతో కలిసి ఉంటున్నారు. ఆయన పార్థివ దేహానికి మంగళవారం అంత్యక్రియలు నిర్వహిస్తామని కుటుంబసభ్యులు తెలిపారు.

## మధ్యంతర పోరు ప్రజలపై భారమే

కేంద్రమంత్రి డీవీ సదానందగౌడ



**బెంగళూరు, జూన్ 23:** కర్ణాటక అసెంబ్లీకి మధ్యంతర ఎన్నికలు వస్తే ప్రజలపై భారమేనని కేంద్ర మంత్రి డీ వీ సదానందగౌడ అన్నారు. ఎన్నికల వల్ల అభివృద్ధి పనులు నిలిచిపోతాయన్నారు. ఆదివారం బెంగళూరు శివారులోని నీలమంగళ వద్ద ప్రధానమంత్రి జన్ ఔషధి కేంద్రాన్ని ప్రారంభించిన తర్వాత డీవీ సదానందగౌడ మీడియాతో మాట్లాడారు. 'ప్రస్తుత తరుణంలో మధ్యంతర ఎన్నికలు ప్రజలపై భారమే. నూతన ప్రభుత్వాన్ని పని చేయనిద్దాం. కానీ మధ్యంతర ఎన్నికలకు వెళ్లడం ప్రజలపై భారం మోపడంతోపాటు సరైన చర్య కాదు' అని అన్నారు. 'మా రాజకీయ లక్ష్యాలను సాధించుకునేందుకు ప్రజలపై భారం మోపాలని మేం భావించడం లేదు. ప్రస్తుతం అధికారంలో ఉన్న వారు పరిస్థితులను చక్కదిద్దకుంటే.. మాకు ఒక అవకాశం ఇస్తే పరిస్థితులను సరిదిద్దుతాం' అని సదానందగౌడ చెప్పారు.

## కశ్మీర్‌లో నలుగురు ఉగ్రవాదులు హతం

**శ్రీనగర్, జూన్ 23:** జమ్ముకశ్మీర్‌లో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. భద్రతా బలగాలు జరిపిన కాల్పుల్లో నలుగురు ఉగ్రవాదులు హతమయ్యారు. ఈ సంఘటన ఆదివారం షోపియాన్ జిల్లాలోని దరమ్‌దోరా ప్రాంతంలో చోటుచేసుకుంది. ఈప్రాంతంలో ఉగ్రవాదులు సంచరిస్తున్నారన్న సమాచారం మేరకు భద్రతా బలగాలు గాలింపు చేపట్టాయి. వీరి రాకను గుర్తించిన ముష్కరులు కాల్పులకు తెగబడటంతో బలగాలు ఎదురు కాల్పులు జరిపాయి. దీంతో నలుగురు ఉగ్రవాదులు హతమయ్యారు. వీరిని రఫీ హసన్ మీర్, సుహేల్ అహ్మద్ భట్, షౌకత్ అహ్మద్ మీర్, ఆజాద్ అహ్మద్ ఖాండేగా గుర్తించారు. వీరంతా అల్‌ఖైదా అనుబంధ సంస్థ అన్సార్ గజ్వతుల్ హింద్ ఉగ్రవాద సంస్థకు చెందిన వారుగా భద్రతా బలగాలు అనుమానిస్తున్నాయి.

## పోలీస్‌ను చంపిన నక్సల్స్

**బీజాపూర్, జూన్ 23:** ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో ఆదివారం వారాంతపు సంతలో ఓ పోలీస్ కానిస్టేబుల్‌ను నక్సల్స్ హతమార్చారు. మిర్తూర్ పోలీస్‌స్టేషన్‌లో అసిస్టెంట్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న చైతు కడ్తీ తన కుటుంబసభ్యులతో స్థానిక అంగడికి వెళ్లగా.. నలుగురు లేదా ఐదుగురు సభ్యుల నక్సల్స్ యాక్షన్ టీమ్ కడ్తీని కత్తులతో పొడవటంతో అతడు అక్కడికక్కడే మరణించినట్టు పోలీస్ అధికారులు తెలిపారు. అనంతరం నక్సల్స్ అక్కడి నుంచి పరారయ్యారని పేర్కొన్నారు. పోలీస్ కుటుంబసభ్యులకు నక్సల్స్ ఎలాంటి హాని తలపెట్టలేదని వెల్లడించారు.

ఆట
నమస్తే తెలంగాణ
క్రికెట్ సమరం
WORLD CUP
కరీంనగర్ | WWW.NTNEWS.COM | సోమవారం 24 జూన్ 2019 | 10

### పాయింట్ల పట్టిక

| స్థానం | జట్టు | ఆ | గె | ఓ | ఫ.తే. | ర.రే | పా |
|---|---|---|---|---|---|---|---|
| 1. | న్యూజిలాండ్ | 6 | 5 | 0 | 1 | +1.30 | 11 |
| 2. | ఆస్ట్రేలియా | 6 | 5 | 1 | 0 | +0.84 | 10 |
| 3. | భారత్ | 5 | 4 | 0 | 1 | +0.80 | 9 |
| 4. | ఇంగ్లండ్ | 6 | 4 | 2 | 0 | +1.45 | 8 |
| 5. | శ్రీలంక | 6 | 2 | 2 | 2 | -1.11 | 6 |
| 6. | బంగ్లాదేశ్ | 6 | 2 | 3 | 1 | -0.40 | 5 |
| 7. | పాకిస్థాన్ | 6 | 2 | 3 | 1 | -1.26 | 5 |
| 8. | వెస్టిండీస్ | 6 | 1 | 4 | 1 | +0.19 | 3 |
| 9. | దక్షిణాఫ్రికా | 7 | 1 | 5 | 1 | -0.32 | 3 |
| 10. | ఆఫ్ఘనిస్థాన్ | 6 | 0 | 6 | 0 | -1.71 | 0 |

ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, ఫ.తే- ఫలితం తేలనివి, ర.రే - నెట్ రన్‌రేట్, పా-పాయింట్లు,

వరల్డ్‌కప్‌లో నేడు | బంగ్లాదేశ్ X ఆఫ్ఘనిస్థాన్ - 3 గం. | స్టార్ స్పోర్ట్స్‌లో

అత్యధిక పరుగులు **447** వార్నర్ (ఆస్ట్రేలియా)

అత్యధిక వికెట్లు **15** ఆమిర్ (పాకిస్థాన్)



# భారత్ జయభేరి

**ఎఫ్ఐహెచ్ సిరీస్ తుదిపోరులో జపాన్‌పై ఘన విజయం**

**హిరోషిమా:** ఎఫ్ఐహెచ్ సిరీస్ ఫైనల్స్ ఆసాంతం అద్భుత ఆటతో అదరగొట్టిన భారత మహిళల హాకీ జట్టు తుదిపోరులోనూ సత్తా చాటింది. ఆదివారం ఇక్కడ జరిగిన ఫైనల్‌లో రాణి రాంపాల్ బృందం 3-1తేడాతో ఆతిథ్య జపాన్‌ను మట్టికరిపించి విజేతగా నిలిచింది. కెప్టెన్ రాణి రాంపాల్(3వ నిమిషంలో) తొలి గోల్ చేస్తే, సెమీస్‌లో రెండు గోల్స్‌తో సత్తా చాటిన డ్రాగ్‌ఫ్లిక్ క్వీన్ గుర్జీత్ కౌర్ (45వ, 60వ నిమిషాల్లో) మరోసారి అదే ప్రదర్శన పునరావృతం చేసింది. గుర్జీత్ టోర్నీలో అత్యధిక గోల్స్ (11) చేసిన ప్లేయర్‌గా నిలిస్తే.. రాణి రాంపాల్‌కు బెస్ట్ ప్లేయర్ అవార్డు దక్కింది. జపాన్ జట్టులో కనోన్ మోరీ (11ని.) ఏకైక గోల్ చేసింది. మ్యాచ్ ప్రారంభమైన మూడో నిమిషంలోనే జపాన్ గోల్ కీపర్‌ను బోల్తా కొట్టిస్తూ.. రాణి రాంపాల్ గోల్ సాధించడంతో ఆధిక్యంలోకి వచ్చిన టీమ్‌ఇండియా.. తొమ్మిదో నిమిషంలో లభించిన పెనాల్టీ కార్నర్ అవకాశాన్ని చేజార్చుకుంది. పదకొండో నిమిషంలో జపాన్ క్రీడాకారిణి కనోన్ మోరీ గోల్ సాధించడంతో స్కోర్లు సమమయ్యాయి.

**ఆఖర్లో అదుర్స్:** రెండో అర్ధభాగం మొదట్లో వచ్చిన రెండు పెనాల్టీ కార్నర్ అవకాశాలను భారత్ వృథా చేసుకుంది. అయితే 45వ నిమిషంలో డ్రాగ్ ఫ్లికర్ గుర్జీత్ కౌర్ బంతిని గోల్ పోస్టులోకి కొట్టి భారత్‌ను 2-1 ఆధిక్యంలోకి తెచ్చింది. ఈ దశలో జపాన్ దాడులు ఉధృతం చేసినా.. మన రక్షణపంక్తి అడ్డుగోడలా నిలిచింది. చివరి నిమిషంలో దక్కిన పెనాల్టీ కార్నర్‌ను గుర్జీత్ గోల్‌గా మలచడంతో భారత్ 3-1తో గెలుపొందింది. తీవ్ర ఒత్తిడిలోని సంయమనంతో ఆడిన ఆటగాళ్లపై భారత చీఫ్ కోచ్ జోయార్డ్ మరీనే ప్రశంసలు కురిపించాడు. ఉదాసీనతను దరి చేరనివ్వకుండా అందరూ చక్కగా ఆడారని ప్రశంసించాడు. 'ఇది చాలా కష్టమైన మ్యాచ్. మేం ఎలాంటి తప్పులకు తావివ్వలేదు. గుర్జీత్ మరోసారి మంచి ప్రదర్శన చేసింది'అని కోచ్ మరీనే అన్నాడు. ఈ టోర్నీలో ఫైనల్ చేరడం ద్వారా భారత్, జపాన్ జట్లు ఒలింపిక్స్ క్వాలిఫయర్స్ ఫైనల్ రౌండ్‌కు అర్హత సాధించిన సంగతి తెలిసిందే.

## ఇంకా బాగా ఆడాల్సింది



**సౌతాంప్టన్:** కీలక సమయంలో టీమ్‌ఇండియా మిడిలార్డర్ నత్తనడకన బ్యాటింగ్ చేయడంపై మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్ అసంతృప్తి వ్యక్తం చేశాడు. శనివారం ఆఫ్ఘనిస్థాన్‌తో మ్యాచ్‌లో ధోనీ, జాదవ్ మరీ నెమ్మదిగా ఆడటంతో భారత్ భారీ స్కోరు చేయలేకపోయిందని అభిప్రాయపడ్డాడు. 'వారి (ధోనీ, జాదవ్) ప్రదర్శనతో కాస్త అసంతృప్తి చెందా. వారిద్దరి భాగస్వామ్యం మరీ నెమ్మదిగా సాగింది. విరాట్ ఔటయ్యాక స్కోరు మందగించింది. మిడిలార్డర్ ఇంకా మెరుగ్గా ఆడాల్సింది. జాదవ్ ఒత్తిడిలో కనిపించాడు. అలాంటి సమయంలో ధోనీ మరింత బాధ్యత తీసుకొని కేదార్‌పై ఆ ఒత్తిడి తొలగించాల్సింది. కానీ దురదృష్టవశాత్తు అది జరగలేదు. మొత్తానికి మ్యాచ్‌లో ఆఫ్ఘన్ పోరాటం ఆకట్టుకుంది' అని సచిన్ వివరించాడు.

# సెమీస్ రేసు కోసం..

## ఆఫ్ఘనిస్థాన్‌తో నేడు బంగ్లాదేశ్ పోరు


షకీబ్


నైబ్

**సౌతాంప్టన్:** అంచనాలకు మించి అద్భుతంగా రాణిస్తున్న బంగ్లాదేశ్.. టోర్నీలో ఆడిన అన్ని మ్యాచ్‌ల్లోనూ ఓడిన ఆఫ్ఘనిస్థాన్‌తో రోస్‌బౌల్ స్టేడియం వేదికగా సోమవారం అమీతుమీ తేల్చుకోనుంది. టోర్నీలో ఇప్పటి వరకు రెండు మంచి జట్లపై (దక్షిణాఫ్రికా, వెస్టిండీస్) గెలిచిన బంగ్లాదేశ్.. ఈ పోరులో ఎలాగైనా ఆధిపత్యం ప్రదర్శించి సెమీస్ ఆశలను సజీవంగా నిలుపుకోవాలనే పట్టుదలగా ఉంది. బ్యాటింగ్‌లో ఊహకందని రీతిలో అదరగొడుతున్న ఆ జట్టు.. స్పిన్నే ప్రధానాస్త్రంగా దిగుతున్న ఆఫ్ఘన్‌ను ఎలా ఎదుర్కొంటుందో చూడాలి. మరోవైపు టోర్నీలో ఆడిన ఆరు మ్యాచ్‌ల్లో ఓడి పాయింట్ల పట్టికలో అట్టడుగున ఉన్నా.. గత మ్యాచ్‌లో భారత్‌పై చేసిన అద్భుత పోరాటమే స్ఫూర్తిగా బంగ్లాపై ఆధిపత్యం ప్రదర్శించి పాయింట్ల ఖాతా తెరవాలని ఆఫ్ఘన్ భావిస్తున్నది.

**సూపర్ బ్యాటింగ్..**

బలమైన పేస్ బౌలింగ్ దళమున్న వెస్టిండీస్‌పై 322 పరుగుల లక్ష్యాన్ని ఛేదించడమంటే మామూలు విషయం కాదు. కానీ బంగ్లా మాత్రం ఆ స్కోరును 41.3 ఓవర్లలోనే ఛేజ్ చేసి కరీబియన్లకు భారీ షాకిచ్చింది. అలాగే ఆస్ట్రేలియాతో జరిగిన గత మ్యాచ్‌లోనూ కొండంత లక్ష్యం ముందున్నా.. చివరి వరకు పోరాడి 338 పరుగులు చేసి భేష్ అనిపించుకుంది. ఈ రెండు ఉదాహరణలు చాలు బ్యాటింగ్‌లో బంగ్లా ఎంత బలంగా ఉందో చెప్పడానికి. ముఖ్యంగా షకీబ్ అల్ హసన్(425) మూడో స్థానంలో బ్యాటింగ్‌కు దిగి సంచలన ఇన్నింగ్స్‌లు ఆడుతున్నాడు. రెండు శతకాలు, రెండు అర్ధ శతకాలతో వార్నర్ తర్వాత అత్యధిక పరుగుల జాబితాలో రెండో స్థానంలో ఉన్నాడు. అలాగే తమీమ్ ఇక్బాల్, సౌమ్యా సర్కార్, ముష్ఫికర్ రహీమ్ అంచనాలకు తగ్గట్టు రాణిస్తున్నారు. వారందరూ చెలరేగితే ఆఫ్ఘనిస్థాన్‌కు కష్టాలు తప్పక పోవచ్చు. కానీ బౌలింగే బంగ్లాకు ఆందోళన కలిగిస్తున్నది. ప్రత్యర్థి జట్లకు భారీ స్కోర్లు చేసే అవకాశమిస్తున్న బౌలర్లు.. తమ బ్యాట్స్‌మెన్‌పై అదనపు భారాన్ని మోపుతున్నారు. కెప్టెన్ మొర్తజా కనీసం పూర్తి ఓవర్లు కూడా వేయలేక ఇబ్బందులు పడుతుంటే ముస్తఫిజుర్, రూబెల్ అనుకున్న స్థాయిలో రాణించలేకపోతున్నారు.

**స్పిన్నర్లపైనే ఆశలు**

మరోవైపు టోర్నీలో ఇంతవరకు బ్యాటింగ్‌లో పెద్దగా ఆకట్టుకోలేకపోయిన ఆఫ్ఘనిస్థాన్.. తమకున్న స్పిన్ బలంతోనే బంగ్లాను దెబ్బకొట్టాలని అనుకుంటోంది. గత మ్యాచ్‌లో ముజీబ్, నబీ, రషీద్‌ఖాన్ త్రయం భారత్‌ను ముప్పుతిప్పలు పెడితే.. బ్యాటింగ్‌లోనూ రాణించిన నబీ టీమ్‌ఇండియాను ఓడించినంత పని చేశాడు. ఆ స్ఫూర్తితోనే.. అదే మైదానంలో జరుగనున్న ఈ మ్యాచ్‌లో బంగ్లాను కట్టడి చేసి.. విజయం సాధించాలని ఆఫ్ఘన్ పట్టుదలగా ఉంది.

## ఆష్లే బార్టీ @ 1



**బర్మింగ్‌హామ్:** ఇటీవల ఫ్రెంచ్ ఓపెన్ మహిళల టైటిల్ నెగ్గి సంచలనం సృష్టించిన ఆస్ట్రేలియా టెన్నిస్ స్టార్ ఆష్లే బార్టీ ప్రపంచ నంబర్‌వన్‌గా అవతరించింది. 1976లో ఇవోన్ గూలగోంగ్ కాలే తర్వాత ఈ ఘనత సాధించిన తొలి ఆసీస్ మహిళగా చరిత్ర సృష్టించింది. బర్మింగ్‌హామ్ డబ్ల్యూటీఏ ఫైనల్‌లో 6-3,7-5తో జూలియా (జర్మనీ)ను ఓడించడంతో బార్టీ ఈ ఫీట్‌ను అందుకుంది. 6540 పాయింట్లతో బార్టీ నంబర్‌వన్ ర్యాంకుకు చేరుకోగా.. నవోమీ ఒసాకా(జపాన్, 6377) రెండో స్థానానికి పడిపోయింది.




## పాక్‌కు ఓదార్పు

# విజయం



**దక్షిణాఫ్రికాపై 49 పరుగులతో గెలుపు.. విజృంభించిన హారీస్ సోహైల్**
**రాణించిన ఆమిర్, షాదాబ్.. సెమీస్ రేసు నుంచి తప్పుకున్న సఫారీలు**



**భారత్ చేతిలో ఓటమి పాకిస్థాన్‌ను రాటుదేల్చినట్టుంది. ఆ పరాజయం తర్వాత ఎదురైన విమర్శలతో కసి పెంచుకున్న పాక్.. సఫారీలపై ప్రతాపం చూపింది. మొదట బ్యాటింగ్‌లో భారీ స్కోరు చేసిన సర్ఫరాజ్ సేన.. ఆ తర్వాత బౌలింగ్‌లోనూ విజృంభించి విజయం సాధించింది. ఆడిన ఏడు మ్యాచ్‌ల్లో ఐదింట ఓడిన దక్షిణాఫ్రికా అధికారికంగా సెమీఫైనల్ రేసు నుంచి నిష్క్రమించగా.. అనూహ్యంగా చెలరేగిన పాకిస్థాన్ ఈ విక్టరీతో సెమీస్ అవకాశాలను కాస్త మెరుగుపరుచుకుంది.**

**లండన్:** ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఆకట్టుకున్న పాకిస్థాన్ ప్రపంచకప్‌లో రెండో విజయం నమోదు చేసుకుంది. బ్యాటింగ్‌లో హారీస్ సోహైల్ (59 బంతుల్లో 89; 9 ఫోర్లు, 3 సిక్సర్లు), బాబర్ ఆజమ్ (69; 7 ఫోర్లు) అర్ధ శతకాలకు.. బౌలింగ్‌లో షాదాబ్ ఖాన్ (3/50), మొహమ్మద్ ఆమిర్ (2/49) మెరుపులు తోడవడంతో దక్షిణాఫ్రికాపై 49 పరుగుల తేడాతో గెలుపొందింది. క్రికెట్ మక్కా లార్డ్స్‌లో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్ 50 ఓవర్లలో 7 వికెట్లకు 308 పరుగులు చేసింది. సఫారీ బౌలర్లలో ఎంగ్డీ 3, తాహిర్ 2 వికెట్లు పడగొట్టారు. అనంతరం లక్ష్య ఛేదనలో దక్షిణాఫ్రికా 50 ఓవర్లలో 9 వికెట్లకు 259 పరుగులు చేసింది. కెప్టెన్ డుప్లెసిస్ (63; 5 ఫోర్లు), డికాక్ (47; 3 ఫోర్లు, 2 సిక్సర్లు) పోరాడారు. ప్రపంచకప్‌లో ఆడిన తొలి మ్యాచ్‌లోనే అర్ధశతకంతో ఆకట్టుకున్న సోహైల్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది.

**పాత కథ.. అదే వ్యథ**

లక్ష్యఛేదనలో దక్షిణాఫ్రికాకు శుభారంభం దక్కలేదు. ఫామ్‌లేమితో సతమతమవుతున్న ఆమ్లా (2) రెండో ఓవర్‌లోనే ఔటయ్యాడు. మరో ఓపెనర్‌తో కలిసి వన్‌డౌన్‌లో వచ్చిన కెప్టెన్ డుప్లెసిస్ ఇన్నింగ్స్‌ను నడిపించే బాధ్యత భుజానెత్తుకున్నాడు. పాక్ బౌలర్లను సమర్థవంతంగా ఎదుర్కొన్న ఈ జోడీ ఒక్కో పరుగు జతచేసుకుంటూ వెళ్లడంతో పవర్ ప్లే ముగిసేసరికి దక్షిణాఫ్రికా 38/1తో నిలిచింది. రెండో వికెట్‌కు 87 పరుగులు జోడించాక డికాక్ ఔటయ్యాడు. మార్క్‌రమ్ (7) విఫలం కాగా.. అర్ధ సెంచరీ పూర్తయ్యాక డుప్లెసిస్ కూడా వెనుదిరిగాడు. ఈ దశలో డస్సెన్ (36), మిల్లర్ (31) సంయమనంతో ఆడారు. ఐదో వికెట్‌కు 53 పరుగులు జతచేశాక 3 పరుగుల వ్యవధిలో వీరిద్దరు ఔటవడంతో దక్షిణాఫ్రికా ఓటమి ఖరారైంది. ఆఖర్లో వహాబ్ రియాజ్ (3/46) ధాటికి మోరిస్ (16), రబాడ (3), ఎంగ్డీ (1) పెవిలియన్‌కు వరుసకట్టారు. ఫెలుక్వాయో (32 బంతుల్లో 46 నాటౌట్; 6 ఫోర్లు) పోరాటం ఓటమి అంతరాన్ని తగ్గించడానికే పరిమితమైంది.


డుప్లెసిస్ (63)

**తలా కొన్ని..**

భారత్‌తో మ్యాచ్‌లో టాస్ గెలిచి ప్రత్యర్థికి బ్యాటింగ్ అప్పగించడంపై తీవ్ర విమర్శలు రావడంతో ఈ సారి టాస్ గెలవగానే మరో ఆలోచన లేకుండా సర్ఫరాజ్ మొదట బ్యాటింగ్ ఎంచుకున్నాడు. తమ కెప్టెన్ నమ్మకాన్ని నిలబెడుతూ ఓపెనర్లు ఫఖర్ జమాన్ (44; 6 ఫోర్లు, 1 సిక్స్), ఇమాముల్ హక్ (44; 6 ఫోర్లు) ఎడాపెడా బౌండ్రీలతో రెచ్చిపోయారు. రబాడ ఓవర్‌లో ఫఖర్ 2 ఫోర్లు కొడితే.. ఎంగ్డీకి ఇమామ్ 3 ఫోర్లు రుచి చూయించాడు. ఈ జోడీ చక్కటి సమన్వయంతో ముందుకు సాగడంతో పవర్‌ప్లే ముగిసేసరికి పాక్ వికెట్ నష్టపోకుండా 58 పరుగులు చేసింది. తొలి వికెట్‌కు 81 పరుగులు జతచేశాక ఇమ్రాన్ తాహిర్ ఈ పార్ట్‌నర్‌షిప్‌ను బ్రేక్ చేశాడు. మొదట బాబర్‌ను ఆ తర్వాత ఇమామ్‌ను పెవిలియన్ పంపాడు. సీనియర్ ప్లేయర్ మొహమ్మద్ హఫీజ్ (20) పెద్దగా ఆకట్టుకోలేకపోయాడు. కుదురుగా ఆడుతున్న బాబర్ ఆజమ్‌కు ప్రపంచకప్‌లో తొలి మ్యాచ్ ఆడుతున్న హారీస్ సోహైల్ తోడవడంతో పాక్ స్కోరు ఉరకలెత్తింది. స్ట్రోక్ ప్లేతో అలరించిన సోహైల్ 38 బంతుల్లో అర్ధశతకం పూర్తి చేసుకున్నాడు. నాలుగో వికెట్‌కు 81 పరుగులు జోడించాక బాబర్ ఔటైనా.. ఇమాద్ వసీమ్ (23; 3 ఫోర్లు)తో కలిసి మరో మంచి భాగస్వామ్యాన్ని నమోదు చేశాడు. ఫెలుక్వాయో ఓవర్‌లో 4,6,4 కొట్టిన సోహైల్.. ఎంగ్డీ బౌలింగ్ 6, 4 బాదాడు. ఐదో వికెట్‌కు 40 బంతుల్లో 71 పరుగులు జోడించాక ఇమాద్ వెనుదిరగ్గా.. చివరి ఓవర్‌లో సోహైల్ కూడా ఔటయ్యాడు.

**సోహైల్**
పరుగులు : 89
బంతులు : 59
ఫోర్లు : 9
సిక్సర్లు : 3

**1**
ప్రపంచకప్‌లో దక్షిణాఫ్రికా తరఫున అత్యధిక వికెట్లు(39) తీసిన బౌలర్‌గా తాహిర్ డొనాల్డ్ (38)ను వెనక్కినెట్టి అగ్రస్థానానికి చేరాడు.

### స్కోరు బోర్డు

**పాకిస్థాన్:** ఇమామ్ ఉల్ హక్ (సి అండ్ బి) ఇమ్రాన్ తాహిర్ 44, ఫఖర్ జమాన్ (సి) ఆమ్లా (బి) తాహిర్ 44, బాబర్ (సి) ఎంగ్డీ (బి) ఫెలుక్వాయో 69, హఫీజ్ (ఎల్బీ) మార్క్‌రమ్ 20, సోహైల్ (సి) డికాక్ (బి) ఎంగ్డీ 89, ఇమాద్ (సి) (సబ్) డుమినీ (బి) ఎంగ్డీ 23, వహాబ్ (బి) ఎంగ్డీ 4, సర్ఫరాజ్ (నాటౌట్) 2, షాదాబ్ (నాటౌట్) 1, **ఎక్స్‌ట్రాలు:** 12, **మొత్తం:** 50 ఓవర్లలో 308/7. **వికెట్ల పతనం:** 1-81, 2-98, 3-143, 4-224, 5-295, 6-304, 7-307, **బౌలింగ్:** రబాడ 10-0-65-0, ఎంగ్డీ 9-0-64-3, మోరిస్ 9-0-61-0, ఫెలుక్వాయో 8-0-49-1, తాహిర్ 10-0-41-2, మార్క్‌రమ్ 4-0-22-1.

**దక్షిణాఫ్రికా:** ఆమ్లా (ఎల్బీ) ఆమిర్ 2, డికాక్ (సి) ఇమామ్ (బి) షాదాబ్ 47, డుప్లెసిస్ (సి) సర్ఫరాజ్ (బి) ఆమిర్ 63, మార్క్‌రమ్ (బి) షాదాబ్ 7, డస్సెన్ (సి) హఫీజ్ (బి) షాదాబ్ 36, మిల్లర్ (బి) షాహీన్ షా 31, ఫెలుక్వాయో, మోరిస్ (బి) వహాబ్ 16, రబాడ (బి) వహాబ్ 3, ఎంగ్డీ (బి) వహాబ్ 1, తాహిర్ (నాటౌట్) 1, **ఎక్స్‌ట్రాలు:** 6, **మొత్తం:** 50 ఓవర్లలో 259/9. **వికెట్ల పతనం:** 1-4, 2-91, 3-103, 4-136, 5-189, 6-192, 7-222, 8-239, 9-246, **బౌలింగ్:** హఫీజ్ 2-0-11-0, ఆమిర్ 10-1-49-2, షాహీన్ షా 8-0-54-1, ఇమాద్ 10-0-48-0, వహాబ్ 10-0-46-3, షాదాబ్ 10-1-50-3.

# క్రీడాభివృద్ధికి కృషి

## రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్


ఐదో రోజు ఆట ప్రారంభం సందర్భంగా బ్యాటింగ్ చేస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

**మహబూబ్‌నగర్ స్పోర్ట్స్:** క్రీడాభివృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తామని రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. నంది టైగర్స్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఎండీసీఏ మైదానంలో జరుగుతున్న మహబూబ్‌నగర్ ప్రీమియర్ క్రికెట్ టీ20 టోర్నీ ఐదో రోజు ఆదివారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో మినీ స్టేడియం ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ క్రీడాభివృద్ధికి అన్ని విధాల సహకరిస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా పాలమూరులో ఎంపీఎల్ టోర్నీ నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జిల్లా క్రికెట్ సంఘం ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, క్రికెట్ సంఘం ప్రతినిధులు సురేశ్ కుమార్, గోపాలకృష్ణ, కృష్ణమూర్తి, అబ్దుల్లా, టీఆర్ఎస్ నాయకులు వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## కోహ్లీకి జరిమానా

**సౌతాంప్టన్:** ప్రపంచకప్‌లో భాగంగా ఆఫ్ఘనిస్థాన్‌తో మ్యాచ్‌లో భారత కెప్టెన్ విరాట్ కోహ్లీపై జరిమానా పడింది. ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించి అంపైర్‌తో దురుసుగా ప్రవర్తించినందుకు గాను కోహ్లీ మ్యాచ్ ఫీజులో 25 శాతం కోత విధిస్తున్నట్లు ఐసీసీ ఓ ప్రకటనలో తెలిపింది. 'నియమావళిలోని 2.1 ఆర్టికల్‌ను కోహ్లీ ఉల్లంఘించాడు. అందుకే అతడిపై చర్యలు తీసుకున్నాం'అని అందులో పేర్కొంది. ఆఫ్ఘన్ ఇన్నింగ్స్ 29వ ఓవర్లో రహ్మత్ షా ఎల్బీ కోసం అప్పీలు చేసిన విరాట్.. ఫీల్డ్ అంపైర్ అలీం డార్‌తో దురుసుగా వ్యవహరించాడు. మ్యాచ్ అనంతరం రిఫరీ క్రిస్ బోర్డ్ ఎదుట తప్పును ఒప్పుకోవడంతో.. స్వల్ప జరిమానాతో పాటు ఒక డీ మెరిట్ పాయింట్‌ను కోహ్లీ ఖాతాలో చేర్చారు.

**విరాట్, బుమ్రాకు విశ్రాంతి!**

ప్రపంచకప్ అనంతరం ఆగస్టు 6 నుంచి వెస్టిండీస్‌తో జరుగనున్న పరిమిత ఓవర్ల సిరీస్‌లకు టీమ్‌ఇండియా కెప్టెన్ విరాట్ కోహ్లీతో పాటు స్పీడ్‌స్టర్ జస్ప్రీత్ బుమ్రాకు విశ్రాంతి ఇవ్వనున్నారు. విశ్వసమరం అనంతరం భారత్.. విండీస్‌తో 3 వన్డేలు, 3 టీ20లు, 2 టెస్టులు ఆడనుంది.

## హ్యాట్రిక్‌లో మహీ భాయ్ ట్రిక్ ఉంది



**సౌతాంప్టన్:** ప్రపంచకప్‌లో 'హ్యాట్రిక్' నమోదు చేయడం వెనుక మాస్టర్‌మైండ్ మహేంద్ర సింగ్ ధోనీ సూచనలు ఉన్నాయని మొహమ్మద్ షమీ పేర్కొన్నాడు. 'వరుసగా రెండు వికెట్లు తీసిన అనంతరం మూడో బంతిని కూడా యార్కర్ వేయమని 'మహీ భాయ్' సూచించాడు. ఎలాంటి మార్పులు చేయకు. అరుదైన అవకాశం నీ ముందు ఉంది. ఇలాంటి చాన్స్ మళ్లీ మళ్లీ రాదు అని అన్నాడు. అందుకు తగ్గట్లే నేను యార్కర్ వేసి హ్యాట్రిక్ పూర్తి చేసుకున్నా' అని మ్యాచ్ అనంతరం షమీ తెలిపాడు. శనివారం ఆఫ్ఘనిస్థాన్‌తో జరిగిన ఉత్కంఠ పోరులో చివరి ఓవర్‌లో ప్రత్యర్థి 16 పరుగులు చేయాల్సి ఉండగా.. షమీ 4 పరుగులే ఇచ్చి మూడు వికెట్లు పడగొట్టడంతో భారత్ 11 రన్స్ తేడాతో విజయం సాధించింది.

## ఇన్ఫీలో 9వేల అమెరికన్ల ఉద్యోగులు



**న్యూఢిల్లీ, జూన్ 23:** దేశీయ రెండో అతిపెద్ద ఐటీ సేవల సంస్థ ఇన్ఫోసిస్..భారీ స్థాయిలో అమెరికన్లకు ఉపాధి అవకాశాలు కల్పించింది. ఏప్రిల్ 2017 నుంచి మార్చి 2019 మధ్యకాలంలో 9 వేల మంది అమెరిక్లను రిక్రూట్ చేసుకున్నది. అక్కడి వ్యాపారాన్ని మరింత బలోపేతం చేయడానికి ఈ నియామకం ఎంతో దోహదం చేయనున్నదని కంపెనీ సీవోవో యూబీ ప్రవీణ్ రావు వార్షిక సాధారణ సమావేశం(ఏజీఎం)లో చెప్పారు. రెండేండ్ల క్రితం ఇదే నెలలో అమెరికాలో నాలుగు టెక్నాలజీ, ఇన్నోవేషన్ హబ్‌ను ఏర్పాటు చేయడంతో పాటు పదివేల మంది ఉద్యోగులను తీసుకున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. పరిశీలనలు పెరుగుతుండటం, పలు దేశాల్లో వీసా సమస్యలు అధికమవడంతో ఇన్ఫోసిస్ అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియాలోని ప్రాంతీయ ఉద్యోగులకు పెద్దపీట వేస్తున్నది. కంపెనీకి వచ్చిన మొత్తం ఆదాయంలో నార్త్-అమెరికా వాటా 61.2 శాతంగా ఉండగా, యూరప్ 24 శాతం, మిగతా దేశాలు 12.5 శాతం, ఇండియాలో 2.3 శాతంగా ఉన్నది. మార్చి చివరి నాటికి కంపెనీలో 2.28 లక్షల మంది ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు.

# శతకోటి దండాలు

క్రికెట్ వరల్డ్ కప్‌కు వర్షం అడ్డు రావద్దంటూ మొక్కుతున్న బీమా సంస్థలు ■ భారత్ మ్యాచ్‌లు ఆగినా రూ.100 కోట్ల నష్టం!

**న్యూఢిల్లీ, జూన్ 23:** వరల్డ్ కప్‌లో వర్షం రావద్దంటూ క్రికెట్ అభిమానులే కాదు.. బీమా రంగ సంస్థలూ ఇప్పుడు వరుణ దేవుడికి దండాలు పెడుతున్నాయి. భారత్ మ్యాచ్‌లు వాన కారణంగా ఆగితే.. దాదాపు రూ.100 కోట్ల నష్టం వాటిల్లుతున్నది మరి. ఈ ఐసీసీ మహా సంగ్రామంలో ఇప్పటికే న్యూజీలాండ్‌తో భారత్ తలపడిన మ్యాచ్ వర్షార్పణమైన విషయం తెలిసిందే. ఈ క్రమంలో రాబోయే మ్యాచ్‌లకు వర్షం అడ్డంకి కాకూడదని బీమా కంపెనీలు మొక్కుతున్నాయి. సెమీ-ఫైనల్స్‌కు ముందు టీమిండియా ఇంకా నాలుగు మ్యాచ్‌లను ఆడాల్సి ఉంది. దీంతో వీటికి ఎలాంటి ఆటంకాలూ కలుగకూడదని ఇన్సూరర్లు వేడుకుంటున్నారు. ఇంగ్లండ్‌లో జరుగుతున్న ప్రస్తుత ఐసీసీ క్రికెట్ వరల్డ్ కప్‌లో ఇప్పటి దాకా నాలుగు మ్యాచ్‌లు వర్షం కారణంగా రద్దయ్యాయి.

### అసలు విషయమేమంటే..

ఐసీసీ వంటి మెగా టోర్నీలకు వీక్షకుల సంఖ్య చాలాచాలా ఎక్కువగానే ఉంటుందని ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. దీంతో ఈ మ్యాచ్‌లను ప్రత్యక్ష ప్రసారం చేసే టెలివిజన్ చానళ్లకు ఆదాయమూ భారీగానే ఉంటుంది. ఇక భారత్ ఆడుతున్న మ్యాచ్‌లకు సహజంగానే వ్యూవర్‌షిప్ ఎక్కువ. దీంతో మిగతా మ్యాచ్‌లతో పోల్చితే కోహ్లి సేన సమరానికి ప్రకటనలు పోటెత్తుతాయి. ఇలాంటి తరుణంలో మ్యాచ్‌కు వర్షం ఆటంకం కలిగిస్తే.. ప్రకటనల ఆదాయం బాగా పడిపోతున్నది. ఫలితంగా ప్రసార హక్కుల కోసం ఐసీసీకి చెల్లిస్తున్న సొమ్ము కూడా రాని పరిస్థితి. స్వదేశీ మ్యాచ్‌ల కోసం పెద్ద మొత్తంలోనే ఐసీసీకి ముట్టజెప్పాల్సి వస్తున్నది మరి. దీంతో బ్రాడ్‌కాస్టర్లు (టెలివిజన్ చానల్స్) ఈ నష్టం భర్తీకి బీమా కంపెనీలను ఆశ్రయిస్తున్నాయి. సాధారణంగా వర్షంతో తప్ప మ్యాచ్‌కు మరెటువంటి ఆటంకం రాదు కాబట్టి.. వాన పడొద్దురా దేవుడా అని ఇప్పుడు బీమా క్లయిములను తీసుకున్న సంస్థలు వేడుకుంటున్నాయి. 'వర్షం పడితే మాకు భారీ నష్టం వాటిల్లుతుంది. అందుకే సగటు క్రికెట్ అభిమానిలా మేమూ వరుణ దేవునికి మ్యాచ్ సమయంలో వాన రవద్దని ప్రార్థనలు చేస్తున్నాం' అంటూ ఐసీఐసీఐ లాంబార్డ్ జనరల్ ఇన్సూరెన్స్ ప్రతినిధి సంజయ్ దత్తా అన్నారు. అయితే వర్షంతో రద్దయిన మ్యాచ్‌లకు ఎంతెంత బీమా సొమ్మును ఇచ్చారన్న సమాచారాన్ని మాత్రం ఆయన తెలియజేయలేదు.

**బీమా ధరలిలా..**

ఐసీసీ క్రికెట్ వరల్డ్ కప్ మ్యాచ్‌ల కోసం సుమారు రూ.150 కోట్ల క్లయిములను బ్రాడ్‌కాస్టర్ల నుంచి ఇన్సూరెన్స్ సంస్థలు తీసుకున్నాయి. న్యూ ఇండియా అస్యూరెన్స్, జనరల్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్, ఐసీఐసీఐ లాంబార్డ్ జనరల్ ఇన్సూరెన్స్, ఓరియంటల్ ఇన్సూరెన్స్ సంస్థలు ఈ బీమా కవరేజీలను అందిస్తున్నట్లు పరిశ్రమ వర్గాల సమాచారం. వర్షం పడితే ప్రసార హక్కుల కోసం ఐసీసీకి ఇచ్చిన అడ్వాన్సులను నష్టపోతున్న బ్రాడ్‌కాస్టర్లు.. ఈ బీమాతో ధీమాగా ఉంటున్నారిప్పుడు. కాగా, అన్ని మ్యాచ్‌లకూ బ్రాడ్‌కాస్టర్లు బీమా చేస్తుండగా, ఒక్కో మ్యాచ్‌కు ఒక్కో రకంగా బీమా సంస్థలు చార్జీలను వసూలు చేస్తున్నాయి. రూ.5 కోట్ల నుంచి రూ.50 కోట్లదాకా ఈ ధరలున్నాయి. తలపడుతున్న జట్ల ఆధారంగా బీమా బిల్లుంటున్నది. అలాగే భారత్ ప్రత్యర్థి ఆధారంగా కూడా సొమ్ము చెల్లింపులుంటున్నాయి. భారత్, పాకిస్తాన్ మ్యాచ్ కోసం దాదాపు రూ.50 కోట్లదాకా బీమా సొమ్మును బ్రాడ్‌కాస్టర్లు చెల్లించాల్సి వచ్చింది. ఈ మ్యాచ్‌కు వర్షం అడ్డు తగిలినా.. డక్‌వర్త్‌లూయిస్ గణన ప్రకారం భారత్ విజయం సాధించిన సంగతి విదితమే. ఇక సెమీ ఫైనల్స్, ఫైనల్ మ్యాచ్‌కు రూ.70-80 కోట్ల దాకా బీమా కవరేజీని చేస్తున్నాయి. అడ్వర్టైజ్‌మెంట్లకు టీవీ చానల్స్ మ్యాచ్‌నుబట్టి ఫీజులు తీసుకుంటున్నట్లుగానే.. ఇన్సూరర్లూ కట్టించుకుంటున్నారు. మ్యాచ్‌లు సజావుగా సాగితే క్లయిముల కోసం చెల్లించిన సొమ్ము పోయినట్లే. వర్షం, మరే కారణంగానైనా రద్దయితే బీమా వర్తిస్తుందన్న మాట. బ్రాడ్‌కాస్టర్ల నుంచి తీసుకున్న సొమ్ముకు ఇన్సూరర్లు రెట్టింపుల్లో ఇవ్వాల్సి ఉంటుంది. ఎనిమిదేండ్ల కాలానికిగాను రెండు వరల్డ్ కప్‌లు, మరో రెండు చాంపియన్స్ ట్రోఫీలు, టీ-20 వరల్డ్ కప్‌ల ప్రసార హక్కులను స్టార్ ఇండియాకు అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) అమ్మేసింది. ఇందుకుగాను ఐసీసీకి 1.98 బిలియన్ డాలర్లను ఇచ్చేందుకు స్టార్ ఇండియా అంగీకరించింది. అంతకు ముందు ఎనిమిదేండ్లకు చెల్లించినదానికంటే ఇది 80 శాతం ఎక్కువ. నాడు 1.1 బిలియన్ డాలర్లను అప్పజెప్పింది. కాగా, ఒక్క బంతి కూడా పడకుండానే మ్యాచ్ రద్దయితే క్రీడాభిమానులకు టిక్కెట్ డబ్బులు తిరిగి ఇచ్చేస్తారు. కొంత ఆట జరిగాక రద్దయినా టిక్కెట్ సొమ్ము వెనక్కి వచ్చేస్తున్నది.



## తయారీ రంగంలో నిస్తేజం

ఫిక్కీ సర్వేలో వెల్లడి



**న్యూఢిల్లీ, జూన్ 23:** తయారీ రంగంలో మళ్లీ నిస్తేజం ఆవరించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికం(ఏప్రిల్-జూన్ మధ్య కాలం)లో తయారీ రంగం మందకొడి వృద్ధిని నమోదు చేసుకున్నదని పారిశ్రామిక కూటమి ఫిక్కీ నిర్వహించిన సర్వేలో అత్యధిక మంది ఇదే అభిప్రాయాన్ని వ్యక్తంచేశారు. గడిచిన మూడు నెలల్లో తయారీరంగం ఉత్పత్తి 54 శాతం నుంచి 41 శాతానికి పడిపోయిందని వెల్లడైంది. తాజాగా విడుదల చేసిన నివేదికలో ఈ విషయం స్పష్టమైంది. జనవరి-మార్చి మధ్యకాలంలో అత్యధిక వృద్ధిని నమోదు చేసుకున్న తయారీ రంగం..ఆ మరుసటి క్వార్టర్‌లో భారీగా పడిపోయింది. ఆర్డర్ బుక్‌లో వృద్ధి 44 శాతం నుంచి 36 శాతానికి జారుకున్నాయి. సర్వేలోపాల్గొన్న వారిలో 86 శాతం మంది దేశీయంగా డిమాండ్ లేకపోవడం, అంతర్జాతీయ మార్కెట్లలో కూడా అంతంత మాత్రమే డిమాండ్ ఉండటం వల్లనే ఈ పరిస్థితి దాపురించిందని పేర్కొన్నారు. ఇప్పుడిప్పుడే ఎగుమతుల్లో పెరుగుదల కనిపిస్తున్నదన్నారు. ఎక్స్ఛేంజ్ రేట్లలో నెలకొన్న అనిశ్చిత పరిస్థితులు ఎగుమతులపై తీవ్రస్థాయిలో ప్రభావం చూపుతున్నాయని 79 శాతం మంది అభిప్రాయపడ్డారు. కానీ, ఇదే సమయంలో డాలర్‌తో పోలిస్తే రూపాయి పతనం ఎలాంటి ప్రభావం పడకపోవడం విశేషం. వచ్చే మూడు నెలల్లో భారీగా ఉద్యోగ అవకాశాలు లభించే అవకాశాలు లేవని 65 శాతం మంది స్పష్టంచేశారు. తయారీరంగంపై విధిస్తున్న వడ్డీరేటు 10.3 శాతం నుంచి 9.9 శాతానికి తగ్గడం కొంత ఊరటనిచ్చే విషయం. ఒకప్పుడు అధికస్థాయిలో 14 శాతం వసూలు చేసేవారు. గడిచిన ఐదు నెలల్లో రిజర్వు బ్యాంక్ వడ్డీరేట్లను పావుశాతం చొప్పున మూడు సార్లు తగ్గించడంతో బ్యాంక్ ఇచ్చే రుణాలు మరింత చౌకయ్యాయి. భవిష్యత్తులో మరింత తగ్గే అవకాశాలున్నాయని సర్వేలో పాల్గొన్న వారిలో అత్యధిక మంది ఇదే అభిప్రాయం వ్యక్తంచేశారు. ముడి సరుకులు ధరలు పెరుగడం, మరోవైపు జీతభత్యాలు, విద్యుత్ ఖర్చు, ఇంధన ధరలు అధికమవడం, ఆర్థిక ఖర్చు అధికమవడంతో తయారరంగం తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నదని తెలిపింది.

## జెట్ దివాలా ప్రక్రియ మొదలు

**న్యూఢిల్లీ, జూన్ 23:** జెట్ ఎయిర్‌వేస్‌పై దివాలా ప్రక్రియ మొదలైంది. రూ.8,500 కోట్ల రుణ భారాన్ని మోస్తున్న ఈ దేశీయ ప్రైవేట్ రంగ విమనయాన సంస్థ.. ఈ ఏడాది ఏప్రిల్ 17న విమాన సేవలకు గుడ్‌బై చెప్పిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఈ నెల 20న రుణదాతలు సంస్థను దివాలా కోర్టు (ఎన్‌సీఎల్‌టీ)కు లాగగా, దివాలా చర్యలు మొదలైనట్లు ఆదివారం జెట్ ఎయిర్‌వేస్ తెలిపింది. ఎస్‌బీఐ నేతృత్వంలోని 26 మంది రుణదాతలు ఎన్‌సీఎల్‌టీలో పిటిషన్ వేయగా, ముంబై ధర్మాసనం.. కార్పొరేట్ ఇన్సాల్వెన్సీ రిజల్యూషన్ ప్రాసెస్ (సీఐఆర్‌పీ)కు దిగింది. సంస్థ పునరుద్ధరణకు చేసిన అనేక ప్రయత్నాలు విఫలమయ్యాయంటూ ఈ నెల 17న జెట్ రుణదాతలు.. దివాలాకు ఓటేశారు. కాగా, 90 రోజుల్లో రిజల్యూషన్ ప్రాసెస్‌ను ముగించాలంటూ ఆర్పీని ఎన్‌సీఎల్‌టీ ఆదేశించింది.

## పీ-నోట్స్ ద్వారా రూ.82 వేల కోట్ల పెట్టుబడులు



**న్యూఢిల్లీ, జూన్ 23:** దేశీయ క్యాపిటల్ మార్కెట్లలోకి పార్టిసిపేటరీ నోట్స్(పీ-నోట్స్) ద్వారా వచ్చే పెట్టుబడులు క్రమంగా పెరుగుతున్నాయి. గత నెల చివరినాటికి మరో రూ.1,400 కోట్లు పెరిగి మొత్తం రూ.82,619 కోట్లకు చేరుకున్నాయి. దేశీయ స్టాక్ మార్కెట్లలో పెట్టుబడులు పెట్టాలనుకునే విదేశీ మదుపరులు అప్పటికే నమోదు చేసుకున్న విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు నుంచి నేరుగా అనుమతించేవాటిని పీ-నోట్స్ పెట్టుబడులు అంటారు. ఈ పెట్టుబడులకు ఎలాం టి అనుమతులు అవసరం లేదు. సెబీ వద్ద ఉన్న సమాచారం మేరకు మే చివరి నాటికి పీ-నోట్స్ ద్వారా దేశీయ ఈక్విటీ, డెబిట్, డెరివేటివ్‌లలోకి రూ.82,619 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. ఏప్రిల్ చివరి నాటికి ఇవి రూ.81,220 కోట్లుగా ఉన్నాయి. వీటిలో ఈక్విటీ మార్కెట్లలోకి రూ.61,574 కోట్లు, డెబిట్ మార్కెట్లోకి రూ.19,681 కోట్లు, డెరివేటివ్‌లోకి రూ.193 కోట్లు వచ్చాయి. గడిచిన 3 నెలలుగా ఇవి పెరుగుతున్నాయి. ఫిబ్రవరి వరకు రూ.73,428 కోట్ల పెట్టుబడులు రాగా, మార్చికి ఇవి రూ.78,110 కోట్లకు, ఏప్రిల్‌కి రూ.81,220 కోట్లకు చేరుకున్నాయి.

# ఇక ఓన్ డ్యామేజ్ మోటర్ పాలసీ



సెప్టెంబర్ 1 నుంచి కొత్త, పాత వాహనాలకు కవరేజీ

జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీలకు స్పష్టం చేసిన ఐఆర్‌డీఏఐ

**న్యూఢిల్లీ, జూన్ 23:** భూకంపాలు, వరదలు వంటి ప్రకృతి వైపరీత్యాలు.. విధ్వంసాలు, అల్లర్లు వంటి విపత్తుల్లో నష్టపోయిన వాహనదారులకు స్టాండలోన్ వార్షిక వోన్ డ్యామేజ్ (ఓడీ) కింద బీమా సదుపాయాన్ని కల్పించాలని జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీలను బీమా రంగ నియంత్రణ సంస్థ ఐఆర్‌డీఏఐ ఆదేశించింది. కొత్త వాటితోపాటు పాత కార్లు, ద్విచక్ర వాహనాలకు సెప్టెంబర్ 1 నుంచి బీమా సౌకర్యాన్ని అందుబాటులోకి తేవాలని సూచించింది. దీంతో ఇక కార్లు, టూవీలర్లకు బండిల్డ్ పాలసీల జారీ తప్పనిసరి కాబోదు. సుప్రీం కోర్టు తీర్పు నేపథ్యంలో గతంలో ఇచ్చిన ఆదేశాల్లో ఈ మేరకు ఐఆర్‌డీఏఐ మార్పులు చేసింది. పాలసీదారుడు కోరితే అగ్ని ప్రమాదం, దొంగతనాలకూ ఓడీ కవరేజీని ఇవ్వాలని స్పష్టం చేసింది. కాగా, ఓడీ వాహన ఇన్సూరెన్స్ కొనుగోలు.. వాహనదారుడు తమ ఇష్టానుసారంగా తీసుకోవచ్చు. అయితే స్టాండలోన్ ఓడీ, థర్డ్-పార్టీ పాలసీలకు అదనంగా ప్యాకేజీ పాలసీలను అమ్ముకునే దానిపై నిర్ణయాన్ని బీమా సంస్థలకే ఐఆర్‌డీఏఐ వదిలేసింది. అయినప్పటికీ దీర్ఘకాలిక స్టాండలోన్ ఓడీ పాలసీని ప్రస్తుతం అనుమతించబోమని తాజా సర్క్యులర్‌లో స్పష్టం చేసింది. ఇదిలావుంటే ఐఆర్‌డీఏఐ తాజా ఆదేశాలపై బజాజ్ అలియాంజ్ జనరల్ ఇన్సూరెన్స్ కార్యదర్శి ఓంకార్ కొఠారి స్పందిస్తూ.. ఈ కొత్త నిర్ణయాలపై మరింత స్పష్టత అవసరమని అభిప్రాయపడ్డారు. ధర, కాల వ్యవధి తదితర అంశాలపై స్పష్టత రావాల్సి ఉందన్నారు.

**విలీన మార్గాల అన్వేషణ**

ప్రభుత్వ బీమా రంగ ఏకీకరణకున్న మార్గాలను అన్వేషిస్తున్నది మోదీ సర్కారు. న్యూ ఇండియా అస్యూరెన్స్‌తో ఇతర ప్రభుత్వ బీమా కంపెనీల విలీనాలకూ యోచిస్తున్నది. జీవిత బీమా రంగ దిగ్గజం ఎల్ఐసీ తరహాలో జనరల్ ఇన్సూరెన్స్ రంగంలోనూ ఓ భారీ సంస్థ ఏర్పాటును కేంద్రం కోరుకుంటున్నది. విలీనానంతర భారీ సంస్థలో వాటాలనూ అంతే స్థాయిలో విక్రయించాలని చూస్తున్నది. ఇప్పటికే ఈ విలీనాలపై ఈఅండ్‌వైని కన్సల్టెంట్‌గా ప్రభుత్వం నియమించింది కూడా. ఈ ఆర్థిక సంవత్సరం (2019-20)లో ప్రభుత్వ రంగ సంస్థల్లో వాటాల విక్రయం ద్వారా రూ.90,000 కోట్లను సమీకరించాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నది. గత ఆర్థిక సంవత్సరం (2018-19) రూ.85,045 కోట్లను సేకరించిన విషయం తెలిసిందే. అలాగే నేషనల్ ఇన్సూరెన్స్ కంపెనీ, ఓరియంటల్ ఇన్సూరెన్స్ కంపెనీ, యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీల్లో వాటాల విక్రయాన్నీ కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ అధీనంలో ఉన్న పెట్టుబడులు, ప్రభుత్వ ఆస్తుల నిర్వహణ శాఖ (డీఐపీఏఎం) పరిశీలిస్తున్నది. గడిచిన రెండేండ్లుగా వాటాల అమ్మకం ఎటూ తేలకుండా ఉన్నదని, దీనిపై త్వరగా ఓ నిర్ణయానికి రావాలని కేంద్రం భావిస్తున్నట్లు ఓ అధికారి చెప్పారు. 2018-19 బడ్జెట్‌లోనే ఈ మూడు సంస్థల విలీనాన్ని మోదీ సర్కారు ప్రతిపాదించింది. అయితే ఈ సంస్థల ఆర్థిక పరిస్థితులు అందుకు సహకరించకపోవడం తదితర కారణాల మధ్య వాయిదా పడింది.

## ఇండస్ఇండ్‌లో రూ.2,700 కోట్ల పెట్టుబడి

వాటాను పెంచుకున్న హిందుజాలు



**ముంబై, జూన్ 23:** ప్రైవేట్ రంగ ఆర్థిక సేవల సంస్థయైన ఇండస్ఇండ్ బ్యాంక్‌లో మెజార్టీ వాటా కలిగిన హిందుజాలు తమ వాటాను మరింత పెంచుకున్నారు. వ్యారెంటీ ఇష్యూ కింద రూ.2,700 కోట్ల పెట్టుబడులు పెట్టబోతున్నట్లు బ్యాంక్ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. భారత్ ఫైనాన్షియల్(గతంలో ఎస్‌కేఎస్)ను విలీనం చేసుకున్న తర్వాత వచ్చిన ఇదే అతిపెద్ద పెట్టుబడి. వచ్చే నాలుగు నుంచి పూర్తిస్థాయిలో ఈ విలీనం అమలులోకి రాబోతున్నది. బ్యాంక్ ప్రమోటర్లైన హిందుజాలు 15 శాతం అదనపు వాటాను కొనుగోలు చేయడానికి రూ.2,700 కోట్ల నిధులను చొప్పించనున్నట్లు బ్యాంక్ స్ట్రాటజీ హెడ్ సంజయ్ మాలిక్ తెలిపారు. ఈ మొత్తం పెట్టుబడుల్లో నాలుగోవంతు విలీనం తర్వాత రానుండగా, మిగతా నిధులు 18 నెలల తర్వాత బ్యాంక్‌లోకి రానున్నాయని ఆయన చెప్పారు. శుక్రవారం స్టాక్ మార్కెట్ ముగిసే సమయానికి ఉన్న రూ.1,448.70 షేరు కంటే అధికంగా ఒక్కో షేరుకు రూ.1,709కి కొనుగోలు చేయడం విశేషం. అక్టోబర్ 2017లో హైదరాబాద్ కేంద్రస్థానంగా సూక్ష్మ రుణాలు అందిస్తున్న భారత్ ఫైనాన్షియల్‌ను విలీనం చేసుకోబోతున్నట్లు ఇండస్ఇండ్ బ్యాంక్ ప్రకటించింది. దీంతో బ్యాంక్‌కు చెందిన 639 షేర్లకుగాను వెయ్యి షేర్లు లభించాయి. రూ.4,200 కోట్ల నికర విలువ కలిగిన బ్యాంక్‌ను ఆర్థికంగా బలోపేతం చేయాలనే ఉద్దేశంతోనే హిందుజాలు ఈ భారీ స్థాయిలో పెట్టుబడులు పెట్టారని మాలిక్ చెప్పారు. ఈ విలీనంతో చిన్నస్థాయిలో రుణాలు తీసుకున్నవారికి ఆర్థికంగా ప్రయోజనం లభించనున్నదని, ముఖ్యంగా మూడు శాతం పాయింట్లు అదనంగా సమకూరనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం భారత్‌లో 20 ఆర్థిక సేవల సంస్థలు ఉండగా, వీటిలో భారత్ ఫైనాన్షియల్ ఒకటని వ్యాఖ్యానించారు. మార్చి 31తో ముగిసిన త్రైమాసికంలో బ్యాంక్ వడ్డీ మార్జిన్ 3.9 శాతంగా ఉన్నది. గడిచిన త్రైమాసిక ఆర్థిక ఫలితాలను వచ్చే నెల 12న విడుదల చేయబోతున్నట్లు ఆయన ప్రకటించారు.

## కొనసాగుతున్న ఎఫ్‌పీఐల పెట్టుబడులు

జూన్‌లో ఇప్పటివరకు రూ.10,312 కోట్లు



**న్యూఢిల్లీ, జూన్ 23:** దేశీయ క్యాపిటల్ మార్కెట్లలోకి విదేశీ పెట్టుబడుల హవా కొనసాగుతున్నాయి. ప్రస్తుత నెలలో ఇప్పటివరకు క్యాపిటల్ మార్కెట్లలోకి రూ.10,312 కోట్ల నిధులను చొప్పించారు. జూన్ 3 నుంచి 21 మధ్య కాలంలో ఈక్విటీల్లోకి రూ.552.07 కోట్ల పెట్టుబడులు పెట్టిన ఎఫ్‌పీఐలు..డెబిట్ మార్కెట్లోకి మాత్రం గరిష్ఠంగా రూ.9,760.59 కోట్లను పెట్టుబడుల రూపంలో చొప్పించినట్లు డిపాజిటరీ వద్ద ఉన్న సమాచారం మేరకు తెలియవచ్చింది. ఫిబ్రవరిలో రూ.11,182 కోట్లను క్యాపిటల్ మార్కెట్లోకి(డెబిట్, ఈక్విటీ) ఇన్వెస్ట్ చేసిన ఎఫ్‌పీఐలు..మార్చి నెలలో రూ.45,981 కోట్లు, ఏప్రిల్‌లో రూ.16,093 కోట్లు, మేలో రూ.9,031.15 కోట్లను పెట్టారు. అమెరికా-ఇరాన్ దేశాల మధ్య నెలకొన్న ఉద్రిక్తత పరిస్థితులు మరింత ముదురుతుండటంతో అంతర్జాతీయ పెట్టుబడిదారుల్లో ఆందోళనను మరింత పెంచిందని, దీంతో తొలివారంలో భారీగా పెట్టుబడులు పెట్టిన ఇన్వెస్టర్లు, చివరి వారంలో వెనక్కి తీసుకున్నారని గ్రోవ్ సీవోవో హర్ష జైన్ తెలిపారు. ఇది స్వల్పకాలం మాత్రమేనని, దీర్ఘకాలికంగా ఇక్కడ ఇన్వెస్ట్ చేయడానికి ఆసక్తి చూపే అవకాశం ఉందన్నారు.

## లక్ష్య సాధనకు బాటలు

రూ.5 లక్షల కోట్ల ఆర్థిక వ్యవస్థ కోసం ప్రధానికి నిపుణుల సూచనలు

**న్యూఢిల్లీ, జూన్ 23:** దేశ ఆర్థిక వ్యవస్థ 5 లక్షల కోట్ల డాలర్లకు చేరడానికి నిపుణుల కమిటీ పలు సూచనలు చేసిందని నీతి ఆయోగ్ ఆదివారం తెలిపింది. స్థూల ఆర్థిక పరిస్థితులు, ఉపాధి, ఉద్యోగావకాశాల కోసం ఏర్పాటైన ఈ కమిటీ.. శనివారం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో సమావేశం సందర్భంగా ఈ సూచనలు ఇచ్చిందని ట్విట్టర్‌లో వివరించింది. నీతి ఆయోగ్ ఆధ్వర్యంలో ఇక్కడ జరిగిన సమావేశంలో ప్రస్తుత దేశీయ ఆర్థిక పరిస్థితులపై ఆర్థికవేత్తలు, పరిశ్రమ వర్గాలతో మోదీ చర్చించారు. ఈ సందర్భంగానే వృద్ధి లక్ష్యాల సాధనకు అంతా తమ అభిప్రాయాలను తెలియజేశారు. 'ఎకనామిక్ పాలసీ-ది రోడ్ ఎహెడ్' పేరిట నీతి ఆయోగ్ నిర్వహించిన ఈ సమావేశానికి 40 మందికిపైగా ఆర్థికవేత్తలు, వివిధ రంగాల నిపుణులు, సంస్థల అధిపతులు హాజరైయ్యారు. ఎన్ చంద్రశేఖరన్ (టాటా సన్స్ చైర్మన్), టీవీ నరేంద్రన్ (టాటా స్టీల్ గ్లోబల్ సీఈవో, ఎండీ), అనిల్ అగర్వాల్ (వేదాంత రిసోర్సెస్ చైర్మన్), సంజీవ్ పురి (ఐటీసీ చైర్మన్, ఎండీ), విజయ్ శేఖర్ శర్మ (పేటీఎం సీఈవో) తదితరులు వచ్చారు. వచ్చే నెల 5న లోక్‌సభలో ఈ ఆర్థిక సంవత్సరానికి (2019-20)గాను కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్న విషయం తెలిసిందే. కాగా, గనుల రంగంలో ప్రభుత్వం వ్యాపారం చేయడానికి ఏమీ లేదని ఎన్ఎండీసీ, హిందుస్థాన్ జింక్‌ల్లో వాటాలను ఉపసంహరించుకోవాలని వేదాంత చీఫ్ అనీల్ అగర్వాల్ ఈ సందర్భంగా ప్రధాని మోదీకి సూచించడం గమనార్హం.

## బ్యూరోక్రాట్లకు చుట్టుకున్న ఐఎన్ఎక్స్ కేసు

నీతి ఆయోగ్ మాజీ సీఈవో, ఎంఎస్ఎంఈ మాజీ సెక్రటరీలను విచారించనున్న సీబీఐ




**న్యూఢిల్లీ, జూన్ 23:** ఐఎన్ఎక్స్ మీడియా కేసు తిరిగి తిరిగి మాజీ బ్యూ రోక్రాట్లకు చుట్టుకుంటున్నది. ఐఎన్ఎక్స్ మీడియాలోకి వచ్చిన నిధుల వ్యవహారంలో నీతి ఆయోగ్ మాజీ సీఈవో సింధుశ్రీ కుల్లార్, సూక్ష-చిన్న మధ్యతరహా(ఎంఎస్ఎంఈ) మాజీ కార్యదర్శి అనుప్ కే పూజారీలతోపాటు ఇతర టాప్ బ్యూరోక్రాట్లను విచారించడానికి సెంట్రల్ విజిలెన్స్ కమిషన్(సీవీసీ)..సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్(సీబీఐ)కి అనుమతినిచ్చింది. వీరితోపాటు ప్రస్తుతం హిమాచల్ ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులుగా విధులు నిర్వహిస్తున్న రవీంద్ర ప్రసాద్, ప్రబోధ్ సక్సేనాలను కూడా విచారించడానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. 2004 నుంచి 2008 మధ్యకాలంలో ఆర్థిక వ్యవహారాల అదనపు కార్యదర్శిగా కుల్లార్ విధులు నిర్వహించగా, పూజారీ కూడా 2006 నుంచి 2010 వరకు జాయింట్ సెక్రటరీగా పనిచేశారు. వీరిద్దరు అప్పటి కేంద్ర ఆర్థిక మంత్రి పీ చిదంబరం హయంలో పనిచేయడం విశేషం. అలాగే సక్సేనా 2008 నుంచి 2010 వరకు ఆర్థిక మంత్రిత్వ శాఖ డైరెక్టర్‌గాను, ప్రసాద్ విచారణ అధికారిగా విధులు నిర్వహించారు. ఐఎన్ఎక్స్ మీడియాలోకి వచ్చిన రూ.305 కోట్ల విదేశీ నిధులను చట్టాలకు వ్యతిరేకంగా అప్పటి విదేశీ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డ్(ఎఫ్ఐపీబీ) అనుమతినిచ్చింది. దీనిపై విచారించిన సీబీఐ..వీటికి వ్యతిరేకంగా ఎఫ్ఐఆర్‌ను దాఖలు చేసింది.

# ఒడిదుడుకుల వారం!

స్టాక్ మార్కెట్లకు దిశానిర్దేశం చేయనున్న అంతర్జాతీయ అంశాలు

అమెరికా-ఇరాన్ దేశాల మధ్య నెలకొన్న ఉద్రిక్తత పరిస్థితులు కూడా

రూపాయి, ఇంధన ధరలు, విదేశీ పెట్టుబడులూ కీలకం



**న్యూఢిల్లీ, జూన్ 23:** ఈవారంలో దేశీయ స్టాక్ మార్కెట్లు తీవ్ర ఒడిదుడుకులను ఎదుర్కొనే అవకాశాలున్నాయని మార్కెట్ పండితులు అంచనావేస్తున్నారు. అంతర్జాతీయంగా నెలకొన్న ఇబ్బందికర పరిస్థితులకు తోడు దేశీయంగా నెలకొన్న మందకొడి పరిస్థితులు కూడా తోడవడంతో గడిచిన వారంలో భారీగా పడిపోయిన మార్కెట్లు ఈ వారంలోనూ మరింత పడిపోయే ప్రమాదం ఉన్నదని అత్యధిక మంది విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. అమెరికా-ఇరాన్ దేశాల మధ్య నెలకొన్న ఉద్రిక్తత పరిస్థితులు, అంతర్జాతీయ వాణిజ్య యుద్ధ మేఘాలు, దేశీయంగా ఆశించిన స్థాయిలో వర్షాలు కురియకపోవడం కూడా స్టాక్ మార్కెట్లకు దిశానిర్దేశం చేయనున్నాయి. అమెరికాకు చెందిన డ్రోన్ కెమెరా కూల్చివేయడం, రెండు చమురు ట్యాంక్‌లను పేల్చివేయడం వంటి సంఘటనలతో గడిచిన వారంలో తీవ్ర ఆటుపోటులకు గురైన అంతర్జాతీయ మార్కెట్లు ఈ వారంలోనూ మరింత ఒత్తిడికి గురికావచ్చున్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. ఇరాన్‌పై సైనికదాడులకు సిద్ధమని ప్రకటించడంతో గ్లోబల్ మార్కెట్లో ఇంధన ధరలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. గత శుక్రవారం ఒక్క రోజే బ్యారెల్ ధర ఆరు శాతం పెరుగడంపై మదుపరులు ఈ పరిస్థితిని నిశితంగా పరిశీలించనున్నారు. వరుసగా రెండోసారి అధికారంలోకి వచ్చిన నరేంద్ర మోదీ సర్కార్ ప్రవేశపెట్టనున్న సార్వత్రిక బడ్జెట్‌లో తీసుకోనున్న నిర్ణయాలు, గ్లోబల్ మార్కెట్లలో కదలికలు దేశీయ ఈక్విటీలపై ప్రభావం చూపనున్నాయని సామ్‌కో సెక్యూరిటీస్ ఫౌండర్, సీఈవో జిమీత్ మోదీ తెలిపారు. డాలర్‌తో పోలిస్తే రూపాయి కదలికలు, క్రూడాయిల్ ధరల పెరుగుదల కూడా మార్కెట్లను ప్రభావితం చేసే అంశాలని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం నెలకొన్న ట్రేడ్ వార్, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తత పరిస్థితుల నేపథ్యంలో మదుపరులు పెట్టుబడులు పెట్టకపోవడం మంచిదని ఆయన ఇన్వెస్టర్లకు సూచించారు. గడిచిన వారంలో ఒక్క శాతానికి పతనమైన సూచీలు మరికొన్ని రోజులపాటు దిగువముఖంగా ప్రయాణించనున్నాయని, ఆ తర్వాత స్థిరికరణ జరిగి మళ్లీ కోలుకునే అవకాశాలున్నాయన్నారు. గతవారంలో సెన్సెక్స్ 257.58 పాయింట్లు పతనం చెందింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి కూడా 14 పైసలు తగ్గి రూ.69.58 వద్ద ముగిసింది.

**రుతుపవనాల పురోగతి కీలకం:**

రుతుపవనాల పురోగతిపై కూడా మదుపరులు దృష్టి సారించే అవకాశాలున్నాయి. ఈ నెల ప్రారంభం నుంచి ఇప్పటివరకు దేశవ్యాప్తంగా 43 శాతం వర్షం లోటు ఏర్పడిందని వాతావరణ శాఖ ప్రకటించడం కూడా పెట్టుబడిదారుల్లో ఆందోళనను మరింత పెంచనున్నది.

### భారీగా నష్టపోయిన బ్లూచిప్‌లు

గడిచినవారంలో దేశీయ బ్లూచిప్ సంస్థలకు నిరాశే ఎదురైంది. టాప్-10 బ్లూచిప్ సంస్థల్లో ఆరు కంపెనీలు నికరంగా రూ.54,458.80 కోట్ల మేర మార్కెట్ విలువను కోల్పోయాయి. వీటిలో రిలయన్స్ ఇండస్ట్రీస్ అత్యధికంగా రూ.23,929.9 కోట్లు పడిపోయి రూ.8,10,889.80 కోట్లకు జారుకున్నది. వీటితోపాటు టీసీఎస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, హెచ్‌యూఎల్, హెచ్‌డీఎఫ్‌సీ, ఐటీసీల మార్కెట్ విలువ కోల్పోగా..ఇన్ఫోసిస్, ఎస్‌బీఐ, కొటక్ మహీంద్రా బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్‌లు మాత్రం పెరిగాయి.

### ఎఫ్ అండ్ వో కాంట్రాక్టులు

ప్రస్తుత నెలకుగాను ఫ్యూచర్ అండ్ డెరివేటివ్ కాంట్రాక్టు గడువు కాలపరిమితి ముగియనుండటంతో మదుపరులు ముందు జాగ్రత్త చర్యగా కొనుగోళ్లకు మొగ్గుచూపకపోవచ్చును. జూన్ నెలకుగాను కాంట్రాక్టుల గడువు గురువారం ముగియనున్నది.


29 జిల్లాలలో తెలంగాణ రాష్ట్రసమితి పార్టీ నూతన కార్యాలయ భవనాల
శంకుస్థాపన కార్యక్రమం సందర్భంగా టీఆర్ఎస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు మరియు
టీఆర్ఎస్ పార్టీ అభిమానులకు తెలంగాణ రాష్ట్ర సమితి యువజన విభాగం తరపున శుభాకాంక్షలు ...
తెలంగాణ రాష్ట్ర ప్రదాత, జనహృదయ నేత, బంగారు తెలంగాణ నిర్మాత,
అపర భగీరథుడు, ముఖ్యమంత్రివర్యులు
శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు సారు గారికి
మరియు యువతకు స్ఫూర్తి, తెలంగాణ ఘనకీర్తి,
భవిష్యత్తు తరాల ఆశాజ్యోతి, తండ్రికి తగ్గ తనయుడు
టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్
శ్రీ కల్వకుంట్ల తారకరామారావు అన్న గారికి
శుభాకాంక్షలు
టీఆర్ఎస్ పార్టీయే
తెలంగాణకు శ్రీరామరక్ష
జై కేసీఆర్
శంభీపూర్ రాజు
ఎమ్మెల్సీ, టీఆర్ఎస్ పార్టీ యూత్ వింగ్ రాష్ట్ర అధ్యక్షులు
తెలంగాణ రాష్ట్ర సమితి యువజన విభాగం

జిందగీ

సోమవారం 24 జూన్ 2019 WWW. NTNEWS.COM /nt.zindagi



తోపుడుబళ్ల మీదా, నెత్తిన ఓ బుట్ట పెట్టుకుని ఇళ్ల వెంట తాజా కూరలు అంటూ అమ్మే రోజులు పోయాయి. అలాగే సందుచివర కనిపించే పళ్లు, కూరలను అమ్మే వ్యాపారాలు కూడా క్రమంగా కనుమరుగైపోతున్నాయి. అయితే తాజా కూరలు, పళ్లకి డిమాండ్ ఏమైనా తగ్గిందా అంటే మాత్రం లేదనే చెప్పాలి. ఆరోగ్యమైన జీవితాన్ని గడిపేందుకు.. ప్రజలు గతంలో కంటే ఎక్కువగా వీటికి ప్రాధాన్యమిస్తున్నారు. ప్రస్తుత కాలానికి అనుగుణంగా, సాంకేతికను అందిపుచ్చుకుంటున్న ప్రజలు.. అన్నింటికీ ఆన్‌లైన్ మార్గాన్ని ఎంచుకుంటున్నారు. దీనిద్వారా కావలసిన వస్తువులు ఇంటికే వచ్చేలా ప్లాన్ చేసుకుంటున్నారు. ఆన్‌లైన్ ద్వారా కూరగాయలు అందించే వ్యాపారంలో విజయం సాధించారు గుర్‌గావ్‌కు మహిళ. కార్పొరేట్ ఉద్యోగం వదులుకుని ఫ్రెష్ 2 ఆల్ పేరుతో తాజా కూరగాయల వ్యాపారంలోకి అడుగుపెట్టిన పూర్ణిమా రావ్ సక్సెస్‌మంత్ర.

## 'కార్పొరేట్' నుంచి కూరగాయల బిజినెస్‌కు

# పూర్ణిమారావు

**పంటపొలాల్లో** రైతుల నుంచి కొనుగోలు చేసి.. నేరుగా కస్టమర్ల ఇళ్లకు తాజా కూరగాయలు, పళ్లను అందించే లక్ష్యంతో ఫ్రెష్2ఆల్ ప్రారంభమైంది. తాజా వస్తువులను ఆహారంగా తీసుకుంటే ఆరోగ్యంగా ఉండొచ్చనేది ఈ వెంచర్లో కీలకమైన పాయింట్. ఢిల్లీకి కూతవేటు దూరంలోని గుర్గావ్‌లో తాజా పళ్లు, కూరగాయలను ఫ్రెష్2ఆల్ విక్రయిస్తున్నది. పాత కాన్సెప్టే అయినా కొత్త ఆలోచనతో పూర్ణిమారావ్ దీన్ని నడిపిస్తున్న తీరు అందరినీ ఆకట్టుకుంటున్నది.

### కార్పొరేట్ ఉద్యోగం వదిలి..

పంజాబ్‌లోని పటియాలాలో ఓ మధ్య తరగతి కుటుంబం నుంచి వచ్చారు పూర్ణిమ. 8 ఏళ్ల వయసులో ఉండగా పూర్ణిమ తండ్రిని పోగొట్టుకున్నారు. తర్వాత పిల్లలను పెంచేందుకు తల్లి ఎంతగా కష్టపడ్డారో ప్రత్యక్షంగా చూశారామె. అందుకే అదే ఊరులో పాఠశాల చదువు, ఫరీద్‌కోట్‌లో కంప్యూటర్ సైన్స్‌లో బీటెక్ చేశారు. డిగ్రీ పూర్తయ్యాక జెన్‌పాక్ట్‌లో ఏడు నెలలపాటు ఉద్యోగం చేశారు. ఆ తర్వాత ఈవాల్యూసర్వీస్‌తో సహా పలు కంపెనీల్లో వివిధ బాధ్యతలు చేపట్టారు. 2004లో పూర్ణిమకు పెండ్లి అయ్యింది. అయినప్పటికీ తన ఉద్యోగాన్ని కొనసాగించింది. 2007లో తొలిసారి ఆమె కూతురుకు జన్మనిచ్చారు. అప్పుడే ఉద్యోగాన్ని వదిలేశారు. నాలుగేళ్ల తర్వాత 2011లో మరోసారి కార్పొరేట్ ఉద్యోగంలో చేరారు. కానీ దాన్ని కూడా ఎక్కువకాలం కొనసాగించలేకపోయారు. కారణం ఆ తరువాతి ఏడాది 2012లో రెండో కూతురు పుట్టడంతో మళ్లీ ఉద్యోగానికి గుడ్ బై చెప్పేశారు.

### స్వంతంగా వ్యాపారం

ఇద్దరు పిల్లల కారణంగా రెండుసార్లు కార్పొరేట్ కెరీర్‌కు బ్రెక్ పడినప్పటికీ పూర్టిమా పెద్దగా బాధపడలేదు. చిన్న కూతురికి రెండేండ్ల వయసు దాటాక ఉద్యోగం చేద్దామని మరోసారి భావించారు. అయితే ఒకరి మీద ఆదారపడి ఎన్నాళ్లు చేయడం, దీనికి బదులుగా సొంతగా ఏదైనా చేయాలనే ఆలోచన అంతర్లీనంగా మనసులో ఉంది. దాంతోపాటు పెండ్లయిన కొత్తలో తన భర్త తరపు బంధువులకు వ్యవసాయంతో ఉన్న అనుబంధం, పొలాల్లో వారు పడుతున్న కష్టం చూశాక.. ఆమెకు ఓ మంచి ఆలోచన తట్టింది. ఆ ఆలోచన నుండి పుట్టిందే ఫ్రెష్ 2 ఆల్. రైతులను, కస్టమర్లను కలిపేలా ఈ ఆన్‌లైన్ వ్యాపారాన్ని 2015 జూలైలో ప్రారంభించారు పూర్ణిమ.

### తాజా కూరగాయలు

పూర్టిమ కుటుంబానికి హర్యానాలో పంటభూములు ఉన్నాయి. అలాగే హర్యానా, రాజస్థాన్, పంజాబ్‌లలో వారి బంధువులు ఉన్నారు. ఇటు గుర్‌గావ్‌లోనూ చాలామంది తెలుసు. అందుకే వీరందిరినీ కలుపుతూ ఈ రంగంలో ఎవరూ చేయలేని విధంగా అందుబాటు ధరల్లో, రసాయనాలు లేని పదార్థాలను అందించాలని నిర్ణయించుకుంది. మార్కెట్లో కూరగాయలు లభిస్తున్న రేట్లకే.. ఇలాంటి తాజా కూరలు, పళ్లు అందించడం సాధ్యమేనని గుర్తించింది. మొదట వారి సొంత పొలాలు, తోటల్లో పండిన కూరగాయలు, పండ్లను విక్రయించగా ఆ తర్వాత మరికొంతమంది రైతులను కూడా ఇందులో భాగస్వాములను చేశారామె.

### సవాళ్లను ఎదుర్కొని..

ఈ రంగంలో లాభదాయకత ఉండాలంటే.. విభిన్నంగా ఉండక తప్పదనే విషయం పూర్ణిమకు స్పష్టంగా తెలుసు. ఎందుకంటే ఇది విపరీతమైన పోటీ ఉన్న మార్కెట్. ఇప్పటికే అనేక కంపెనీలు భారీగా ఫండింగ్ కూడా పొంది, మార్కెట్లో సత్తా చాటుతున్నాయి. కొన్నింటికైతే వ్యాపారం ఇంకా ప్రారంభించక మునుపే నిధులు అందిన దాఖలాలు కూడా ఉన్నాయి. అందుకే ఇతరులతో పోల్చితే.. విధానాలు, ఉత్పత్తుల్లో పలు కీలకమైన మార్పులు ఉండాల్సిందేని భావించిందామె. అందుకే అందరికీ భిన్నంగా తన వ్యాపారం ఉండాలని నిర్ణయించుకున్నారు. అనుకున్నట్లుగానే ఫ్రెష్2ఆల్ గణనీయమైన అభివృద్ధి సాధించింది. అంతేకాదు కస్టమర్ల సంఖ్య కూడా వేగంగా పెరిగింది.

### కస్టమర్లకు మేలు జరిగేలా..

తమ కస్టమర్ల గురించి కూడా వివరించారు పూర్ణిమ. తమ కస్టమర్లలో 90శాతం మంది మధ్యతరగతి వారేనని.. వారితో తాను వ్యక్తిగతంగా కూడా కనెక్ట్ అయి ఉంటానంటున్నారు పూర్ణిమ. తద్వారా వారి ప్రాధాన్యాలు ఏంటో తెలుస్తాయని చెబుతున్నారు. తమ కస్టమర్లలో 90శాతం మంది ఇతర స్థానిక సర్వీసులకు ఆర్డర్ చేయడం మానేశారని గర్వంగా చెబుతారు పూర్ణిమ. వారి అంచనాలను అందుకోగలగడమే ఇందుకు కారణమన్నది ఆమె ఉద్దేశ్యం. తన కస్టమర్లకు తగిన ధరల్లో ఉత్తమమైన నాణ్యత గల సరుకు అందించడమే పూర్ణిమ వ్యూహం.

'ప్రతీ అపార్ట్‌మెంట్‌లోను, ప్రతీ ప్రాంతంలోనూ కొంత మంది మా కస్టమర్లు ఉండాలన్నది మా ప్రాథమిక లక్ష్యం. వీరినుంచి వచ్చిన రిఫరెన్సుల ద్వారా తర్వాత అపార్ట్‌మెంట్, కాలనీల వారీగా మార్కెట్ చేయాలని భావించాం. ఈ వ్యూహం సత్ఫలితాలనే అందించిందని చెప్పాలి. సాధారణ మార్కెటింగ్ కోసం ఖర్చు చేసేందుకు బదులుగా.. ఇప్పటికే ఉన్న కస్టమర్లకు కొంత లాభం పంచాలన్నది నా ఉద్దేశ్యం'అన్నారు పూర్ణిమ.కస్టమర్లతో అనుబంధం కొనసాగాలంటే.. నమ్మకం చాలా ముఖ్యమని పూర్ణిమ నమ్ముతారు. లావాదేవీల కంటే వినియోగదారులకే ఎక్కువ ప్రాధాన్యమిస్తారు కూడా. తన కస్టమర్లు ఇచ్చే ఫీడ్‌బ్యాక్‌కే ఎక్కువ విలువని ఇస్తారు పూర్ణిమ. తన సర్వీసుల్లో నాణ్యత పెంచేందుకు ఇది మరింతగా తోడ్పడిందని చెప్పారామె.

### ఇతర మార్కెట్‌ల నుండి..

గుర్‌గావ్‌లోని తన తోటల నుంచి తొలి పంట రావడానికి ముందే తన వ్యాపారాన్ని విస్తరించింది పూర్ణిమా. ఇతర మార్కెట్ల నుంచి నాణ్యతగల కూరలు, పళ్లను సేకరించి.. తన కస్టమర్లకు అందించారు పూర్ణిమ. ఇప్పటికి ఆమె టీం చిన్నదే. తరచుగా తనే వెళ్లి స్టాక్ తెచ్చుకుంటారు కూడా. కొంతమంది గ్రామాల్లో తిరుగుతూ వ్యవసాయ కార్యకలాపాలు చూసుకుంటూ ఉంటారు.తనకు ఉన్న చిన్న టీంతోనే ఎంతో హార్డ్ వర్క్ చేశారామె. అత్తవారింటి నుంచి లభించిన మద్దతుతో.. పని, కుటుంబాలను బేలన్స్ చేసేందుకు పూర్ణిమకు అవకాశం లభించింది. తను చేస్తున్న పనికి భర్త నుంచి పూర్తి మద్దతు లభిస్తుండడంతో.. ఆయననే దీనికి మూలస్తంభంగా చెప్తారామె. తొలి ఏడాదే రెండు లక్షలకు పైగా ఆదాయాన్ని ఆర్జించిన పూర్ణిమా గడచిన నాలుగేళ్లలో ప్రతి ఏడాది 40 నుంచి 50 శాతం వృద్ధిని సాధిస్తున్నారామె.



కస్టమర్లకు తిరిగి ఉపయోగించగల బ్యాగ్‌లను సరఫరా చేయడంతో.. ప్రతీ ఆర్డర్కు ₹5 రూపాయల ప్యాకేజింగ్ ఖర్చు తగ్గిపోయింది. ప్రతీ కస్టమర్ దగ్గరకు సరుకు పంపేటపుడు ఖచ్చితంగా ప్రింటెడ్ బిల్ అందిస్తాం. దీనికి వారి సంతకంతో కూడిన అక్నాలెజ్‌మెంట్ తప్పనిసరిగా ఉండాల్సిందే. కనీస ఆర్డర్ ధర లేకుండానే.. రిటర్న్, రిఫండ్లను అంగీకరించడంతో.. మా సేవలు, ఉత్పత్తుల్లో నాణ్యతను కస్టమర్లకు నేరుగా చెప్పినట్లు అయింది.

-పూర్ణిమారావు

## ఉద్యమానికి ఊపిరి పోస్తున్నది!



సమాజంలో చర్మ సౌందర్యం గురించి ఎంతోమంది మహిళలు అవహేళనలకు గురయిన సందర్భాలున్నాయి. అటువంటి అవహేళనలను తిప్పి కొట్టేందుకు సామాజిక మాధ్యమం వేదికగా ఓ ఉద్యమం ఏర్పాటయింది. ఓ మోడల్ తనలా మరెవరూ బాధపడకూడదని ఈ ఉద్యమానికి ఊపిరి పోస్తున్నది.

తెల్లగా ఉన్న వారికే అవకాశాలివ్వడం సరికాదని, బ్లాక్ స్కిన్ కలిగిన వారు కూడా అందంగా ఉంటారని నిరూపించేందుకు ఛత్తీస్‌గఢ్‌కు చెందిన రిహన్న అనే మోడల్ కంకణం కట్టుకున్నది. రెనీ కుజూర్ రిహన్న మూడేండ్ల వయసున్నప్పుడు ఫ్యాన్సీ డ్రెస్ కాంపిటేషన్‌లో పాల్గొన్నది. ఆ సమయంలో ప్రేక్షకులు ఆమెను 'నల్లమ్మాయి' అంటూ వెక్కిరించారు. రెనీ కుజూర్ కొన్నిరోజులు బాధపడింది. ఆ తర్వాత ఫ్యాషన్ రంగంలో ఎలాగైనా విజయం సాధించాలని నిర్ణయానికి వచ్చింది. తన 28వ ఏట మొదటిసారిగా మోడల్‌గా ప్రయత్నించింది. ఆ ప్రయత్నం విఫలమయింది. వ్యక్తిగతంగా జడ్జిలను కలవకపోవడం వల్లే మోడల్‌గా ఎంపికచేయలేదని రెనీ చెబుతున్నది. పైగా తన ముక్కు, చర్మాన్ని వంకగా చూపి తిరస్కరించారు. కాస్టింగ్ కౌచ్ వేధింపులు కూడా ఆమెకు తప్పలేదు. అటువంటి వాతావరణం రెనీ కుజూర్‌కు నచ్చలేదు. ప్రముఖ పాప్ సింగర్ రాబిన్ రిహన్న ఫెంటీకి రెనీకు దగ్గర పోలికలున్నాయని ఓ సందర్భంలో ఆమె స్నేహితులు గమనించారు. రెనీ పాప్‌స్టార్ పోలికలతో ఉండడం వల్ల చివరకు మోడల్‌గా అవకాశం దక్కింది. అందవికారంగా ఉన్నారని, నల్లగా ఉన్నారనేటటువంటి సామాజిక ఒత్తిళ్ల కారణంగా ఎంతోమంది మహిళలు పలు రంగాల్లో రాణించలేకపోతున్నారు. అటువంటి వివక్షను తిప్పి కొట్టేందుకు రెనీ కుజూర్ రిహన్నతో కలిసి ఓ సంస్థ 'ద స్టీరియోటైప్ ఫేస్' ప్రాజెక్టు ద్వారా ఉద్యమాన్ని చేపట్టింది. ఈ ఉద్యమం సమాజంలో అనేక మంది మహిళలు ఎదుర్కొంటున్న సామాజిక ఒత్తిళ్లకు చరమగీతం పాడేందుకు ఉద్దేశించింది.

## రాలుతున్న జుట్టుకు చెక్



- స్వచ్ఛమైన కొబ్బరి నూనె లేదా బాదాం నూనెను తీసుకుని కాస్త వేడి చేయాలి. దానిని తలకు పట్టించి, మునివేళ్లతో నెమ్మదిగా మసాజ్ చేయాలి. దీని వల్ల రక్త ప్రసరణ బాగా జరిగి జుట్టు కుదుళ్లు గట్టిపడతాయి. ఫలితంగా జుట్టు రాలడం తగ్గుతుంది.
- శారీరకంగా మనం ఎదుర్కొనే ప్రతి సమస్యకు వంటింట్లో పరిష్కారం దొరుకుతుంది. మన ఒంట్లో పోషకాహార లోపాన్ని బీట్‌రూట్ పూర్తి చేస్తుంది. కాబట్టి మీరు రోజు తీసుకునే ఆహారంలో బీట్ రూట్‌ను కూడా చేర్చితే జుట్టు రాలడాన్ని నివారించవచ్చు.
- ఉల్లిపాయ జ్యూస్ చాలామందికి రుచించదు. కానీ దీనిలో అత్యధికంగా ఉండే సల్ఫర్.. మీ కుదుళ్ల మధ్య రక్తప్రసరణను వేగవంతం చేయడానికి ఉపయోగపడుతుంది. కుదుళ్ల రంధ్రాలను బిగుతుగా చేస్తుంది. ఉల్లిపాయలో ఉండే యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు చర్మంపై ఉండే సూక్ష్మజీవులను అరికడతాయి.
- గ్రీన్ టీ అన్ని ఆరోగ్య సమస్యలకు మంచిదే. గ్రీన్ టీ వల్ల జుట్టు రాలడం తగ్గడంతో పాటు కొత్త వెంట్రుకల ఉత్పత్తి కూడా జరుగుతుంది. ఇది మీ జీవ క్రియను పెంచి జుట్టు ఎదుగుదల రేటును కూడా పెంచుతుంది. ఒకసారి గ్రీన్ టీ పొడిని మీ జుట్టకు పట్టిస్తే తేడా మీకే తెలుస్తుంది.
- జుట్టు సంబంధిత సమస్యలకు ఉసిరిని మించిన ఔషధం మరొకటి లేదు.

## పెరుగు తింటే ప్రమాదమా?

**పాలు, పెరుగు మన నిత్య జీవితంలో భాగం. నిద్రలేచినప్పటి నుంచి తిరిగి నిద్రించే వరకు ఏదో ఒక రూపంలో పాల ఉత్పత్తులను తీసుకుంటాం. అయితే కొంత మంది మధ్యాహ్నం పూట పెరుగు తింటే నిద్రొస్తుందని, రాత్రి తింటే బాగా నిద్ర పడుతుందని చెబుతుంటారు. వీటిలో వాస్తవమెంతో చదవండి.**

- పెరుగు శరీరానికి అన్ని రకాలుగానూ మంచిదే. రోజుకో గ్లాసు పాలు, కప్పు పెరుగు తింటే మనకు కావాల్సిన ప్రొటీన్లు అందుతాయి. పెరుగు జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. అరుగుదల సమస్యను నివారిస్తుంది.
- ముఖ్యంగా ఎండాకాలంలో పెరుగు తినడం వల్ల శరీరానికి చలువ చేస్తుంది. రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. శాకాహారులు పాలు, పెరుగు పదార్థాలు ఎక్కువగా తీసుకుంటే విటమిన్ బీ 12 లభిస్తుంది.
- పెరుగు పగలు తింటే నిద్రవస్తుంది అనేది అపోహ మాత్రమే. రాత్రి పూట తింటే మాత్రం జీర్ణక్రియ సులువవుతుంది కాబట్టి నిద్రకు ఆటంకం కలుగకుండా ఉంటుంది. పెరుగును రాత్రి, పగలు ఎప్పుడైనా తినవచ్చు.
- ఫ్రిజ్‌లో పెట్టిన పెరుగు రాత్రి తింటే మాత్రం జలుబు చేసే అవకాశాలున్నాయి. అందువల్ల రాత్రి పూట ఫ్రిజ్ లోంచి తీసిన పెరుగు కాకుండా బయట ఉంచిన పెరుగు తింటే ఎలాంటి అనారోగ్య సమస్యలు దరిచేరవు.
- బాగా పులిసిన పెరుగును జుట్టుకు పట్టించడం వల్ల జుట్టుకు తేమ అందుతుంది.



## కాలేయం ఎందుకు దెబ్బతింటుంది?



కాలేయ వ్యాధులతో బాధపడేవారు, చనిపోయినవాళ్ల గురించి విన్నప్పుడుల్లా నాకు భయమేస్తున్నది. ఎందుకంటే మా కుటుంబంలో కూడా మూడు తరాల నుంచి కాలేయ సమస్యలతో మరణించారు. కొందరు దీర్ఘకాలిక మద్యపానం వల్ల, మరి కొందరు నాన్ ఆల్కహాలిక్ సిరోసిస్ అండ్ హెపటైటిస్ వ్యాధితో చనిపోయారు. ఈ దెబ్బతో నాకు భయమేస్తున్నది. కాలేయం ఎందుకు దెబ్బ తింటుంది? దీనిని ముందుగా గుర్తించలేమా? ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? దయచేసి తెలుపగలరు.

- జి. శ్రీలక్ష్మి, పాలమూరు

అడుగండి చెబుతా



**డాక్టర్ బి. రవిశంకర్**
సీనియర్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్
యశోద హాస్పిటల్స్
సికింద్రాబాద్

మీ వయసు ఎంతో తెలియజేయలేదు. మీ ఆహారపు అలవాట్లు కూడా పేర్కొనలేదు. జీర్ణ సంబంధిత సమస్యలు ఉన్నాయా కూడా చెప్పలేదు. ఇవి చెప్పి ఉంటే మీ సమస్యకు పరిష్కారం ఏంటో చెప్పే అవకాశం ఉంది. ముందుగా మీకు కాలేయ సమస్యల గురించి అవగాహన అవసరం. కాలేయం మన జీర్ణవ్యవస్థకు అనుబంధంగా ఉన్న పెద్ద గ్రంథి. కానీ మనిషి స్వయంకృతంగా అలక్ష్యం చేయడం, చెడు అలవాట్లకు బానిస కావడంవల్ల కాలేయం దెబ్బ తింటుంది. హెపటైటిస్ 'బి'.. 'సి' వైరస్ ఇన్‌ఫెక్షన్ల వల్ల కాలేయం పాడవుతుంది. ముందుగా కామెర్లు వస్తాయి. దానిని సరైన సమయంలో గుర్తించకపోతే ముదిరి కాలేయానికి అపాయం ఏర్పడుతుంది. మితిమీరిన మద్యపానం వల్ల 'లివర్ సిరోసిస్' వ్యాధి వస్తుంది. ఊబకాయం కూడా కాలేయ వ్యాధులకు కారణమవుతున్నది. ఇవి కాకుండా విల్సన్ డిసీజ్, బైల్ డక్ట్ వంటివి పుట్టుకతో వస్తుంటాయి. కళ్లు పచ్చగా మారడం, విపరీతమైన దురద, ఆకలి బాగా తగ్గిపోవడం, నీరసం, నిద్ర మత్తుగా ఉండటం, కడుపులో వికారం, ఏకాగ్రతా లోపం, జ్ఞాపకశక్తి తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్‌ను సంప్రదించాలి. ప్రాథమిక దశలోనే కాలేయ సమస్యలను గుర్తిస్తే సురక్షితంగా బయటపడవచ్చు.

## పిల్లల భవిష్యత్తుకు మెంటార్ టుగెదర్!



**యుక్త వయసులో ఉన్న వారు నచ్చని రంగంలోకి అడుగుపెట్టి నచ్చింది చేయలేకపోయామే అన్న బాధలో ఉంటారు. అలాంటి వారికి ఆశాదీపంగా నిలుస్తున్నది ఓ సంస్థ.**

చాలామందికి కుటుంబ నేపథ్యం సరిగా లేకపోవడమో, ఆర్థిక పరిస్థితి బాగా లేకపోవడమో, నిరక్షరాస్యత వల్ల వారి గమ్యానికి చేరుకోలేకపోతున్నారు. ఎలాంటి రంగాన్ని ఎంచుకోవాలో తెలియని స్థితిలో ఉన్న యువతకి సరైన గైడెన్స్ ఇస్తూ వారిని ముందుకు నడిపిస్తున్నదో సంస్థ. యువతకు ఉచిత సేవలు అందిస్తున్నది బెంగళూరుకు చెందిన అరుంధతీ గుప్తా. 'మెంటార్ టుగెదర్' అనే పేరుతో యువతను విజయతీరాలకు నడిపిస్తున్నది. బెంగళూరులోనే కాకుండా హైదరాబాద్, పుణె, ఢిల్లీ, ముంబై లాంటి ప్రధాన నగరాల్లోనూ సేవలందిస్తున్నది గుప్తా. మాంచెస్టర్ యూనివర్సిటీలో డిగ్రీ చదువుతున్న రోజుల్లో అరుంధతికి మెంటర్‌గా డాక్టర్ రాజీవ్ గౌడ ఉండేవారు. భారత్‌లో గైడెన్స్ ఇచ్చేవాళ్లు లేరని గ్రహించిన గుప్తా డాక్టర్ రాజీవ్ సహకారంతో 2009లో భారత్‌లో 'మెంటార్ టుగెదర్' పేరుతో స్వచ్ఛంద సంస్థ ప్రారంభించింది. 13 నుంచి 15 యేండ్లలోపు వారికి మూడేండ్ల పాటు శిక్షణ, 18 నుంచి 21 యేండ్లలోపు వారికి 8 నెలల పాటు జీవన నైపుణ్యాలపై శిక్షణ ఇస్తుంది. వీరితో స్నేహపూర్వకంగా మెలగుతూ మార్పులు, మెళకువలు, విలువలు, నలుగురిలో ఎలాంటి గుర్తింపు తెచ్చుకోవాలో లాంటి అంశాలపై అవగాహన కల్పిస్తున్నది. 'మెంటార్ టుగెదర్' యాప్‌లో పేరు నమోదు చేసుకుంటే వాళ్ల వ్యక్తిత్వం, అర్హతలు అధ్యయనం చేసి ట్రైనింగ్ మొదలుపెడుతామంటున్నది అరుంధతీ గుప్తా.

నమస్తే తెలంగాణ
నిపుణ
[ కరీంనగర్ ]
సోమవారం 24 జూన్ 2019




# హెచ్‌సీఎల్ టెక్‌బీ

# ఇంటర్‌తో ఉద్యోగం + డిగ్రీ

**ఇంటర్ పూర్తయింది.. తర్వాత మంచి కాలేజీలో ఇంజినీరింగ్ పూర్తిచేసి సాఫ్ట్‌వేర్‌గా మంచి ఉద్యోగం సాధించాలన్నది లక్షల మంది విద్యార్థుల కోరిక. కానీ చాలా మందికి ఇంజినీరింగ్ చేయడానికి అనేక సమస్యలు. ఆర్థిక ఇబ్బందులు, మంచి కాలేజీలో ప్రవేశాలు దొరకక మరికొందరు.. ఇలా రకరకాల సమస్యలతో తమ కోరిక నెరవేరని వారెందరో.. కానీ ఇంటర్‌తోనే ఉద్యోగంతోపాటు డిగ్రీ చదవడానికి అవకాశమిచ్చి.. కోర్సుకు కావాల్సిన ఫీజు సైతం రుణ రూపంలో అందించి అద్భుతమైన అవకాశం కల్పిస్తుంది ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీ హెచ్‌సీఎల్.**

- ఇంటర్ తర్వాత ఉద్యోగం కోసం తప్పనిసరిగా ఇంజినీరింగ్ లేదా గ్రాడ్యుయేషన్ కాలేజీలో చేరడం ఇది సాధారణంగా జరిగేది. కానీ నిజానికి డిగ్రీ పూర్తికాగానే ఉద్యోగం అనేది కూడా చాలా కష్టమైనపనే. ఎందుకంటే సాఫ్ట్‌వేర్‌కు అవసరమైన స్కిల్స్ నేర్చుకుని అన్ని రకాలుగా సిద్ధమైనవారికే అవకాశాలు ఉంటాయి. సాధారణ డిగ్రీ/బీటెక్ చేసినవారికి బాగా శ్రమిస్తేనే ఉద్యోగం వస్తుంది.
- ఇటువంటి సంప్రదాయక ఆలోచనలకు 'టెక్ బీ' ఫుల్‌స్టాప్ పెట్టనుంది. సరైన గైడెన్స్, శిక్షణ ఉన్న ఇంటర్ విద్యార్థులు సైతం ఇంజినీర్ చేసే పనులను చేయగలరు. విద్యార్థుల మానసిక, శారీరక పరిస్థితులను అధ్యయనం చేసి హెచ్‌సీఎల్ తత్వశాస్త్రం ఆధారంగా టెక్ బీ ప్రోగ్రామ్‌ను రూపొందించింది. దేశవ్యాప్తంగా ప్రస్తుత పరిస్థితులను అధ్యయనం చేసి పరిశ్రమకు అవసరమైన నైపుణ్యం కలిగిన అభ్యర్థులను తయారు చేయడం కోసం హెచ్‌సీఎల్ టెక్ బీ ప్రోగ్రామ్‌ను రూపొందించింది.

### టెక్ బీ ఎర్లీ కెరీర్‌లో స్ట్రీమ్‌లు

- **సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్:** సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్‌కు సంబంధించిన విభాగం
- **ప్రొడక్ట్ ఇంజినీరింగ్:** టెక్నాలజీస్ అండ్ టాపిక్స్
- **మెకానికల్ ఇంజినీరింగ్:** మెకానికల్ డొమైన్‌లో భాగంగా మెకానికల్ డిజైన్ అండ్ టూల్స్ (లైక్ క్యాడ్)
- **సపోర్ట్ ఇంజినీరింగ్:** అప్లికేషన్, మౌలిక సదుపాయాలకు సంబంధించిన ముఖ్యాంశాలు ఈ కోర్సులో ఉంటాయి.

**నోట్:** అభ్యర్థులు శిక్షణ సమయం ప్రారంభ నెలల్లో చూపించిన ప్రతిభ ఆధారంగా వారిని ఆయా స్ట్రీమ్‌లకు ఎంపికచేస్తారు. దీన్ని హెచ్‌సీఎల్ టీఎస్ఎస్ విభాగం పర్యవేక్షిస్తుంది. అభ్యర్థులకు సరైన విభాగాన్ని ఎంపిక చేసి దానిలో నిష్ణాతులను చేస్తారు.



### టెక్ బీ ప్రోగ్రామ్

- ఇంటర్ పూర్తిచేసినవారికి అప్లికేషన్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సపోర్ట్, టెస్టింగ్, క్యాడ్ సపోర్ట్ రంగాల్లో ప్రవేశస్థాయి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారు. దీనికోసం మొదట 12 నెలల శిక్షణ ఇస్తారు. శిక్షణ సమయంలో నెలకు రూ. పది వేలు స్టయిఫండ్‌గా అందిస్తారు. మొదటి తొమ్మిది నెలలు ఐటీ ఫండమెంటల్స్, సాఫ్ట్‌వేర్ టూల్స్, లైఫ్ స్కిల్స్‌పై విద్యార్థులకు శిక్షణ ఇస్తారు. చివరి మూడునెలలు ప్రాక్టికల్ పద్ధతిలో నేర్చుకోవాలి. ప్రత్యక్షంగా కంపెనీ ప్రాజెక్టులపై పనిచేసే అవకాశం కల్పిస్తారు. శిక్షణ పూర్తిచేసినవారికి హెచ్‌సీఎల్‌లో ఐటీ ఇంజినీర్‌గా ఉద్యోగ అవకాశం కల్పిస్తారు.
- హెచ్‌సీఎల్ ఎర్లీ కెరీర్ ప్రోగ్రామ్‌లో చేరిన ప్రతి విద్యార్థికి స్టయిఫండ్‌గా ప్రతి నెల రూ. పది వేలు చెల్లిస్తారు.
- **అర్హతలు:** ఇంటర్ (సీబీఎస్ఈ/ఐసీఎస్ఈ లేదా ఎన్ఐవోఎస్ బోర్డులు లేదా దేశంలోని ఆయా రాష్ట్రాలకు చెందిన స్టేట్ బోర్డుల్లో) కనీసం 60 శాతం మార్కులతో 2018/2019లో ఉత్తీర్ణులైనవారు అర్హులు.
- అభ్యర్థులు ఇంటర్‌లో మ్యాథమెటిక్స్ లేదా బిజినెస్ మ్యాథమెటిక్స్ ఒక సబ్జెక్టుగా చదివి ఉండాలి.
- **ఫీజు:** ఈ ప్రోగ్రామ్ ఫీజు రెండు లక్షలు (ట్యాక్స్‌లు అదనం). దీన్ని చెల్లించడానికి బ్యాంకు రుణసదుపాయం కల్పిస్తారు. దీనివల్ల అభ్యర్థి లేదా తల్లిదండ్రులకు ఎటువంటి ఆర్థిక భారం ఉండదు.
- ఉద్యోగంలో చేరిన మొదటి ఏడాది నుంచి నెల నెలా వాయిదాల (ఈఎంఐ) ద్వారా రుణాన్ని తీర్చాలి.
- శిక్షణ సమయంలో 90 శాతం మార్కులను సాధించినవారికి 100 శాతం ఫీజును మాఫీ చేస్తారు. 85-90 శాతం మార్కులను సాధిస్తే 50 శాతం ఫీజును మాఫీ చేస్తారు.

### ఉద్యోగం చేస్తూ డిగ్రీ

- హెచ్‌సీఎల్‌లో ఉద్యోగం చేస్తూ బిట్స్ పిలానీలో నాలుగేండ్ల బీఎస్సీ (డిజైన్& కంప్యూటింగ్) లేదా రెండేండ్ల ఎమ్మెస్సీ/ఎంటెక్ చదవచ్చు. శస్త్ర యూనివర్సిటీ నుంచి మూడేండ్ల బీసీఏ/ఎంసీఏ చదువుకోవచ్చు. ఉద్యోగం చేసే ప్రాంతంలోనే తరగతులు నిర్వహిస్తారు.
- బిట్స్ పిలానీకి సంబంధించిన కోర్సుల ఫీజు విషయంలో హెచ్‌సీఎల్ పాక్షికంగా ఫీజులను భరిస్తుంది. అదేవిధంగా శాస్త్ర యూనివర్సిటీ అందించే కోర్సుల ఫీజును మాత్రం పూర్తిగా హెచ్‌సీఎల్ భరిస్తుంది.
- శాస్త్ర యూనివర్సిటీలో బీసీఏకు రూ.90,000 (సెమిస్టర్‌కు రూ.15,000), ఎంసీఏకు రూ.1,35,000 (సెమిస్టర్‌కు రూ.22,500).
- బిట్స్ పిలానీ కోర్సులు బీఎస్సీకి రూ.1,75,000 (సెమిస్టర్‌కు రూ.21,875), ఎంటెక్/ఎంఎస్‌కు రూ.2,35,000 (సెమిస్టర్‌కు రూ.29,375).

**నోట్:** అభ్యర్థులు యూజీ/పీజీ పూర్తయిన తర్వాత హెచ్‌సీఎల్‌లో రెండేండ్లు పనిచేసేందుకు అంగీకార పత్రాన్ని ఇవ్వాల్సి ఉంటుంది.

### ఎంపిక విధానం

- ఆసక్తిగల అభ్యర్థులు దగ్గర్లోని హెచ్‌సీఎల్ క్యాంపస్ లేదా నిర్దేశించిన ప్రదేశాల్లో కౌన్సెలింగ్ సెషన్‌కు హాజరుకావాలి. అనంతరం వారికి కంపెనీ వాక్ ఇన్ డ్రైవ్స్ నిర్వహిస్తుంది.
- హెచ్‌సీఎల్ స్టాండర్డ్ ఆప్టిట్యూడ్ టెస్ట్‌ను నిర్వహిస్తారు. ఇది కంప్యూటర్ ఆధారిత పరీక్ష.
- దీనిలో క్వాంటిటేటివ్, లాజికల్ రీజనింగ్, లాంగ్వేజ్ ఎబిలిటీస్‌కు సంబంధించిన ప్రశ్నలు ఇస్తారు.
- కంప్యూటర్ బేస్డ్ టెస్ట్‌ను దేశవ్యాప్తంగా ఉన్న అన్ని హెచ్‌సీఎల్ కార్యాలయాల వద్ద ప్రతి వీకెండ్‌లో నిర్వహిస్తారు. పరీక్షలో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు రెండో దశలో ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. ప్రవేశ ప్రక్రియ 2019 జూలై చివరి వరకు జరుగుతుంది.
- ఇంటర్వ్యూ విజయవంతంగా పూర్తిచేసిన వారికి ఆఫర్ లెటర్ ఇస్తారు.

### ఏ ఉద్యోగం ఇస్తారు?

- శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు ఐటీ ఇంజినీరింగ్‌లో డెవలప్‌మెంట్ లేదా టెస్టింగ్ లేదా సపోర్ట్ రోల్స్ వంటి ఉద్యోగ అవకాశాలను కల్పిస్తారు.
- అభ్యర్థులు ఉద్యోగం అనేది అభ్యర్థి చూపించే ప్రతిభపై ఆధారపడి ఉంటుంది. విజయవంతంగా శిక్షణ పూర్తిచేసిన వారికి తప్పనిసరిగా ఉద్యోగ అవకాశాన్ని హెచ్‌సీఎల్ కల్పిస్తుంది.

### వేతనం

- హెచ్‌సీఎల్ టెకీ బీ ఎర్లీ కెరీర్ శిక్షణ పూర్తిచేసుకున్నవారికి చెన్నై, నోయిడా, బెంగళూరులలో అయితే ఏడాదికి రూ.2.2 లక్షలు, లక్నో, మధురై, నాగ్‌పూర్‌లలో అయితే రూ.2 లక్షలు చెల్లిస్తారు.

### ప్రోగ్రామ్ పూర్తయినవారికి కలిగే లాభాలు

- హెచ్‌సీఎల్‌లో డెవలపర్/టెస్టర్/సపోర్ట్ లేదా మెయింటెనెన్స్ ఎగ్జిక్యూటివ్‌గా హెచ్‌సీఎల్ టెక్నాలజీస్‌లో ఉద్యోగం ఇస్తారు.
- సంబంధిత ఉద్యోగ ధృవపత్రాన్ని హెచ్‌సీఎల్ నుంచి ఇస్తారు,
- ఆరోగ్య, లైఫ్ ఇన్సూరెన్స్ సదుపాయాన్ని కల్పిస్తారు.
- పని చేసుకుంటూ ఉన్నత విద్య అంటే బీసీఏ, ఎంసీఏ, బీఎస్సీ, ఎమ్మెస్సీ వంటి కోర్సులు పూర్తిచేసుకోవడం.
- రెగ్యులర్ ఉద్యోగి పొందే సదుపాయాలను పోస్ట్ ఎంప్లాయ్‌మెంట్‌లోనే పొందుతారు.

- పూర్తి వివరాల కోసం 8448386391కు మిస్డ్ కాల్ ఇస్తే వారే తర్వాత కాల్‌చేసి వివరాలు తీసుకుంటారు లేదా techbee.telangana@hcl.comకు వివరాలు మెయిల్ చేయవచ్చు.
- **వెబ్‌సైట్:** https://www.hcltechbees.com/job-programes

... ✍ **కేశవపంతుల వేంకటేశ్వరశర్మ**

# CIVILS 2020-PREPARATION

**The Civil Services Examination (CSE) is a nationwide competitive examination in India conducted by the Union Public Service Commission for recruitment to various Civil Services of the Government of India, including the Indian Administrative Service (IAS), Indian Foreign Service (IFS), Indian Police Service (IPS) among others. Also simply referred to as UPSC examination.**

- Although regarded as one of the toughest exams in the country, with the right approach and strategy, an aspirant can crack the examination. It is essential for aspirants to know and understand the requirements of the examination such as the syllabus and pattern, to get started.

**The Notification for the 2020 examination will be issued in the month of February 2020.**

- This exam is conducted every year in three stages and they are:
  1. Stage I: Preliminary Examination (Prelims)
  2. Stage II: Mains Examination
  3. Stage III: Personality Test/Interview Round
- Stage 1 and 2 are conducted in pen-paper mode.

**PRELIMS**

- This examination is meant to serve as a screening test only; the marks obtained in the Preliminary Examination by the candidates who are declared qualified for admission to the Main Examination will not be counted for determining their final order of merit.

| Paper | Nature of paper | Duration | Questions | Marks |
|---|---|---|---|---|
| I | Merit | 2 hours | 100 | 200 |
| II | Qualifying | 2 hours | 80 | 200 |

**Paper I - (200 marks) Duration :** Two hours

- Current events of national and international importance.
- History of India and Indian National Movement.
- Indian and World Geography-Physical, Social, Economic Geography of India and the World.
- Indian Polity and Governance-Constitution, Political System, Panchayati Raj, Public Policy, Rights Issues, etc.
- Economic and Social Development-Sustainable Development, Poverty, Inclusion, Demographics, Social Sector Initiatives, etc.
- General issues on Environmental ecology, Bio-diversity and Climate Change (that doesn't require subject specialisation)
- General Science.

**Paper II-(200 marks) duration:** two hours



- Comprehension;
- Interpersonal skills including communication skills;
- Logical reasoning and analytical ability;
- Decision making and problem solving;
- General mental ability;
- Basic numeracy (numbers and their relations, orders of magnitude, etc.) (Class X level), Data interpretation (charts, graphs, tables, data sufficiency etc. — Class X level);

**POINTS TO BE NOTED:**

- The questions in the Prelims Exam are of objective type or Multiple Choice Questions (MCQs)
- There is 'Negative Marking' in the prelims exam for each incorrect answer. The negative marking for incorrect answers will be 1/3rd of the allotted marks of that question.
- The GS Paper II (CSAT) is of qualifying nature and candidates should score a minimum of 33 per cent in this paper to qualify to the next stage of the exam.

Only those candidates who are declared by the Commission to have qualified in the Preliminary Examination in the year will be eligible for admission to the Main Examination of that year

**MAINS**

- The Main Examination will consist of written examination and an interview test. The written examination will consist of 9 papers of conventional essay type, out of which two papers will be of qualifying in nature. Marks obtained for all the compulsory papers and Marks obtained in Interview for Personality Test will be counted for ranking.
- The main Examination is intended to assess the overall intellectual traits and depth of understanding of candidates rather than merely the range of their information and memory. The nature and standard of questions in the General Studies papers will be such that a well- educated person will be able to answer them.
- The questions will be such as to test a candidate's general awareness of a variety of subjects, which will have relevance for a career in Civil Services. The questions are likely to test the candidate's basic understanding of all relevant issues, and ability to analyse, and take a view on conflicting socio-economic goals, objectives and demands. The candidates must give relevant, meaningful and succinct answers.
- Candidates who obtain such minimum qualifying marks in the written part of the Main Examination as may be fixed by the Commission at their discretion, shall be summoned by them for an interview known as the Personality Test.The number of candidates to be summoned for interview will be about twice the number of vacancies to be filled.
- Marks thus obtained by the candidates in the Main Examination (written part as well as interview) would determine their final ranking. Candidates will be allotted to the various Services keeping in view their ranks in the examination and the preferences expressed by them for the various Services and posts.

| S. No | Paper | Nature of paper | Time | Marks |
|---|---|---|---|---|
| 1 | Paper A - Compulsory Indian Language | Qualifying | 3 hours | 300 |
| 2 | Paper B – English | Qualifying | 3 hours | 300 |
| 3 | Paper 1 – Essay | Merit | 3 hours | 250 |
| 4 | Paper 2 – General studies 1 | Merit | 3 hours | 250 |
| 5 | Paper 3 – General studies 2 | Merit | 3 hours | 250 |
| 6 | Paper 4 – General studies 3 | Merit | 3 hours | 250 |
| 7 | Paper 5 – General studies 4 | Merit | 3 hours | 250 |
| 8 | Paper 6 - Optional Paper I | Merit | 3 hours | 250 |
| 9 | Paper 7 - Optional Paper 2 | Merit | 3 hours | 250 |
| | **Total** | | | **1750** |
| | Interview/ Personality Test | | | 275 |
| | Grand total | | | 2025 |

**HOW TO PREPARE FOR CIVILS EXAM**

- How much time do I spend daily in preparing for this exam?
- Preparing for this exam requires atleast 12-14 hrs of intensive and exhaustive study. The time needs to apportioned judicially between the GS papers and CSAT for Prelims and 4 GS papers, Essay paper, Optional papers and finally language papers. Waitage needs to be given according to the importance of the subject.
- Is prelims and mains the same?
- Another common doubt among students is this. Mains is a different ball game compared to prelims. In prelims the questions are based on accuracy of knowledge, and can come from a vast source, while in mains the questions are asked to test your analytical capabilities, your understanding of the overall picture and the logical way in which you present your answer.
- For ex. A prelims question might be: When did Gandhiji launch the Dandi march? The answer for which has to be very precise and accurate date of the launch of the famous Dandi march. But on the same topic question in mains might be: What is the spirit behind Gandhiji launching the Dandi march? to answer this question in mains we need to understand what is the core of the question. The core aspect is the Spirit of launching the Dandi march, and not about the dates or timelines. There are 3 aspects to that a student needs to write to gain maximum marks for this.
  1. Primarly the Dandi march was launched to oppose the British and throw them out of the country by breaking their laws.
  2. It could be done by mass movement across the country.
  3. This mass movement can only happen when an issue of commonality for all the sections of the Indian society cutting across region, religion, caste, community, strata lines is crossed , and therefore salt was chosen to unite the whole country.
- So, for prelims we need to study exhaustively, while for writing mains answers we need a lot of analytical capabilities and understanding of the overall scenario.
- How many questions do I need to attempt in prelims and mains to get qualified?
- **Prelims** - The GS paper in prelims is a place where we need to be careful about negative marking. We should attempt all those which we are sure of and then a calculated risk needs to be taken for those which we are half sure. But for those questions which are not at all sure of, its better to leave them rather than incur negative scoring.
- In the paper 2 in prelims, ie. CSAT, which is a qualifying paper, the focus should be on crossing the cutoff rather than anything else.
- **Mains**- Usually a GS mains paper has 20 questions, which we need to complete in 3 hours. Over the time it has been observed that, the success mantra for a student to get a good rank has been to complete all the questions in each paper without fail. Attempting and writing all the questions logically and conclusively gives a lot of edge.

**To be Continued..**



**VIJAY CH**
D.S.PExcise
**AMULYA B**
Civil Services Faculty, M.Sc Finance
( Gold Medalist)
For any help in preparation or answer writing or test series
call/whataspp: 9912094992

III.
నమస్తే తెలంగాణ
నిపుణ
[ కరీంనగర్ ]
సోమవారం 24 జూన్ 2019

## సంస్థలు

- ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫైనాన్షియల్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లానింగ్-ముంబై
- **వెబ్‌సైట్:** www.ifip.co.in
- బీఎస్‌ఈ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్-ముంబై
- **వెబ్‌సైట్:** www.bseindia.com
- నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్-ముంబై
- **వెబ్‌సైట్:** www.nseindia.com
- ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా-న్యూఢిల్లీ
- **వెబ్‌సైట్:** www.icsi.edu
- నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సెక్యూరిటీస్ మార్కెట్స్
- **వెబ్‌సైట్:** www.nism.ac.in
- ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా-న్యూఢిల్లీ
- **వెబ్‌సైట్:** www.icai.org
- ఎస్‌సీఎఫ్ఎం అకాడమీ-హైదరాబాద్
- **వెబ్‌సైట్:** www.ascncfmacademy.com
- ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ ఫైనాన్షియల్ అనలిస్ట్స్ ఆఫ్ ఇండియా (ICFAI)-హైదరాబాద్
- **వెబ్‌సైట్:** www.icfai.org




# మార్కెట్‌కా షేర్ స్టాక్ బ్రోకర్

**సెన్సెక్స్, నిఫ్టీ, ఎలా పనిచేస్తుందో తెలుసుకోవాలనుకుంటున్నారా. మీకు ఆర్థిక వ్యవహారాల నిర్వహణపై పట్టు ఉందా. అయితే మీరు స్టాక్ బ్రోకర్‌గా బులియన్ మార్కెట్‌లో బేఫికర్‌గా అడుగుపెట్టవచ్చు. ఎందుకంటే స్టాక్ ఎక్స్ఛేంజ్, షేర్లు, బులియన్ మార్కెట్ గురించి చదువుతుంటాం, వింటుంటాం. వీటిలో పెట్టుబడులు పెట్టవచ్చని కూడా తెలుసు. కానీ చాలామందికి వీటిపై సరైన అవగాహన లేక చేతులు కాల్చుకుంటుంటారు. కాబట్టి షేర్ల ఫలాలు పొందడానికి స్టాక్ బ్రోకర్లను ఆశ్రయిస్తుంటారు. ఈ నేపథ్యంలో స్టాక్ బ్రోకర్ అంటే ఎవరు, ఇందుకు ఏం చదవాలో తెలుసుకుందాం.**



### స్టాక్ బ్రోకింగ్ అంటే ఏమిటి?

- స్టాక్స్ లేదా ఇతర సెక్యూరిటీల అమ్మకం, కొనుగోలు ప్రక్రియనే స్టాక్ బ్రోకింగ్ అని పిలుస్తారు. ఈ స్టాక్ బ్రోకింగ్‌లో నైపుణ్యంగల వారిని స్టాక్ బ్రోకర్లు అంటారు. తమ పెట్టుబడిదారుల తరఫున స్టాక్ వ్యాపారం నిర్వహించే ఏజెంట్‌గా స్టాక్ బ్రోకర్ వ్యవహరిస్తారు. వీరిని సెక్యూరిటీల విక్రయ ఏజెంట్ లేదా సెక్యూరిటీలు, వస్తువుల అమ్మకం ఏజెంట్‌గా పిలుస్తారు. వీరు తమ క్లయింట్లకు విలువైన సేవ, సమాచారాన్ని అందిస్తారు. షేర్లను ఏ రేట్లకు కొనాలో, అమ్మాలో వీరు నిర్ణయిస్తారు. ఇందుకు కమీషన్ తీసుకుంటారు.
- స్టాక్ మార్కెట్లో మూడు రకాల బ్రోకర్లు ఉన్నారు. వారు.. డిస్కౌంట్ బ్రోకర్లు, బ్యాంకు బ్రోకర్లు, ఫుల్ సర్వీస్ బ్రోకర్లు. స్టాక్ బ్రోకర్లు దీర్ఘకాలిక పరిశ్రమల నుంచి మంచి ప్రతిఫలాలు పొందుతారు. ప్రస్తుతం భారత స్టాక్ మార్కెట్ అభివృద్ధి పథంలో పయనిస్తుంది. దీంతో స్టాక్ బ్రోకర్లకు డిమాండ్ బాగా పెరిగింది. షేర్లు, బాండ్లు అమ్మకాలు, కొనుగోళ్ల ప్రక్రియల్లో స్టాక్ బ్రోకర్లదే కీలకపాత్ర. కాబట్టి షేర్ మార్కెట్లపై ఆసక్తి ఉన్నవారు దీనికి సంబంధించిన కోర్సులు చేయవచ్చు.
- స్టాక్ ఎక్స్ఛేంజ్ సభ్యులు మాత్రమే స్టాక్ మార్కెట్లో లావాదేవీలు నిర్వహిస్తారు. వ్యక్తులు గాని, సంస్థలు గాని షేర్ల వ్యాపారానికి స్టాక్ బ్రోకర్ల ద్వారానే వెళ్లాలి. వీరు వ్యక్తులు, సంస్థలకు చెందిన క్రయవిక్రయాల విషయంలో అడ్వయిజర్‌గా, అనలిస్ట్‌గా, డీలర్‌గా పనిచేస్తారు. ఇది సవాళ్లతో కూడుకుని ఉత్తేజాన్ని, ఉత్సాహాన్ని ఇచ్చే కెరీర్.
- ప్రపంచంలో ధనం ఉన్నంతకాలం స్టాక్ మార్కెట్ కళకళలాడుతూ ఉంటుంది. కాబట్టి మార్కెట్ తీరు తెన్నులను ఎప్పటికప్పుడు గమనిస్తూ లాభాలు వచ్చే కంపెనీలపై పక్కాగా అంచనా వేస్తే స్టాక్ బ్రోకర్లకు ఆదాయంతోపాటు పేరు ప్రఖ్యాతలు లభిస్తాయి. అందుకు తగ్గట్టుగా అవకాశాలూ విస్తృతమవుతాయి. స్టాక్ బ్రోకర్లు తమ క్లయింట్లకు సురక్షితమైన పెట్టుబడి పథకాలను సూచించాలి.

### నైపుణ్యాలు

- స్టాక్ బ్రోకర్లకు సహనం, నమ్మకం, లాజికల్ థింకింగ్, మంచి వ్యాపార చతురత, సంక్లిష్ట సమస్యలను పరిష్కరించే సామర్థ్యం, మంచి కమ్యూనికేషన్ స్కిల్స్, గణితంలో నైపుణ్యం, విశ్లేషణాత్మక ఆలోచన, బాధ్యతల గల వైఖరి ఉండాలి.
- ఇవి ఉంటేనే మార్కెట్ నాడిని సరిగ్గా గుర్తించగలిగే నేర్పు పొందుతారు. క్లయింట్ల మనోభావాలకు భంగం కలగకుండా, మార్కెట్‌లో కంపెనీ స్థానం దిగజారకుండా జాగ్రత్తగా వ్యవహరిస్తారు. స్టాక్‌బ్రోకర్లు పొరపాటు నిర్ణయాలు తీసుకుంటే క్లయింట్ల జీవితాలు తారుమారవుతాయి. కాబట్టి విధుల్లో నిర్లక్ష్యం చేయకుండా, ఒత్తిళ్లను అధిగమిస్తూ ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలి.

### అర్హతలు

- దేశంలో బ్రోకరేజీ సంస్థలు ఎంబీఏ (ఫైనాన్స్) కోర్సు చదివినవారిని అసిస్టెంట్ రిలేషన్‌షిప్ మేనేజర్, రిలేషన్‌షిప్ మేనేజర్‌గా నియమించుకుంటున్నాయి. కాబట్టి ఈ కోర్సు పూర్తిచేస్తే స్టాక్‌బ్రోకర్‌గా స్థిరపడవచ్చు. దీంతోపాటు నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ ఆఫర్ చేస్తున్న ఫైనాన్షియల్ మార్కెట్స్ సర్టిఫికేషన్, బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ ఆఫర్ చేస్తున్న డెరివేటివ్ ఎక్స్ఛేంజ్ సర్టిఫికేషన్ కూడా పూర్తిచేస్తే అర్హతలను పెంచుకుని, మంచి అవకాశాలను అందుకోవచ్చు.

### కోర్సులు

- స్టాక్ బ్రోకింగ్ రంగంలో కనీసం రెండేండ్ల అనుభవంతో గ్రాడ్యుయేట్ డిగ్రీని పొందవచ్చు. స్టాక్ బ్రోకర్‌గా మీ కెరీర్‌ను ప్రారంభించడానికి ముందు మీరు సబ్ బ్రోకర్‌గా పనిచేయవచ్చు. దేశంలో వివిధ యూనివర్సిటీలు, విద్యాసంస్థలు ఇంటర్ తర్వాత సర్టిఫికెట్ స్థాయి కోర్సులను అందిస్తున్నాయి.
- ఇంటర్ కామర్స్‌తో పూర్తిచేసిన వారికి ఎన్‌ఎస్‌ఈ సర్టిఫికెట్ ఇన్ ఫైనాన్షియల్ మార్కెట్స్, సర్టిఫైడ్ మార్కెట్ ప్రొఫెషనల్, సర్టిఫికెట్ ప్రోగ్రామ్ ఆన్ క్యాపిటల్ మార్కెట్స్, పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ క్యాపిటల్ మార్కెట్ అండ్ ఫైనాన్షియల్ సర్వీసెస్, పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ ఫండమెంటల్స్ ఆఫ్ క్యాపిటల్ మార్కెట్ డెవలప్‌మెంట్ వంటి కోర్సులను అందిస్తుంది.

### డిగ్రీ కోర్సులు

- బ్యాచిలర్ డిగ్రీ ఇన్ ఫైనాన్స్/ మ్యాథమెటిక్స్/ అకౌంటింగ్/ ఎకనామిక్స్/బిజినెస్ మేనేజ్‌మెంట్
- బ్యాచిలర్ ఆఫ్ కామర్స్

### పీజీ కోర్సులు

- మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ (ఎంబీఏ) ఇన్ ఫైనాన్స్
- మాస్టర్ ఆఫ్ కామర్స్
- పెద్ద బ్రోకింగ్ సంస్థలు చార్టర్డ్ అకౌంటెంట్ (సీఏ), చార్టర్డ్ ఫైనాన్షియల్ అనలిస్ట్స్ (సీఎఫ్‌ఏ)లను తీసుకోవడంలో ఇష్టపడుతున్నాయి.
- సబ్ బ్రోకర్‌గా చేయడానికి ఇంటర్ పూర్తిచేసి 21 ఏండ్లలోపు ఉండాలి. దీంతోపాటు ఎకనామిక్స్, కామర్స్, బిజినెస్, ఫైనాన్స్‌లో అవగాహన ఉండాలి.

- ఈ కోర్సులను పూర్తిచేసిన తర్వాత సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబి)లో నమోదు చేసుకోవాలి. అంతేకాకుండా మీకు మీరే స్టాక్ ఎక్స్ఛేంజీలో సభ్యునిగా కూడా రిజిస్టర్ చేసుకోవచ్చు.
- రిజిస్టర్ చేసుకున్న తర్వాత స్టాక్ ఎక్స్ఛేంజీ నిర్వహించే రాత పరీక్షలో ఉత్తీర్ణత సాధించాలి. తర్వాత అకౌంటెన్సీ, క్యాపిటల్ మార్కెట్లు, సెక్యూరిటీలు, పోర్ట్‌ఫోలియో విశ్లేషణ వంటి విషయాల్లో శిక్షణ తీసుకోవాలి. శిక్షణ పూర్తయిన తర్వాత బ్రోకర్‌గా పనిచేయగలడు అని భరోసా వచ్చిన తర్వాతనే సభ్యత్వం ఇస్తారు.

### కెరీర్

- స్టాక్ బ్రోకర్‌గా సభ్యత్వం వచ్చిన తర్వాత ఫైనాన్షియల్ అడ్వయిజర్‌గా, ఇన్వెస్ట్‌మెంట్ అడ్వయిజర్‌గా, క్యాపిటల్ మార్కెట్ స్పెషలిస్ట్‌గా, ఇండిపెండెంట్ ఏజెంట్‌గా, అకౌంటెంట్‌గా, సెక్యూరిటీ అనలిస్ట్‌గా, ఫైనాన్షియల్ మేనేజర్‌గా, సెక్యూరిటీ ట్రేడర్‌గా, సెక్యూరిటీ సేల్స్ రిప్రజెంటేటివ్‌గా, సెక్యూరిటీస్ బ్రోకర్‌గా కెరీర్‌ను ప్రారంభించవచ్చు.
- ఆర్థిక ప్రపంచీకరణ, సరళీకరణ నేపథ్యంలో స్టాక్ బ్రోకర్‌గా కెరీర్‌ను ఎంచుకునేవారికి బ్రోకింగ్ సంస్థలు, పెద్ద వ్యాపార సంస్థలు, ఇన్సూరెన్స్ కంపెనీలు, ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్స్, పెన్షన్ ఫండ్స్, బ్రోకింగ్ సంస్థలతో డీలింగ్ చేసే ట్రెడిషనల్ బ్యాంకులు, మ్యాగజీన్స్, న్యూస్‌పేపర్లు, చారిటీ సంస్థలు, మ్యూచువల్ ఫండ్స్ వంటివాటిలో అవకాశాలు లభిస్తాయి.
- అంతేకాకుండా ఇన్వెస్ట్‌మెంట్ కన్సల్టెన్సీలను పెట్టుకోవచ్చు. ఎంట్రప్రెన్యూర్‌గా రాణించవచ్చు. విదేశాల్లోనూ అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి.
- ఏంజెల్ బ్రోకింగ్ లిమిటెడ్, రిలయన్స్ క్యాపిటల్ లిమిటెడ్, హెచ్‌డీఎఫ్‌సీ, జేపీ మోర్గాన్, ఐసీఐసీఐ డైరెక్ట్, ఇండియా ఇన్ఫోలైన్, ఇండియా బుల్స్, షేర్‌ఖాన్ లిమిటెడ్, కొటక్ సెక్యూరిటీస్ లిమిటెడ్, కార్వీ కన్సల్టెన్సీ వంటి సంస్థలు స్టాక్ బ్రోకర్లను రిక్రూట్ చేసుకుంటున్నాయి.

- ఇవేకాకుండా బోర్డ్ ఆఫ్ స్టాక్ ఎక్స్ఛేంజ్ కూడా సర్టిఫికేషన్ ఆన్ సెంట్రల్ డిపాజిటరీ, సర్టిఫికేషన్ ఆన్ డెరివేటివ్స్ ఎక్స్ఛేంజ్, సర్టిఫికేషన్ ఆన్ కరెన్సీ ఫ్యూచర్స్, సర్టిఫికేషన్ ఆన్ సెక్యూరిటీస్ మార్కెట్స్‌లలో ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తుంది.

### వేతనం

- స్టాక్ బ్రోకర్లకు పనితీరును బట్టి ఆదాయం లభిస్తుంది. ఏడాదికి రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు వేతనం లభిస్తుంది. అనుభవం పెరిగే కొద్ది రూ.5 లక్షల నుంచి రూ.7 లక్షల వరకు ఆదాయం వస్తుంది. కొన్ని బ్రోకింగ్ సంస్థలు పర్ఫామెన్స్ చూపే బ్రోకర్లకు బోనస్‌ను కూడా ఇస్తున్నాయి. నైపుణ్యం పెరిగితే రూ.కోట్లలోనూ సంపాదించవచ్చు.

... సత్యం చాపల

---

# జమిలి ఎన్నికలు

**ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం మన భారత దేశం. ఈ ప్రజాస్వామ్యానికి ఊపిరి ఎన్నికలు. అలాంటి ఎన్నికల ప్రక్రియలో భారీ సంస్కరణల దిశగా అడుగులు పడుతున్నాయి. కాలానుగుణంగా ఎన్నికల ప్రక్రియలో ఎన్నో మార్పులు జరిగినప్పటికీ ఇది మాత్రం ప్రత్యేకం. దేశ ఎన్నికల విధానంలో పెనుమార్పులు సృష్టించబోతున్న ఆ సంస్కరణలే జమిలి ఎన్నిక. కొత్తగా కొలువుదీరిన 17వ పార్లమెంట్ ఉభయసభల సంయుక్త సమావేశంలో ప్రసంగిస్తూ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఈ ఏకకాల ఎన్నికలు నవభారత నిర్మాణానికి అత్యవసర చర్యగా అభివర్ణించారు. జమిలి ఎన్నికకు సంబంధించి ఇటీవలే ప్రధాని మోదీ అధ్యక్షతన అఖిలపక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఏకకాల ఎన్నికలపై వివిధ రాజకీయపార్టీల అభిప్రాయాలు తెలుసుకోవడానికి త్వరలోనే ఒక కమిటీ వేయనున్నట్లు ప్రకటించారు. ప్రభుత్వ వర్గాలతోపాటు, రాజకీయ వర్గాలు కూడా ఈ కమిటీలో ఉండనున్నట్లు తెలుస్తుంది.**

### సివిల్స్ జనరల్ ఎస్సే

### ఏమిటీ ఈ జమిలి విధానం?

- సమాఖ్య తరహా వ్యవస్థని అనుసరిస్తున్న మనదేశంలో లోక్‌సభకు, రాష్ట్ర శాసనసభలకు వేర్వేరుగా ఎన్నికలు జరుగుతున్నాయి. అయితే కొన్ని రాష్ర్టాల శాసనసభలకు లోక్‌సభ ఎన్నికల సమయంలోనే ఎన్నికలు వస్తున్నాయి. మరికొన్ని రాష్ర్టాల శాసనసభలకు మాత్రం వేరే సమయంలో జరుగుతున్నాయి. అన్ని రాష్ర్టాల అసెంబ్లీలకు ఒకేసారి ఎలక్షన్లు జరగకపోవడమే ఈ తేడాకు కారణం. అయితే లోక్‌సభతోపాటు అన్ని రాష్ర్టాల శాసనసభలకు ఒకేసారి ఎన్నికలు జరుపడాన్ని జమిలి ఎన్నికలు అంటారు. లోక్‌సభ, శాసనసభ మాత్రమే కాకుండా స్థానిక సంస్థలకు కూడా కలిపే ఎన్నికలు నిర్వహించాలనే ప్రతిపాదన కూడా ఉంది.

### కొత్తగా వినిపిస్తున్నా..

### గతంలోనూ అనుసరించాం

- 2014లో ఎన్‌డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జమిలిపై చర్చ మొదలైంది. కానీ ఈ తరహా ఎన్నికల విధానానికి చాలా చరిత్ర ఉంది. 1967 అంటే మొదటి మూడు లోక్‌సభ ఎన్నికల వరకూ ఏకకాల ఎన్నిక విధానమే కొనసాగింది. 1967 తర్వాత రాష్ర్టాల్లో సంయుక్త విధాయక్ దళ్ పేరిట ఏర్పడిన ప్రభుత్వాలు కూలిపోవడంతో రాష్ర్టాల ఎన్నికల కాలంలో తేడాలు వచ్చాయి. ఆ తర్వాత కాలంలో రాష్ర్టాల్లో ప్రాంతీయ పార్టీలు ఊపిరిపోసుకోవడం వల్ల ఈ విధానం దాదాపుగా కనుమరుగైంది. మళ్లీ 1983లో జమిలి ఎన్నికల విధానాన్ని పునరుద్ధరించాలని ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకుంది. కానీ అప్పటికే ప్రాంతీయపార్టీల ప్రాబల్యం అంతకంతకూ పెరిగింది. 1999లో మరోసారి ఈ విషయం చర్చకు వచ్చింది. అప్పట్లో జమిలి విధానాన్ని లా కమిషన్ కూడా సమర్థించింది. కానీ అడుగులు ముందుకు పడలేదు.

### 2014 తర్వాత మళ్లీ కదలిక

- 2014లో బీజేపీ కేంద్రంలో స్పష్టమైన మెజార్టీతో అధికారంలోకి వచ్చింది. కొన్ని రాష్ర్టాల్లో కూడా బీజేపీ ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. ఈ క్రమంలోనే జమిలి ఎన్నికల విధానంపై మళ్లీ కదలిక వచ్చింది. 2015లో సుదర్శన్ నాచియప్పన్ నేతృత్వంలో నియమించిన పార్లమెంటరీ స్థాయి సంఘం జమిలి విధానానికి పచ్చజెండా ఊపింది.

### అంతర్జాతీయంగా జమిలి

- ఇప్పటికే దక్షిణాఫ్రికా, స్పెయిన్, జర్మనీ, స్వీడన్ లాంటి దేశాల్లో జమిలి విధానం అనుసరిస్తున్నారు. ఇండోనేషియాలో కూడా మొన్నటి ఎన్నికల్లో ఈ విధానం అనుసరించాలి. కానీ అది కార్యరూపం దాల్చలేదు.

### ఎలా ముందుకు వెళ్లాలి?

- జమిలి ఎన్నికలు నిర్వహించాలంటే ఇప్పుడున్న చట్టాల్లో మార్పులు చేపట్టాలి. లా కమిషన్ అభిప్రాయం ప్రకారం
- దేశ అత్యున్నత శాసనమైన రాజ్యాంగంతోపాటు ప్రజాప్రాతినిధ్య చట్టాన్ని, లోక్‌సభ, అసెంబ్లీ నిబంధనలను సవరించాలి. అటు పార్లమెంట్‌తోపాటు రాష్ర్టాల శాసనసభల ఆమోదం కూడా అవసరమవుతుంది.



### ప్రయోజనాలేంటి?

- దేశంమంతా ఏకకాలంలో ఎన్నికలు జరిగితే ప్రభుత్వ ఖజానాపై వ్యయభారం తగ్గుతుందన్నది ప్రభుత్వ అభిప్రాయం.
- గతంలో నీతి ఆయోగ్ చెప్పిన లెక్కల ప్రకారం దేశంలో 2021 వరకు ప్రతి ఆరునెలలకోసారి ఎన్నికలు జరుగుతాయి. దీనివల్ల ఆర్థిక భారం పెరుగుతుంది. మొన్నటి ఎన్నికల్లో ఎన్నికల కమిషన్ ఖర్చుతో కలిపి దాదాపు రూ.60 వేల కోట్లు ఖర్చు జరిగినట్లు అంచనా. కొత్త ఎన్నికల విధానంవల్ల ఈ సమస్యని కొంత మేర అధిగమించే అవకాశం ఉంది.
- తరచూ ఎన్నికలు రావడంవల్ల ప్రభుత్వ పెద్దలు, ఇతర నేతలు ఎప్పుడూ ఏదో ఒక ప్రచారంలో ఉండాల్సి వస్తుంది. దీన్నే పర్మినెంట్ క్యాంపెయినింగ్ సిండ్రోమ్ అంటారు. ఈ క్రమంలోనే దీర్ఘకాలిక అభివృద్ధి కంటే కూడా ప్రజాకర్షక పథకాలకు ప్రాధాన్యం ఇస్తున్నారు.
- అభివృద్ధి పనులకు ఆటంకాలు ఉండవు. ప్రస్తుత విధానంలో తరచూ ఎన్నికల నియమావళి అడ్డువస్తుండటం వల్ల ప్రభుత్వ విధానపర నిర్ణయాల్లో జాప్యం జరుగుతుందన్నది విశ్లేషకుల మాట. ఒకేసారి ఎన్నికల ద్వారా ఈ సమస్య దాదాపుగా తగ్గే అవకాశం ఉంది. ఎన్నికలు ఒకేసారి జరిగితే ఇలాంటి వాటిని నిరోధించవచ్చు. పరిపాలన సుపరిపాలన దిశగా దృష్టిపెట్టవచ్చు.
- ఎన్నికల సమయంలో యథేచ్ఛగా సాగే నల్లధన ప్రవాహాన్ని కూడా కొంతమేర అడ్డుకోవచ్చని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.

### జమిలి కాకుండా ఇంకేమైనా మార్గాలున్నాయా?

- ఎన్నికల వ్యయంపై కఠినమైన చట్టాలు చేయాలి. ఉన్న చట్టాలని సమర్థవంతంగా అమలు చేయాలి.
- ఎన్నికలు జరిపే కాలవ్యవధిని తగ్గించడంవల్ల కోడ్ అడ్డంకులను కొంతమేర అధిగమించవచ్చునేది విశ్లేషకుల మాట.
- జమిలి ఎన్నికలతో ప్రయోజనాలున్నాయి. అదే సమయంలో ఆ విధానాన్ని ఆచరణలో పెట్టాలంటే కొన్ని సవాళ్లు కూడా ఉన్నాయి. అందుకే ఒకేసారి మొత్తం ప్రక్రియని మార్చివేయకుండా వివిధ వర్గాలతో విస్తృతస్థాయిలో చర్చలు జరపాలి. ఇప్పటికే టీఆర్‌ఎస్, బిజూజనతాదళ్ వంటి పార్టీలు ఈ విధానాన్ని సమర్థిస్తుండగా, కమ్యూనిస్టులు వ్యతిరేకిస్తున్నారు. ముందుగా ఏకాభిప్రాయానికి కృషి చేయాలి. విదేశాల అనుభవాలు కూడా చూడాలి. ఆ తర్వాత దశలవారీగా ఈ విధానాన్ని అమల్లోకి తీసుకురావాలి. మొత్తానికి ప్రక్రియ ఎలాంటిదైనా ప్రజాస్వామ్యానికి ఆయువుపట్టుగా నిలిచే ఎన్నికల విధానం మాత్రం ప్రజామోదాన్ని, విశ్వాసాన్ని పొందేలా ఉండాలి.

### సవాళ్లు?

- దేశ ప్రజల్లో చాలావరకు పార్టీ వ్యవస్థపై పెద్దగా అవగాహన లేదు. ప్రాంతీయ, జాతీయ పార్టీల మధ్య తేడాలేంటి, వాటి లక్ష్యాలేంటి అనే అంశాలపై వారికి స్పష్టత లేదు. ఇలాంటి సమయంలో ఏకకాల ఎన్నికలు నిర్వహిస్తే కొన్ని పార్టీలకే మేలు కలుగుతుందని గత అనుభవాలు చెబుతున్నాయి.
- లోక్‌సభ, రాష్ట్ర శాసనసభలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహిస్తే రాష్ట్రంలోనూ, కేంద్రంలోనూ ఒకే పార్టీకి, అందులోనూ జాతీయ పార్టీలకే ఎక్కువ ఓట్లు పోలైనట్లు కింది గణాంకాలు రుజువు చేస్తున్నాయి.
- 1999 ఎన్నికల్లో 68 శాతం
- 2004 ఎన్నికల్లో 77 శాతం
- 2009 ఎన్నికల్లో 76 శాతం
- 2014 ఎన్నికల్లో 86 శాతం
- ఒకసారి ఎన్నికలు ముగిస్తే దేశంలోని చాలామంది నేతలు మళ్లీ ప్రజల మధ్యకి రారనే అపప్రద ఉంది. ఇప్పుడున్న విధానంలోఎన్నికల కోసమైనా నేతలు అప్పుడప్పుడు ప్రజల దగ్గరికి వెళ్తున్నారు. పంచాయతీ నుంచి ప్రధాని వరకు అన్ని ఎన్నికలు ఒకేసారి అయిపోతే ప్రజల దగ్గరికి వస్తారా అనే ప్రశ్న ఉత్పన్నమవుతుంది.
- ఒకసారి ఎన్నికైన ప్రభుత్వం అవిశ్వాసానికి గురైతే అప్పుడు పరిస్థితి ఏంటి? అటు కేంద్రంలో ఈ పరిస్థితి వచ్చినా, రాష్ర్టాల్లో వచ్చినా ఎదుర్కోవడానికి సరైన వ్యవస్థాగతమైన ఏర్పాట్లు ఉండాలి.
- కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు, గుజరాత్ నుంచి అరుణాచల్ ప్రదేశ్ వరకు సువిశాలంతో ఎంతో వైవిధ్యంగా ఉన్న ఈ దేశంలో ఏకకాల ఎన్నికల సందర్భంలో ఏదైనా జాతీయ విపత్తు తలెత్తితే పరిస్థితి ఏంటి? దీనికి కూడా ముందస్తు వ్యూహరచన ఉండాలి.



మల్లవరపు బాలలత
సివిల్స్ ఫ్యాకల్టీ
సీఏఎస్‌బీ అకాడమీ
అశోక్‌నగర్, హైదరాబాద్

## సుడోకు

డైలీ సుడోకు 72 సమాధానం

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 5 | 8 | 9 | 4 | 1 | 2 | 7 | 6 | 3 |
| 6 | 2 | 3 | 7 | 9 | 5 | 4 | 1 | 8 |
| 7 | 1 | 4 | 3 | 6 | 8 | 5 | 9 | 2 |
| 4 | 6 | 5 | 2 | 8 | 3 | 9 | 7 | 1 |
| 2 | 9 | 8 | 5 | 7 | 1 | 3 | 4 | 6 |
| 1 | 3 | 7 | 6 | 4 | 9 | 2 | 8 | 5 |
| 9 | 4 | 2 | 1 | 5 | 6 | 8 | 3 | 7 |
| 8 | 5 | 6 | 9 | 3 | 7 | 1 | 2 | 4 |
| 3 | 7 | 1 | 8 | 2 | 4 | 6 | 5 | 9 |

1. నిలువుగా, అడ్డంగా ప్రతివరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.

సమాధానం రేపటి సంచికలో

డైలీ సుడోకు -73

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 7 | | 1 | 4 | 3 | | | 5 | |
| | | 5 | | | | 8 | | 9 |
| | | | | 5 | | | 7 | |
| | 1 | | | | 9 | | | |
| | | | 1 | 8 | 3 | | | |
| | | | 6 | | | | 4 | |
| | 5 | | | 9 | | | | |
| 3 | | 2 | | | | 5 | | |
| | 8 | | | 7 | 4 | 1 | | 2 |

IV.
నమస్తే తెలంగాణ
చిత్రం
[ కరీంనగర్ ]
సోమవారం 24 జూన్ 2019



చంద్రశేఖర్ యేలేటి, ఆనందప్రసాద్, నితిన్, ప్రియాప్రకాష్, అన్నే రవి తదితరులు

# నితిన్ చిత్రం మొదలైంది

నితిన్ కథానాయకుడిగా చంద్రశేఖర్ యేలేటి దర్శకత్వంలో రూపొందిస్తున్న తాజా చిత్రం ఆదివారం హైదరాబాద్‌లో లాంఛనంగా ప్రారంభమైంది. భవ్య క్రియేషన్స్ పతాకంపై వి.ఆనందప్రసాద్ నిర్మిస్తున్నారు. రకుల్‌ప్రీత్‌సింగ్, ప్రియాప్రకాష్ వారియర్ కథానాయికలు. ముహూర్తపు సన్నివేశానికి నితిన్ తండ్రి సుధాకర్‌రెడ్డి క్లాప్‌నివ్వగా, నిర్మాత వి.ఆనందప్రసాద్ కెమెరా స్విఛాన్ చేశారు. నిర్మాత ఆనందప్రసాద్ చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'నితిన్ బాడీలాంగ్వేజ్‌కు పక్కాగా సరిపోయే కథ ఇది. దర్శకుడు చంద్రశేఖర్ యేలేటి వైవిధ్యమైన కథల్ని ఎంచుకొని ఇన్నోవేటివ్ కాన్సెప్ట్స్‌తో సినిమాలు చేస్తుంటారు. ఈ చిత్ర కథ కూడా నవ్యతతో కూడుకొని ఉంటుంది. కీరవాణి సంగీతం ప్రధానాకర్షణగా నిలుస్తుంది. వింక్‌గర్ల్‌గా పాపులారిటీని సంపాదించుకున్న ప్రియాప్రకాష్ వారియర్‌ను మా చిత్రం ద్వారా తెలుగు తెరకు పరిచయం చేయడం ఆనందంగా ఉంది. ఈ సినిమాకు సంబంధించిన ఇతర నటీనటుల ఎంపిక జరుగుతున్నది. షూటింగ్ షెడ్యూల్‌కు సంబంధించిన వివరాల్ని త్వరలో వెల్లడిస్తాం' అన్నారు. ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: రాహుల్ శ్రీవాస్తవ్, రచనా సహకారం, మాటలు: వెంకట్ నరేష్‌రెడ్డి, కళా దర్శకత్వం: వివేక్ అన్నామలై, సంగీతం: కీరవాణి, రచన–దర్శకత్వం: చంద్రశేఖర్ యేలేటి.



శ్రీరామ్, కృష్ణభగవాన్, శ్రీనివాసరెడ్డి, ఈషారెబ్బ, సత్యదేవ్, శ్రీనివాస్

# 24 గంటల్లో ఏం జరిగింది?

సత్యదేవ్, ఈషారెబ్బ, గణేష్ వెంకట్రామన్, ముస్కాన్‌సేథీ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'రాగల 24గంటల్లో'. శ్రీనివాస్ రెడ్డి దర్శకుడు. హీరో శ్రీరామ్ ముఖ్యపాత్రలో నటించారు. శ్రీనివాస్ కానూరు నిర్మాత. ఈ చిత్ర ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. దర్శకుడు శ్రీనివాస్‌రెడ్డి చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'రాగల 24 గంటల్లో అంటే ఏమిటో మనందరికి తెలుసు. వాతావరణ సమాచారం గురించి తెలుసుకోవాలంటే రేడియోల్లో, టీవీల్లో రాగల 24 గంటల్లో అని చెప్పేవారు. ఈ సినిమాలో కూడా 24 గంటల్లో అనూహ్య సంఘటనలు చోటుచేసుకుంటాయి. అవేమిటన్నది ఆద్యంతం ఉత్కంఠభరితంగా ఉంటుంది. ఇప్పటివరకు కామెడీ, ఎంటర్‌టైన్‌మెంట్ ప్రధాన చిత్రాల్ని తెరకెక్కించిన నేను తొలిసారిగా థ్రిల్లర్ చిత్రాన్ని చేశాను. అయినా ఇందులో వినోదాన్ని ఎక్కడా మిస్ చేయలేదు. సత్యదేవ్, ఈషారెబ్బ తమ పాత్రల్లో చక్కగా ఒదిగిపోయారు. శ్రీరామ్ పాత్ర సినిమాలో కీలకంగా ఉంటుంది. వినూత్న, కథ కథనాలతో తెలుగు ప్రేక్షకులకు సరికొత్త అనుభూతినందించే చిత్రమిది' అన్నారు. నిర్మాత మాట్లాడుతూ 'వినోద చిత్రాలకు పెట్టింది పేరైన శ్రీనివాస్‌రెడ్డి తొలిసారి ఓ సస్పెన్స్ థ్రిల్లర్ చిత్రానికి దర్శకత్వం వహించారు. రెగ్యులర్ థ్రిల్లర్ చిత్రాలకు పూర్తి భిన్నంగా ఉంటుంది. శ్రీనివాస్‌రెడ్డి తనదైన శైలి వినోదంతో మెప్పిస్తాడు. షూటింగ్ పూర్తిచేశాం. వచ్చే నెలలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం' అని నిర్మాత తెలిపారు. ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగే చిత్రమిదని, తన పాత్ర చిత్రణ వైవిధ్యంగా ఉంటుందని సత్యదేవ్ చెప్పారు. శ్రీరామ్ మాట్లాడుతూ 'ఇది పూర్తిస్థాయి సీరియస్ సినిమా కాదు. సస్పెన్స్‌తో పాటు కావాల్సినంత ఎంటర్‌టైన్‌మెంట్ ఉంటుంది. నా పాత్ర భిన్న పార్శ్వాలతో సాగుతుంది. నా కెరీర్‌లో మరో విభిన్నమైన పాత్ర అవుతుందనే నమ్మకం ఉంది' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: అంజి, సంగీతం: రఘు కుంచె, కథ: వై.శ్రీనివాస్‌వర్మ, మాటలు: కృష్ణభగవాన్, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: శ్రీనివాస్‌రెడ్డి.



రాశీఖన్నా





కాజా సూర్యనారాయణ, కాదంబరి కిరణ్, ఎన్.శంకర్, అనిల్ తదితరులు

# తెలంగాణ ప్రజానీకం గర్విస్తోంది

'తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ కార్యసాధన దీక్ష, ప్రజలకు మేలు చేయాలనే నిరంతర తపనతోనే కాళేశ్వరం ప్రాజెక్టు రికార్డు సమయంలో పూర్తయింది' అని నటుడు కాదంబరి కిరణ్ అన్నారు. హైదరాబాద్‌లోని ఫిలింనగర్‌లో ప్రముఖ దర్శకనిర్మాత ఎన్.శంకర్‌తో కలిసి కాదంబరి కిరణ్....సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కాదంబరి కిరణ్ మాట్లాడుతూ 'చరిత్రలో నిలిచిపోయే బృహత్కార్యాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ పూర్తిచేశారు. తెలుగు నేలను సస్యశ్యామలం చేస్తున్న అపర భగీరథుడు కేసీఆర్. ఆయన వెంట కోట్లాది మందితో పాటు మేము నడుస్తాం. బంగారు తెలంగాణలో భాగస్వాములం అవుతాం' అన్నారు. ఎన్.శంకర్ మాట్లాడుతూ 'కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తిచేయడం ద్వారా తాను గొప్ప కార్యసాధకుడిగా మన ముఖ్యమంత్రి కేసీఆర్ నిరూపించుకున్నారు. ఆయన కృషిని చూసి మొత్తం తెలంగాణ ప్రజానీకం గర్విస్తోంది. నా స్టూడియో నిర్మాణానికి ఐదెకరాల స్థలం కేటాయించారు. చిత్ర పరిశ్రమ అభివృద్ధికి ఇది ఎంతగానో తోడ్పడుతుందని ఆశిస్తున్నా' అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జూబ్లీహిల్స్ కార్పొరేటర్ కాజా సూర్యనారాయణ, వల్లభనేని అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# కల్మషం లేని ప్రణయగాథ



శివాత్మిక, ఆనంద్ దేవరకొండ

ఆనంద్ దేవరకొండ, శివాత్మిక నాయకానాయికలుగా నటిస్తున్న చిత్రం 'దొరసాని'. కేవీఆర్ మహేంద్ర దర్శకుడిగా పరిచయమవుతున్నాడు. మధుర ఎంటర్‌టైన్‌మెంట్స్, బిగ్‌బెన్ సినిమాస్ పతాకాలపై మధుర శ్రీధర్‌రెడ్డి, యష్ రంగినేని నిర్మిస్తున్నారు. జూలై 12న ప్రేక్షకులముందుకురానుంది. దర్శకుడు చిత్ర విశేషాలు తెలియజేస్తూ '80వ దశకంలో తెలంగాణ ప్రాంతంలో జరిగే కథ ఇది. దొరసాని దేవకి, ఓ సాధారణ యువకుడు రాజు మధ్య నడిచే స్వచ్ఛమైన ప్రేమకథ ఇది. కల్మషంలేని ప్రణయానికి దర్పణంలా ఉంటుంది. ఇటీవల విడుదలైన టీజర్‌కు మంచి స్పందన లభిస్తున్నది. సంభాషణలు తెలంగాణ మాండలికంలో సహజంగా ఉంటాయి. హృదయాల్ని స్పృశించే ఉద్వేగాలతో ప్రతి ఒక్కరికి ఆకట్టుకునే చిత్రమది' అన్నారు. కన్నడ కిషోర్, వినయ్ వర్మ, శరణ్య తదితరులు ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: సన్నీ కూరపాటి, ఆర్ట్: జెకె మూర్తి, ఎడిటర్: నవీన్ నూలి, సమర్పణ: సురేష్‌బాబు, సంగీతం: ప్రశాంత్ విహారి, రచన–దర్శకత్వం: కేవీఆర్ మహేంద్ర.

**'తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన పలు కార్యక్రమాల స్ఫూర్తితో సినిమాలు రూపొందడం ఆనందంగా ఉంది. సమాజాన్ని సినిమా ప్రభావితం చేస్తే తెలంగాణలో మాత్రం సినిమాను సమాజం ప్రభావితం చేస్తుంది. కేసీఆర్ రాష్ట్రాన్ని పాలిస్తున్న తీరు, ఆయన విజన్ అద్భుతం' అని అన్నారు దర్శకనిర్మాత అల్లాణి శ్రీధర్. నేడు ఆయన జన్మదినం. ఈ సందర్భంగా 'నమస్తే తెలంగాణ'తో అల్లాణి శ్రీధర్ ప్రత్యేకంగా ముచ్చటించారు.**

# సినిమా తప్ప ప్రత్యామ్నాయం లేదు



అల్లాణి శ్రీధర్

సామాజిక ప్రయోజనంతో కూడిన ప్రేమకథా చిత్రానికి ప్రస్తుతం దర్శకత్వం వహిస్తున్నాను. చదలవాడ శ్రీనివాసరావు నిర్మాణంలో రూపొందుతున్న ఈ సినిమా పతాక ఘట్టాలు మినహా చిత్రీకరణ పూర్తి చేసుకున్నది. ఆదిలాబాద్ అడవులు, కుంటాల జలపాతంతో పాటు కశ్మీర్‌లో ప్రధాన ఘట్టాలను తెరకెక్కించాం. సమాజంపై ప్రేమ ప్రభావాన్ని ఆవిష్కరిస్తూ రూపొందుతున్న ఈ చిత్రంతో నూతన తారల్ని తెలుగు చిత్రసీమకు పరిచయం చేస్తున్నాం. కథానాయికగా బెంగాలీ నటి హిందోళ చక్రవర్తి అభినయం ఆకట్టుకుంటుంది. పాటలు అద్భుతంగా వచ్చాయి.

**కాళేశ్వరం మీద సినిమాలు రావాలి..**

ఒకప్పుడు తెలంగాణ కథాంశాల పట్ల చిత్రసీమ విముఖత చూపించింది. ప్రస్తుతం తెలంగాణ నేపథ్యాలే సినిమాల విజయాల్లో కీలక భూమిక పోషిస్తున్నాయి. కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను ఇతివృత్తంగా చేసుకుంటూ సినిమాలు రావాలని కోరుకుంటున్నాను. కాళేశ్వరం కల నెరవేరినట్లుగానే తెలంగాణలో తెలుగు సినిమా అభివృద్ధి సాకారం అవుతుందనే నమ్మకం ఉంది. దర్శకనిర్మాత, ఉద్యమకారుడు ఎన్.శంకర్‌కు ఐదెకరాల స్థలాన్ని కేటాయించి ఆ దిశగా ప్రభుత్వం ముందడుగు వేయడం ఆనందంగా ఉంది. భవిష్యత్తులో ప్రభుత్వం నుంచి తెలంగాణ సినీకళాకారులకు మరింత ప్రోత్సాహం లభిస్తుందనే నమ్మకం ఉంది. యువతరం దర్శకులతో పోటీపడి సినిమాలు చేయాలనే తపన పెరిగింది. సినిమాలు తప్ప నాకు మరో ప్రత్యామ్నాయం లేదు. ఇందులో టెన్షన్, అటెన్షన్ రెండు ఇష్టమే..

**సైనికాధికారి కూతురి పోరాటం**

తెలంగాణ వ్యవసాయశాఖతో పాటు 'ఇష్ట' అనే అంతర్జాతీయ కాన్ఫరెన్స్ కోసం చేసిన లఘు చిత్రాలు నాకు మంచి పేరుతెచ్చిపెట్టాయి. నేను రూపొందించిన 'డూ డూ డీ డీ' బాలల చిత్రానికి పశ్చిమబెంగాల్ ప్రభుత్వం నుంచి అవార్డు అందుకున్నాను. చారిత్రక కథాంశంతో ఓ వెబ్‌సిరీస్‌ను భారీ నిర్మాణ విలువలతో రూపొందించే ఆలోచనలో ఉన్నాను. చరిత్ర అనేది వర్తమానానికి ఎలా దారితీస్తుంది? భవిష్యత్తును ఎలా పునర్నిర్మిస్తుందనే పాయింట్‌తో ప్రయోగాత్మకంగా సాగుతుంది. మహిళలపై జరుగుతున్న అకృత్యాలపై పోరాడే పదహారేళ్ల యువతి కథతో మరో సినిమా చేయబోతున్నాను. యుద్ధంలో మరణించిన సైనికాధికారి కూతురు సమాజంపై చేసిన సమరం నేపథ్యంలో ఈ సినిమా ఆసక్తికరంగా సాగుతుంది. సందేశానికి వాణిజ్య హంగులు మేళవించి తెరకెక్కించిన ఈ చిత్రాన్ని జూలై ప్రథమార్థంలో ప్రారంభిస్తాం. చిలుకూరు బాలాజీ సినిమాను హిందీలో పునర్నించే ప్రయత్నాలు జరుగుతున్నాయి.

# సాయిధరమ్‌తేజ్‌కు జోడీగా..!

'శ్రీనివాస కల్యాణం' తరువాత తమిళంలో వరుస చిత్రాల్లో నటిస్తూ బిజీగా వుంది రాశీఖన్నా. తెలుగులో వెంకటేష్, నాగచైతన్య కలయికలో దర్శకుడు బాబి రూపొందిస్తున్న 'వెంకీమామ'లో నటిస్తున్న ఆమె తాజాగా తెలుగులో మరో చిత్రాన్ని అంగీకరించినట్లు తెలిసింది. 'చిత్రలహరి' విజయంతో రెట్టించిన ఉత్సాహంలో వున్నారు యువ హీరో సాయిధరమ్‌తేజ్. తాజాగా ఆయన మారుతి దర్శకత్వంలో ఓ చిత్రం చేస్తున్న విషయం తెలిసిందే. గీతాఆర్ట్స్, యువీ క్రియేషన్స్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించబోతున్నాయి. ఈ చిత్రంలో సాయిధరమ్‌తేజ్‌కు జోడీగా రాశీఖన్నాను చిత్ర బృందం ఎంపిక చేసిందని తెలిసింది. మారుతి మార్కు ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కనున్న ఈ చిత్రానికి 'ప్రతి రోజు పండగే' అనే టైటిల్‌ని పరిశీలిస్తున్నారు. ఈ నెల 27 నుంచి చిత్రీకరణ ప్రారంభంకానుంది. సాయిధరమ్‌తేజ్, రాశీఖన్నా కలిసి గతంలో 'సుప్రీమ్' చిత్రంలో నటించిన విషయం తెలిసిందే. ఇది వారిద్దరి కలయికలో రానున్న రెండో సినిమా. తమన్ సంగీతం అందించనున్న ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది సంక్రాంతికి విడుదల చేయాలని చిత్ర బృందం సన్నాహాలు చేస్తోంది.

**'మెంటల్ మదిలో' సినిమా విషయంలో లోపం ఎక్కడ జరిగిందో తెలుసుకుని అది పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకుని చేసిన చిత్రమిది' అని అన్నారు వివేక్ ఆత్రేయ. ఆయన తెరకెక్కిస్తున్న తాజా చిత్రం 'బ్రోచేవారెవరురా'. శ్రీవిష్ణు, నివేదా థామస్ జంటగా నటించారు. మన్యం ప్రొడక్షన్స్ పతాకంపై విజయ్‌కుమార్ మన్యం నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 28న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో దర్శకుడు వివేక్ ఆత్రేయ పాత్రికేయులతో ముచ్చటించారు.**



వివేక్ ఆత్రేయ

# ఆ లెక్కలు ఇప్పటికీ అర్థం కాలేదు!

ఉమెన్ హెరాస్‌మెంట్‌పై తీసిన చిత్రమిది. అయితే పూర్తి సీరియస్ డ్రామాగా కాకుండా ఎంటర్‌టైన్‌మెంట్‌ని మిళితం చేసి ఆద్యంతం వినోదాత్మకంగా తెరకెక్కించాం. తప్పకుండా ప్రతి మహిళ చూడాల్సిన చిత్రమిది. ఇంటర్మీడియట్ చదివే మిత్రా అనే ఓ అమ్మాయి నేపథ్యంలో కథ నడుస్తుంది. శ్రీవిష్ణు, రాహుల్ రామకృష్ణ, ప్రియదర్శి రాహుల్, రాకీ, రాంబో అనే 'ఆర్3' బ్యాచ్. మూడేళ్లుగా ఇంటర్మీడియట్‌లోనే కొనసాగుతున్న ఈ బ్యాచ్‌కు మిత్రా అనే అమ్మాయి పరిచయం అవుతుంది. ఆ తరువాత వీరి జీవితాల్లో ఎలాంటి మార్పులు చోటుచేసుకున్నాయి? కథ ఎలాంటి మలుపులు తిరిగింది అన్నదే ఈ చిత్ర ప్రధాన ఇతివృత్తం. సెలెక్టివ్‌గా సినిమాలు చేసే శాలిని అనే హీరోయిన్‌గా నివేదా పేతురాజ్ నటిస్తుండగా ఆమెకు కథ చెప్పే ఫిల్మ్ మేకర్‌గా సత్యదేవ్ నటించాడు. అతను చెప్పే కథే ఈ సినిమా.

**శ్రీవిష్ణు మాత్రమే...**

ఈ కథకు హీరో శ్రీవిష్ణు తప్ప మరొకరు సెట్ కారు. అందుకే ఆయనని ఈ సినిమాకు హీరోగా తీసుకున్నాను. పైగా 'మెంటల్ మదిలో' చిత్రీకరణ సమయంలో ఆయనతో నాకు మంచి పరిచయం ఏర్పడింది. ఆయనని దృష్టిలో పెట్టుకుని ఈ కథ రాసుకున్నాను. 'మెంటల్ మదిలో' చిత్రంలో శ్రీవిష్ణు పాత్ర ఎక్కువగా మాట్లాడదు. మొహమాటస్తుడిగా కనిపించారు. కానీ ఈ సినిమాలో మాత్రం ఆయన పాత్ర ఎక్కువ మాట్లాడుతుంది. సినిమా చూసిన వాళ్లకు నా నిర్ణయం కరెక్టే అనిపిస్తుంది. అంత బాగా చేశాడు. సినిమాలోని ప్రతి రెండు పాత్రలు మరో పాత్రని కాపాడుతుంటాయి. అందుకే ఈ చిత్రానికి 'బ్రోచేవారెవరురా' అని టైటిల్ పెట్టాం.

**అనుకున్న స్థాయిలో...**

తొలి సినిమా 'మెంటల్ మదిలో' సక్సెస్ అనేది ఇంకా క్వశ్చన్ మార్కే. సినిమా చూసిన కొంత మంది బాగుందన్నారు. కొంత మంది సెకండ్ హాఫ్ మార్చితే బాగుండేదన్నారు. ఆ లెక్కలు ఇప్పటికీ అర్థం కాలేదు. నేను రాసుకున్న కథని అనుకున్న స్థాయిలో తెరకెక్కించలేకపోయానేమో అనిపించింది. ఇంకా బాగా తీసివుండొచ్చు కదా అనిపించింది. తొలి సినిమా విషయంలో జరిగిన తప్పుల్ని సరిదిద్దుకుని తాజా చిత్రాన్ని తెరకెక్కించాను. ఇంత వరకు ఎవరూ స్పృశించని కొత్త పాయింట్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కించాను. ప్రతీ ఒక్కరినీ ఆకట్టుకుంటుందన్న నమ్మకముంది.



విజయలక్ష్మి, హేమ, శివబాలాజీ, నరేష్, రాజశేఖర్, రాజీవ్ కనకాల, గౌతంరాజు

# 'మా' సలహాదారుగా కృష్ణంరాజు!

''మా'లో చిన్ని చిన్న మనస్పర్థలు వుండేవి. దీంతో తొలి జనరల్‌బాడీ మీటింగ్ ఎలా జరుగుతుందో అన్న భయం ఏర్పడింది. కానీ మాజీ అధ్యక్షుడు శివాజీరాజా, ప్రస్తుత అధ్యక్షుడు నరేష్‌లు అన్నీ చక్కదిద్దారు' అని అన్నారు రాజశేఖర్. నూతనంగా ఏర్పడిన 'మా' అసోసియేషన్ కార్యవర్గ సమావేశం ఆదివారం హైదరాబాద్‌లో జరిగింది. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు నరేష్ మాట్లాడుతూ ''మా' తొలి కార్యవర్గ సమావేశం సాఫీగా సాగింది. గతంలో 'మా'కు ముఖ్య సలహాదారులుగా ఏఎన్నార్, చిరంజీవి వ్యవహరించేవారు. అయితే ఈ సారి ఆ స్థానంలో కృష్ణంరాజును ఎన్నుకున్నాం. ఈ సందర్భంగా వారిని సత్కరించుకోవడం ఆనందంగా వుంది. మేము ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్‌కు మంచి స్పందన లభించింది. 30 మంది ఫోన్ చేశారు. 33 మంది కళాకారులకు ఇస్తున్న 3వేల పెన్షన్‌ని 6 వేలకు పెంచాం. మేడే రోజును పెన్షన్‌డేగా ఇక నుంచి జరుపుకోబోతున్నాం. కొత్త వారికి 25 వేలకే సభ్యత్వం ఇవ్వాలని నిర్ణయించుకున్నాం. అలా రెండేళ్లు కడితే శాశ్వత సభ్యత్వాన్ని ఇస్తాం' అన్నారు. ఈ కార్యక్రమంలో జీవిత, హేమ, కృష్ణంరాజు దంపతులు, శివబాలాజీ, పరుచూరి బ్రదర్స్, కవిత, గౌతంరాజు, సురేష్ కొండేటి తదితరులు పాల్గొన్నారు.

# నాన్న నాకు అమ్మయ్యావా..



లావణ్య, తరుణ్‌తేజ్

తరుణ్‌తేజ్, లావణ్య జంటగా నటిస్తున్న చిత్రం 'ఉండిపోరాదే'. నవీన్ నాయిని దర్శకుడు. డా॥ లింగేశ్వర్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రం కోసం ప్రముఖ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ రాసిన 'నాన్న నువ్వు నాకు అమ్మయ్యావా..' అంటూ సాగే లిరికల్ వీడియోను ఆదివారం హీరో సుధీర్‌బాబు విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'ఓ కూతురు తన తండ్రిపై వున్న ప్రేమను వ్యక్తం చేసే పాట ఇది. సుద్దాల అశోక్‌తేజ అద్భుతంగా రాశారు. గాయని చిత్ర ఆలపించిన ఈ పాటకు సాబు వర్గీస్ అందించిన సంగీతం ప్రధాన ఆకర్షణగా నిలిచింది. త్వరలో ఒక్కో పాటని వరుసగా విడుదల చేస్తాం. యథార్థ ప్రేమకథ నేపథ్యంలో రూపొందిన చిత్రమిది' అన్నారు. నిర్మాత మాట్లాడుతూ 'నాన్న పాటకు సుద్దాల అశోక్‌తేజ అద్భుతమైన సాహిత్యాన్ని అందించారు. నేను చూసిన యథార్థ సంఘటనల ఆధారంగా ఈ చిత్రాన్ని నిర్మించాం. ఈ సినిమా ద్వారా హీరోయిన్‌గా పరిచయమవుతున్న లావణ్య తెలుగమ్మాయి. కథపై వున్న నమ్మకంతో తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో ఏకకాలంలో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాం. పిల్లలతో పాటు ప్రతీ తల్లిదండ్రులు తప్పక చూడాల్సిన చిత్రమిది' అన్నారు.



మధుసాయివంశీ, శ్రావణి

# యథార్థ ప్రేమకథ

మధు సాయివంశీ, శ్రావణి నిక్కీ, హిమ బిందు ప్రధాన పాత్రల్లో నటిస్తున్న 'అర్జున వేట' చిత్రం ఆదివారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. కె.రవీంద్ర కల్యాణ్ దర్శకుడు. రోజా శ్రీనివాస్ సినిమాస్ పతాకంపై వాయుల శ్రీనివాసరావు నిర్మిస్తున్నారు. పూజా కార్యక్రమాల అనంతరం చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి సి. కల్యాణ్ క్లాప్‌నివ్వగా, తుమ్మలపల్లి రామసత్యనారాయణ కెమెరా స్విచాన్ చేశారు. దర్శకుడు మాట్లాడుతూ 'ఓ యథార్థ సంఘటన ఆధారంగా రూపొందుతున్న ప్రేమకథాచిత్రమిది. వచ్చేనెల 16 నుంచి రెగ్యులర్ షూటింగ్ మొదలవుతుంది. హైదరాబాద్, చెన్నై, కేరళ తదితర ప్రాంతాల్లో చిత్రీకరణ చేస్తాం. ఐదు భాషల్లో చిత్రాన్ని విడుదల చేస్తాం' అన్నారు. సుబ్బరాజు, వెన్నెల కిషోర్, రావు రమేష్ తదితరులు నటిస్తున్నారు.

# వాస్తవికత ప్రధానంగా..



వెంకటేష్, కృష్ణ

''కృష్ణారావ్ సూపర్ మార్కెట్' టీజర్ రియలిస్టిక్‌గా ఉంది. ఈ తరహా సినిమాలనే నేటి యువతరం ఆదరిస్తున్నారు. హీరోగా కృష్ణకు మంచి గుర్తింపును తెచ్చిపెడుతుందనే నమ్మకం ఉంది' అని అన్నారు కథానాయకుడు వెంకటేష్. హాస్యనటుడు గౌతంరాజు తనయుడు కృష్ణ హీరోగా నటిస్తున్న చిత్రం 'కృష్ణారావ్ సూపర్ మార్కెట్'. శ్రీనాథ్ పులకరం దర్శకుడు. బీజేఆర్ ఫిల్మ్ అండ్ టీవీ స్టూడియోస్ సంస్థ నిర్మిస్తున్నది. ఎల్సాగోష్ కథానాయిక. చిత్ర టీజర్‌ను హీరో వెంకటేష్ ప్రత్యేకంగా వీక్షించారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'ప్రేమకథకు థ్రిల్లర్ హంగులను జోడించి రూపొందిస్తున్న చిత్రమిది. సూపర్ మార్కెట్ నేపథ్యంలో సాగుతుంది. వాస్తవికతను ప్రతిబింబిస్తూ తెరకెక్కిస్తున్న ఈ చిత్రం తెలుగు ప్రేక్షకుల్ని అలరిస్తుంది' అని చెప్పారు. నిర్మాణానంతర కార్యక్రమాలు పూర్తయ్యాయని, త్వరలో సినిమాను విడుదలచేస్తామని గౌతంరాజు పేర్కొన్నారు. తనికెళ్లభరణి, గౌతంరాజు, బెనర్జీ, రవిప్రకాష్, సూర్య ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: బోలేషావలీ, సినిమాటోగ్రఫీ: ఎ. విజయ్‌కుమార్